
# శివాని

నవల

## మంథా భానుమతి




శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 33



# శివాని
## మంథా భానుమతి



*ముప్పేటలా అల్లుకున్న ముగ్గురు స్నేహితురాళ్ళ ముచ్చటైన కథ.. !*

"శివానీ! త్వరగా రా. ఇవాళ అహల్య పుట్టినరోజు మర్చిపోయావా?" కాలేజీకి వెళుతూ, శివానీ ఇంటి ముందర ఆగి, పిలిచాను.

శివానీ, అహల్య, నేను... ముగ్గురం ఆరోక్లాసు నుంచీ స్నేహితులం. శివానీ, అహల్య, బి.యస్.సి ఫైనల్ ఇయర్లో ఉన్నారు. నేను బి.ఏ. తెలుగు... మూడవ సంవత్సరం. వాళ్ళ క్లాసులో వందమంది ఉంటే... మా క్లాసులో ఇద్దరు.

ఇంటర్లో, అందరం బై.పి.సి తీసుకుని కుస్తీ పట్టాం. పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థలోనే చేర్పించారు ఇంట్లోవాళ్ళు. మా ముగ్గురిలో, శివానీకి ఆర్థిక సమస్యలు లేవు. అహల్యకి పదోక్లాసులో తొంభైశాతం మార్కులు వచ్చాయి. వాళ్ళిద్దరూ, ఇంటర్లో సులభంగా చేరిపోయారు. అహల్య, వాళ్ళ నాన్న బట్టల కొట్లో పనిచేస్తారు. కుప్తంగా ఖర్చు పెడుతూ, కాలక్షేపం చేస్తున్నారు. తనకి మార్కుల పెట్టుబడితో ఫీజులేకుండా చేర్చుకున్నారు.

మాది, ఎటుకాని పరిస్థితి. మా నాన్నగారు స్కూలు టీచరు. స్కేలైతే బాగానే ఉంటుంది. కానీ, ఒక్కోసారి నెలలతరబడి జీతాలురావు. నా అదృష్టమో, మా అమ్మ కోరిక తీరాలనో.. సరిగ్గా ఇంటర్లో చేరేముందు, ఆర్నెల్ల జీతం ఒక్కసారి వచ్చింది. అయినా నలభైవేలు కట్టగల స్తోమతలేదు మాకు. పైగా, నాకు సైన్సు మీద అంత అభిరుచి లేదు.

కానీ, ప్రవాహంలో కొట్టుకు పోతూ, నేను కూడా మా ఫ్రెండ్స్‌తో చేరాను. వాళ్ళతోటే చదువుకోవచ్చనేది కూడా ఒక కారణం. మా అమ్మ ఎలా సర్దుబాటు చేసిందో నాకెప్పటికీ అర్థంకాదు.

ముగ్గురం బాగానే చదివాం. మా శక్తికి మించే.

అహల్యకి కాస్త మంచి రేంకే వచ్చింది. కానీ మా ఊళ్ళో మెడికల్ కాలేజీలో సీటు రాలేదు. వాళ్ళ నాన్న పై ఊర్లో ఉంచి చదివించలేనన్నారు.

ఇంక నా సంగతీ, శివానీ సంగతి చెప్పేదేముంది! ఏదో పేపర్లో నంబరు కనిపించింది. వాళ్ళిద్దరూ బి.యస్సీలో చేరుతుంటే అమ్మ గొణిగింది నన్ను కూడా చేరమని. కానీ ఈ సారి మాత్రం చాలా పట్టుదలగా ఉన్నాను. "బి.ఏ తెలుగు అంటే ఎవరు పెళ్ళి చేసుకుంటారే" అమ్మ గొడవ.

"ఎవరో! నాకోసం పుట్టే ఉంటాడులే" అప్పుడప్పుడే పెళ్ళిళ్ళు.. సంబంధాలు వెతకడాల గురించి కొంచెం కొంచెం తెలుస్తోంది మాకు.

"వద్దు! నీ ఆశలు దాని మీద రుద్దకు. పిల్లలు అభిరుచిని గౌరవించు." నాన్నగారికి కూడా అమ్మకి పాఠం చెప్పగల ధైర్యం వచ్చింది.

"సరే! మీరిద్దరూ ఏకమైతే నేనేం చేస్తాను?" అమ్మ నిరాశతో వెళ్ళిపోయింది.

నేను ఆనందంగా నాన్నగారికేసి చూసి బొటన వేలు పైకెత్తి చూపించాను. 'గెలిచాను' అన్నట్టుగా.

తొమ్మిదో క్లాసులో ఉండగా హాఫియర్లీ పరీక్ష పేపర్లు ఇస్తున్నపుడు జరిగిందా సంఘటన.

మా తెలుగుటీచరు, కృష్ణవేణిగారు. ఆన్సరు పేపర్లు తీసుకుని క్లాసులోకి వస్తున్నారు. ఆవిడకి, ఆ పేరెలా పెట్టారో కానీ... సార్థకనామం. నాలుగువేళ్ళ వెడల్పున మోకాలు తాకుతూ ఉంటుంది జడ. ఆవిడని చూసినప్పుడల్లా, భుజాలు దాటని నా రెండు జళ్ళనీ వెనక్కి వేసేసుకునేదాన్ని. అవి మళ్ళీ అంత ఫోర్సుతోటే ముందుకి వచ్చేసేవి.... అది వేరే సంగతి. చక్కని కంఠంతో.. స్పష్టంగా రాగంతో పద్యం చదివి, అర్థం చెపుతుంటే అందరం కళ్ళార్పకుండా చూస్తూ వినేవాళ్ళం.

కృష్ణవేణి టీచరు పేపర్ల కట్ట బల్ల మీద పెట్టి కుర్చీలో కూర్చున్నారు. ఆవిడ జడ కుర్చీ చెయ్యి ప్రక్కనుంచి నేలమీదకి పాకింది. నేను ఆ జడ వంకే చూస్తున్నాను. తొమ్మిదోక్లాసులోనే ఆవిడ మా క్లాసుకి రావడం మొదలు పెట్టారు. ఇంతకీ మా ఊరు ఆంధ్రదేశం నడిబొడ్డున ఉంది కనుక ఆ మాత్రం ముప్పయి మందైనా తెలుగు క్లాసులో ఉన్నారు. అదే ఏ హైదరాబాదో అయితే.... సెక్షన్లు సెక్షన్లే హిందీ, ఫ్రెంచ్‌లకి వెళ్ళిపోతారట.

"ఇదిగో! అమ్మాయిలూ! తొమ్మిదో క్లాసుకి వచ్చారు. అక్షరాలు రాయడం కూడా రాదు కొంతమందికి. మరి తెలుగులో మార్కులు రావాలంటే ఎలా వస్తాయి? ఏరోజు పాఠం ఆ రోజు ఎంత మంది చదువుతున్నారు?" ఏమిటో! ఈవిడ మార్కులివ్వకుండా సుత్తికొడుతున్నారు క్లాసులో అందరూ గొణుగుతున్నారు.

"వస్తున్నా! సుత్తికాదు ఇకముందైనా కొంచెం శ్రద్ధపెడతారేమోనని. మామూలుగానే... అందరికీ అరవైశాతంలోపే వచ్చింది. ఒక్క 'సమీరకి తప్ప." ఉలిక్కిపడ్డాను. నేనేం అంత గొప్పగా వ్రాయలేదే పైగా ఒక ప్రశ్నవదిలేశాను కూడాను.

అందరికీ పేపర్లిచ్చి నా పేపరు మాత్రం ఆవిడ దగ్గర పెట్టుకున్నారు. "ఏమ్మా! చెయ్యి నొప్పిపెట్టిందా! పద్యానికి ప్రతిపదార్థం రాయలేదు. అందుకే ఏకంగా పదిమార్కులు పోయాయి."

"నిజం చెప్పొద్దూ! చెయ్యి నొప్పుట్టే వదిలేశాను. తెలుగు అక్షరాలు ఇంత కష్టంగా ఎందుకు పెట్టారో! ఒక్కో అక్షరం రాయాలంటే చెయ్యి ఎన్ని మెలికలు తిరగాలి." తలొంచుకుని మనసులోనే అనుకున్నాను. "ఇలారా!" నెమ్మదిగా లేచి ఆవిడ పక్కకి వెళ్ళినుంచున్నాను.

"చూడండి. అక్షరాలు అంత ముత్యాల్లా లేకపోయినా స్పష్టంగా ఉన్నాయి. పదానికి పదానికీ మధ్య ఖాళీ స్థలం, కామాలు... ఫుల్‌స్టాప్‌లు అన్నీ ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టింది. ప్రతీ ప్రశ్నకీ కావల్సినంత ఆన్సరు... సరిగ్గా. ఎక్కడా ఒక్క వాక్యం ఎక్కువ రాయలేదు. కానీ ఏంలాభం. నేను మిగిలిన సబ్జక్టుల్లాగే తెలుగులో కూడా తొంభయి శాతం దాటిపోయే పేపరు వచ్చిందనుకుని సంతోషిస్తుంటే... ఒకటిన్నర ప్రశ్నకి ఆన్సరే లేదు." కృష్ణవేణీ టీచరు మాటలకి నాకేం చెయ్యాలో తోచలేదు.

అసలు అంత బాగా రాశానని నాకు తెలీదు. మా నాన్నగారు తెలుగు టీచరవడంతో స్వతహాగా అబ్బిన జ్ఞానం.. ఆయన దగ్గరికి వచ్చిన వాళ్ళతో జరిగే సాహిత్య సమావేశాలు... అటొచ్చీ, ఇటొచ్చీ చెవిన పడిన కష్టం ఏం లేదు. ఒకసారి చదివితేనే పాఠ్యాంశాలు గుర్తుండిపోయాయనుకుంటా.

"ఇదిగో! ఎనభయ్యయిదు మార్కులు. ఇకనుంచయినా బద్ధకించకుండా పేపరంతా రాయి." పేపరు చేతికిచ్చి కృష్ణవేణి టీచరు పాఠం చెప్పసాగారు.

పేపరు తీసుకుని నా సీట్లో కూర్చున్నాను. శివానీ, అహల్య అభినందనపూర్వకంగా చూశారు. నేను కొంచెం సిగ్గుతో తడపడ్డాను. లెక్కల్లో, సైన్సులో వాళ్ళే ఫస్టు మరి.

కానీ... అప్పట్నుంచే 'తెలుగు' మీద అభిమానం పెరిగింది.

❀ ❀ ❀

నా పిలుపు వింటూనే శివానీ బైటికి వచ్చింది. ఇద్దరం కొంచెం ముందు బయలుదేరి అహల్యా వాళ్ళింటికి వెళ్ళాలని నిన్న సాయంత్రమే అనుకున్నాం. అలాగే ఎనిమిదింటికల్లా అహల్య ఇంటిముందున్నాం. ముగ్గురం.. పరికిణీ, జాకెట్టు, వోణీలు వేసుకుని పొడుగు గొలుసులు వేసుకున్నాం.

"హ్యాపీ బర్త్‌డే డియర్ ఫ్రెండ్" శివానీ వన్‌గ్రామ్ గోల్డుతో చేసిన చక్కని బ్రేస్‌లెట్ ఇచ్చింది. కుడిచెయ్యి ముందుకు చాపింది అహల్య. చేతికి పెట్టి, చెయ్యి ఆప్యాయంగా నొక్కి వదిలేసింది శివానీ.

"ప్రియమైన స్నేహితురాలికి పుట్టినరోజు శుభాకాంక్షలు." ఆప్యాయంగా అంటూ స్వయంగా, పూసలతో అల్లిన బుల్లి సంచిని అహల్యకిచ్చాను.

"మీరా తెలుగు బియ్యే అని ఎప్పుడూ గుర్తుచేస్తుంటుందే" అహల్య అంటూ.. బ్రాస్‌లెట్‌తో మరింత మెరిసే పచ్చని చేత్తో పర్సుని పట్టుకుంది.

అహల్యది పచ్చని పసిమిఛాయ, ప్రశాంతమైన నవ్వు మొహంతో, సాత్వికంగా ఉంటుంది. మాట, నడక అంతా నెమ్మదే చూడగానే పొందికైన ఆడపిల్లలంటే ఇదే, అనిపిస్తుంది. ఏ అలంకారం లేకపోయినా, ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగా కనిపిస్తుంది.

ఇంక నేను... సమీర అని ఎలా పేరు పెట్టారో కానీ, సుడిగాలిలా అందరినీ చుట్టేస్తుంటాను. ఏదయినా అనుకుంటే వెంటనే చేసెయ్యవలసిందే. గలగలా మాట్లాడుతూ, అందరినీ నవ్విస్తూ.... మధ్యలో తెలుగు భాషా పరిజ్ఞానాన్ని ప్రకటిస్తుంటాను. కాలేజీలో డిబేట్స్, ఎస్సేరైటింగ్‌లలో నాదే ఫస్ట్‌ప్రైజు. కాలేజ్ మ్యాగజైన్స్‌కీ, వీక్లీలకీ అప్పుడప్పుడు కథలూ, కవితలూ పంపుతుంటాను. చాలామటుకు ప్రచురితం అవుతుంటాయి. అహల్యంత అందంగా లేకపోయినా, కళగా ఉంటానంటారు. నవ్వితే కుడిబుగ్గమీద సొట్ట ఆకర్షణ అంటారు. పైగా ఫోటోల్లో బాగా పడతాను.

శివానీ గంభీరంగా ఉంటుంది. మాట, నడక... అంతా ఒక గ్రేస్‌తో సాగుతుంది. తను ధనవంతురాలని చూడగానే తెలిసిపోతుంది. కానీ ఏ అలంకారం ఉండదు. మాలాగే సామాన్యంగానే ఉంటుంది. ఒకోసారి ఎంతో సౌమ్యంగా ఉంటుంది. మేం చెప్పేవన్నీ నవ్వుతూ వింటుంది. సమయం వస్తే తన శక్తి చూపించడానికి వెనుకాడదు. ప్రతీదీ విశ్లేషణతో మాట్లాడుతుంటుంది. మా ఇద్దరి కంటే శక్తిలోనూ, యుక్తిలోనూ కూడా ఎక్కువే.

మా నాన్నగారు చిన్నప్పుడు నేర్పించిన భర్తృహరి సుభాషితాల్లోని ఒక పద్యం ఎప్పుడూ గుర్తుకొస్తుంటుంది నాకు.

"ఆపదల యందు ధైర్యగుణ మంచిత సంపదల యందుదాల్మియున్" ఇది మా 'శివానీ'కి చక్కగా అన్వయిస్తుంది.

ఒకసారి మా ఇంటి ప్రక్కనే ఉన్న గుడిసెలోంచి పెద్దగా ఏడుపు వినిపించింది. ఆరోజు ఆదివారం సాయంత్రం నాలుగయిందేమో. మేము ముగ్గురమే ఉన్నాం. అమ్మా, నాన్నగారు బంధువుల ఇంటికి, తమ్ముడు ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళారు. ముగ్గురం బైటికి వచ్చాం. అహల్య 'వద్దు' అంటూనే ఉంది. శివానీ గబగబా గుడిసెలోకి వెళ్ళింది. మా ఇంటి ప్రక్కనే ఉన్నా, నేనెప్పుడూ వెళ్ళలేదు.

గుడిసెలో ఇళ్ళల్లో పాచి పనిచేసే సుబ్బమ్మ ఉంటుంది. దానికి ఏడాది కొడుకు. ఇంకా నాలుగన్నా అవకుండా పీకల్దాకా సారా తాగి వచ్చాడు 'రంగడు'.. సుబ్బి మొగుడు. అప్పుడు 'కోడికూర' కోసం గోల. వాడు తోసిన తోపుకి, చంకలో పిల్లాడితో సహా అక్కడున్న బండమీద పడిపోయింది సుబ్బి. అది అరచిన అరుపులే మాకు వినిపించాయి.

శివానీ రంగడ్ని ఈడ్చుకుని బైటకి వచ్చి, నెత్తిమీంచి బాల్చీడునీళ్ళు పోసింది.

"మీరిద్దరూ సుబ్బినీ, కొడుకునీ, డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళండి. నా పర్సు తీసుకెళ్ళండి. అందులో సరిపడా డబ్బులుంటాయి. వీడి సంగతి నేను చూస్తాను." నేనూ, అహల్యా మారుమాట్లాడకుండా, రిక్షా తీసుకొచ్చి సుబ్బినీ, కొడుకునీ ఎక్కించి మేం సైకిళ్ళమీద ఫాలో అవుతూ హాస్పటల్‌కి తీసుకెళ్ళాం.

సుబ్బికి కట్టుకట్టించి, పిల్లాడికి పాలు పట్టించి... ఇంటికొచ్చేసరికి అంతా నిశ్శబ్దంగా ఉంది. సుబ్బినీ, కొడుకునీ వాళ్ళ గుడిసెలోకి పంపి, మా ఇంట్లోకి వచ్చాం. శివానీ ఏం జరగనట్లు చదువుకుంటోంది.

"ఇదిగో పర్సు. అయిదొందలయింది. కుట్లు వేశారు, ఇంకా యాంటీబయాటిక్స్, బికాంప్లెక్స్ వగైరాలు" పర్సు శివానీ చేతికిచ్చాను. తీసుకుని బాగ్‌లో పెట్టుకుంది.

"అంత డబ్బుంచుకుంటావా నీ దగ్గర!" విస్మయంగా అడిగాను.

"అవును మీరా! ఎమర్జెన్సీకి ఉంచుకోమంటారు డాడీ." శివానీ పర్సులో రెండువేలుంది. మాకు నెలంతా గ్రాసం వస్తుంది దాంతో.

"వాడేమయ్యాడు?" అహల్య పుస్తకాలు తీస్తూ అడిగింది.

"తీసుకెళ్ళి పోలేస్ స్టేషన్‌లో అప్పచెప్పాను. నాల్రోజులుంచుకుని బుద్ధిచెప్పి పంపమన్నాను." శివానీ వాళ్ళకి పోలీస్ సర్కిల్లో చాలమంది తెలుసు. శివాని మేనత్త కోడుకు 'రుద్ర' ఐ.పి.యస్‌కి సెలక్టయ్యాడు.

భూపసభాంతరాలమున, బుష్కల వాక్చతుర్వత్వ. మజిబా

హాపటు శక్తియున్, యశము నందను రక్తియు, విద్యయందు వాం

ఛాపరి వృద్ధియున్, బ్రకృతి జన్యగుణంబులు సజ్జనాళికిన్.

ఒక్కరాజ సభల్లోనేమిటి, అన్ని చోట్లా నాకు వాక్చతురత్వం పుష్కలంగానే ఉంది. కానీ అహల్య, శివానీ కూడా... తక్కువ మాట్లాడినా, ప్రతీమాటకీ అర్థం, అంతరార్థం ఉంటాయి.

మేం ఇద్దరం అంత బలవంతులం కాకపోయినా శివానీకి మంచి స్టామినా, బలం ఉన్నాయి. రైతు కుటుంబంలోంచి వచ్చింది, పైగా మాంసాహారి. జన్మతః శక్తివచ్చింది. తనతో తిరిగి తిరిగి, నాకూ అహల్యకి కూడా బలం రాకపోయినా, నీరసం మాత్రం పోయింది.

మా ముగ్గురికీ కూడా "యశమునందనురక్తి, విద్యయందు వాంఛా పరివృద్ధి"... సమృద్ధిగా ఉన్నాయి. మమ్మల్ని ముగ్గురినీ ఒకచోట చూసినప్పుడల్లా నాన్నగారి నోటంట ఈ పద్యం తప్పకుండా వస్తుంది. మొదట్లో అర్థం అయేదికాదు. తెలుగు సాహిత్యామృతాన్ని కొద్దికొద్దిగా రుచిచూడడం మొదలు పెట్టాక. ఒకసారి విశ్లేషించి వినిపించాను. శివానీ, అహల్య ఒకటే చప్పట్లు.

ఇంటర్ అయాక, విభాగాలు విడిపోయినా మా స్నేహం మరింత పటిష్టం అయింది. రోజూ ముగ్గురం మూడు సైకిళ్ళ మీద.. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాలేజ్‌కి వెళుతుంటే... దారిలో అందరూ పలకరించేవారు, క్రమం తప్పకుండా. కూరగాయల బండివాడి దగ్గరనుంచీ, ఇస్త్రీపెట్టె మల్లమ్మ వరకు. ఎవరైనా మిస్ అయితే సాయంత్రం ఏమయిందో కనుక్కోవలసిందే

మా ఇంట్లో నేనూ, అమ్మా, నాన్నగారూ, తమ్ముడు శేషు ఉంటాం. మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఉండే వీధిలో మా నివాసం. చాలా చిన్న ఇల్లయినా, తాతగారు కట్టించి ఇచ్చిన స్వంత ఇల్లు కనుక ఇంటద్దె లేకుండా కాలక్షేపం అయిపోతుంది. ఒక్క పక్కనే మూడు గదులున్న ఇంటిని మధ్యలో గోడకట్టి రెండు ఇళ్ళుగా చేశారు. ప్రక్కన మూడు గదులింట్లో బాబాయి, పిన్ని వాళ్ళ పిల్లలు శ్యాము, కిరణ్ ఉంటారు. బాబాయ్ బాంకులో పని చేస్తాడు బాబాయి పేరు 'సుబ్బారావు'. పిన్ని పేరు 'శారద'. మా వీధిలోనే ఉన్న 'హార్వర్డ్ కాన్వెంట్'లో టీచరు. శ్యాము పదోతరగతిలో ఉంది. కిరణ్ ఏడోక్లాసు చదువుతున్నాడు.

మా నాన్నగారు నారాయణరావుగారు గవర్నమెంట్ స్కూల్లో టీచరు. ట్యూషన్లు అవీ కుదరని తెలుగు టీచరు. సాయంత్రాలు ఊర్లో ఉన్న సాహిత్యాభిలాషులతో మా వీధి వరండా నిండిపోతుంది. "పైసా సంపాదన లేని పోచికోలు కబుర్లు" అని అమ్మ గొణుగుతుంటుంది.... ఇంట్లో. వచ్చిన వాళ్ళకి మాత్రం నవ్వుతూ టీయో, మజ్జిగో ఇస్తుంటుంది. "అన్నపూర్ణ" కదా!

మా వాటాకి వీధివరండా, హాలు, పెద్ద వంటిల్లు వచ్చాయి. ఇంటి ముందు కొద్దిగా ఖాళీ స్థలం అందులోనే ఓ మందార చెట్టు, గేటు మీంచి ఓ జాజి తీగ ఉన్నాయి. పెరట్లో కొంచెం ఎక్కువే ఉంది జాగా. అక్కడే నీళ్ళ పంపులు, బాత్‌రూం, లెట్రిన్‌లకి పోగా ఇంకా బాగానే ఉంది స్థలం. అందులో ఏవో తీగలు వేసి కూరగాయలు పండిస్తుంటుంది అమ్మ. కూరగాయలేవీ ఎక్కువ కొనక్కర్లేకుండానే గడిచిపోతుంది. రెండరటి చెట్లలో ఒకదానికి ఎప్పుడూ గెల ఉంటుంది. అరటి చెట్టుకింద ఆకుకూరలు, ఇంక తీగలు పెంకుటింటిపైకి పాకి పోయి ఉంటాయి. బాబాయి వాళ్ళ వాటా మీదకి పాకిన కాయల్ని వాళ్ళే కోసుకుంటారు, సంరక్షణ అమ్మ చేసినా. "పోన్లే వాళ్ళు మాత్రం పరాయి వాళ్ళా. అంటుంది" అమ్మ కానీ వాళ్ళు మాత్రం అలా అనుకోవద్దూ!!

పండగలకీ పబ్బాలకీ అందరం కలిసి పూజలు చేసుకుని భోంచేస్తాం. మా ఇంట్లో అమ్మ తెల్లవారుఝామునే లేచి వంటంతా చేసేస్తుంది. పిన్ని.. పిల్లలకి తలంట్లూ ఇల్లు సర్దుకోవడం, చిన్నా చితకా పనులు తెమల్చుకుని వచ్చేసరికి, పనంతా అయిపోతుంది. బాబాయి కొంచెం త్వరగా వచ్చి, పూజగది దగ్గర అలంకారం చేస్తాడు. పూజగది అని ప్రత్యేకం ఏం లేదు. వంటింట్లోనే ఒక మూల చిన అడ్డగోడ కట్టి మందిరం పెట్టారు. అప్పుడు వచ్చి పిన్నీ, పిల్లలు పూజ దగ్గర కూర్చుంటారు. నాన్నగారు గంభీరమైన కంఠంతో మంత్రాలు పఠిస్తుంటే అందరం కలిసి పూజ చేస్తాం.

తర్వాత భోంచేశాక, మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళిపోతారు బాబాయి వాళ్ళు. ఒకసారి అమ్మని అడిగాను. "ఎప్పుడూ వాళ్ళు మనింటికి రావడమే కానీ. మనం ఎప్పుడూ వాళ్ళింటికి ఎందుకు వెళ్ళం?" అని.

"ఏమో! నాకెప్పుడూ అనిపించలేదు" అనేస్తుంది అమ్మ.

ఒక్కసారి కూడా వాళ్ళు ఇంటికి రమ్మని కానీ, భోంచెయ్యండని కానీ పిలవరు. వాళ్ళ వాటాకి వచ్చిన మూడుగదుల వాటానీ మార్చి అంతా ఆధునికంగా చేసుకున్నారు. వెనక పెరట్లో వంటిల్లు, భోజనాల గదీ... మధ్యగదికి ప్రక్కగా, ఒక పడకగది వేసుకున్నారు. నేలమీద కూడా తళతళలాడే పాలరాయి వేయించుకున్నారు. పెంకుటిల్లే అయినా క్రింద సరంబీ వేయించుకుని, బూజులూ... దుమ్ము అదీ ఎక్కువరాకుండా చూసుకున్నారు.

పాపం అమ్మ! ప్రతి గురువారం బూజుల కర్రపట్టుకుని దులపాల్సిందే. తాతగారినాటి సిమెంటునేల. పామి కడిగీ కడిగీ, నున్నగా మెరుస్తుంటుంది. ఎంత ఆధునిక సదుపాయాలున్నా మా ఇంట్లో ఉన్న నిరాడంబరత, హాయి పక్కింట్లో కనిపించవు నాకు.

చాలా చాకచక్యంగా పిన్ని అమ్మ చేత పనులు చేయించుకుంటుంది. వాళ్ళు ప్రక్కనుండడం వల్ల వాళ్ళకే ఎక్కువ లాభం. పిల్లల చదువుల్లో కూడా నేను, నాన్నగారు సాయం చేస్తుంటాం.

"అన్నయ్య పెద్దవాడవుతున్నాడు. కాస్త చేసాయంగా ఉంటామని మేం ఇక్కడే ఉంటున్నాం. లేకపోతే బాంకు కాలనీలో కొనుక్కొనేవాళ్ళం." బాబాయ్ ఎవరితోనో అంటుంటే విని నవ్వుకున్నాను.

మా తమ్ముడు శేషు నాకంటే రెండేళ్ళు చిన్న. ఇంజనీరింగు ఫస్టియర్లో చేరాడు ఇంటర్లో కాలేజీ, ట్యుటోరియల్ క్లాసులు అయి ఇంటికికొచ్చేసరికి పది దాటేది. మా ఊళ్ళో కాలేజీలోనే గవర్నమెంటు కోటాలో సీటు వచ్చింది. అయినా మా తాహతుకి ఎక్కువే. అమ్మ ఇంకొంచెం పొదుపు పాటించి, చిట్టీలు పాడి వాడిని కాలేజీలో చేర్పించింది.

"బాబాయ్‌కి నాన్నేగా చెప్పించారు. శేషు ఫీజు అడగండి." నేనొక ఉచిత సలహా పడేశాను.

"ఎందుకు అడిగిలేదనిపించుకోవడం. అయినా మనం అడగకుండానే వాళ్ళ అవసరాలన్నీ ఏకరువు పెడుతుంటారుకదా!" అమ్మ బట్టలు మడతపెడుతూ అంది. మా ఇంట్లో పనిమనిషి లేదు. నాకు వీలయినంత సాయం చేస్తుంటాను. అయినా నిర్విరామంగా పనిచేస్తూనే ఉంటుంది.

"ఏయ్! ఏం చేస్తున్నారు?" వరండాలోంచి శేషు ఎవరిమీదో అరుస్తున్నాడు. ఇవాళెందుకో వీడు పెందరాడే వచ్చేశాడు. ఇంటర్లో పది దాటాక ఇంటికి వచ్చే అలవాటు ఇంజినీరింగులో చేరినా వదల్లేదు. ఏం చేస్తాడో!

"పూలు కోసుకుంటున్నాం శేషన్నాయ్." శ్యాము మందార పూలు, కిరణ్ జాజిపూలు కోస్తున్నారు.

"కోసింది చాల్లే. వెళ్ళండి."

"పూజకి మందారాలు, తల్లోకి జాజిపూలు కోసుకురమ్మంది అమ్మ." కిరణ్‌గాడు చేతికందినన్ని పచ్చిమొగ్గల్తో కూడా కోసేస్తున్నాడు.

"అలాగా అయితే మీ ఇంటిముందు వేసుకోండి. ఎప్పుడన్నా ఒక చెంబుడు నీళ్ళు పొయ్యడం కానీ, ఎండాకులు తియ్యడం కానీ చేశారా? చెట్టంతా ఖాళీ చెయ్యడం మటుకు వచ్చు" శేషు మొహం అంతా ఎర్రగా చేసుకుని కిరణ్ దగ్గరకి వెళ్ళాడు.

"శేషూ! ఇలారా!" అమ్మ శేషుని లోపలికి తీసుకెళ్ళింది.

"ఏం నీకు పూజకి అక్కర్లేదా! చెట్టంతా ఊడ్చేస్తున్నారు రోజూ!" శేషు కోపంగా అన్నాడు. నాకైతే శేషు మాటలు న్యాయంగానే అనిపించాయి. వాళ్ళింటి ముందు తక్కువ స్థలం ఉంది. ఒక వరస క్రోటన్స్ మాత్రం వేసుకున్నారు.

"ఊరుకో! నీకు ఇంజినీరింగులో చేరాక కోపం ఎక్కువైంది" అమ్మకి పిన్ని ఏమైనా అనుకుంటుందేమో అని భయం.

"నాలుగు పూలు కోసుకుంటే ఏమైందక్కా? శేషు ఏమన్నాడు శ్యాము ఏడుస్తూ వచ్చింది." శారద పిన్ని రానే వచ్చింది.

"నాలుగు పూలా? మొగ్గలు కూడా వదలట్లేదు రోజూ" శేషు మళ్ళీ లేచాడు.

"శేషూ! నువ్వూరుకుంటావా?"

"రోజూ ఊరుకుంటూనే ఉన్నాను. చాకరీ చేసేది నువ్వూ, షోకులు చేసుకునేది వాళ్ళూ."

"అబ్బా! నీకెందుకురా. నాకు లేనిది. నోర్మూసుకో." అమ్మ ఆ మాత్రం పరుషవాక్యం అనగా నేనెప్పుడూ వినలేదు.

"నువ్వనలేక వాడిచేత అనిపిస్తున్నావు. పూజకి రెండుపూలు కోసుకుంటే ఎకరాలు కరిగిపోతాయా!" శారద పిన్ని మాటలకి నాక్కూడా కోపం వచ్చింది.

"ఎకరాలేం కరిగిపోవు కానీ మాకు పూజకి ఏం ఉండటంలేదు. అందుకే వాడు ఊరుకోలేక అన్నాడు." అమ్మని వంటింట్లోకి తీసుకెళుతూ అన్నాను.

శారద పిన్ని కోపంగా వాళ్ళింటికి వెళ్ళిపోయిమింది.

వినేవాళ్ళకి ఏంటి సిల్లీగా పోట్లాడుకుంటున్నారు పూలకోసం అనిపిస్తుంది. కామన్‌గా ఉన్న పూలనైనా అందరూ సమానంగా పంచుకోవాలి అనే ఆలోచన ఉండాలనిపిస్తుంది నాకెపుడు. అలాంటిది మా ఇంట్లో చెట్లు, వాళ్ళ సొంతవిలాగా అనుకుని..... ఇవాళే కాదు. రోజూ అదే తంతు. ఎపుడూ లేనిది శేషు ఏంటి? అలా రెచ్చిపోయాడు?

అయినా ఇంజినీరింగ్‌లో చేరాక మారాడేమో అనిపిస్తుంది. ఎప్పుడూ మూడీగా ఉండడం. ఏదైనా కావాలంటే దబాయించి తీసుకోవడం.... చదువెలా ఉందో కనుక్కోవాలి.. నాకెందుకో భయం వేసింది.

నాలుగు తరాల క్రితం మా పూర్వీకులు కరువు ప్రాంతంనుంచి ఈ ఊరు వలసి వచ్చేశారట. కృష్ణవేణి నదీ తీరం. పాడి పంటలకి లోటు లేదు. దాంతో పండితులకి కూడా ఆదరం పుష్కలంగానే లభించేదట. మా తాత ముత్తాతలు జ్యోతిషంలోనూ,

వ్యాకరణంలోనూ ఆరితేరిన పండితులు. ముహూర్తాలు పెట్టడానికీ, జాతక చక్రం వేయించుకోడానికి వచ్చే పోయేవారితో ఇల్లు కళకళలాడుతుండేదట.

మా తాతగారి తండ్రి ఇపుడు మేముంటున్న ఇల్లు కట్టించి, దగ్గర్లో ఉన్న ఊర్లో నాలుగెకరాలు పొలం కూడా ఏర్పర్చుకోగలిగారు. మాముత్తాతగారి విద్య మీద గౌరవంతో చల్లపల్లి రాజావారు పొలం ఇచ్చారని అంటారు. కాలక్రమేణా పిల్లల్ని బడికి పంపడం, ఇంగ్లీషు చదువులు చదివించడం అన్ని పండిత కుటుంబాల్లోనూ అనివార్యమైంది. మా తాతగారొక్కరే సంతానం. అయినా జ్యోతిషశాస్త్రంలో దిట్టేనట.

మా నాన్నగారు బి.ఏ. బి.యిడి చదివి స్కూలు టీచరుగా చేరితే, బాబాయి డిగ్రీ అవగానే బాంకులో చేరాడు. ఇద్దరికీ మధ్య ఇద్దరాడపిల్లలు. మా అత్తలిద్దరి పెళ్ళికీ పొలం అమ్మేశారు. మా తాతగారు, బామ్మ సంవత్సరం తేడాలో పోయారు.

ఇంటికి పెద్దకొడుకు అని పెద్దవాటా నాన్నగారికివ్వాలని బాబాయి పంపకాలప్పుడు ఉదారంగా ప్రవర్తించాడు. నిజంగానే మాకు పెద్ద వరండా, హాలు, పెద్ద భోజనాలగది వచ్చాయి. ముందు వెనక జాగా కూడా ఉంది. అందరం నిజమే కాబోలనుకున్నాం. కాని బాబాయ్ వాటా కొచ్చిన మూడు గదుల ప్రక్కన ఇంటిని మించిన స్థలం ఉంది. అది ఆయనకి వెళ్ళింది. అందులోనే కావల్సినట్లు గదులు వేసుకున్నారు వాళ్ళు.

ఈ మధ్య తగ్గింది కానీ, ఇదివరకు మా అత్తలు తరచు మాఇంటికి వచ్చేవారు. వాళ్ళు వచ్చారని, ప్రక్కనున్న బాబాయ్ వాళ్ళు సరేసరి. తాతగారున్నప్పటిలాగే చాలాకాలం మా ఇంట్లో సాగింది. నెమ్మదిగా అమ్మ మర్యాదలు తగ్గించింది. రెండుకూరలు చేసేది ఒక కూర, సాంబారు బదులు చారు... ఇలా. అర్ధం చేసుకున్నారో లేక ఎవరి సంసారాలు వాళ్ళు చూసుకోవడంలో మునిగారో కానీ రద్దీ తగ్గింది. మాక్కూడా ఖర్చులు పెరిగాయి కదా!

అంతమంది వస్తూపోతున్నా, మా శేషు మాత్రం ఎక్కువ ఎవరితో కలిసేవాడు కాదు. కొంచెం కూరకానీ, రెండు పూరీలు తగ్గితే మాత్రం ఎవరున్నా పేచీ పెట్టేసేవాడు. అత్తల పిల్లలతో ఆడేవాడు కాదు. తన చదువు లేదా బైట స్నేహితులతో గడపడం. ఒకదశలో నాన్నగారు బెంగపెట్టుకున్నారు కూడా! ఇంజినీరింగులో చేరాక కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

ఒక్క విషయంలో మాత్రం నేను శేషుతో ఏకీభవించేదాన్ని. శ్యాము, కిరణ్ వాళ్ళు సొంతంలా మా ఇంట్లో వస్తువులు వాడుకోవడం, స్కూల్నించి వచ్చి మా ఇంట్లో ఫలహారం చెయ్యడం నచ్చేది కాదు. మేం ఎప్పుడూ వెళ్ళలేదు. మాకు పడక గదే లేదు. హాల్లో పరుపులు వేసుకోవడమే. పగలు ఎత్తేసి ఒకమూల పెట్టేసి ఫోల్డింగ్ బల్ల వేసుకుని చదువుకుంటాం. ఎవరొచ్చినా ఇంక అక్కడే

ఒకసారి మా చిన్నత్త వచ్చినప్పుడు... తననీ, మామయ్యనీ పిల్లల్నీ, "డిన్నర్‌కి రమ్మన్నారు" అంటూ బాబాయ్ వాళ్ళింటికి వెళ్ళారు. ఆదివారం సాయంత్రం నాల్గింటికి వెళ్ళినవాళ్ళు ఎనిమిదింటికి మా ఇంటికి వచ్చారు. వాళ్ళతో బాబాయ్ వాళ్ళూను. "డిన్నర్" అయి కబుర్లు చెప్పుకోడానికి వచ్చారనుకున్నాం.

"వదినా! కూరగాయలేం ఉన్నాయ్" చిన్నత్త నీరసంగా. నేను, శేషు ఒకరి మొహం ఒకరం చూసుకున్నాం.

"అదేం పాపా! డిన్నర్ అవలేదా?" చిన్నత్తని 'పాప' అంటారు.

"ఎక్కడొదినా! ఎనిమిదింటి వరకు పేకాడుకున్నాం. శారద వంటి చేద్దామని వంటింట్లోకి వెళ్ళింది. 'గాస్' అయిపోయిందని తిరుగు టపాలో వెనక్కి వచ్చింది. అబ్బ! కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఏదైనా పెట్టు." చిన్నత్త కాస్తాగితే కళ్ళు తిరిగి పడేట్టుంది స్పేర్ సిలిండర్ లేదా? ఎవరడుగుతారు?

అప్పుడు రాత్రి తొమ్మిదవుతుంటే... ఎనిమిది మందికి, అమ్మ బంగాళ దుంపలు వేయించి, చారుపెట్టి, అన్నం వండి వడ్డించింది. "వాళ్ళింట్లోంచి కూరగాయలేనా తేవచ్చుగా! రేపూ, ఎల్లుండీ మనకి పచ్చడిమెతుకులే గతి" శేషు కోపంగా అన్నాడు.

నిజమే కదా! గాస్ అయిపోయిందికానీ, "డిన్నర్"కి తెచ్చిన కాయగూరలుంటాయి. అవి తేవచ్చుకదా!

"హు! వీళ్ళు ప్రక్కనుండడం వల్ల మనకి ఎంతో లాభం." గొణుగుతున్న శేషు నోరు నొక్కుతూ పుస్తకాలు తీసుకుని వీధి వరండాలోకి వెళ్ళిపోయాను. నావెనకాలే వాడూను.

కష్టపడి ఏకాగ్రత కుదుర్చుకుని, హోం వర్క్ చేసుకుని పడుకునేసరికి పదకొండయింది... శేషు, నాన్నగారు, మామయ్య వరండాలో, మేము హాల్లో. బాబాయ్, పిన్నీ వాళ్ళింట్లోకి వెళ్ళి వెచ్చగా పడుకున్నారు.

## 2

అహల్య వాళ్ళ ఇల్లు మా ఇల్లు దాటాక రెండు వీధులవతల ఉంది. మా పేటకి వాళ్ళ వీధే ఆఖరు. తరువాత రైలు కట్ట వచ్చేస్తుంది. ఆ చివరికి వెళ్ళే సరికి వీధులు, ఇళ్ళు... ఇంకా ఇరుకై పోతాయి. అహల్య వాళ్ళు రెండు గదుల ఇంట్లో అద్దెకుంటారు. ఇంటి ముందు తాటాకుల పంచ దించారు. ఆ పంచ మీదకి ఆనప్పాదు, దొండపాదులాంటివి ఎక్కించారు. ఉన్న కాస్త స్థలం ఇంటి ముందే ఉంది. అందులోనే ఒక పక్క కొత్తిమీర మడి, తులసి మొక్క ఉన్నాయి. సన్నగా ఒక మనిషి నడవడానికి మాత్రమే త్రోవ ఉంది. అహల్య వాళ్ళ నాన్న 'శివయ్య'కి పెద్ద బజార్లో బట్టల కొట్లో పని. ఎంత ఇస్తారో కానీ... అందులోనే గుట్టుగా బ్రతుకుతున్నారు. అహల్య ఒక్కతే వాళ్ళకి. కొంతలో కొంత నయం.

పొదరిల్లు లాంటి ఆ ఇంట్లోంచి అహల్య వస్తుంటే వనకన్య నడిచి వస్తున్నట్లుంటుంది. ఉన్న రెండు మూడు జతల బట్టలు ఎంతో శుభ్రంగా ఉంటాయి. రెండు చేతులకీ నాలుగేసి ఎర్రగాజులు, మెళ్ళో నల్ల తాడుకి వెంకటేశ్వర స్వామి లాకెట్. అంత సామాన్యమైన అలంకరణలోనూ అనంతమైన సౌందర్యం. మూర్తీభవించిన సరస్వతీ రూపం 'అహల్య' బి.యస్సీ డిగ్రీలో చేరినప్పటినుంచీ, ప్రతీ సబ్జెక్టులోనూ తనదే ఫస్ట్. ఒక్క పాఠ్య పుస్తకం కూడా కొనలేదు. శివానీ దగ్గర పుస్తకాలు తీసుకుని నోట్సు తయారు చేసుకుంటుంది. శివానీ రెండేసి కొంటుందనుకుంటాను. ఎప్పుడూ పుస్తకం తిరిగి ఇమ్మని అడగదు.

అహల్య వాళ్ళ అమ్మ 'వాణి', అహల్య కన్నా పదిహేడేళ్ళే పెద్ద చక్కని కంఠస్వరం. సంగీత కళాశాలలో చేరి నాలుగేళ్ళ సర్టిఫికెట్ పాసైంది. డిప్లొమోకి తయారవుతోంది. చుట్టుపక్కల పిల్లలకి సంగీతం నేర్పిస్తూ కొద్దిగా పాలఖర్చు వెళ్ళేలాగ సంపాదిస్తుంది. అక్కడందరి ఆదాయం అంతంత మాత్రమే. ఇంక సంగీతం టీచరుకేమిస్తారు? బి.ఎస్సి చేశాక, యం.ఎస్సి చేసి రీసెర్చి చెయాలనుంది అహల్యకి. అహల్య నాన్నమ్మ, వాళ్ళింట్లోనే ఉంటారు. పగలంతా తాటాకు పంచలోనే ఆవిడ మకాం. ఒక్క వానాకాలం తప్పితే, మా ఊర్లో పంచలు. వరండాలే నయం. ఇంట్లో ఉక్కిపోతూ ఉంటుంది. నాన్నమ్మగారు వత్తులు చేసి మా పేటలో కావాల్సిన వాళ్ళిళ్ళకి వెళ్ళి ఇస్తూంటుంది.

మా వీధిలో చాలా మంది ఇళ్ళలో, ఇంటి ముందు పత్తి చెట్లున్నాయి. అహల్యా వాళ్ళ నాన్నమ్మ... దుర్గమ్మగారు, వాళ్ళ ఇళ్ళకి వెళ్ళి.... మధ్యాహ్నం ఆ పన్లో, ఈ పన్లో సాయం చేస్తుంటుంది. కింద పడ్డ పత్తికాయలన్నీ ఏరి, ఇంటికి తెచ్చుకుని వత్తులు చేస్తుంది.

"నాన్నమ్మా! మాక్కూడా నేర్పించవా?" మేం ముగ్గురం ఎప్పుడైనా ఆవిడ దగ్గర చేరేవాళ్ళం.

"మీరు బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగాలు చెయ్యాలి. ఇదెందుకమ్మాయిలూ!" అంటూ ఆవిడ నేర్పించేది.

శివానీ అలాంటివి ఇట్టే పట్టేసేది. వారినికోసారి ఆవిడ దగ్గర కూర్చుని చకచకా చేసేది.

"చూస్తుండండి మామ్మగారూ! నేను వత్తుల ఇండస్ట్రీ పెడతాను. మీరే దానికి మేనేజరు." శివానీకి దుర్గమ్మగారంటే చాలా ఇష్టం. అసలు తను పెద్దవాళ్ళని ఎవర్ని చూసినా దగ్గరకి చేరి, కబుర్లు చెప్పి వాళ్ళ అనుభవాలన్నీ తెలుసుకుంటుంటుంది. మా ఇంట్లో, అహల్య ఇంట్లో కూడా శివానీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారు.

"ఏం వస్తుందే పిల్లా! వెయ్యి వత్తులకి యాభై రూపాయలు కూడా రాదు ఎప్పుడూ చేస్తూనే ఉంటానా? నెలకి వంద వస్తే గొప్ప. కొంత మందికి ఉత్తినే ఇస్తుంటాను. మరి వాళ్ళింట్లో పత్తి తెస్తాగా?"

"చూశావా మీరా! మామ్మగారి బిజినెస్ టెక్నిక్. రామెటీరియల్ ఫ్రీ. దానికి కొంత ప్రొడక్ట్ సప్లై. ఇలాంటిది చూసుకుంటే పెట్టుబడి అఖ్ఖర్లేదు." శివానీకి సహజంగా వ్యాపార దృక్పథం ఉన్నట్లనిపిస్తుంది.

"అంత పెద్ద ఆలోచనలేం లేవురా! ఏదో సంసారం నడవడానికి ఉడత సాయం. పైగా కాలక్షేపం."

"అందరూ మీలాగే ఉంటే వృద్ధాశ్రమాల అవసరం ఉండదు మామ్మగారూ! ఎవరింట్లో వాళ్ళకే హాయిగా ఉంటుంది." శివానీ ఆవిడకేసి ఆరాధనగా చూస్తూ అంది.

"నాలాగే కాదు. నా కోడల్లాగా కూడా ఉండాలి. పెద్దవాళ్ళుంటే 'అడ్డు' అనుకునే వాళ్ళే అధికం ఇప్పుడు." దుర్గమ్మగారు చేసిన వత్తుల్ని లెక్కపెట్టి వంద, వంద చొప్పున చిన్న కట్టలు కడుతూ అన్నారు.

నిజంగానే... వాణి ఆంటీ, దుర్గమ్మ గారు చాలా స్నేహంగా ఉంటారు. కోడలు త్యాగరాజ కీర్తనలు పాడుతుంటే, భావమంతా మనసులోకి పట్టించుకుంటూ... మధ్యలో తెలీక పోతే అర్థం అడుగుతూ, చిక్కుడు కాయలు బాగు చేస్తూ ఉంటారు.

"దినకర కులభూషణుని దీనుడవై భజన చేసి,

దినము గడుపు మనిన నీవు వినవదేల గుణవిహీన"....

మలయ మారుతం రాగంలీ "మనసా ఎటులోర్తునే" వింటుంటే... ఆవిడకి ఒళ్ళంతా పులకరించి, కళ్ళల్లో నీళ్ళొచ్చేసాయి.

"ఇంక వేరే పురాణాలు వినడానికి ఎక్కడికో వెళ్ళడం ఎందుకు? ఇలాంటి మహానుభావుల పాటలు మననం చేసుకుంటూంటే చాలు. ఏదీ.. 'భావములోనా' పాడమ్మా!" చిక్కుడుకాయలు లోపల పెట్టి, ఏరడానికి బియ్యం తెచ్చుకుంటూ అడుగుతారు.

వాణీ ఆంటీ ఉత్సాహంతో అన్నమయ్య కీర్తన ఎత్తుకుంటారు. మేం ముగ్గురం, కాలేజీ అవగానే వెళ్ళి కాసేపు ఆ అత్తా కోడళ్ళ సంవాదాలు విని ఆనందిస్తుంటాం.

వాణీ ఆంటీకి సంగీత సాధన, దుర్గమ్మగారికి ఆధ్యాత్మిక సాధన అవుతుంటే... ఇంటిపనులు కూడా అయిపోతాయి. తర్వాత అంటే అరగంటలో వంట పూర్తిచేసేసి, పిల్లలకి పాఠాలు చెప్పడానికి కూర్చుంటారు.

ఇలాంటి వాతావరణంలో పెరగడం వల్లే అనుకుంటాను... మా అహల్యకి అంత సాత్విక స్వభావం అలవడింది.

"మా నాన్నమ్మకి పెళ్ళయి, ఇద్దరు పిల్లలు పుట్టిన వెంటనే మా తాత గారు పోయార్ట. అప్పటికి ఆవిడకి పద్దెనిమిదేళ్ళు." ఓ రోజు మాతో అహల్య విచారంగా అంది. ఎప్పుడూ తను కొంచెం కూడా దిగులు కనిపించనీయదు.

"మైగాడ్! అంటే మన వయసంతన్నమాట." శివానీ, అహల్య ప్రక్కన కూర్చుంటూ అంది.

అహల్య తల ఊపింది. "మరి... మీ నాన్న ఒక్కరే? " నేను సందేహంగా సగంలో ఆపేశాను.

"మా తాతగారు హార్ట్ ఎటాక్‌తో పోయారనుకుంటాను. అప్పుడు పల్లెటూళ్ళలో ఏమీ తెలీదుకదా! మా బాబాయికి పుట్టినప్పట్నుంచీ హార్ట్ ప్రాబ్లంట. కంజెనిటల్ అనుకుంటాను. డాక్టర్లు పదహారేళ్ళు నిండాక ఆపరేషన్ చేస్తామన్నార్ట. ఆ అవసరం రాలేదు. పదిహేనేళ్ళకే ఆయన... హాస్పిటల్‌కి తీసుకెళ్ళేలోపునేపోయార్ట.."

"అంత చిన్న వయసప్పుడే అన్ని కష్టాలు పడి కూడా మామ్మగారు ఎంత గంభీరంగా ఉంటారో. ఆవిడే నిజమైన యోగి." శివానీకి దుర్గమ్మ గారి మీద అభిమానం మరింత పెరిగింది.

"అవును. కొన్నాళ్ళు మరుదుల దగ్గర, కొన్నాళ్ళు చెల్లెలు దగ్గర ఉంటూ పిల్లల్ని చూసుకుందట. అందుకే మా నాన్న ఎక్కువ చదువుకోలేకపోయరు. ఇవాళ మా బాబాయి పోయిన రోజట. నాన్నమ్మ పులిహోర చేసి గుడికి తీసుకెళ్ళింది." అహల్య మూడీగా అంది.

"మామ్మగారు... గుడికా" శివానీ ఆశ్చర్యంగా అంది. ఆవిడ గుడికి వెళ్ళగా మేం ఎప్పుడూ చూడలేదు. "మామ్మగారికి ఇల్లే ఆలయం" అంటుంది శివానీ ఎప్పుడూ.

"గుడి దగ్గర ఉన్న బిచ్చగాళ్ళందరికీ పులిహోర పంచి పెడుతుంది. వాళ్ళు కడుపు నిండి వద్దనేవరకూ" డబ్బా తీసి మాక్కూడా పులిహోర పెడుతూ అంది అహల్య.

"మామ్మగారు రియల్లీ గ్రేట్. ఆవిడ్ని చూసి చాలా నేర్చుకోవాలి మనం."

శివానీకి అహల్య వాళ్ళ పులిహోర చాలా ఇష్టం. "ఇలాంటి వాసన మా ఇంట్లో రాదేం?" అంటుంది.

"ఇంగువ బాగా దట్టిస్తే వస్తుంది."

"మా ఇంట్లో ఇంగువే వాడరు ఎప్పుడూ. అల్లం, వెల్లుల్లి తప్ప." శివానీ వాళ్ళింట్లో చేసేవి నాకూ, అహల్యకీ ఇష్టం. పూరీ, కుర్మా తెస్తే మేమే లాగిస్తుంటాం. ఎవరికయినా కొత్తరుచులంటే మక్కువే.

"ఇంక మామూలుగా ఉండు అహల్యా! నువు విచారంగా ఉంటే మాకేం తోచదు." నేనూ, శివానీ కోరస్.

అహల్య చిరునవ్వు నవ్వింది.

"అమ్మయ్య! మబ్బు తొలిగి చందమామ బైటికి వచ్చింది."

"మీరా! నీ తెలుగు పాండిత్యం మాకు ఎప్పుడూ ప్రదర్సిస్తూంటావే!"

శివానీ వాళ్ళ ఇల్లు మెయిన్ రోడ్డుకి దగ్గరగా ఉంటుంది. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు మా పేటలోకి తిరగ్గానే మొదటి వీధిలోనే ఉంటుంది. ముందర అయిదు వీదులూ విశాలంగా.... అక్కడి ఇళ్ళు మరింత విశాలంగా ఉంటాయి. మాది ఆరో వీధి. వీధులూ, ఇళ్ళు కూడా చివరికి వెళ్ళేసరికి ఇరుకయిపోతాయి.

అహల్య మా ఇంటికి వస్తే మేమిద్దరం కలిసి శివానీ ఇంటికి వెళతాము. ఇంటి బైట నుంచుని ఉన్న శివానీ మమ్మల్ని చూడగానే సైకిలెక్కేస్తుంది. ఇన్నేళ్ళ స్నేహంలోనూ శివానీ వాళ్ళింటికి మూడు నాలుగు సార్లుకంటే వెళ్ళలేదు. బైటనించీ కంటే ఇంట్లోకి వెళితే ఇంకా పెద్దగా ఉంటుంది.

శివానీ వాళ్ళ నాన్నగారు 'గిరినాయుడు'గారు. వాళ్ళకు చాలా వ్యాపారాలున్నాయంటారు. మా ఊళ్ళో ఆయన పేరు చెపితే అందరూ "అమ్మో" అంటారు... భయంతో, భక్తితో. తన దగ్గర పనిచేసే వాళ్ళని ఎంత ఆదరంతో చూస్తారో.... సరిగ్గా పని చెయ్యక పోయినా, ఏవైనా మోసం చెయ్యాలని చూసినా... అంతే కఠినంగా ఉంటారని పేరు. మేము నైన్త్ క్లాసులో ఉండగా ఆయన్ని ఎక్కువ చూసేవాళ్ళం. వీధి వరండాలో ఉయ్యాల బల్లమీద కూర్చుని ఊగుతూ పేపరు చదువుతుండేవారు. నన్నూ, అహల్యనీ ఎంతో వాత్సల్యంగా పలకరించేవారు. టెన్త్‌లో అప్పుడపుడు చూస్తే... ఆ తర్వాత అసలు కనిపించలేదు. శివానీని అడిగితే... "డాడీ చాలా బిజీ అయిపోయారు, నాకే సరిగ్గా కనిపించడం లేదు" అంటుంది.

రోజూ మేం కలిసినా ... శివానీయే మా ఇళ్ళకొచ్చి గడిపేది. మేం వాళ్ళ ఇంటికి వెళ్ళేవాళ్ళం కాదు. తను మాతో ఎంత ఇదిగా ఉంటుందంటే.... మాకెప్పుడు "ఎందుకు మమ్మల్ని వాళ్ళింటికి పిలవదు?" అని అనిపించేది కాదు.

శివానీకి ఒక అక్క 'భవానీ'. తనకి పెళ్ళైంది. ఇద్దరు పిల్లలు. వాళ్ళు హైదరాబాదులో ఉంటారు. బావగారు కూడా బిజినెస్సేనట. శివానీ వాళ్ళ అన్న వీళ్ళిద్దరికంటే పెద్దవాడు. శివానీకీ, అతనికీ పదిహేనేళ్ళు తేడా. పేరు 'విష్ణు'. గుంటూర్లో మెడిసెన్ చదివి, అమెరికాలో సెటిలయాడు.

గిరినాయుడుగారు, కొడుకు డాక్టరై.... తోడుగా ఇంట్లో ఉంటాడని ఆశపడ్డారు. విష్ణు తన క్లాసుమేట్ రాధికని పెళ్ళి చేసుకుని... మెడిసెన్ అవగానే, సంవత్సరం లోపు అమెరికా వెళ్ళిపోయాడు.

"అంత ఇంట్లో మీరు ముగ్గురే ఉంటారా?" ఒకసారి అహల్య అడిగింది.

"పగలంతా పని వాళ్ళుంటారు. వంటమనిషి, తోటమాలి, డాడీ పి.ఏ, పనిమనిషిలాంటి వాళ్ళు. రాత్రి గూర్ఖా ఉంటాడు. అయినా అలవాటయిపోయింది. అందుకే తీరికున్నపుడల్లా మీ దగ్గరికి వచ్చేస్తుంటానుగా." శివానీ చెపుతుండగానే వాళ్ళ అమ్మగారు, ప్రమీల ఆంటీ గేటు దగ్గరకి వచ్చారు.

"ఏమ్మా! బాగున్నారా! లోపలికి రాకూడదూ!"

"ఇప్పటికి అరగంట నుంచీ గేటు ముందు బాతాఖానీ వేశాం మమ్మీ! ఇంకోసారి వస్తార్లే. మళ్ళీ నేను టిఫిన్ అదీ తిని అహల్య వాళ్ళింటికి వెళ్ళాలి. రికార్డ్ వేసుకోవాలి."

"సరే నీ ఇష్టం" శివానీ వాళ్ళమ్మగారు అదోలా చూస్తూ లోపలికి వెళ్ళిపోయారు.

ప్రమీలాంటి ఎక్కువ బైటికి రారు. ఎప్పుడూ ఇస్త్రీ నలగని చీరలో హుందాగా ఉంటారు. మంచి ఒడ్డూ పొడుగు... శివానీకి గ్రేస్ అంతా ఆవిడ దగ్గర్నుంచే వచ్చినట్లుంది. నాకప్పుడప్పుడు అనిపించేది "శివానీకి ప్రత్యేకంగా గదీ .. అవీ ఉంటాయి కదా! అహల్యని రమ్మని వాళ్ళింట్లోనే చదువుకోవచ్చుకదా!" అని. కానీ ఎందుకో శివానీకి అహల్య వాళ్ళ చిన్న ఇంట్లో తాటాకు పంచే ఇష్టం. అంతఃపురం వదిలి తోటమాలి కూతురుతో ఆడుకునే రాజకుమారిలాగా ఉండేది శివానీ తీరు. మేం ముగ్గురం సాయంత్రం సమావేశమైనప్పుడు అదే అన్నానొకసారి.

"పోవే మీరా! అంత సీన్‌లేదు. నాకు మీదగ్గరున్నప్పటి హాయి, సంతోషం ఎక్కడా దొరకవు. సరే కానీ మంచి సినిమా వచ్చింది వెళదామా?"

"ఏంటి? శంకర్ దాదా యం.బి.బి.యస్సా?" ఉడికిస్తూ అన్నాను. శివానీకి చిరంజీవి పిక్చర్స్ చాలా ఇష్టం.

"ఒకసారి మమ్మీ, నేను చూశాం. ఇప్పుడు మీతో చూస్తాను పదండి"

"వద్దులెద్దూ! మీరాని ఏదైనా కథ చెప్పమందాం. ఆ సినిమాలకంటే బాగుంటాయి. బాగా అల్లేస్తుంది." అహల్యకి సినిమాకి వెళ్ళడానికి డబ్బులేం ఉంటాయి? నా పరిస్థితీ అంతే.

"అరె! మర్చిపోయాను. ఇవాళ మా డాడీ బర్త్‌డే అలా హోటల్లో మసాలా దోశ తినేసి చిరంజీవిని చూసేద్దాం." శివానీ మమ్మల్నిద్దర్నీ లేపింది.

"క్రిందటి నెలేకదా మీ డాడీ పుట్టినరోజని అయిస్‌క్రీమ్ తినిపించి సినిమాకి తీసుకెళ్ళావు." అహల్య అనుమానంగా చూసింది.

"పోవే! అది మా మమ్మీ పుట్టినరోజు."

"ఉండసలు. మీ ఇంట్లో వాళ్ళ బర్త్‌డేలన్నీ రాసుకుంటా."

"వాళ్ళ అమ్మ, నాన్న, అక్క, బావ, ఇద్దరు పిల్లలు, అన్న, వదిన, వాళ్ళ పిల్లలు, శివానీది.. పెద్ద లిస్ట్ ఉంది. మనకి ప్రతీనెలా ఒక ట్రీట్." అహల్యతో అన్నాను.

శివానీ ప్రక్కకి తిరిగిపోయింది.

"ఏయ్! ఏంటది?" నేను, అహల్య శివానీని త్రిప్పి మొహం పైకెత్తాము. కళ్ళనిండా నీళ్ళు. శివానీ మొహం ఎర్రగా అయిపోయింది.

"సారీ. నేను సరదాగా అన్నాను. అంతలా ఫీల్ అవుతావనుకోలేదు" చెయ్యి పట్టుకున్నాను.

"నాకు మీతో గడిపిన కాలం అంతా ఎంతో హాయిగా సరదాగా ఉంటుందే అసలు మనం ముగ్గురం రోజంతా కలిసి ఉండేలా ఎందుకు పుట్టించలేదో అనుకుంటాను ఎప్పుడూ! నాకు ఈ సంతోషాన్ని దూరం చెయకండి ప్లీజ్." శివానీ అంత బేలగా మాట్లాడ్డం మేమెప్పుడూ చూడలేదు.

"అరె! మీరా! సినిమాకి వెళ్ళి, హోటల్‌కి వెళ్ళి ఎంజాయ్ చేద్దామంటే నువ్వేంటే వెనక్కిలాగుతావు. పద పద! అలాగే అంకుల్‌కి హాపీ బర్త్‌డే కూడా చెప్పొద్దాం." నాదే తప్పయినట్లు అహల్య..

"డాడీ ఊర్లో లేరు. నేను ఫోన్ చేసి మీరు విష్ చేసినట్లు చెప్తాలే" శివానీ బైటకి నడుస్తూ అంది.

అహల్య ఇంట్లోకి వెళ్ళి వాళ్ళమ్మకి చెప్పి వచ్చింది. నేను దారిలో మా ఇంటి దగ్గర ఆగి, వరండాలో ఉన్న నాన్నగారికి చెప్పి వాళ్ళని కలిశాను.

శివానీని మళ్ళీ మామూలుగా సరదాగా ఉండేలా చెయ్యడాణికి చాలా సేపే పట్టింది మాకు.

హాల్లో మా వెనకాల ఒక 'గాంగు' చేరారు. చిరంజీవి డైలాగ్ చెప్పే ముందరే ఒకడు లేచి చెప్పేస్తున్నాడు. శివానీ చివ్వున లేచింది.

"మొత్తం కథంతా స్క్రీన్‌ప్లే లాగా చెప్పగలను నేను. చెప్పనా! నీ కంటె పెద్ద కంఠమే ఉంది" వెనక్కి తిరిగి ఒక డోస్ ఇచ్చింది. ఆ తర్వాత వాడు మాట్లాడితే ఒట్టు.

అయినా ఎంత మందిని ఆపగలం? డాన్సు సీన్లు వచ్చినప్పుడు స్టెప్పులు వేసేవాళ్ళూ, ఫైట్‌లు వచ్చినప్పుడు అరిచేవాళ్ళూ.... సినిమా రిలీజయి చాలారోజులైంది కదా! ఒక్కోళ్ళు పదోసారి చూస్తున్నట్లున్నారు. ఇంత శ్రద్ధలో సగం వాళ్ళు చేసే వృత్తిమీద, చదివే చదువు మీద ఉంటే ఎప్పుడో బాగు పడేది దేశం.

"ఇంత అవాస్తవమైన, అసంబద్ధమైన కథకి మానవీయకోణాన్ని, హాస్యాన్ని జోడించి జనరంజకంగా తీసినందుకు ఆ డైరెక్టర్ని మెచ్చుకోవాలే!" హాల్లోంచి బైటపడి ఇంటికి వెళుతూ అన్నాను. హాల్లో ఉండగా అంటే అందరూ నాకు తలంటుతారని భయపడి.

శివానీకి ఛర్రుమని కోపం వచ్చింది. ఇంకా ఆ సినిమా ప్రభావంలోనే ఉంది కనుక ప్రమాదం తప్పింది నాకు. లేపోతే పెద్దఫైట్ అయ్యేది.

"ఏమైంది ఆ కథకి? చిరంజీవి ఎంత బాగా నటించాడు? నాచురల్‌గా... అసలు ఆ కోమా పిల్లాడి దగ్గర అతను చేసిన యాక్టింగ్ ఎంత హృద్యంగా ఉంది?" రోషంగా అంది.

"ఏం నాచురల్ బాబూ! 'చిరంజీవి' అని ఆలోచించకు. ఒక రౌడీ మెడికల్ కాలేజీలో చేరడం, నాలుగేళ్ళు చదవడం.... అంతంత మాత్రం ఉన్న విద్యావ్యవస్థని అధఃపాతాళానికి తొక్కెయడంకాదూ!"

అహల్య అందుకుంది దానికి మెడికల్ కాలేజీ అంటే ఆలయంగా!

"తల్లీ! మిమ్మల్నిద్దర్నీ ఆ సినిమాకి తీసుకెళ్ళాను చూడు! అదీ నా తప్పు. లెంపలేసుకుంటున్నాను." శివానీ వాళ్ళింటి దగ్గర సైకిలాపుతూ అంది. ఎప్పుడు సినిమాకి వెళ్ళినా మాకిది అలవాటే..

## 3

తెనాలికి కొద్ది దూరంలో ఉన్న 'వామన గుంట పాలెం' మా అమ్మమ్మగారి ఊరు. తొమ్మిదో క్లాసుకి వచ్చేవరకూ ప్రతీ వేసవి సెలవల్లోను పాలెం వెళ్ళేవాళ్ళం. అమ్మమ్మ గారి వీధిలో వరసగా ఆరిళ్ళు మా చుట్టాలవే.

అమ్మమ్మ ఇల్లు పెద్ద ప్రహరీ గోడ లోపల ఉంటుంది. ప్రహరీ అంతా ఇటుకలతో మట్టితో కట్టారు. ఇటుకలు కనిపిస్తూ ఉంటాయి. మధ్య మధ్యలో ఇటుకలు లేకుండా ఖాళీగా ఉంటుంది. ఆ కన్నాల్లోంచి వీధిలోకి చూస్తూ అక్కడ ఏం జరుగుతుందో చెప్పుకోడం ఒక ఆట మా అందరికీ.

అంత పెద్ద గోడని దాటి పెరిగిపోయి, మందార చెట్టు కొమ్మలు వీధిలోకి వాలిపోయి ఉండేవి. ఆ కొమ్మల్లోంచి గుత్తులుగా ముద్దమందారాలు వంగి, ఇంట్లోకి వచ్చే పొయ్యే వాళ్ళని పలకరిస్తూండేవి.

ఇంటి ముందు పెద్ద జాగా. ఎంత పెద్దదంటే, పిల్లలందరం క్రికెట్ ఆడుతుండేవాళ్ళం, మొక్కలన్నీ దున్నేస్తూ. అమ్మమ్మ లోపల్నుంచీ అరుస్తుండేది. "మొక్కలన్నీ తొక్కి, తొక్కి నాశనం చేసేస్తున్నార్రా!" అని... చాలా మొక్కలు, చెట్లు ఒక తీరు లేకుండా ఉండేవి. మంచి సారవంతమైన నేల కావటంతో అన్నీ ఏపుగా పెరిగి ఉండేవి. ఒక మూల రెండు మామిడి చెట్లు. పిల్లలందరం ఒక్క పిందె కూడా లేకుండా ఊదేస్తుండేవాళ్ళం.

మామయ్య పిల్లలు పెద్ద బుజ్జి, చిన్న బుజ్జి, చంటిగాడు. పెద్ద బుజ్జి నాకంటే ఒక ఏడు పెద్ద. చిన్న బుజ్జి రెండేళ్ళు నాకంటే చిన్నది. చంటిగాడు చాలా చిన్నవాడు. మేము రన్నింగ్ రేసు పెట్టుకుని, ఒలింపిక్ లెవెల్లో పరుగెడుతుంటే, కాళ్ళల్లో అడ్డం పడుతుండేవాడు.

నేనూ, మా తమ్ముడు శేషూ వచ్చినప్పుడల్లా, బుజ్జిలిద్దరూ కుళ్ళుతుండేవాళ్ళు. వచ్చిన రోజు మాత్రం బోలెడు కబుర్లు... మర్నాటి నుంచీ పేచీలు మొదలు. మేం ఏడాదికోసారి వస్తామని అమ్మమ్మ ప్రత్యేకంగా చూసేది. లోపల్నుంచీ తీసిన వెండి పళ్ళాలలో అన్నాలు పెట్టేది.

"నాకూ ఆ కంచం కావాలి" పెద్ద బుజ్జి కాళ్ళతో నేల తంతూ వెళ్ళిపోయింది. "నీ కంచం ఉంది కదా! ఇది మీరాది. అప్పుడప్పుడు వేసుకోడం వల్ల కొత్తగా ఉంది." అమ్మమ్మ నా తరపున వకాల్తా.

"నాది అంతా సొట్టలు పడిపోయింది. ఇది మీరాకియ్యి నేను కొత్త దాంట్లో తింటా" పెద్ద బుజ్జి కంచం విసిరేసింది.

"కంచం తింటావా? అన్నం తింటావా కోపం వచ్చినప్పుడల్లా నేలకేసి కొడితే సొట్టలు పడదూ!"

"పోనీలే అమ్మమ్మా! నేను అన్నం తింటా. దాన్ని కంచం తిననీ", అంటూ నేనే సర్దుకోవాల్సి వచ్చేది. లేకపోతే ఆ పోట్లాట అలా సాగుతూనే ఉంటుంది.

ఇంక అన్నాలు తిన్నాక, కంచాలు మేమే తోమాలి. అన్ని కంచాలూ పెరట్లో వేసేసి, నీళ్ళు తోడుతుంటే... ఇప్పుడే వస్తానని ఎక్కడికో చెక్కేసేది పెద్ద బుజ్జి. చచ్చినట్టు అన్నీ తోమి వంటింట్లో పెట్టేదాన్ని. అప్పుడు చిరాగ్గా అనిపించేది కానీ, ఇప్పుడాలోచిస్తే.... అదీ ఒక తమాషాలాగా... ప్రతీక్షణం పెద్ద బుజ్జి విసిరే ఛాలెంజ్‌ని ఎదుర్కోడం ఎలాగా అని వ్యూహాలు రచించుకోడం... బాగుండేది.

స్కూలు ఉన్నన్నాళ్ళూ ఎప్పుడెప్పుడు అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళదామా అని ఉండేది. ప్రక్కింటి శాంత పిన్ని కొడుకు గౌతమ్ మా గాంగ్‌కి లీడర్. వాడు నాకంటే మూడేళ్ళు పెద్ద. కానీ క్లాసు మాత్రం నాకంటే నాలుగెక్కువ. పాలెం దగ్గర్లో ఉన్న మోపర్రులో చదువుతుండేవాడు. స్కూల్లో అన్ని సెక్షన్లకీ ఫస్టొచ్చేవాడు. శాంత పిన్ని, అమ్మకి బాబాయి కూతురు. ఆవిడ ఒక్కతే సంతానం అవడంతో ఆవిడ, గౌతమ్, గౌతమ్ చెల్లెళ్ళు రాధ, సావిత్రి... అందరూ అక్కడే ఉండేవారు. రాధ నేను ఒకే క్లాస్. సావిత్రి మాకంటే మూడు ఏళ్ళు. రెండూ క్లాసులు తక్కువ. గౌతమ్ వాళ్ళ నాన్న 'హరి' బాబాయ్ కూడా అక్కడే ఉండేవారు.

సెలవలకి ఆరిళ్ళలోను సందడిగా ఉండేది. అందరం కలిసి పదిపదిహేను మంది పిల్లలు వరకు ఉండేవాళ్ళం.

మిట్ట మధ్యాహ్నం పెద్దవాళ్ళందరూ కునుకు తీస్తుంటే, మేమందరం పెరళ్ళలో చేరేవాళ్ళం. ఒక ఇంట్లో చెట్టు మీద నుంచి, ఇంకో ఇంట్లో చెట్టుకి పాకుతూ, అప్పుడే అన్నాలు తిని వచ్చినా కూడా.... అటుకులు, వేయించిన కందిపప్పు,మరమరాలు, కారప్పూసలాంటివి పంచుకుంటూ, మామిడికాయలు ముక్కలు చేసి అందులో ఉప్పు కారం నంజుకుని తింటూ... రోజుకో కొత్తరకం ఆట కనిపెడుతూ... ఎవరికి వాళ్ళు వాళ్ళే మహరాజుల్లాగా, వాళ్ళదే ప్రపంచం లాగా అనుకుంటుండేవాళ్ళం.

మధ్య మధ్య అమ్మమ్మ వచ్చి, "ఎండ మండిపోతుంటే ఏమాటలర్రా! ఇంట్లో కొచ్చి పడుకోండి." అని కసిరేది.

వెళ్ళి హాల్లో పడుకుని కళ్ళుమూసుకున్నట్లు నటించే వాళ్ళం. లోపల ఊపిరాడనట్టనిపించేది. ఎవరో ఒకరు పిల్లిలా జారుకునేవాళ్ళు. ఇంక వెనకాలే అందరం తయారు.

ఆ ఆటల్లో ఎన్నో రాజకీయాలుండేవి. పెద్ద బుజ్జి సగం మందిని తీసుకెళ్ళి వేరే పార్టీ పెట్టేది. గౌతమ్ పార్టీలో మేం ఊళ్ళనుంచి వచ్చిన వాళ్ళం ఉండేవాళ్ళం. వాళ్ళది తిండిపోతు పార్టీ అని పేరు పెట్టాం ఎప్పుడూ ఇంట్లోంచి ఎత్తుకొచ్చినవి తింటూ ఉండేవాళ్ళు.

ఒకసారి ఆరోక్లాసు సెలవల్లో వెళ్ళినపుడు.... చిన్న తాతగారింట్లో సగ్గుబియ్యం వడియాలు ఎండబెట్టారు. గౌతమ్ చెపుతూనే ఉన్నాడు, "ఇవాళ మా ఇంటికేసి వెళ్ళొద్దు. తెల్లవారు ఝామున నాలిగింటికి లేచి అమ్మ వాళ్ళు వడియాలు ఎండబెట్టారు" అని.

"ఏం? మా ఇంట్లో రోజూ ఆడుకోవటంలేదా? మేం మీ ఇంటికి వెళ్ళి తీరతాం" పెద్ద బుజ్జి చేతులు తిప్పుతూ అంది.

"పోవే శూర్పణఖా! వేషాలేశావంటే ముక్కు కోసేస్తా!" గౌతమ్ ఎప్పుడూ నెమ్మదిగా ఉండేవాడు. ఆ వేళెందుకో వీరావేశం మీదున్నాడు.

"ఏంట్రా? కొయ్యి చూద్దాం." మీది కొచ్చింది శూర్పణఖ.

అది చూసి రాధకి పౌరుషం పొడుచుకు వచ్చింది. పెద్ద బుజ్జి జుట్టు రెండు చేతుల్తో పట్టుకుని లాగుతూ వెనక్కితోసింది. అదేం తక్కువ తిందా! రాధ గౌనుకున్న కాలరు పట్టుకుంది. ఇద్దరూ కలిసి క్రింద పడ్డారు. మట్టిలో పొర్లుతూ ఒకళ్ళ నొకళ్ళు కొట్టుకుంటూ... చేతుల్తో రక్కుకుంటున్నారు.

గాంగు నిట్టనిలువుగా చీలిపోయింది. కొంతమంది రాధని, కొంతమంది పెద్ద బుజ్జిని సమర్థిస్తూ అరుస్తున్నారు. నాకు ఇలాంటివేమీ అలవాటు లేదు కదా అరుగు మీదకెక్కి చూస్తున్నాను.

అమ్మమ్మ చీపురు కట్ట పట్టుకుని వచ్చింది.

"లేస్తున్నారా? తిరగేయనా? ఏబ్రాసి మొహాల్లారా! చక్కగా నీళ్ళుపోసుకుని తయారయి ఈ దొర్లడాలేంటి? చూడండి ఇద్దరూ ఎలా ఉన్నారో!? ఇద్దర్నీ చెరో రెక్కా పుచ్చుకుని బావి దగ్గరకి తీసుకెళ్ళింది.

"రేయ్! గౌతమ్! ఇలారా!" గౌతమ్ బుద్ధిగా వెళ్ళాడు. పదో క్లాసు పరీక్షలు రాశాడుగా పెద్దరికంగా ఉంటాడు.

"నీళ్ళు తోడి గోలెంలో పొయ్యి." అంటూ గోలెంలో నీళ్ళన్నీ పోసి ఇద్దరికీ తలరుద్దింది. నన్నేమో పెద్ద బుజ్జి బట్టల్నీ, సావిత్రిని రాధ బట్టల్నీ తెమ్మని, ఇద్దరికీ శుభ్రంగా తుడిచి బట్టలు వేసింది.

"మీ అమ్మలు చూశారంటే ఒళ్ళు చీరేస్తారు. వెళ్ళి బుద్ధిగా ఆడుకోండి. ఏదీ! ఇద్దరూ నవ్వండీ చక్కగా!" ఇద్దర్నీ ఎదురెదురుగా నుంచోపెట్టి నవ్వించింది. మొహాల నిండా రక్కుగాట్లతో, కళ్ళనిండా నీళ్ళతో వాళ్ళిద్దరూ తెచ్చిపెట్టుకుని నవ్వుతూంటే... తమాషాగా ఉంది.

అమ్మమ్మ అలాగ వెయ్యి కళ్ళతో మమ్మల్ని కాపలా కాస్తుండేది. ఆ మధ్యాహ్నం అందరూ పడుకున్నాక చిన్న తాతగారింటికి గోడ దూకి వెళ్ళింది పెద్దబుజ్జి. రెండు బాదం ఆకులో పట్టినన్ని వడియాలు పట్టుకొచ్చింది.

"శాంతత్త చాలా పెట్టింది. పెద్ద పెద్ద వడియాలు. నేను కొన్నే వడియాలు... అదీ సగం సగం తెచ్చాను. మిగిలిన పిండి నిండుగా సర్దేశాగా! రండి" అందర్నీ పిలిచింది.

అందరం ప్రొద్దున్న జరిగిన గొడవంతా మర్చిపోయి దాని చుట్టూ చేరాం. ఒక్కొక్కళ్ళకీ రెండేసి వడియాలు ఆరిందాలాగా సర్ది పెట్టింది.

ఒక పొరపైన ఎండి గట్టిగా పంటి కింద సాగుతూ... లోపల మెత్తగా గుంజు - చేతి కంతా ఆ గుంజు అంటుకుని బంకలా పట్టుకుంటే... ఆ వేళ్ళు నాకుతూ. మధ్యలో నూపప్పు గింజల్ని గట్టిగా నవుల్తూ.. కారం ముక్కులోకి వస్తుంటే ఎగపీలుస్తూ అందరం ఒక గంట సేపు ఆ వడియాలు తిన్నాం. అందరికీ నాలిక, నోరు మంటకి పీకేస్తుంటే బావి దగ్గరకి పరుగెత్తాం నీళ్ళు తాగడానికి.

బావిలో నీళ్ళు చల్లగా.. తియ్యగా ఎంత బాగున్నాయో!

గౌతమ్ అన్నయ్య పదోక్లాసు జిల్లాకి ఫస్టుగా పాసయాడు. తెనాలి దగ్గర రెసిడెన్షియల్ స్కూల్లో ఫ్రీగా ఇంటర్లో సీటిచ్చారు. అక్కడకి వెళ్ళిపోయ్, ఆ తర్వాత "పిలానీ - బిట్స్"లో ఇంజినీరింగ్ చదవడానికి వెళ్ళాడు.

ఆరోక్లాసు సెలవల తర్వాత గౌతమ్‌ని చూడలేదు నేను. గౌతమ్‌లేని లోటు తరువాతి వేసవి సెలవల్లో బాగా తెలిసింది. మేం అందరం... ముఖ్యంగా నేను గౌతమ్‌ని ఒక హీరోలా చూసేదాన్ని.

మాకు ఆటలే కాకుండా చాలా విషయాలు నేర్పించేవాడు. రోజూ భర్తృహరి సుభాషితాల్లోది ఒక పద్యం, భగవద్గీతలోది ఒక శ్లోకం అందరి చేతా బట్టీ కొట్టించి అప్పచెప్పించుకునేవాడు. నాకు తెలుగు భాష మీద అంత మక్కువ కలగడానికి సగం కారణం గౌతమ్ అన్నయ్యే.

పిలానీ నుంచి అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండేవాడు. "మీ ఊళ్ళో కంప్యూటర్ కేఫ్ ఉంటే బాగుండేదే! చక్కగా ఛాట్ చేసుకోవచ్చు." ఒకసారి రాశాడు, యం.టెక్‌లో చేరాక.

గంటకి పదిరూపాయలిస్తే వెబ్‌కేఫ్‌లు వాడొచ్చు. కానీ పదిరూపాయలు ఖర్చుపెట్టాలంటే ఆలోచించాలి కదా! అదే రాశాను గౌతమ్‌కి.

"ఉండు! నేను జాబ్‌లో చేరాక నీకు కంప్యూటర్ కొనిస్తాను" అని రాశాడు తిరిగి. ఆప్యాయతతో అంటాడు కానీ, జరిగే పనేనా!

## 4

**"పాపగోరూ!"** శివానీ వాళ్ళ పని కుర్రాడు రొప్పుతూ వచ్చాడు. మా ఇంట్లో జాజిపందిరి దగ్గర బల్ల, కుర్చీలు వేసుకుని కూర్చున్నాం, నేనూ అహల్య, శివానీ. వాళ్ళిద్దరూ రికార్డు వేసుకుంటున్నారు. నేను ఎకనామిక్స్ కుస్తీ పడుతున్నాను . నా గ్రూపు హిస్టరీ, ఎకనామిక్స్, తెలుగు. నాకు తలకెక్కనిది ఎకనామిక్సే.

"ఏమయింది? ఎందుకలా పరుగెత్తుకుని వచ్చావు?" శివానీ కంఠం లో ఆదుర్దా. ఎప్పుడూ ఇలా ఎవరూ రారు.

"నాన్నగారు పడిపోయారండి. మిమ్మల్ని యమర్జంటుగా రమ్మన్నారు." శివానీ వెంటనే సైకిలెక్కి వెళ్ళింది. రికార్డులు, పెన్సిళ్ళు... అన్నీ ఎక్కడివక్కడ వదిలేసి. పనివాడు వెనకాలే వెళ్ళాడు.

అహల్యా, నేనూ పుస్తకాలన్నీ సర్ది, సైకిళ్ళ మీద వెళ్ళాం. ఇలాంటప్పుడు శివానీ రమ్మని ప్రత్యేకంగా ఆహ్వానించాలా?

మేము వెళ్ళేసరికి డాక్టరు వచ్చేసి ఉన్నారు. ఇద్దరం శివానీ వాళ్ళనాన్నగారి గదిలోకి వెళ్ళాం. గిరినాయుడు గారిని చూసి, అహల్య నాకేసి చూసింది. నేను కదల్లేనట్టుగా నుంచుండిపోయాను.

అంత పెద్ద ఆజానుబాహువు... కుచించుకుపోయి ఉన్నారు. మొహంలో కళ్ళు తప్ప ఏం కనిపించట్లేదు. మీసాలు తీసేశారు. కళ్ళు తిప్పుతూ అందరి కేసి చూస్తున్నారు. మాటరావట్లేదు. సైగలు చెయ్యడానికి చేతులు కూడా స్వాధీనంలోలేవనుకుంటాను. కాళ్ళు, చేతులు బాగా వణుకుతున్నాయి... మలేరియా వచ్చినట్లు.

గదిలో చక్రాల కుర్చీ, మంచం దగ్గర అన్ని సదుపాయాలూ.... మంచం కూడా కావల్సిన పొజిషన్‌లో ఎడ్జస్ట్ చేసుకునే రకం... చూస్తుంటే, ఎప్పటినుంచో ఆయన కదల్లేని స్థితిలో ఉన్నారని అనిపించింది.

అహల్య నా పక్కకి వచ్చి నుంచుంది. మాకిద్దరికీ ఇది కలో నిజమో అర్థం కాలేదు. శివానీ, తండ్రి దగ్గర కూర్చుని మొహం అంతా తుడుస్తోంది. నోట్లో నుంచిచొంగ ధారాపాతంగా కారుతూనే ఉంది.

"మీకేం అవలేదు నాన్నా! నేనున్నాకదా! ఇప్పుడే వెళ్ళాను. మీరు పడుకున్నారు కదా అని. ఇవాళ ఆఫీసులో ఏమయిందో తెలుసా?...." అంటూ ఏవేవో మాట్లాడుతోంది. ఆయన వింటున్నారా? వింటే అర్థం చేసుకుంటున్నారా?.. ఏదీ తెలీదు. కానీ ఆయన కళ్ళు మాత్రం శివానీ మాటలకి అనుగుణంగా కదులుతున్నట్లు అనిపించింది.

ప్రమీలాంటీ ఎక్కడా కనిపించరే? మాకు అన్నీ సందేహాలే! వంటమనిషి ఏదో సూప్‌లాంటిది తీసుకొచ్చింది. మంచం, తలవేపు భాగం పైకి లేపి, దిళ్ళు సర్ది నాయుడిగారిని కూర్చోబెట్టారు. మెడమీదుగా ప్లాస్టిక్ మీద గుడ్డ వేసి కుట్టిన బిబ్ లాంటిది కట్టి, మెల్లిగా తాగిస్తోంది శివానీ... మధ్య, మధ్య తుడుస్తూ ఆపకుండా మాట్లాడుతూ.

డాక్టరు ఇంజక్షనేదో ఇచ్చి, కాళ్ళు, చేతులూ, ఎముకలు పరీక్ష చేసి వెళ్ళిపోయాడు. "ఫ్రాక్చరేం అవలేదు. కొంచెం భయపడినట్లునారంతే." అని, మందులేవో రాసిచ్చాడు.

అక్కడ మేమున్నా మన సంగతి కూడా గమనించకుండా, శివానీ తన పని తాను చేసుకుపోతోంది. మేముండడం వల్ల వాళ్ళకి ఇబ్బంది తప్ప ఏం కనిపించలేదు నాకు. అందరూ కూడా సుశిక్షితులైన సైనికుల్లా, నిశబ్దంగా పన్లు చేసుకుపోతున్నారు.

అహల్యకి సైగ చేసి బైటకి నడిచాను. ఇద్దరం ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయాం. మాట్లాడుకోడానికి ఏం ఉంది కనుక? అన్న జవాబులేని ప్రశ్నలే. శివానీయే చెప్పాలి. మేమెప్పుడూ దగ్గరలేని వాళ్ళగురించి మాట్లాడుకోం. అందుకే మాస్నేహం అన్నేళ్ళుగా కొనసాగుతుందేమో!

"అఘము వలన మరల్చు, హితార్థకలితుఁ
జేయు, గోప్యంబుదాచు, బోషించు గుణము,
విడువడాపన్ను, లేవడి వేళనిచ్చు
మిత్రుడీ లక్షణముల మెలగుచుండు."

అయిదో క్లాసు సెలవులై వెళ్ళినప్పుడు గౌతమ్ నేర్పించిన సుభాషితం గుర్తుకొచ్చింది. అన్ని మిత్రలక్షణాలు ఉన్న శివానిలో ఇంత "గోప్యంబు దాచు" గుణం ఉందా! ఎన్నేళ్ళుగా .... అంత బాధని దాచుకుని - ఏమీలేనట్లు - ఎలా ఉండగలిగింది? ఒక్కసారి తల విదిల్చాను.

అందుకేనా ఆ రోజు సినిమాకి వెళ్ళేముందు అలా కన్నీళ్ళు పెట్టుకుంది. ఎంత ధీరోదాత్తులైనా ఒక్కోసారి బేలగా అయిపోతారేమో! "మీ దగ్గరుంటే నాకెంతో హాయిగా ఉంటుందే" తలుచుకుంటే నోరంతా చేదుగా అయినట్టు ఏదోలా అయిపోయింది. కళ్ళలో నీళ్ళు నిండిపోయాయి. అందుకేనా మమ్మల్నెప్పుడూ వాళ్ళింటికి రమ్మనదు! ఒక క్షణమైనా శివానీని అపార్థం చేసుకున్నందుకు నన్ను ఏంచేస్తే సరిపోతుంది?

"మాకంటే గొప్పవాళ్ళమని, మమ్మల్ని రమ్మనదేమో!" అని ఒకటి రెండుసార్లు అనుకున్నాకదా! ఎంత పశ్చాత్తాప పడినా ఏం లాభం? మబ్బులు విచ్చుకున్నట్లుగా నా మనసులో సందేహాలన్నీ పటాపంచలయాయి.

శివానీ ఆ రోజంతా కనిపించలేదు. మర్నాడు ఆదివారం. ప్రతీ ఆదివారం శివాలయంలో కలుసుకోవడం మాకలవాటు. మావీధికి రెండు వీధులవతల రైలు గేటు దాటగానే శివాలయం ఉంది. చిన్నగుడి. కానీ చాలా ప్రశాంతంగా ఉంటుంది. గుడిలోనే చిన్నతోట. అందులో మారేడు చెట్టు, రావి చెట్టు ఉన్నాయి. రావి చెట్టు క్రింద చప్టాలాగ అరుగు కట్టారు. ముగ్గురం సాయంత్రం అయిదింటి కల్లా గుడి దగ్గర కలుసుకుని, దైవ దర్శనం అయాక రావి చెట్టు క్రింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటాం. అక్కడ ముఖ్యవ్యక్తిని నేనే. నాకు తెలుసున్నంత మటుకు పురాణ కథలు కానీ, భగవద్గీతలో దేదైనా శ్లోకం గానీ, లేకపోతే తెలుగు పద్యాలుకానీ - వివరిస్తూ ఉంటాను. శివానీ, అహల్యా శ్రద్ధగా విని వాళ్ళ అభిప్రాయాలు కూడా చెపుతుంటారు. ఆదివారం ఎప్పుడు వస్తుందా అని అందుకే ఎదురు చూస్తుంటాం.

ప్రతీ ఆదివారంలాగే ఆ రోజు కూడా అహల్య మా ఇంటికి వచ్చింది. వరండాలో కూర్చున్న నాన్నగారికి, ఆయన సాహిత్య మిత్రులకి నమస్కారం చేసి లోపలికి వచ్చింది. నేను నిస్త్రాణగా పరుపు మీద పడుకున్నాను.

వరండాలో అందరికీ నిమ్మకాయరసం ఇచ్చి, అమ్మలోపలికి వచ్చింది. అహల్యక్కూడా ఒక గ్లాసు ఇచ్చింది.

"ఎప్పుడూ పడుకునెరగదు. నిన్నట్నుంచీ అలా పడుకుంది. జ్వరమేదైనా ఉందా అని చూస్తే... ఏం లేదు. ఏమిటే అంటే 'ఊరికేనమ్మా!" అంటుంది. ఏమైంది? నీకైనా తెలుసా అహల్యా!" అమ్మ ఆతృత అమ్మది. నా చేతిలో వేడి వేడి పాలు పెట్టింది.

"ఎకనామిక్సుతో బుర్ర వేడెక్కి పోయుంటూంది. అంతకంటే ఏం లేదత్తా! లే! త్వరగా తయారవు. గుడికి వెళదాం." నా చేత బలవంతాన పాలు తాగించి లేపింది.

ఇద్దరం నెమ్మదిగా నడుచుకుంటూ గుడి దగ్గరకి వెళ్ళాం. శివానీ అప్పుడే మెట్లు ఎక్కి లోపలికి వెళుతోంది. దైవదర్శనం అయాక మామూలు చోట్లో కూర్చున్నాం. కొంచెం సేపు ఎవరి ధ్యాసలో వాళ్ళున్నాం. మొదట శివానీయే నిశ్శబ్దాన్ని ఛేదించింది.

"సారీనే! నిన్న మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను."

"ఇబ్బందా! అదేంలేదే! అయినా మేం ఎవరం అని ఇబ్బంది పడాలి? మామూలుగా మా ఇళ్ళకి వెళ్ళి ఉల్లాసంగా ఉన్నాం." నాకు దూకుడెక్కువ కదా.. కొంచెం గట్టిగానే అన్నాను.

అహల్య ఏం మాట్లాడకుండా నిశ్శబ్దంగా, నిష్టూరంగా శివానీ కేసి చూస్తోంది.

"నాకు తెలుసు. ఎప్పుడో ఒక రోజు మీకు ఇలా సమాధానం చెప్పవలసి వస్తుందని. నిన్న అలా తెలియకపోయినా, ఇవాళో, రేపో, మీకు నేనే చెప్పేదాన్ని. ఇంక ఒంటరిగా పోరాడే శక్తిపోయింది. మీ మోరల్ సపోర్ట్ నాక్కావాలి ప్లీజ్! అలా నిష్టూరంగా చూడకండి. మీకు చెప్పకుండా దాచానని నామీద కోపం ఉంటుందని తెలుసు." శివానీ చేతుల్లో మొహం దాచుకుంది.

నేనూ, అహల్యా చెరో ప్రక్కనా కూర్చుని శివానీ భుజాల మీద చేతులు వేశాం. మౌనంగా రోదిస్తున్నట్లు, కదులుతున్న శివానీ భుజాలు చెపుతున్నాయి. "గోప్యం" కదా! లోలోపలే కుమిలిపోతుంది.

పావుగంట అయాక లేచి, కుళాయి దగ్గరకి వెళ్ళి మొహం కడుక్కుని వచ్చింది. అహల్య తన కొంగు పెట్టి శివానీ మొహం తుడిచింది. నేను చెయిపట్టుకుని తీసుకెళ్ళి చెట్టు క్రింద కూర్చోపెట్టాను.

మా ఇద్దరికీ ఏం మాట్లాడాలో తెలియటంలేదు.

"అసలేం జరిగింది?" నేనే చివరికి చొరవ తీసుకునాను.

శివానీ మెల్లగా మొదలుపెట్టింది.

"మనం టెన్త్‌లో ఉండగా ఒక రోజు డాడీ నడుస్తూ నడుస్తూ పడిపోయారు. "కాళ్ళు వీక్ అయినట్లయి కూలబడ్డాను' అని చెప్పారు. డాక్టర్ దగ్గరికి వెళితే 'నీ' జాయింట్ దగ్గర లిగమెంట్స్ వీక్ అయ్యుంటాయని, ఎక్సర్‌సైజులు చెయ్యమని మల్టివిటమిన్‌లు, పెయిన్ రిలీవర్స్ ఇచ్చారు. కాళ్ళు వణుకుతున్నాయని ఎప్పుడూ అంటుండేవారు. తరువాత చేతులువణకడం, మెడవాలిపోవడం మొదలైంది. మనం ఇంటర్‌లో ఉండగా మేము చైన్నై వెళ్ళాం గుర్తుందా! అప్పుడు అన్ని చెకప్‌లు చేయించాం. అన్నయ్య కూడా వచ్చాడు."

"అవును గుర్తుకొచ్చింది. మీ అన్నయ్య వాళ్ళు ఇక్కడికి రాలేదేమిటా అని అడిగాం కూడాను" నేను ఆలోచనగా అన్నాను.

"అప్పుడే! 'నేను అందరం చెన్నైలో గడిపాం' అని చెప్పాను. ఆ టైములోనే. చెన్నైలో 'అపోలో' హాస్పటల్ లో పదిహేను రోజులు ఉన్నాం. డాక్టర్స్ అన్ని రకాల టెస్టులూ చేసి "పార్కిన్‌సన్స్ డిసీజ్" అని చెప్పారు." శివానీ గొంతు జీరపోయింది.

"పార్కిన్‌సన్స్ డిసీజా?" అహల్య గొంతు అంతగట్టిగా ఎప్పుడూ వినలేదు నేను. "అది ఇన్‌క్యూరబుల్ కదా!"

శివానీ తల ఊపింది. "కొంత మందికి కాళ్ళు, చేతులు వణకడంతో ఆగిపోతుంది. కానీ మాకంత అదృష్టం లేదు. రెండేళ్ళలో చాలా ఫాస్ట్‌గా డెవలప్ అయింది. కాళ్ళు, చేతులు కదల్లేని స్టేజ్ వచ్చేసింది. నాలిక కూడా పని చెయ్యకపోవడంతో మాట్లాడ్డం కూడా కష్టమైపోయింది. ఇంక ఇంట్లోనే అన్ని ఎరేంజ్‌మెంట్స్ చేసుకుని ఆయన్ని చూసుకుంటున్నాం."

"మరి బిజినె వ్యవహారాలన్నీ.." నేను సగంలోనే ఆపేశాను.

"అన్నయ్య, వదిన ఇండియా రాలేమని చెప్పారు. డాడీ పూర్తిగా సిక్ అవక ముందరే నాకు అన్ని విషయాలు చెప్పి ట్రైనింగ్ ఇచ్చారు. నన్ను ఎయిటీన్ ఇయర్స్ నిండగానే యం.డి కింద డిక్లేర్ చేశారు. నేనే అన్నీ చూసుకుంటున్నాను." శివానీ మాటలకి నమ్మలేనట్లుగా చూశాం నేనూ, అహల్య.

"ఇవన్నీ ఎప్పుడు చూస్తావు? కాలేజ్‌కి, మాతో గడపడానికీ ఎప్పుడూ ఆలస్యం చెయ్యడం కానీ, మానెయ్యడం కానీ చెయ్యలేదు. పైగా ఎప్పుడూ అలిసిపోయినట్లేనా చూడలేదు." నేను ఆశ్చర్యంగా అన్నాను.

"నాన్నగారి స్ట్రెంగ్త్ తీసేసుకున్న దేముడు, అన్నీ నాకిచ్చాడు. ఆఫీస్ వ్యవహారాలన్నీ చాలా ఈజీగా అర్థం అయిపోయాయి. ప్రొద్దున్న లేవగానే మా జనరల్ మానేజర్ని కలుస్తాను. ఆరోజు చెయ్యాల్సిన పనులు కానీ, చెక్స్ మీద సంతకాలు, ఏవయినా కాగితాల మీద అవసరమైన సలహాలివ్వడంలాంటివి చేస్తాను. రాత్రి ఇంటికి వెళ్ళేముందు వచ్చి ఆయన మళ్ళీ రిపోర్ట్ ఇస్తారు. ప్రతీనెలా ఎకౌంట్స్ అన్నీ క్లియర్ చేసేస్తాను. అమ్మ, అన్నయ్య, అక్క, నేను పార్టనర్స్‌మి. ఎవరిది వాళ్ళకి అప్పచెప్పడం, శాలరీలు, మెయింట్‌నెన్స్ అన్నీ చూస్తాను. లక్కీగా మాకు అన్నిచోట్లా మంచి స్టాఫ్ ఉన్నారు." నిండా ఇరవయ్యేళ్ళు లేని శివానీనా మేం చూస్తున్నది.

"మరి మీ అమ్మగారేం పట్టించుకోరా? ఆవిడ గ్రాడ్యుయేట్ కదా!" అహల్య సందేహిస్తూ నే అడిగింది.

"నాన్నగారు పూర్తిగా కదలడం మానేసి రెండేళ్ళయింది. మొదట్లో తగ్గుతుందేమో అనీ, తగ్గకపోయినా కనీసం మాట్లాడుతూ తన పని చూసుకోగలరని అనుకున్నాం. ఆ ఆశ ఉన్నన్ని రోజులూ మమ్మీ బాగానే ఉంది. డాడీకి మందులివ్వడం, దగ్గర కూర్చోడం చేసేది. లాస్ట్ ఇయర్నించీ పూర్తిగా డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయింది. అసలు ఇంట్లో డాడీలేనట్లే బిహేవ్ చేస్తుంది. ఎవరితో మాట్లాడదు. ఏదీ పట్టించుకోదు. ఏదైనా మాట్లాడదామని ప్రయత్నం చేసినా, అక్కడ్నించి వెళ్ళిపోతుంది. తను ఉన్నా, మెంటల్‌గా లేనట్లే" శివానీ కంఠంలో ఏదో అడ్డుపడినట్లయింది.

"అంత నీట్‌గా ఉండి, బాగానే తిరుగుతున్నట్లుంటారు కదా!"

"డిప్రెషన్‌లో కొంతమంది మామూలుగా ఉన్నట్లే ఉంటారు. కానీ వాళ్ళవల్ల ఎవరికీ ఏం ఉపయోగం ఉండదు. వాళ్ళకి కావలసిన పనులు మాత్రమే చేసుకుంటారు. అదీ మెడికేషన్ ఉంటే లేకపోతే సూసైడల్ టెండెన్సీ ఎక్కువైపోతుందని చదివాను."

అహల్య నా ప్రశ్నకి జవాబిచ్చింది.

శివానీ విచారంగా, అవునన్నట్లు తల ఊపి, "రోజూ రాత్రి మమ్మీని బ్రతిమాలి ఆవిడకి కూడా మందులు తినిపించాలి. ఇంకా డాడీకి మెడిసన్స్ ఇవ్వడం తేలిక. మమ్మీ చాలా గొడవ చేస్తుంది. ఇద్దరితోనూ ఎప్పుడూ మాట్లాడుతూ, వాళ్ళకి మందులు కంటే ప్రేమ ఎక్కువ ఇస్తూ చూసుకోవాలని డాక్టర్స్ చెప్పారు. వాళ్ళు నార్మల్‌గా ఉన్నట్లుగానే చూస్తూ, ఫీలవుతూ మందులు క్రమం తప్పకుండా ఇస్తూ... నా శక్తి కొద్దీ చేస్తున్నాను." అంది

మేమిద్దరం ఆ శక్తి స్వరూపిణిని ఆరాధనగా చూస్తూ ఉండిపోయాం.

"ఏయ్! ఏమిటే ఆ చూపు?" శివానీ మామూలుగా అయిపోయి మమ్మల్ని ఈలోకంలోకి తీసుకొచ్చింది.

## 5

**"అబ్బ! ఈ రికార్డులు** వేసి వేసి చెయ్యినొప్పెడుతోందే. మీరా పని హాయనుకో. మనం కూడా ఇంగ్లీషో, తెలుగో తీసుకుంటే పొయ్యేది. " శివానీ పెన్సిలు పక్కన పెట్టి చేతి వేళ్ళు చిరుచుకుంటూ అంది.

"నాకేం పెద్ద తేడా కనిపించలేదు. మీరా కూడా ఎప్పుడూ ఏదో రాస్తూనే ఉంటుంది, మనకంటే సీరియస్‌గా!" అహల్య తను వేసిన డి.యన్.ఏ మాలక్యూల్ స్ట్రక్చర్ని మరోసారి చూసుకుంటూ నాకేసి చూసింది.

నేను ప్రబంధ నాయికల మీద ఎస్సే తయారు చేస్తున్నాను.

"ఏదైనా మనం మనస్ఫూర్తిగా చేస్తేనే కదా ఫలితం దక్కేది. నేను తెలుగు మాటల్ని నమ్ముకుని బ్రతుకుదామనుకుంటున్నాను. మరి సీరియస్‌గా తీసుకోవాలి కదా!"

"నిజమే! షడుచులూ ఉంటేనే కదా భోజనం బాగుండేది." శివానీయేనా ఇలా మాట్లాడేది?

"కొంచెం నీ పాండిత్యం నాకంటిందిలే. అంత కంగారు పడకు." శివానీ నవ్వుతూ అంది.

"సరేకానీ మాటనీ షోకి ఏదైనా సినిమాకి వెళదామా? చదివి చదివి బుర్ర పేలిపోయేలా ఉంది." ఈసారి అహల్య షాకిచ్చింది. ఎప్పుడూ గుడికి తప్ప ఎక్కడికీ వెళదామని అనదు.

శివానీ ఎగిరి గంతేసింది. "మన ఫేవరెట్ హాల్లో 'ఇంద్ర' ఆడుతోంది పదండి. మీరు చూడలేదుగా!" ఈ మధ్య కాలంలో వచ్చిన చిరంజీవి సినిమాల్లో అదొక్కటే చూడలేదు మేము. అన్నింటికీ ఏదో వంక పెట్టి శివానీ తీసుకుపోతుంటుంది.

"ఒక షరతు", అహల్య నుంచుంటూ అంది.

"సరే తల్లీ! ఎవరి టిక్కెట్ వాళ్ళే. అంతేగా!"

అందరూ నవ్వుతూ పుస్తకాలు సర్దేసి అహల్య నాన్నమ్మగారికి అన్నీ అప్ప చెప్పి అహల్య వాళ్ళ ఇంట్లోంచి బైటకి నడిచాం.

"ఒక్కోసారి ఇంటికెళ్ళి నేను హాలు దగ్గరికి వచ్చేస్తాను మీరు వెళ్ళండి" అంది శివాని.

సైకిల్ మీద రివ్వుమని వెళ్ళిపోయింది.

"వాళ్ళ నాన్నగారికి అన్నీ చూసుకుని వస్తుందనుకుంటా. మనం నడిచి వెళదామా! పావుగంటలో వెళ్ళిపోతాం. ఆ హాలు దగ్గర బైట నుంచుని అష్ట కష్టాలు పడే బదులు... నడుస్తూ కబుర్లు చెప్పుకోవచ్చు. టికెట్స్ దొరుకుతాయిలే! పాత సినిమాయే కదా!" మా ఇంటికేసి నడవబోతూ అన్నాను.

"నిజమేనే. ముందుగా వెళితే ఇబ్బందే. సరైన కాంపౌండ్ వాల్ కూడా లేదా హాలుకి. బైట యూరినల్ స్మెల్ భరించలేం. ఇంక రౌడీ గాంగ్‌ల సంగతి చెప్పనే అక్కర్లేదు. వాళ్ళ ఫోజులూ వాళ్ళూను. హాయిగా నడుద్దాం." అహల్య, వాళ్ళ వెదురు బొంగుల గేటు దగ్గరగా వేస్తూ నాతో కలిసింది.

ఇద్దరం మా ఇంటికి వెళ్ళి అమ్మతో చెప్పి బైటపడ్డాం.

మా భ్రమ కానీ.. నడవడం మాత్రం తేలికా! రోడ్డుకి ఇటు, అటూ వెళ్ళామా! అంతే సంగతులు. ఎందులో కాళ్ళుపడతాయో తెలియదు. మధ్యలో నడుద్దామంటే బ్రేకుల్లేని రిక్షాలు, గంటలు మ్రోగించుకుంటూ... ఎలాగో తప్పించుకుని "అమ్మయ్య!" అనుకుందా మంటే సైకిల్ మీద ఓ నిత్య ప్రేమికుడు రాసుకుంటూ వెళ్ళిపోతాడు. ఇంక మధ్య మధ్య ఆటోలు, కార్లు... స్కూటర్లు.... హారన్‌లు మ్రోగించుకుంటూ తొక్కకుండా జాగ్రత్తగా నడుస్తుంటే... బర్రెల గుంపు అడ్డంగా వస్తుంది.

అన్ని అడ్డంకులూ తప్పించుకుని, ఎలాగో వీరోచితంగా హాలు దగ్గరకి చేరాం. ఎంత పాత సినిమా అయినా, రెండోసారి వచ్చినా బాగానే ఉన్నారు జనం. కొంత మంది అందులో డైలాగులు నెమరేసుకుంటూ నుంచున్నారు. కొంతమంది పాటలు పాడుకుంటూ ఆనందిస్తున్నారు. మరి కొందరు.... అందులో సీన్లని తలచుకుంటూ తన్మయత్వంతో ఉన్నారు. టికెట్స్ కూడా దొరుకుతాయో లేదో... అనుమానమే.

శివానీ అప్పుడే వచ్చింది. సైకిల్ స్టాండ్‌లో పెట్టి మానేజర్ గదిలోకి వెళ్ళి మాకు టిక్కెట్లు తెచ్చింది. వాళ్ళచుట్టాలదే హాలు.

అప్పుడే షో మొదలవబోతోంది. మెల్లిగా కుర్చీలు దాటుకుంటూ, మా సీట్లు వెతుక్కుని కూర్చున్నాం.

సినిమాలో లీనమై చూస్తున్నాం. ఇంటర్వెల్ ముందు మా కుర్చీలకి ముందు వరుసలోంచి నలుగురు కుర్రాళ్ళు లేచి బైటికి వెళుతున్నారు. వెనకనుంచి అరుపులు కేకలు... "కాసేపు ఆగలేకపోయార్రా"... అంటూ ఆ కుర్రాళ్ళు మాత్రం... వాళ్ళని కాదన్నట్లుగా బైటికి వెళ్ళిపోయారు.

వాళ్ళు సరిగ్గా తలుపు దగ్గరికి వెళ్ళగానే హాల్లో లైట్లు వెలిగాయి.

"మీరా! మీ తమ్ముడిలా ఉన్నాడు కదూ!" అహల్య తలుపుకేసి చూస్తూ అంది.

"అవును వాడే! కాలేజీ ఎగ్గొట్టి సినిమాలు చూస్తున్నాడన్నమాట" కోపంగా అంటూ లేవబోయాను.

"ఆగు మీరా! తొందరపడకు. శేషు, యం.ఎల్.ఏ గారబ్బాయి 'ఫణీంద్ర' తో వచ్చాడు. అతను శేషు వాళ్ళ కాలేజీలోనే థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. మిగిలిన ఇద్దరు కూడా నాకు తెల్సున్న వాళ్ళే 'అవినాశ్' ఇన్‌కంటాక్సు ఆఫీసర్‌గారబ్బాయి. ఇంకొకడు 'అక్షయ్' మనూర్లో ఉన్న రెండు పెద్ద బట్టల షాపుల్లో ఒకటి వాళ్ళదే" శివానీ నన్ను ఆపింది.

"ఇంకో బట్టలషాపు మీది కదా! "

అహల్య అడిగింది.

శివానీ అవునన్నట్లుగా తలూపుతూ "వాళ్ళముగ్గురూ బాగా చదివేవాళ్ళే. అవినాశ్, అక్షయ్‌లకి ఫస్టియర్‌లో డిస్టింక్షన్ వచ్చింది" అంది.

"వాళ్ళే సంవత్సరం?" నాకింకా కోపం పోలేదు. గొంతు బాగా పైకి లేచింది.

"ఊరుకో మీరా! వాళ్ళు సెకండియర్. ఎక్సైట్ అవకు."

"వాడి క్లాసు వాళ్ళతో తిరక్కుండా సీనియర్స్‌తో ఏం పని వీడికి? ఇదేదో తేల్చుకోవాల్సిన విషయమే!"

సినిమా కొచ్చామన్న సంతోషం లేకుండా... మూడ్ అంతా పాడైంది.

ఇంటర్వెల్ తర్వాత శేషుగాడి గాంగ్ హాల్లోకి రాలేదు. ఇంకెక్కడైనా కూర్చున్నారో.. మమ్మల్ని చూసి తోకముడిచి వెళ్ళిపోయారో!

ఇంకసలు ఎంజాయ్ చెయ్యలేకపోయాం. దానికి తోడు సెకండ్ హాఫ్ అంతా వయొలెన్స్. అంతా నరుక్కోడాలు, చంపుకోడాలు, నేను అసలు తట్టుకోలేను. అసలందుకే, ఆ సినిమా మొదటిసారి వచ్చినప్పుడు శివానీ బలవంతం చెయ్యలేదు.

ఎవరం మాట్లాడకుండా, ఆ సినిమా చూడ్డమే జీవితాశయం అన్నట్లు, దీక్షగా చూసేశాం. నాకైతే కొంచెం కూడా బుర్రకెక్కలేదు. మాలాగే వాడుకూడా చదివి, చదివి బుర్రవేడెక్కి వచ్చాడేమో! అయినా నమ్మబుద్ధికావట్లేదు.

వస్తే తన క్లాస్ మేట్స్‌తో రావాలి కానీ, సీనియర్స్ తోటి ఎందుకు రావడం. ఏ చెడుద్దేశం లేకపోతే... నన్ను చూసి ఎందుకు పారిపోవాలి? రాజమార్గం లో పలకరించి... ఫ్రెండ్స్‌ని పరిచయం చెయ్యచ్చుగా? ఏమిటో? అంతులేని ఆలోచనలు.

"మీరా! పద సినిమా అయిపోయింది." శివానీ లేపింది.

"అంతలా వర్రీ అవకు. ఇంటికి వెళ్ళాక మెల్లిగా కదుపు. వాళ్ళు నాకు తెలుసున్నవాళ్ళే. బాగా చదువుతారని చెప్పాను కదా! ఏమైనా డౌట్స్ క్లియర్ చేసుకోవడానికి వాళ్ళదగ్గరికి వెళ్ళాడేమో!" శివానీ నా చెయ్యి పట్టుకుని అంది.

"అదే అయితే ఎంత బాగుంటుంది? నాకెందుకో భయం వేస్తోందే నమ్మబుద్ధికావట్లేదు. అమ్మ, నాన్న ఎంత కష్టపడి, వాడ్ని చదివిస్తున్నారు?" నా గొంతు జీరపోయింది. ఏడుపు వచేస్తోంది. శివానీ, అహల్యా నా రెండు చేతులూ పట్టుకుని బైటికి తీసుకొచ్చారు

అహల్య ఒక్కసారి నా భుజం నొక్కి వాళ్ళింటికి వెళ్ళిపోయింది. నేను ఏం గొడవ చేస్తానో అని తనకి భయం. గేటు తీసుకుని లోపలికి వెళుతుంటే కాళ్ళలో శక్తి అంతా ఎవరో తీసేసినట్లయి పోయింది. అడుగులు తడబడుతూ ఉంటే వరండా మెట్లు ఎక్కాను. ఎంత శ్రద్ధగా చదువుకుంటున్నాడో... నాకేసి తలెత్తి చూడలేదు.

"ఏమ్మా! అలా ఉన్నావు? ఒంట్లో బాగాలేదా?" జాజి పందిరి బాగుచేస్తున్న నాన్నగారు, పని ఆపేసి నావెనకాలే వచ్చారు. గుమ్మం ఎదురుకుండా హాల్లో ఉన్న అద్దంలో నన్ను చూసుకున్నాను. పది లంఖణాలు చేసినట్లుంది మొహం. అమ్మ ఆదుర్దాగా హాల్లోకి వచ్చింది, వంటింట్లోంచి.

"ఏం లేదమ్మా! కాస్త తలనిప్పి వచ్చింది. మొహం కడుక్కుంటే తగ్గిపోతుంది. "

"మాటనీ"కి వెళితే అంతే. ఏ.సి హాలని పేరు కానీ... ఏ.సి ఉండదు, ఫాన్లూ ఉండవు. ఉండు కాఫీ ఇస్తాను. ఒక మాత్ర వేసుకుని తాగితే తగ్గుతుంది" అమ్మ హడావుడిగా వంటింట్లోకి వెళ్ళింది.

నాన్నగారు పరుపు కిందవేసి, దుప్పటి పరిచారు." కాసేపు పడుకోరా" అంటూ. నేను దొడ్లోకి వెళ్ళి కాళ్ళు, చేతులు, మొహం చన్నీళ్ళతో కడుక్కుని వచ్చాను. కాస్త ఆందోళన తగ్గినట్లనిపించింది.

అమ్మా,నాన్నల అమాయకత్వం చూస్తుంటే... ఎలా మొదలు పెట్టాలో అర్థం కావట్లేదు. ఇంట్లో ఎంత ప్రశాంతంగా ఉంది? తుఫాను రేపనా? ఊరుకుంటే 'సునామీ' వస్తుందేమో? ఏం జరగనట్లు బుద్ధిగా ఎలా చదువుకుంటున్నాడో వెధవ!

పోనీ ఊరుకోనా! అమ్మ కాఫీ తెచ్చింది. గ్లాసు పట్టుకుని పరుపు మీద కూర్చున్నాను. అమృతాంజనం వాసన నాకు ఇష్టం ఉండదు.

"ఉండు తల్లీ! కొంచెం రాస్తాగా. ఉపశమనంగా ఉంటుంది" అమ్మ రెండు చేతుల వేళ్ళకి కొంచెం తీసుకుని నుదుటి మీద రెండు ప్రక్కలా రాస్తుంటే దిండు గోడకానించి... దాని కానుకుని కూర్చుని వేడి వేడి కాఫీ తాగ గానే మాగన్నుగా కునుకుపట్టింది.

"కొండమీదనుంచి కిందకి పడిపోతున్నా... పట్టుకుందామంటే ఏ ఆధారం దొరకట్లేదు. వేగంగా... తల్లక్రిందులుగా.. అదిగో.. నేల కనిపిస్తోంది.. ఇంకేముంది తల వంద చెక్కలవడం ఖాయం..."

ఒక్కసారి పెద్ద కుదుపుతో ఉలిక్కిపడి లేచాను. చేతులు చాపితే... ఒక చెయ్యి అమ్మనీ, ఒక చెయ్యి గోడనీ పట్టుకున్నాయి. అమ్మ! అయితే నేను పడిపోలేదా? ఇంట్లో పరుపు మీద ఉన్నానే!

టైము చూసుకుంటే, ఆశ్చర్యం వేసింది. కునుకు పట్టి ఐదు నిమిషాలు కూడా అవలేదు. ఎంత భయంకరమైన అనుభవం? నవనాడులు కృంగినట్లయిపోయింది.

అవునూ! ఈ శేషుగాడు రోజూ ఫ్రెండింటికి వెళ్ళి చదువుకుంటాడు కదా! ఇవాళ ఇంట్లో పెట్టాడేంటి ప్రోగ్రాం. ఏదో ఉంది. తేల్చాల్సిందే

"శేషూ! ఎంత గట్టిగా అరిచానంటే... ప్రక్కనే ఉన్న అమ్మ దడుచుకున్నట్లయింది. నా కేకకి నాన్నగారు లోపలికి వచ్చారు, గబగబా వాడు మాత్రం తాపీగా.. ముఖం అమాయకంగా పెట్టివచ్చాడు.

"ఎంత సేపయింది ఇంటికి వచ్చి?"

"నాలుగింటికల్లా వచ్చేశాడు మీరా. రేపు పరీక్ష ఉందట. చదువుకోవాలని" అమ్మ అందుకుంది.

"నిన్నడగలేదు కదమ్మా! వాడిని చెప్పనీయి." శేషుని ఏదైనా అడగబోతే మధ్యలో అమ్మ వచ్చేస్తుంది. యుద్ధంలో సైనికుడి డాలులాగా. నాన్నగార్ని కూడా ఏమీ అననీయదు. నాన్నగారు కుర్చీలో కూర్చుని చూస్తున్నారు.

"ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్ళి, ఇంటర్వెల్‌లో వచ్చేశాను. చదువు కోవాలని. ఏం? నువ్వెళ్ళలేదా మీ ఫ్రెండ్స్‌తో" శేషు పొగరుగా అన్నాడు.

"మరి రోజూ ఇంట్లో చదవట్లేదు కదా! ఇవాళ ఏంటి స్పెషల్?"

"అదేమాటనేనంటే?"

"నా సంగతి వేరు. నేనెక్కడుంటానో అమ్మకీ, నాన్నగారికీ తెలుసు. పైగా సీనియర్స్ తోటి ఏంటి షికార్లు?"

"అదేమరి. నువ్వు నాకంటే మూడేళ్ళు పెద్ద అని పెత్తనం చెలాయిస్తుంటావు. మీ ఫ్రెండ్స్ సబ్జక్ట్‌లేవేరు. మరి మీరు ముగ్గురు కలిసి ఏం చదువుతున్నారు? మా ఫ్రెండ్సు సీనియర్స్ అయినా మాది ఒకటే బ్రాంచి" శేషు అడ్డగోలు వాదనలకి... పక్కింటి నుంచి బాబాయి పిల్లలు శ్యాము, కిరణ్ వచ్చి వరండాలో నుంచుని వింత చూస్తున్నారు.

వాళ్ళిద్దరికీ 'శేషు'ని ఎవరైనా ఏదైనా అంటే పరమానందం.

"ఏయ్ మీకేం పనిక్కడ? పొండి మీ ఇంటికి." శేషు ఒక్క కసురుకి పారిపోయారిద్దరూ.

"ఏమయిందమ్మా! ఎందుకలా ఆందోళనగా ఉన్నావు? శేషు వచ్చినప్పట్నుంచీ చదువుకుంటూనే ఉన్నాడు. ఇంటర్నల్స్‌లో బాగానే వచ్చాయి మార్కులు." నాన్నగారు మెల్లిగా అన్నారు.

"సినిమాకి వెళితే ఏమయింది? పెందరాడే వచ్చేసి చదువుకుంటున్నాడు కదా!" అమ్మ శేషు తరపున వకాల్తా.

శేషు చేతులు కట్టుకుని నిర్లక్ష్యంగా నిలబడ్డాడు. మొహంలో గర్వం... పెదవులు కొద్దిగా విచ్చుకుని, ఒక ప్రక్కగా తిరిగి... వంకర నవ్వు... వాడి ధోరణి నా కస్సలు నచ్చలేదు.

"అదికాదమ్మా! సినిమాకి వెళ్ళినందుక్కాదు. మమ్మల్ని చూసి, మధ్యలో దొంగలాగ జారుకున్నాడు. ఏమీలేకపోతే పలకరించి ఫ్రెండ్సుని పరిచయం చెయ్యొచ్చుకదా! అహల్య, శివానీ ఏమైనా కొత్తవాళ్ళా!"

"అక్కడ ... అంతమందిలో నీ చేత చీవాట్లు తినాలా? బోనులో దొంగని, లాయరు ప్రాసిక్యూట్ చేసినట్లు చేస్తావు. నా పరువేం కాను?" అదే పొగరు మోత్తనం, చాచిలెంపకాయ కొట్టాలనిపించింది.

"నా గురించి నువ్వేం బాధపడక్కర్లేదులే. నీ సంగతి నువ్వు చూసుకో" శేషు విసురుగా వెళ్ళిపోయాడు.

"మీరా! ఏంటి ఈగోల ఎందుకు వాడి మీద ఒంటి కాలుతో లేస్తావు?" ఇంత పెద్దవాళ్ళయినా మీరు సఖ్యంగా ఉండలేరా? వాడు తమ్ముడే నీకు. శత్రువు కాదు." అమ్మ కళ్ళనిండా నీళ్ళతో అంది.

నాకు కడుపులో దేవినట్లనిపించింది.

"అందుకే కదమ్మా నా బాధంతా. పరాయివాళ్ళయితే నేనెందుకు తాపత్రయపడతాను? వాడు చక్కగా చదువుకుని పైకి రావాలనే కదా!"

"ఫరవాలేదురా వాడి మీద నమ్మకం ఉంది. ఇంట్లో పరిస్థితులు చూస్తున్నాడు కదా! ఇంతకంటే మంచి జీవితం పొందాలని వాడికి మాత్రం ఉండదా? నువ్వేం బాధపడకు. చూడు ఎలా అయిపోయావో. లేచి, వేడి వేడి నీళ్ళు స్నానం చేసిరా. కాస్త హాయిగా ఉంటుంది. మనిద్దరం కాసేపు సాహిత్య గోష్టి చేద్దాం." నాన్నగారు నాకు సర్ది చెప్పి బైటకి వెళ్ళిపోయారు

నిజంగానేనా? నాన్నగారు చెప్పినట్లు... శేషు బాగా చదువుకుంటున్నాడా? ఎందుకు నాకు ఈ భయంకరమైన హెచ్చరిక లొస్తున్నాయి. లోపల్నుంచి? వాడు నాతో సరిగ్గా ఉండకపోవడం వలనా? నాన్నగారి నమ్మకమే నిజమైతే ఎంత బాగుండును?

నెమ్మదిగా... నీరసంగా లేచి లోపలికి వెళ్ళి, తయారయి బైటికి వచ్చాను. ఇవాళ ఏదైనా భగవద్గీతలోని శ్లోకం చర్చించాలి. కాస్త మనశ్శాంతిగా ఉంటుందేమో!! నేనే అనవసరంగా లేనిది ఊహించుకుంటున్నానేమో.

అన్యమనస్కంగానే, భగవద్గీత తీసుకుని నాన్నగారి పడక్కుర్చీ దగ్గరగా కుర్చీలేసుకుని కూర్చున్నాను.

"అమ్మా! మీరా ఎందుకంత వ్యాకులత? నీకు కావల్సిన మార్గాన్నెంచుకున్నావు. అందులోనే ఉన్నత శిఖరాలధిరోహిస్తావని నాకు నమ్మకం ఉంది. "నీ పని నువ్వు చెయ్యి ఫలితం నాకొదిలిపెట్టు" అనే కదా నీ చేతిలోని ఆ గ్రంధసారం. అంత సున్నితమైన మనస్సు. దానికి రజోగుణం పనికి రాదు తల్లీ. ప్రతిదానికీ అతిగా స్పందించకూడదు. కొంచెం నెమ్మదిగా ఆలోచించు" నాన్నగారు మృదు మధుర గంభీర స్వరంతో అన్నారు.

అలా నాన్నగారు మాట్లాడుతుంటే ఎమతేసేపైనా వినాలనిపిస్తుంది.

ఎందుకో నాకు ఆపుకోలేని దుఃఖం వచ్చింది. కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలిపోయాయి. **ఓదార్పు, మేఘాన్ని ఊరడించే చలిగాలిలా పనిచేస్తుందేమో.**

"నేను కష్టపడ్డం, ఉన్నత శిఖరాలనధిరోహించడం సంగతి కాదు నాన్నా, తమ్ముడి గురించి. వాడి తీరు నాకెందుకో భయం కలిగిస్తోంది. ఏదో అదృశ్య శక్తి అనుక్షణం నన్ను హెచ్చరిస్తోంది. కృష్ణుడు కానీ, అర్జునుడు కానీ తన వాళ్ళ కోసమే కదా నిరంతరం తపించారు." నాన్నగారు అందించిన తుండుగుడ్డతో మొహం తుడుచుకుంటూ అన్నాను.

"నిజమే. కానీ మనిషికి సమత్వమైన బుద్ధికావాలని కూడా కృష్ణుడు చెప్పాడు. ఉద్రేకం గాలిదుమారం లాంటిది. ఆ దుమారంలో ఏమీ కనిపించదు అంతా అంధకారమే. ఉద్రేకాందోళనలు బుద్ధిని అంధకారంలోకి తోస్తాయి. అటువంటప్పుడు ఏమాలోచించినా మాట్లాడినా సరిగ్గా ఉండదు. అంతా సర్దుకున్నాక, నిదానంగా ఆలోచిస్తే సమర్ధవంతంగా పని చెయ్యగలుగుతాం. పూర్వాపరాలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

అదే మనుష్యులకీ జంతువులకీ తేడా. అవి అనుకున్న వెంటనే అమలు చేస్తాయి. ఒక్క క్షణం కూడా చింపాజీకి తనని అదుపులో పెట్టుకోగలిగిన గుణం ఉండదు అంటాడు న్యూరాలజిస్టు 'గ్రీవాల్టర్' అంటే నాన్నగారు నన్ను జంతువులతో

పోలుస్తున్నారన్నమాట. మళ్ళీ కళ్ళలో నీళ్ళు నిండుతున్నాయి. అతి కష్టం మీద నిగ్రహించుకున్నాను. "అదే ఆ యానిమల్ ఇన్‌స్టింక్టే నన్ను జాగ్రత్తపడమంటోంది. వాన రాబోతోందని, భూకంపం రాబోతోందని జంతువులకి ముందే తెలుస్తుంది కదా!" కొంచెం నిష్ఠూరంగా అన్నాను.

"అదిగో! మళ్ళీ ఉద్రేకపడబోతున్నావు. అదే వద్దని చెపుతున్నాము. 'ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత.' లేచి నిలబడి, మేలుకొని, నీ లక్ష్యాన్ని చేరుకో అని కఠోపనిషత్‌లో అంటారు. నీ భావాల్ని ముందు అదుపులో పెట్టుకుని ముందుకు నడు." నాన్నగారు అనునయిస్తూ అన్నారు.

'అదే "ఉత్తిష్టత జాగ్రత్త" అనే నేను చెపుతున్నాను. మీరు వినిపించుకోవట్లేదు.' అని మనసులో అనుకుని పైకి మాత్రం... "అర్జునుడి విషాద యోగం తర్వాత శ్రీకృష్ణుడు తిట్టాట్ట కదు నాన్నా" అని అడిగాను.

"అమ్మయ్య! కాస్త మామూలు స్థితికి వచ్చావన్నమాటే" అంటూ నవ్వారు. "గుర్రాలు స్తబ్ధుగా ఉంటే కొరడా ఝుళిపిస్తారు చూడు! ఆ రకంగా నిర్వేదం అనే మత్తులో ఉన్న అర్జునుడి మనస్సుని మాటలనే కొరడాతో మార్గం లోకి తీసుకొచ్చాడు పరమాత్మ." అంటూ గంభీరమైన కంఠంతో శ్లోకం ఎత్తుకున్నారు నాన్నగారు.

సాంఖ్యయోగం తీసి చూడసాగాను. నాన్నగారికి అన్నీ కంఠస్తమే. నేనే అశ్రద్ధ చేశాను.

"కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితమ్

అనార్య జుష్టమ స్వర్గ్యం అ కీర్తి కర మర్జున."

ఎక్కడినుంచి నీకు ఈ విధమైన బలహీనత ఇటువంటి విషమ పరిస్థితిలో వచ్చింది? నీలాగా అజ్ఞానులు ఆలోచిస్తారు. ఇటువంటి విధానంలో నీకు భూమి మీద కానీ, స్వర్గంలోకానీ కీర్తిరాదు." అని చెప్పు కాసేపు కళ్ళుమూసుకుని ఆలోచన పడ్డారు.

శ్లోకంలోని సంస్కృత పదాలన్నింటికీ అర్థం వెదకసాగాను నేను. ఒక్క 'కశ్మలం' అన్న దానికి తప్ప అన్నింటికీ తెలుసు నాకు. ఇందాక నాన్నగారు చెప్పిన అర్థం గుర్తుకు తెచ్చుకున్నాను 'కశ్మలం" అంటే బలహీనతన్న మాట. శ్రీకృష్ణుడికి తెలీదా!? కశ్మలం లేని వాళ్ళెవరైనా ఉంటారా? కాకపోతే రకరకాల కశ్మలాలు చిన్నగా నవ్వుకున్నాను.

"ఇలాగ 'అనార్యుడివి', నువ్వు ఆలోచించే పద్ధతి 'అకీర్తికరం' అనడంతో వదిలెయ్యలేదు. ఇంకా పెద్ద షాక్ ఇచ్చాడు.." నాన్న గారు కళ్ళు తెరిచి అంటుంటే నేను కుతూహలంగా చూశాను.

"క్లైబ్యం మాస్మ గమః పార్థ నై తత్వ య్యుప పద్యతే

క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప"

హిందోళ రాగంలో భావయుక్తంగా పాడుతుంటే తన్మయత్వంతో విన్నాను. నాన్నగారు సంగీతం నేర్చుకోకపోయినా ఇరవై రాగాల వరకు అలవోకగా పాడేస్తారు. మనం పద్యం, రాగం ఇస్తే చాలు. ఆయన దగ్గర్నుంచే నాక్కూడా కాస్త అబ్బింది.

" 'క్లైబ్యం' ఎటువంటి పదం వాడాడో చూశావా? నపుంసకత్వం అన్న మాట. 'ఆడవాళ్ళు మగవాళ్ళలా – ఆలోచించడం..మగరాయుడ్లా అంటారు. మగవాళ్ళు ఆడవాళ్ళలాగ సున్నితంగా ఉండడం..ఆడదాన్లా ఏమిటా ఏడుపు' అంటారు..ఫరవాలేదు. క్లైబ్యం అంటే ఏదీ కాని నిస్సత్తువ అన్నమాట. 'మాస్మగమః' క్లైబ్యం లాంటి బలహీనతకు గురికావద్దు. ఎందుకంటే 'నై తత్వయ్యు ప పద్యతే'..నీవు వీరుడవు, బుద్ధిశాలివి, ధీరుడవు.. అందుకని.

ముందర తిట్టి పొగుడుతున్నాడు చూడు. తర్వాత ఉపశమన వాక్యాలు ..'మానసిక బలహీనత చాలా కడు హీనమైనది. అందుకని 'త్యక్త్వోత్తిష్ఠ పరన్తప' లేచి నిలబడు.." అంటున్నాడు.

అలాగే మనం కూడా ఎవర్నైనా 'ఎందుకు పనికి రావని తిట్టొచ్చు. కానీ మళ్ళీ నువ్వలా ఉండవులే. నువ్వు చాలా బుద్ధిమంతుడివి' అని వెంటనే వాళ్ళు షాక్ లోంచి తేరుకునే లోపలే అనేయాలి. అప్పుడు వాళ్ళు మన మంచికే చెప్తున్నార్లే అనుకుంటారు" నాన్న గారు నాకేది భావగర్భితంగా చూసారు.

"నాన్నగారూ!" ఏమిటన్నట్లు ఒకసారి కళ్ళజోడులోంచి చూశారు "గుర్రం స్తబ్దుగా ఉన్నపుడే కాదు... అటూ, ఇటూ అడ్డదిడ్డంగా పరుగెడుతున్నప్పుడు కూడా కొరడా దెబ్బలు కావాలని నా ఉద్దేశం" చేతిలో ఉన్న భగవద్గీత పుస్తకం తీసుకుని, కుర్చీలోంచి లేచిలోపలికి వెళ్ళిపోయాను, వెనక్కి తిరిగి చూడకుండా.

✡ ✡ ✡

పరీక్షల హడావుడిలో పడి, శేషుగురించి పట్టించుకోలేదు వాడు కూడా నాకు కోపం వచ్చే పనులు చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు.

అహల్య, శివానీ కలిసి చదువుకుంటున్నారు. అప్పుడప్పుడు, అహల్య శివానీ వాళ్ళ ఇంటికి వెళ్ళి రికార్డులు వేసుకుంటోంది. నేను ఎక్కువగా లైబ్రరీలోనో కాలం గడుపుతున్నాను. ఎంట్రన్స్ పరీక్షలకి కూడా పనికి వచ్చేలా నోట్సులు రాసుకోవడం, ప్రశ్నలు తయారు చెయ్యడం చేస్తున్నాను.

ఎలాగైతేనేం.. మండుటెండల్లో... చెమటలు తుడుచుకుంటూ... పరీక్షలు రాశాక, ముగ్గురం సంతృప్తిగా ఇంకా వాళ్ళిద్దరికీ ప్రాక్టికల్స్ ఉన్నాయి. 'సంవత్సరం అంతా రెగ్యులర్‌గా ఉంటాం కదా! పెద్దగా ప్రిపేర్ అవక్కర్లేదు" అంది అహల్య

పరీక్షలయిన రోజూ సాయంత్రం శివాలయం వెళ్ళి మాకు ఇష్టమైన చెట్టుక్రింద కూర్చున్నాం. శరీరం అంతా తేలిగ్గా, గాల్లో తేలిపోతున్నట్టుంది నాకు.

"మీరా!" ఎవరిదో గొంతు.

"గౌతమ్!" సంభ్రమంగా అంటూ లేచాను.

✡ ✡ ✡

## 6

**"మా పిన్నిగారబ్బాయి** 'గౌతమ్'" అంటూ, శివానీకి, అహల్యకి పరిచయం చేశాను. గౌతమ్ అరుగు మీద చెట్టుని ఆనుకుని కూర్చున్నాడు. కోరా రంగు లాల్చీ, పైజమా... నుదుటి మీదికి పడుతున్న జుట్టుని వెనక్కు తోసుకుంటూ.. మధ్య మధ్య లాల్చీ మీద పడిన ఆకుల్ని, చేత్తో విదిలిస్తూ, తమాషాగా ఉన్నాడు.

వాళ్ళిద్దరినీ తలవంచి, నవ్వి పలకరించి నాకేసి చూసి "ఏయ్! ఏంటలా చూస్తున్నావ్? దిష్టి తగిలేను." అన్నాడు.

నిజంగా దిష్టి తగిలేట్టే ఉన్నాడు. సాయంత్రం నీరెండ, అప్పుడే అరుణమని సంతరించుకుంటూ, మారేడు ఆకుల్లోంచి మా మీద పడుతోంది. మా శివుడి గుళ్ళో, మహా శివరాత్రి నాడు తప్ప అట్టే ఉండరు జనం. అందరూ, దూరమైనా, కొండమీది వెంకటేశ్వర స్వామి గుడికే వెళతారు. అందుకే మేం రోజూ వెళ్ళి ప్రశాంతంగా కూర్చుంటాం.

ఆకుల్లోంచి దోబూచులాడుతున్న అరుణ కిరణాలు గౌతమ్ చెంపల మీద పరావర్తనం చెందుతున్నాయి. ఎప్పుడూ అంత గమనించలేదు కానీ, గౌతమ్‌కి కూడా నాలాగే బుగ్గమీద సొట్టపడుతుంది. ఇంకొంచెం లోతుగా, పచ్చని రంగు, ఎరుపు కలిసి వింతగా మెరుస్తోంది. ఇంత చక్కని, చదువుకున్న అన్నయ్యని పరిచయం చేస్తున్నందుకు చాలా గర్వంగా అనిపిమింది. అహల్య, శివానీల కేసి చూశాను.

ఇద్దరూ అయోమయంగా చూస్తున్నారు.

"స్కూల్లో ఉన్నప్పుడు, ఇతని గురించి చెప్పేదాన్ని. మేం సెలవలకి వెళ్ళినప్పుడు..."

"ఓ శూర్పణఖ..." అహల్య నవ్వేసింది.

గౌతమ్ కూడా నవ్వుతూ "ఓహో! మన వీరగాధలన్నీ వినిపించావన్నమాట," అన్నాడు.

"ఇన్నేళ్ళకి గుర్తుకొచ్చానన్నమాట" బుంగమూతి పెట్టి అన్నాను.

"అబ్బ! నీ బుంగమూతి చూద్దామనే వచ్చాను. ఇన్నాళ్ళు అంతు తెలీని విద్యాసముద్రంలో ఈదుతూనే ఉన్నాను. ఇప్పుడే ఒడ్డుకనిపించింది. ఎక్కివచ్చేశాను. ఇంతకీ, మీ ఫ్రెండ్స్‌ని నాకు పరిచయం చెయ్యవా?" గౌతమ్ లేచి మా ఎదురుగుండా నిల్చుని అన్నాడు.

"చిన్నప్పుడు ఎప్పుడూ చెపుతుండేదాన్నిగా! వాళ్ళే. శివానీ, అహల్య. సూక్ష్మజీవ శాస్త్రం అధ్యయనం చేస్తున్నారు."

"ఉండు. తెలుగు పండిట్‌వని తెలుసుగానీ, మరీ నన్ను పరీక్ష చేస్తే ఎలా? మైక్రోబయాలజీ అన్నమాట. మంచి ఫ్యూచర్ ఉన్న సబ్జక్ట్. గుడ్" అన్నాడు.

"అవునూ! నువ్వేమిటి? ఇలా సడన్‌గా"... నాకు ఆనందంతో మాటలు సరిగ్గా రాలేదు.

"యం.టెక్ అయాక, నాకు హైదరాబాద్‌లో జాబ్ వచ్చింది. ఆర్నెల్లయ్యింది. మీకు పరీక్షలవుతున్నాయని సావిత్రి చెప్పింది. అది బి.యస్సి ఫస్టియర్ కదా. ఇవాళ్టితో అయిపోతాయంటే, నిన్ను, పెద్దమ్మని, పెదనాన్ననీ చూసి పాలెం వెళదామని ఇలా వచ్చాను. ఇంటికి వెళితే పెద్దమ్మ గుళ్ళో ఉన్నావని చెప్పింది. నేను కూడా దైవదర్శనం చేసుకుందామని ఇలా వచ్చాను. అదన్నమాట." గౌతమ్ మాటలకి నవ్వొచ్చింది. చిన్నప్పటి ఊతపదం... వదల్లేదన్నమాట.

"ఉండు. నాకు గుడంతా పరుగులు పెట్టాలనీ, గెంతాలనీ అనిపిస్తోంది. ఇదంతా నిజమేనా?"

"నిజమే తల్లీ. పరుగులు పెట్టకు. పడ్డావంటే కష్టం. రండి. ముందు ప్రదక్షిణం చేసి దర్శనం చేసుకుందాం. "గౌతమ్ దారి తీశాడు.

ముందు అహల్య, శివానీ... వెనుక నేను గౌతమ్ నడుస్తున్నాం. గౌతమ్, అహల్య కేసి అప్పుడప్పుడు చూస్తుండడం గమనించాను.

"ఏంటి సంగతి?" అన్నట్లు కళ్ళెగరేశాను.

"ఏమో!" అన్నట్లు కళ్ళెగరేశాను.

దగ్గర, దగ్గర పదేళ్ళవుతుందేమో మేం కలిసి. అయినా, నిన్ననో మొన్ననో, నాతో పద్యాలప్పచెప్పించుకున్నట్లుగా అనిపిస్తోంది.

గర్భగుడి దగ్గర మేమిద్దరం ఒక ప్రక్క, మా ఎదురుగా అహల్య, శివానీ, నుంచున్నాము. అహల్యని కళ్ళార్పకుండా చూస్తున్న గౌతమ్‌ని, మోచేత్తో పొడిచాను. కళ్ళు తిప్పుకుని, పూజారి గారి దగ్గర తీర్థం తీసుకుని, శఠగోపం పెట్టించుకున్నాడు.

మామూలుగా, ఎప్పుడూ అందంగా ఉండే అహల్య, పరీక్షలయి రిలాక్స్‌డ్‌గా ఉందేమో! ఇంకా బాగుంది. గంధం రంగు మంగళగిరి చీర, ఎర్రబార్డరు. వాళ్ళమ్మ గంజిపెట్టుకున్న చీరని మొదట తను కట్టేస్తుంది. మాచింగ్ ఎర్ర బ్లౌజు. మెళ్ళో మామూలు నల్లత్రాడు. నిజంగానే కళ్ళు తిప్పుకోలేనట్లుంది. మేం రోజూ చూస్తుంటాం కనుక అంత అనిపించదు. కానీ, క్రొత్తవాళ్ళు చూడకుండా ఉండలేరు.

చెట్టుక్రింద, అరుగుమీదకి చేరాం మళ్ళీ. కాళ్ళూపుతూ అడిగాను. "చెప్పు. ఏంటి సంగతులు?"
పొందిగ్గా కూర్చున్న అహల్య కేసి చూస్తూ అన్నాడు.

"ఏముంది? జాబ్‌లో చేరిన పదినెల్లల్లోనూ, మూణ్ణెల్లు అమెరికా, రెణ్ణెల్లు జర్మనీ, ప్రాజెక్ట్ పనిమీద. హైదరాబాద్‌లో ఇల్లు తీసుకుని, అంతా సర్దుకుని ఇలా వచ్చాను. అమ్మ ఎప్పట్నుంచో గొడవ పెడుతోంది చూడాలని. వాళ్ళని చూసి కూడా మూడేళ్ళయింది."

"ఇల్లు రెడీగా ఉంది. ఇంక ఇల్లాలే కావాలన్నమాట." ఆరిందాలాగా అన్నాను.

"అవే ప్రయత్నాలనుకుంటాను" ఇబ్బందిగా తిరుగుతూ అన్నాడు. బుగ్గలెర్రగా అయిపోయాయి.

"ఓ! సారీ" శివానీ, అహల్యని గమనించి అన్నాను.

"ఫర్వాలేదులే. నువ్వు తలుచుకుంటే, ఇల్లాలు కూడా వచ్చేస్తుంది." కొంచెం సిగ్గుపడుతూ అన్నాడు గౌతమ్.

✡ ✡ ✡

"ఇది జరిగే పనేనా గౌతమ్?" ఇంటికొచ్చి వరండాలో కూర్చున్నాం, నేనూ, గౌతమ్, అమ్మ, నాన్నగారూ. గుడిలో గౌతమ్ ఆ మాట అన్నాక, వాతావారణం గంభీరంగా మారిపోయింది. అతను ఎవర్ని గురించి అలా అన్నాడో అర్థం చేసుకోలేని చిన్నపిల్లలం కాదు కదా!

అహల్య తన చీర బోర్డర్‌తో కలిసిపోయేంత ఎర్రగా అయిపోయి తలవంచుకుంది. శివానీ సాలోచనగా చూసింది. 'మళ్ళీ కలుద్దాం' అంటూ విడిపోయాం.

ఇంటికి వచ్చాక అమ్మతో, నాన్నగారితో చెప్పాను. నిండా ఇరవయ్యేళ్ళు లేవు. నేనేం చెయ్యగలను? అంతా విని అమ్మ అడిగింది.

"ఎందుకు జరగదు పెద్దమ్మా!" నెమ్మదిగా అయినా స్థిరంగా అన్నాడు. "ఆ అమ్మాయికి ఇష్టం లేకపోతే చెప్పలేననుకో," గౌతమ్ అహల్యతో అసలు మాట్లాడనే లేదు కదా.

"ఇష్టం లేకపోవడానికి కారణం ఉండదులే. అది నేను కనుక్కుంటాను.. " చెప్పొద్దూ, నాకూ ఉత్సాహంగానే ఉంది.

అహల్య వదిన అయితే ఎంత బాగుంటుంది!

"అదికాదురా! వాళ్ళు పెళ్ళిచెయ్యగలిగే పరిస్థితిలోనే లేరు. మీ అమ్మ నీ మీద ఆశలు పెట్టుకుంది. ఒక కొడుకువి వైభవంగా జరగాలని కోరుకోవడంలో తప్పులేదు కదా!"

"డబ్బుదేవుంది పెద్దమ్మా! ఈ ఫారిన్ ఎసైన్‌మెంట్‌లో నేను బాగానే దాచాను. మనం ఖర్చుపెడదాం." గౌతమ్ పట్టుదలగా ఉన్నాడు.

"బాగేనే ఉంది. శాంత ఒప్పుకోవాలికదా!"

"మనం ఒప్పించాలి." అప్పటివరకు మౌనంగా ఉన్న నాన్నగారు అన్నారు.

అహల్యంటే మా అందరికీ ఎంతో ఇష్టం. తను, గౌతమ్, అన్నిరకాలుగా ఈడూజోడుగా ఉంటారు. ఇద్దరివీ నెమ్మదైన స్వభావాలు.

"సరే! మీరందరూ కూడబలుక్కుంటే నేనేం చెపుతాను. ఏదో మమ్మల్ని చూద్దామని వచ్చావు. చూసి వెళ్ళకుండా ఇదేంటిరా?" అమ్మ కొంత నిష్టూరంగా అంది. పాలెంలో అందరూ ఏమంటారో అని ఆవిడ భయం.

"మిమ్మల్నే చూద్దాం అనుకున్నా పెద్దమ్మా! కానీ ఆ శివుడు ఇంకోటి తలిచాడు." వాతావరణం తేలిక చేస్తూ గౌతమ్ అన్నాడు.

గట్టిగా నవ్వేశాను. "అవునమ్మా! శివుడి సమక్షంలోనే చూశాడు ఈ గౌతముడు అహల్యని."

"సరేలే! సంబరం. శాంతా వాళ్ళకి ఎలా చెప్పాలా అని, నేను సతమతమౌతుంటే." అమ్మకి గాబరాగానే ఉంది.

"ఇంకేం మరి! ఆ పరమేశ్వరుడే చూసుకుంటాడు. భోంచేద్దాం పదండి." నాన్నగారు లేచి, వంటింట్లోకి నడిచారు.

గౌతమ్ ఒక్క ఉదుట్న లేచి, నా పక్కకివచ్చాడు.

"ప్లీజ్ మీరా! మీ ఫ్రెండ్‌ని అడుగు. తను యస్ అంటే నేను చూసుకుంటాను."

"ఈ సమీర నీకు అభయం ఇస్తోంది." చెయ్యి అభయ ముద్రలో పెట్టి అన్నాను.

"థాంక్స్! నీకు మంచి గిఫ్ట్ ఇస్తాను." గౌతమ్ చాక్‌లెట్ దొరికిన చిన్నపిల్లాడిలా ఎగురుకుంటూ వంటింట్లోకి వెళ్ళాడు.

"అబ్బ! పెద్దమ్మా! కొబ్బరికాయ - మామిడికాయ పచ్చడి, అరటికాయ వేపుడు, చారు. మౌత్ వాటరింగ్. ఎన్నాళ్ళయిందో ఈ భోజనం తిని. కమాన్! లెటజ్ ఎటాక్."

"అహల్య మన వంటలు బాగా చేస్తుంది." అమ్మ నాకేసి కోపంగా చూసింది.

✡ ✡ ✡

ఆరోజు శనివారం. ప్రొద్దున్నే లేచి తలంటుకుని, నాకిష్టమైన లేత పసుపు పచ్చ చీర కట్టుకున్నాను. ఆరీ, ఆరని జుట్టుకి మెడక్రిందుగా రబ్బరు బాండ్ పెట్టాను. ముదురు పసుపు హకోబా బ్లౌజు బాగా మేచ్ అయింది.

"సుప్రభాతం" గౌతమ్ బైటినుంచి వస్తూ అన్నాడు.

"ప్రొద్దున్నే లేచి ఎక్కడికి వెళ్ళావు?"

"చన్నీళ్ళ స్నానం చేసి, శివరావుగార్ని రిక్వెస్టు చేసి వస్తున్నాను. సగం పనిచేశావు, మిగిలింది కూడా పూర్తిచెయ్యమని."

కళ్ళు పెద్దవి చేసి, గౌతమ్ కేసి చూస్తుండిపోయాను. తెల్లని పైజమా మీద, మెరూన్ కుర్తా. హైదరాబాద్ ఫాషన్ అనుకుంటా! పెద్ద విభూతి బొట్టు, మధ్యలో కుంకం. కళ్ళు నూతన ఉత్సాహంతో ఉత్తేజంతో మెరుస్తున్నాయి. నిన్నటికంటే, ఇవాళ కొత్త తేజస్సుతో వెలిగిపోతున్నాడు. 'ప్రేమ' అంటే ఇలా ఉంటుందా!

"ఏయ్! నిన్నే. మళ్ళీ, ఏంటాచూపు?" గౌతమ్ దగ్గరగా వచ్చి ఒక మొట్టికాయ వేశాడు.

"నువ్వు బావుంటావా, అహల్య బావుంటుందా అని ఆలోచిస్తున్నాను." గౌతమ్ చెయ్యికి అందకుండా పరుగెడుతూ అన్నాను.

"అహల్యని కనుక్కుంటావా? తనకిష్టమైతే, మిగిలినవి నేను చూసుకుంటాను."

గౌతమ్‌ని వెక్కిరించి, పూజ చేసుకుంటున్న అమ్మకి, "శివానీ, నేనూ, అహల్య వాళ్ళింటికి వెళ్ళొస్తాం" అని చెప్పి బైటకి నడిచాను.

వెనక్కి తిరిగి చూశాను. గౌతమ్ నాకేసి చూస్తూ చెయ్యి ఊపాడు. ఆకళ్ళలో కోటి ఆశలు.

✡ ✡ ✡

అంత ప్రొద్దున్నే శివానీ వాళ్ళింటికి ఎప్పుడూ వెళ్ళలేదు నేను. వాళ్ళ గేటు తీస్తుంటే అనిపించింది. నా ఆదుర్దాకానీ, తనకి బోల్డు పని కదా... ఇంకా ఎనిమిది కూడా అవలేదు. లోపలికి వెళదామా వద్దా అని తటపటాయించాను.

"రా! మీరా!" శివానీ వరండాలోకి వస్తూ పిలిచింది. "రోజూ ఈ వేళకి తయారైపోతాను. ఆఫీసు పనులు చూసుకోవాలి. మానేజర్‌గారు వస్తారు. ఇవ్వాళ రావద్దని చెప్పాలే! ఫోన్‌లోనే అన్నీ కనుక్కున్నాను."

ఇద్దరం చక్కని, చిక్కని కాఫీ త్రాగుతూ... గార్డెన్‌లో కూర్చున్నాం. శివానీ వాళ్ళింట్లో కాఫీ, పెరుగు చాలా బాగుంటాయి. పితికిన బర్రె పాలు తిన్నగా ఇంటికొచ్చేస్తాయట, వాళ్ళ డైరీ ఫామ్ నుంచి. ఎన్ని రకాల వ్యాపారాలున్నాయో నాకు గుర్తుకూడా ఉండదు. తనెలా చూసుకుంటుందో!

"చెప్పు! ఏమయింది?" శివానీ ప్రశ్నకి ఉలిక్కిపడి చూశాను. ఏమిటో! అలా ఆలోచిస్తూ పరధ్యానంలోకి వెళ్ళిపోతుంటాను.

ఇంట్లో జరిగినదంతా చెప్పాను.

"అయితే అహల్యని ముందు కనుక్కోవాలి కదా! సరే పద. "అంటూ లోపలికి వెళ్ళింది. పదిహేన్నిమిషాల తర్వాత వచ్చింది.

"సారీ! మీరా! డాడీకి మందులిచ్చి, మమ్మీకి టిఫిన్ తినిపించి వస్తున్నాను. ఏమీ తెలీదనుకుంటామా! నేను లేకపోతే మందులు మింగరు డాడీ. ఇద్దరూ బేబీస్ అనుకో! పద."

✡ ✡ ✡

అహల్య వాళ్ళింట్లో కూడా అందరూ స్నానాలైపోయి ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. శివయ్యగారు, పంచలో కూర్చుని లెక్కలు చూసుకుంటున్నారు. మేం వెళ్ళేసరికి, అప్పుడా పుస్తకం మూసి లేవబోతున్నారు.

"రండమ్మా! బాగున్నారా? చాలారోజులైంది." నమస్కారం పెట్టి, లోపలికి వెళ్ళాము.

పంచలో చాపమీద, వత్తులు చేస్తున్న దుర్గమ్మగారు కూడా అన్నీ కట్టేసి, మాకు చోటిచ్చారు.

"మీరు కూర్చోండి బాబాయిగారూ! అంటే, మీరుకూడా రండి." మేం వచ్చిన సందడికి, అహల్య బైటికి వచ్చింది. వాణి ఆంటీ కూడా వచ్చారు.

అహల్య కూడా, మేం వస్తామని ఊహించినట్లుంది.

శివానీ, అంతా వివరించి చెప్పింది. గౌతమ్ గురించి, నేను వివరించాను.

"బావుందమ్మా! కానీ... ఇప్పుడు..." శివయ్యగారు, ఏం చెప్పలేక ఆపేశారు.

"యమ్.ఎస్సి చేసి, రిసెర్చి చెయ్యాలనుకుంటున్నాం కదా!" అహల్య.

అంటే గౌతమ్‌ని చేసుకోవడానికేం అభ్యంతరం లేదన్నమాటేకదా!

"నువ్వు ఎంత కావాలంటే, అంత చదువుకోవచ్చు. ఏమీ అడ్డం ఉండదు." నేను హామీ ఇచ్చాను.

వాణి ఆంటీ నోట్లోంచి మాటరానట్లు కూర్చుండిపోయారు.

శివయ్యగారు టైము చూసుకుంటుంటే, శివానీ అంది.

"మీరు, షాపుకి మధ్యాహ్నం వెళ్ళొచ్చు. నేను చెప్పాను. పని కుర్రాడు వచ్చి పుస్తకాలు తీసుకెళతాడు." శివయ్యగారు పని చేసే బట్టలషాపు, శివానీ వాళ్ళదే కానీ, "నాయుడుగారు కదల్లేని పరిస్థితుల్లో ఉన్నారు.... అంతా శివానీ చూసుకుంటుంది." అని ఎవరికీ తెలీదు.

శివయ్యగారు సంభ్రమంగా చూస్తూ, మళ్ళీ కూర్చున్నారు. ఒక్క దుర్గమ్మగారే, నిశ్చింతగా ధైర్యంగా ఉన్నారు.

"గౌతమ్ పేరెంట్సు ఒప్పుకుంటే, డబ్బు గురించి మీరేం ఆలోచించక్కర్లేదు. మీరు దాచుకున్న డబ్బు నా దగ్గర చాలానే ఉంది. యం.ఎస్సీ చదివించడానికని ఆంటీ చాలారోజులుగా నెలకి కొంత ఇస్తున్నారు. నాన్నమ్మగారు పెళ్ళికని, ఎప్పట్నుంచో నా దగ్గర దాస్తున్నారు. ఆవిడ చేస్తున్న వత్తుల్ని, ప్రతీవారం నేను గుళ్ళ దగ్గర అమ్మించేలా చేస్తున్నాను. ఇంక అంకుల్ జీతంలోంచి ప్రతీనెలా వెయ్యిరూపాయలు కట్ చేసి అది కూడా కలుపుతున్నాం. అది మీకు తెలీదనుకోండి. లేకపోతే ఇన్నాళ్ళనుంచీ చేస్తున్నారు... మీకు రెండువేలేనా జీతం?"

శివానీ ఆగింది. అందరం ఆశ్చర్యంగా చూస్తూ వింటున్నాం.

"ఇవన్నీ కూడా ఎక్యూమ్‌లేట్ చేసి, నేను పెట్టుబడి క్రిందపెట్టాను. అంతా కలిపి, షుమారు నాలుగు లక్షలుంటుంది."

శివయ్యగారు, ఒక్కసారి లేచి నుంచున్నారు. ఏం అనాలో తెలీనట్లు.

"ఇదంతా నాన్నమ్మగారి ముందు చూపు. నేను ఎప్పుడో సరదాగా అన్నమాట పట్టుకుని, ఆవిడ ఒకరోజు నన్ను కూర్చోపెట్టారు. ఇద్దరం కలిసి ప్లాన్ చేశాము. సమయం వచ్చినప్పుడు చెప్పవచ్చులే అని ఎవరికీ తెలీనియ్యలేదు."

శివానీలో ఇంకొక కోణం కనిపిస్తోంది నాకు.

"అదే టైములో మీరా వాళ్ళ నాన్నగారితో కూడా మాట్లాడి, మీరాకోసం కూడా ప్లాన్ చేస్తున్నాము."

అహల్య, నేను అవాక్కై చూస్తున్నాము.

"ఇందులో నేను పెద్దగా చేసిందేమీలేదు. వారానికోసారి పదిహేను నిముషాలు కేటాయించడం తప్ప. మీ డబ్బు కొంత ఛానెల్‌లో పెట్టి మానేజ్ చెయ్యడమే." శివానీకి సహజంగా వచ్చిన వ్యాపార లక్షణం మాకు ఈ విధంగ ఉపయోగ పడుతోందన్నమాట.

"ఇలాగ అందరికీ చేస్తా! అంటే `చెయ్యను` అనే చెపుతాను. ఎవరైనా కుటుంబంలోని వారికోసమే కదా పాటు పడేది. మా ముగ్గురి అనుబంధం... కుటుంబంలోని సభ్యుల కంటే ఎక్కువే." శివానీ కంఠం జీరబోయింది.

అహల్య, నేను కళ్ళల్లో నీరు కారుతుండగా... శివానీ దగ్గరగా వెళ్ళాం. ముగ్గురం, ఒకళ్ళనొకళ్ళు పట్టుకుని అలా ఉండిపోయాం.

దుర్గమ్మగారే ముందు తేరుకున్నారు. శివానీ చెప్పింది, ఆవిడకేం పెద్ద న్యూస్‌కాదు కదా!

"అయితే! ఇంక ముందేం చెయ్యాలో చూడండి."

"నాన్నమ్మగారూ! అంతా నేనూ, మీరా చూసుకుంటాం.." శివానీ అంది.

✡ ✡ ✡

శివానీ, నేనూ ఇంటిలోకి వెళ్ళేసరికి, గౌతమ్ జాజిపందిరి దగ్గర పచార్లు చేస్తూ కనిపించాడు. మమ్మల్ని చూసి,ఆదుర్దాగా వచ్చాడు.

"కంగ్రాచ్యులేషన్స్!" అంది శివానీ.

నా చేతులు రెండూ పట్టుకుని ఊపేస్తూ "థాంక్యూ వెరీ మచ్" అని శివానీతో అన్నాడు.

"మీ స్నేహితురాలు ఒప్పుకుందా!"

"ఒప్పుకుంది. కానీ వాళ్ళు భయపడుతున్నారు. మీలాంటి సంబంధం ఎప్పుడూ అనుకోలేదు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి తెలుసుకదా! మీ పేరెంట్స్ ఏమంటారో అని..." శివానీ మాట పూర్తి చెయ్యకుండానే గౌతమ్ అందుకున్నాడు.

"మా పేరెంట్స్ సంగతి, నేను చూసుకుంటాను."

"అది సరే! మీతో కొంచెం మాట్లాడాలి". అంది శివానీ.

"పదండి. అలా కూర్చుని మాట్లాడదాం." గౌతమ్, వరండాలో కుర్చీలు వేశాడు.

"అహల్య చాలా సున్నితమైన మనస్తత్వం కలది. మితభాషి" శివానీ మొదలుపెట్టింది. నాకు తట్టనేలేదు. అహల్యని ఊరికే చూసి మనసు పారేసుకున్నాడు కానీ, తనెలాంటిదో తెలియదు కదా!

"మళ్ళీ జోవియల్‌గానే ఉంటుంది. తనకి యమ్.యస్సి చేసి రిసెర్చి చెయ్యాలనుంది."

"తనిష్టం వచ్చినంతవరకు చదువుకోవచ్చు." శివానీ మాటలకు అడ్డం వస్తూ అన్నాడు గౌతమ్.

నవ్వుతూ తల ఊపి చెప్పసాగింది. "వాళ్ళ పేరెంట్స్ చాలా అమాయకులు. ఏమీ తెలియదు. మీకు వాళ్ళ సపోర్ట్ ఏమైనా ఉంటుందేమో అనుకుంటే, లేదనే చెప్పాలి. తను ఓన్లీ డాటర్. అంటే పేరెంట్స్ బాధ్యత, ఫ్యూచర్‌లో తనదే అవుతుంది. ఈ మారేజ్ వల్ల, మీకు అహల్య వేపు నుంచి ఏ విధమైన భౌతిక, ఆర్థిక లాభాలు ఉండవు. మారేజ్ మాత్రం ఏలోటు లేకుండా జరుగుతుంది. అందుకని మీరు హెజిటేట్ చెయ్యక్కర్లేదు. అన్నీ బాగా ఆలోచించి మీరు ఒక నిర్ణయం తీసుకోండి." శివానీ చెబుతుండగానే, అమ్మ, నాన్నగారు బైటికి వచ్చి కుర్చీలు లాక్కుని కూర్చున్నారు.

"అదే నేనూ అంటున్నానమ్మా! శాంత ఏమంటుందోననే నా భయం" అమ్మ మాటలకి, నాన్నగారు తల ఊపారు.

"పెళ్ళి అంటే లాభనష్టాలు బేరీజు కాదు పెద్దమ్మా! ఇద్దరు మనుష్యుల... ఇద్దరు మనసుల కలయిక. జీవితాంతం ఇద్దరు కలిసి... సుఖదుఃఖాలు పంచుకుంటూ, ఒడిదుడుకులు తట్టుకుంటూ సహజీవనం చెయ్యడానికి.... ఇద్దర్నీ కలిపే పవిత్రబంధం. అహల్యతో నా జీవితం బాగుంటుందని నాకనిపిస్తోంది." గౌతమ్ అభిప్రాయం శివానీకీ, నాకూ చాలా నచ్చింది.

"ఇంక అమ్మా, నాన్నల సంగతంటావా నాకొదిలేయండి. నేను చూసుకుంటా కదా!"

"నువ్వు చాలా గ్రేట్‌రా అన్నయ్యా! అండ్ లక్కీ ఆల్సో. అహల్యలాంటి పిల్ల దొరకడం ఈజీకాదు. అందానికి మించిన అణుకువ, మంచితనం ఉన్నాయి తనలో." గౌతమ్‌కి షేక్ హాండిస్తూ అన్నాను.

"టూ వీక్స్ లీవ్ అని మా ఆఫీస్‌కి ఫోన్ చేసి చెపుతాను. ఇంకా కొత్త ప్రాజెక్ట్ తీసుకోలేదు. అందుకని నో ప్రోబ్లమ్. ఇప్పుడే బయలుదేరి పాలెం వెళతాను. మీ ఫోన్ నంబర్..." శివానీ ఫోన్ నంబర్ సెల్‌లోకి ఎక్కించి గౌతమ్ లేచాడు.

✡ ✡ ✡

గౌతమ్ పాలెం వెళ్ళాక జరగాల్సిన వన్నీ చకచకా జరిగిపోయాయి. ఏం చెప్పి వప్పించాడో కానీ, మర్నాడే శాంత పిన్నీ బాబాయ్, సావిత్రీ వచ్చారు. గుంటూర్లో ఉంటున్న రాధ కూడా వచ్చింది. రాధకి క్రితం ఏడు పెళ్ళయింది. చదువు ఆపేసి, గుంటూర్లో బాంకులో ఉద్యోగం చేస్తున్న వాళ్ళాయన దగ్గరకు వెళ్ళిపోయింది. అక్కడే చదువు పూర్తిచేస్తుందట.

వాళ్ళని చూసి అమ్మకి, నాన్నగారికి కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఒక్కగానొక్క కొడుకుని, ఏమీ లేని వాళ్ళ ఇంటికి అల్లుడిగా చేస్తున్నామంటారేమోనని భయం.

హరి బాబాయ్ నాన్నగారిని చూసి "ఏం బ్రదర్? మీ ఊరు రప్పించావా మమ్మల్ని" అన్నారు. నాన్నగారు మొహమాటంగా నవ్వేశారు.

"ఫరవాలేదులే! అంతా సవ్యంగా జరుగుతుంది" అని నాన్నగారి భుజం తట్టారు. హరిబాబాయి ప్రసన్నవదనం చూడగానే మా కందరికీ ధైర్యం వచ్చింది.

వంటింట్లో పీట వేసి పిన్నిని కూర్చోపెట్టి, కాఫీ కలుపుతూ అంది అమ్మ. "శాంతా! వాడే గుళ్ళో పిల్లని చూశాడు. చూసినట్లు కూడా మాకు తెలియదు"

"గౌతమ్ అంతా చెప్పాడక్కా! మీకేం తెలియదని కూడా చెప్పాడు. డబ్బుదేముంది? పిల్ల మాతో కలిసి పోతే చాలు." అంది పిన్ని.

"పిల్ల చాలా మంచిది, ఎంతో అణుకువ గలది. అసలు వేలెత్తి చూపడానికి లేదు." కాఫీలు గ్లాసుల్లో పోస్తూ, పిన్ని కేసి చూసి అంది.

"ఇవాళ మంచి రోజట. కబురు చెయ్యండి. చూసేద్దాం. వాడు ఈ పదిహేను రోజుల్లోనే 'పెళ్ళి' అంటున్నాడు. వాళ్ళింటికే వెళదాం." కాఫీ గ్లాసులు వరండాలోకి తెస్తూ అంది పిన్ని.

"అయితే నే వెళ్ళి చెప్పొస్తా" అని చెప్పులు వేసుకుని బయలుదేరాను.

✡ ✡ ✡

శివానీ వాళ్ళింటికి వెళ్ళి తనని తీసుకుని అహల్య వాళ్ళింటికి వెళ్ళాను. అందరం ఎదురు చూస్తూనే ఉన్నాం కనుక, ఏం హడావుడి పడలేదు. "సాయంత్రం, నాలుగు దాటాక వస్తాం" అని చెప్పాను. శివానీ అక్కడే ఉండి, అన్నీ చూస్తానంది.

అంత ఖంగారూ నాకే కానీ, అహల్య తొణక కుండా ఉంది. ఫలహారం ఇంట్లోనే చేస్తానన్నారు ఆంటీ, శివానీ తెప్పిస్తానన్నా వినకుండా.

పరుగెడుతున్నట్లుగా ఇంటికి వచ్చేసి, అమ్మా వాళ్ళకి చెప్పాను. అప్పట్నుంచీ, అహల్య వాళ్ళింటికి వెళ్ళేవరకూ... రాధ, సావిత్రి, నేను, గౌతమ్‌ని ఏడిపిస్తూనే ఉన్నాము. మా స్కూలు ఫోటోలన్నీ చూపించాను. ప్రతీ సంవత్సరం గ్రూపు ఫోటోలో... అహల్యకి పదేళ్ళప్పట్నుంచీ.... ఎలా ఉందో చూపించాను. అంతమందిలో, అహల్యని కనుక్కోవడం గౌతమ్ పని. అలా సాయంత్రం వరకూ గడిచిపోయింది.

అందరం కలిసి, నాలుగుంపావుకి అహల్య వాళ్ళ ఇంటికి వెళ్ళాం. ఆరింటికి దుర్ముహూర్తం వచ్చేస్తుందిట మరి. గేటు దగ్గర్నుంచి చామంతి పూలు స్వాగతం పలికాయి. పంచమీద పెద్ద ఆనపకాయ ఆహ్వానం పలికింది. పంచలో ముగ్గులు, చాపలు వేశారు. చాపల మీద కూడా ముగ్గులు వేసింది అహల్య. లోపలికి వెళుతూనే, ఆహ్లాదకరమైన సువాసన. పెద్దవాళ్ళకి నాలుగు కుర్చీలు బైట వేశారు. గౌతమ్, బాబాయ్, నాన్నగారు అక్కడ కూర్చున్నారు.

అమ్మ, పిన్ని, పంచలో చాపమీద కూర్చున్నారు. రాధ, నేను సావిత్రి లోపలికి వెళ్ళం. "వాల్మీకి ఆశ్రమం లా ఉంది, మీ ఇల్లు" అంది రాధ, అహల్యని చూడగానే. అహల్య మనోహరంగా నవ్వింది. అందరం పంచలోకి వచ్చాం. అహల్య అదే గంధం రంగు చీర కట్టుకుంది. పిన్ని, అహల్యతోనూ, ఆంటీతోనూ మాట్లాడింది. దుర్గమ్మగారు వంటింట్లోంచే అంతా అజమాయిషీ చేశారు. అహల్య వాళ్ళ నాన్న, శివయ్యగారు.. బాబాయ్‌తో సరదాగా కబుర్లు చెప్పారు.

మొత్తానికి అంతా సవ్యంగా జరిగింది. పిన్ని మైసూర్‌పాక్‌నీ, బూందీనీ మెచ్చుకుంది. శివానీ, గౌతమ్‌ని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది.

✡ ✡ ✡

అనుకోకుండా కలలోలా అహల్య పెళ్ళి జరిగిపోయింది.

"కోటి రూపాయలు కట్నం తీసుకున్నా, ఇలాంటి కోడలు దొరుకుతుందా!" శాంత పిన్ని, కోడల్ని చూసి ఒకటే మురిసిపోయింది.

పిన్నీ, బాబాయ్ ఏం అడక్కపోయినా, శివానీ దగ్గరుండి అన్ని లాంఛనాలూ జరిపించింది. అత్తగారివీ, ఆడపడుచులవీ లాంఛనాలు, గౌతమ్‌కీ, ఇంట్లోవాళ్ళకీ బట్టలూ... దేనికీ లోటు చెయ్యలేదు. శివానీ వాళ్ళదే, మా ఊళ్ళో పెద్ద కళ్యాణమండపం. అందులో.... ఎంతో వైభవంగా జరిగింది, అహల్య - గౌతమ్‌ల కళ్యాణం.

మధ్యలో దుర్గమ్మగారి సలహాలతో... సంప్రదాయబద్ధంగా, అందరికీ ఆమోదయోగ్యంగా..... కన్నుల పడగలా జరిగింది

శాంత పిన్ని వాళ్ళ అత్తగారి వడ్డాణం, చంద్రహారాలు కోడలికి పెట్టింది. గౌతమ్ స్వయంగా పెళ్ళి చీరలు సెలక్ట్ చేశాడు.

పెళ్ళి అలంకారంలో అహల్య... మహలక్ష్మిలా మెరిసిపోయింది. ఇంక గౌతమ్.... "పుంసా మోహన రూపాయ" లగా ఉన్నాడు. శివానీ వాళ్ళ షాపులోంచి... మేం ముగ్గురం కలిసి గౌతమ్ బట్టలు ఎంచి, దగ్గరుండి కుట్టించాం.

శివానీ వాళ్ళ బావ `రుద్ర`... పనులన్నీ మీద వేసుకుని తిరిగాడు. అతను ఎక్కువగా శివానీ వాళ్ళింట్లో ఉంటుంటాడు. అందుకని మాకు బాగా చనువు. శివానీ మధ్యలో వాళ్ళ డాడీనీ, మమ్మీని చూసుకుంటూ, పెళ్ళివారిని మర్యాదలతో ముచెత్తింది.

అంతా అయాక దుర్గమ్మగారు అన్నారు. "వచ్చే జన్మలో ఏం కావాలి? అని దేముడు నన్ను అడిగాడనుకోండి, ఏం అడుగుతానో తెలుసా?" అందరం కుతూహలంగా చూశాం.

**"శివానీలాంటి స్నేహితురాల్ని ఇమ్మని."**

✡ ✡ ✡

## 7

**రుద్ర అసహనంగా** కదిలాడు కారులో. వెనక సీట్లో కూర్చున శివానీ, నేనూ అతన్ని గమనిస్తూనే ఉన్నాం. రుద్ర క్రిందటి నెలే మా ఊరికి అసిస్టెంటు సూపర్నెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. అహల్య పెళ్ళి అయాక నాకు, శివానీకి ఏదో పోగొట్టుకున్నట్లుగా అనిపించింది. రుద్ర "ఆఫీస్ పని మీద వైజాగ్ వెళుతున్నాను వస్తారా" అని అడిగాడు.

పోలీస్ ఆఫీసర్ కదా భయం ఏం ఉండదని నాన్నగారూ, అమ్మా ఒప్పుకున్నారు. పైగా శివానీ మా ఇంటి కొచ్చి బ్రతిమిలాడింది. నిన్న ప్రొద్దున్నే బయల్దేరి పదింటికల్లా వైజాగ్‌లో ఉన్నాం. మమ్మల్ని గెస్ట్ హౌస్ దగ్గర దింపి, రుద్ర ఆఫీస్‌కి వెళ్ళి కారు పంపించాడు. ఇంక శివానీ, నేనూ సింహాచలం, రామకృష్ణా బీచ్ తిరిగి రూముకి వచ్చి భోజనం అయాక, ఓ కునుకు తీసి లేచేప్పటికి రుద్ర వచ్చాడు. ముగ్గురం కైలాస గిరి మీద తిరిగి, భీమిలి రోడ్ మీద అలా రైడ్‌కి వెళ్ళి గెస్ట్ హౌస్‌కి వచ్చి పడుకున్నాం.

రుద్రకి ఆఫీస్ పని అవగానే పన్నెండింటికి మళ్ళీ తిరుగు ప్రయాణం అన్నాడు. ప్రొద్దున్నే కనక మహాలక్ష్మి గుడికి వెళ్ళి రుద్రరాగానే భోంచేసి బయలుదేరాం.

వైజాగ్ వెళ్ళేప్పుడు ఎంత సులువుగా వెళ్ళిపోయామో, వచ్చేప్పుడు అంత కష్టమవుతోంది. మధ్యలో ఒక చోట ట్రాఫిక్ జామ్. అది క్లియర్ అయి ఇరవై కిలోమీటర్లు దాటగానే ఇంకో చోట పెద్ద యాక్సిడెంట్. రోడ్ మీద మిరపకాయలు ఎండబెట్టారట. అవి కొన్ని నడిరోడ్డుమీదకి వచ్చి, వేగంగా వస్తున్న లారీని స్కిడ్ అయేలా చేశాయిట. లారీ వెళ్ళి ఎదురుగా వస్తున్న బస్సుని ఢీ కొంది. బస్సులో నిండా ఉన్న జనం. చెల్లా చెదురుగా రోడ్డు మీద పడిపోయారు.

ఆ దృశ్యం తలచుకుంటేనే ఒళ్ళంతా జలదరిస్తోంది. అప్పటి వరకు ముగ్గురం జాలీగా కబుర్లు చెప్పుకుంటూ వచ్చాం. రుద్ర తన ట్రైనింగ్‌లో జరిగిన విశేషాలన్నీ చెపుతున్నాడు. మా ముందు ఒక అరడజను బళ్ళుంటాయి. మూడు కార్లు, రెండు వాన్లు, ఒక బస్సు.

ఉన్నట్లుండి అవన్నీ స్పీడు తగ్గించాయి. అప్పుడే లారీబస్సు, లారీ ఢీకొని, జనం హాహాకారాలతో.... పెద్ద చప్పుడుతో.... నానాబీభత్సంగా ఉంది. మాకు ఒక అరమైలు దూరంలో అది జరిగినా, అంతా స్పష్టంగా కనిపించింది. ఎగిరి మిరపకాయల గట్టుమీద పడ్డవాళ్ళు... కళ్ళలో, ముక్కులో, చెవుల్లో కారం వెళ్ళిపోయి... దెబ్బలు తగిలిన చోటక్కూడా దూరిపోయి.... హృదయ విదారంగా ఏడుస్తున్నారు. ఇంక లారీక్రింద, బస్సు క్రింద పడ్డవాళ్ళు, కిటికీల్లో.... తలుపుల్లో..... చిక్కుకున్న వాళ్ళు, బారికేడ్లకి గుద్దుకున్నవాళ్ళు, శివానీ, నేనూ చూడలేక కళ్ళుమూసుకున్నాం.

రుద్ర వెంటనే రంగంలోకి దిగాడు. సెల్‌ఫోన్ తీసి అక్కడికి పాతిక మైళ్ళ లోపు దూరంలో ఉన్న ఊళ్ళలో పోలీస్ స్టేషన్లకి ఫోన్ చేసి..... హాస్పిటల్స్‌ని కాంటాక్ట్ చేసి... అంబులెన్స్‌లు, పారామెడికల్ వాళ్ళని, డాక్టర్లని పంపమని......ఫైర్ ఇంజన్ వాళ్ళని కటింగ్ మెషిన్స్ తెమ్మని....., ఆర్డర్లు పాస్ చేసి, స్పాట్‌కి వెళ్ళాడు. నేను చూడలేనని కార్లోనే కూర్చున్నాను. శివానీ బయాలజీ స్టూడెంట్ కదా! ఫస్ట్ ఎయిడ్ చేస్తానని కార్లో ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్ తీసుకుని వెళ్ళింది. అక్కడ ఒక ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏమూలకి? అయినా ఒక్క ప్రాణం కాపాడినా నయమే కదా!

నేను కాసేపు వణుకుతూ కూర్చున్నాను. ఎమర్జన్సీలో ఎందుకు పనికి రాకుండా ఉండడం క్షమించరాని నేరం. ఎంత సర్ది చెప్పుకున్నా కాళ్ళు కదలనంటున్నాయే!

రుద్ర వచ్చి సెల్‌ఫోన్ ఇచ్చి "ఫోన్లు ఆన్సర్ చెయ్యి. ఈ స్పాట్ ఎడ్రస్ ఇది. యస్.ఓ.యస్. అని చెప్పు. నా పేరు చెప్పు. నేను కొంతమందికి ఫస్టెయిడ్ ఇస్తున్నాను." అని పరుగెత్తుకుంటు వెళ్ళిపోయాడు.

ఈలోగా అంబులెన్సు హారన్‌లు, జీపులు వచ్చే శబ్దాలు వినిపించాయి. ట్రాఫిక్‌ని రైట్ లైన్‌లోకి డైవర్ట్ చెయ్యమని కారు డ్రైవర్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు రుద్ర. కారు డ్రైవర్ ట్రయిన్డ్ పోలీస్, రుద్ర కార్లో, ఎమర్జన్సీకి కావల్సిన వస్తువులన్నీ ఉంటాయి. డ్రైవర్ రెండు చివర్ల బోర్డు పెట్టేసి, అక్కడున్న జనంలో ఒక యువకుడ్ని ఒక ప్రక్క ఉంచి, తనొక ప్రక్కనుండి ట్రాఫిక్‌ని డైవర్ట్ చేస్తున్నాడు.

నేను గుండెదిటువు చేసుకుని ఫోను పట్టుకుని స్పాట్ దగ్గరగా వెళ్ళాను. అంబులెన్సులు నాలుగు, పోలీసు జీపులు ఆరు వచ్చాయి. అందరూ యాక్షన్‌లోకి దిగిపోయారు. రుద్ర ఎవరు ఏం చేయాలో గైడ్ చేస్తున్నాడు. అప్పటికే అతను ప్రయారిటీలు సార్ట్ అవుట్ చేసేశాడు. శివానీ 'కొంచెం ఫరవాలేదు' అన్న వాళ్ళ దగ్గర నర్సుకి సాయం చేస్తూ కనిపించింది.

నేను ఫోన్లు ఆన్సర్ చేస్తూ, ఎంతమందిని అంబులెన్స్ ఎక్కిస్తున్నారో నోట్ చేస్తున్నాను. కొంతమందిని కొంచెం దూరంలో ఒక దగ్గరికి తీసుకెళ్ళి పడుకోపెడుతున్నారు. ఒక నర్సు వెళ్ళి వాళ్ళ మీద తెల్లదుప్పట్లు కప్పుతోంది. అది అర్థం అవగానే నేను రోడ్డు ప్రక్కకి పరుగెత్తుకుంటూ వెళ్ళి భళ్ళున వాంతి చేసుకున్నాను.. హాస్పిటల్‌కి తీసుకెళ్ళఖ్ఖర్లేదన్న మాట వాళ్ళని. తేరుకున్నాక వాళ్ళ సంఖ్యని కూడ నోట్ చెయ్యడం మొదలు పెట్టాను.

ఈ లోపుగా పత్రికలవాళ్ళు, టి.వీ వాళ్ళు, చుట్టు ప్రక్కల ఊళ్ళలోని జనం.... అలా ప్రవాహం లాగా రాసాగారు. పోలీసులు రెండువైపులా తాళ్ళు కట్టేసి అందరినీ కంట్రోల్ చేస్తూ... డాక్టర్స్‌ని, నర్సుల్నీ, ఫైరింజన్ వాళ్ళని మాత్రం లోపలికి వెళ్ళనిస్తున్నారు.

"జీవితంలో మర్చిపోలేని అనుభవం." శివానీతో కార్లో అన్నాను. అంతా అయి మేం కార్లో కూర్చుని బయల్దేరడానికి అయిదుగంటల పైనే పట్టింది. రుద్ర లోకల్ పోలీస్ ఆఫీసర్లకి అంతా అప్ప చెప్పి "బయలుదేరదాం" అన్నాడు.

అందరం నిస్త్రాణగా కూర్చున్నాం. నాకన్పించింది, కారు డ్రైవర్ ఎలా ఉన్నాడో అని.

"మేమందరం ఫిజికల్‌గా, మెంటల్‌గా ఇలాంటివాటికి ట్రైన్ అయిన వాళ్ళం. అందుకని మా గురించి నువ్వేం వర్రీ అవకు" నా మనసులో మాట తెలిసినట్లుగా రుద్ర అన్నాడు.

ఇంతకంటే మర్చిపోలేనిది భరించలేనిది, మనస్సు పిండేసేది అయే అనుభవం కొద్దిసేపట్లో అవబోతోందని అప్పుడనుకోలేదు నేను.

✱ ✱ ✱

ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు రుద్ర. టైము చూశాను. తొమ్మిదిన్నర. అప్పుడే ఊళ్ళోకి ప్రవేశించబోతున్నాం.

"ఊళ్ళోకి వెళ్ళకు. ఆ ముందు కనిపిస్తున్న జంక్షన్ దగ్గర రైట్‌కి పోనీయ్. రైల్వే గేటు దాటాక లెఫ్ట్‌కి వెళితే అత్తయ్య వాళ్ళ పేట వస్తుంది." డ్రైవర్‌తో అన్నాడు రుద్ర.

డ్రైవర్ అలాగే కుడివేపుకి తిప్పాడు. కొంచెం దూరం వెళ్ళాక వీధి దీపాలు మొదలయాయి. రైలు గేటు దాటాక చిన్న పంటకాలువ మీద వంతెన. వంతెన దాటి ఎడం వైపుకి తిరిగి కొంచెం దూరం వెళ్ళగానే మా మా పేట వచ్చేస్తుంది. ఇటునుంచి వెళ్ళేటప్పుడు, రోడ్లు కొంచెం ఇరుగ్గా ఉన్నా మెయిన్ రోడ్డుకి రెండు కిలోమీటర్ల కంటే దూరం ఉండదు. ముందు అహల్య వాళ్ళ ఇల్లు వస్తుంది తరువాత మాది. మా ఇల్లు దాటి మళ్ళీ మెయిన్ రోడ్ కేసి వెళుతుంటే శివానీ వాళ్ళ ఇల్లు. ముందు నన్ను దింపేసి శివానీని దింపుదామని అనుకునుంటాడు రుద్ర.

"డ్రైవర్! కారాపు" రుద్ర కొంచెం గట్టిగా అరిచాడు.

డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. శివానీ, నేనూ ఒక్కసారి ఉలిక్కిపడి ఏమయిందా అని చూశాము.

"కొంచెం వెనక్కి తియ్యి."

డ్రైవర్ రాజు మెల్లిగా వెనక్కి పోనిచ్చాడు. ఇటు, అటు కనుచూపు మేరలో ఎవరూ లేరు. రుద్ర కారెందుకు ఆపమన్నట్లు?

"ఆ! స్టాప్ హియర్", తలుపు తీసుకుని కుడిప్రక్క రోడ్డు దిగాడు. కొంచెం వెనక్కి పంటపొలాలున్నాయి. ప్రక్కన కాలువ. రాజు టార్చిలైటు తీసుకుని రుద్ర వెనకాలే వెళ్ళాడు.

రుద్ర నాలుగడుగులు వెయ్యగానే కనిపించింది..... నేను, శివానీ కారు దిగి రోడ్డు మీదినుంచే చూస్తున్నాం.

"మైగాడ్!" అంటూ గబగబా ఫోను తీసి పోలీస్ స్టేషన్‌ని హాస్పిటల్‌ని కాంటాక్ట్ చేశాడు.

శివానీ కూడా రుద్ర దగ్గరికి వెళ్ళింది. కాళ్ళు వణుకుతుంటే నేను కూడా మెల్లిగా వెనకాల వెళ్ళాను.

ఎవరో ఇద్దరు యువతీ యువకులు. ఇద్దరూ బోర్లా పడుకుని ఉన్నారు, ప్రక్కప్రక్కన. చుట్టూ రక్తం మడుగు. నాకు మళ్ళీ కడుపులో త్రిప్పటం మొదలైంది. ఆ యువకుడికి తెలివస్తున్నట్టుంది. కాళ్ళు చేతులూ కదుపుతున్నాడు. అతను చెయ్యి పైకెత్తినప్పుడే రుద్ర అతన్ని చూసుంటాడు. వీధి దీపం కాంతి అతని మీద బాగా పడుతోంది. ఆ యువతి నీడలో ఉంది.

శివానీ దగ్గరగా వెళ్ళబోయింది.

"వెయిట్. ఫోటోలు తీశాక వెళదాం." రుద్ర ఆపాడు.

"అసలు ప్రాణం ఉందో లేదో చూద్దాం." శివానీ ఇంకా ఏదో అనబోయింది.

"ఇద్దరికీ ప్రాణభయంలేదు. ఒక పదినిముషాల్లో మళ్టీ స్పెషాలిటీస్‌కి తీసుకెళదాం. ఇక్కడికి దగ్గరే కదా!" రుద్ర, శివానీని పట్టుకున్నాడు,

మళ్ళీ అంబులెన్స్‌దీ, పోలీస్ జీపుదీ సైరన్‌లు. మధ్యాహ్నంవే ఇంకా చెవుల్లో గింగురు మంటున్నాయి. ఇవాళ చాలా దుర్దినం లాగా ఉంది.

పోలీస్ వాళ్ళు చకచకా ఫోటోలు తీశారు. అంబులెన్స్‌లోంచి స్ట్రెచర్స్ తీసి ఇద్దర్నీ వెల్లకితలా త్రిప్పి స్ట్రెచర్స్ మీదకి ఎక్కించారు.

స్ట్రెచర్స్ కాంతిలోకి రాగానే నేనూ, శివానీ ఒక్కసారి "అమ్మో!" అని అరిచి, స్ట్రెచర్స్ దగ్గరికి పరుగెత్తాం.... ఇద్దరం వెక్కి, వెక్కి ఏడుస్తూ! రుద్ర మమ్మల్నిద్దర్నీ గట్టిగా వెనక్కిలాగాడు. "హాస్పిటల్‌కి త్వరగా తీసుకెళ్ళాలి. పదండి మనం కూడా వెళదాం."

"రుద్రా! అహల్య, గౌతమ్...!" శివానీ హిస్టీరిక్ గా అరుస్తూ అంది. నేను కళ్ళు తిరిగిపడిపోయాను. ఎవరో పారామెడిక్ వచ్చి, నీళ్ళు చల్లి, లేపి కారు దగ్గరికి తీసుకెళ్ళడం లీలగా గుర్తుంది.

జరిగేదంతా ఏదో కలలా... ఎక్కడో దూరంగా జరుగుతున్నట్లు, నేను పైనుంచి అంతా గమనిస్తున్నట్లు అనిపించింది.

ఏమిటది? ఏమిటది? అంతా అబద్ధం. ఇదంతా ఏదో పీడకల అయుంటుంది. నేనూ, శివానీ, అహల్య కాలేజ్‌లో చెట్టు క్రింద లంచ్ తింటూ స్కూల్ టీచర్ల మీద జోక్స్ వేసుకుంటున్నాం కదా!

"ఏయ్! మీరా! "జయమ్మ‘ టీచరు గుర్తున్నారా?" అహల్య మా కుట్టు టీచర్ని బాగా ఆటపట్టించేది.

"అయ్యో! గుర్తులేకేం మనం ఎంత గట్టిగా కుట్టినా కుట్ల దగ్గిరలాగి పట్టుకుని, చింపినంత పనిచేసి... భూతద్దాల కళ్ళజోడులోంచి చూస్తూ తిట్టేది," శివానీ గొంతు పరక పోయింది.

"ఇదేమో సందు చూసుకుని ఆవిడ కొంగు కట్ చేసి కుట్టేసింది. ఇంక ఆవిడ మొహం చూడాలి." అహల్యని చూపిస్తూ అన్నాను నవ్వలేక ముగ్గురం లేచి నుంచున్నాం.

"మీరా! మీరా!" శివానీ కుదుపుతూ అరుస్తోంది.

నేను నవ్వుతూ, ఏడుస్తూ ఏదో మాట్లాడుతున్నాను.

"లే! లే! హాస్పిటల్ వచ్చింది." ఎవరో లేపి కుర్చీలో కూర్చోపెట్టారు. నోటికి తియ్యగా, చల్లగా తగిలింది. మెల్లిగా కళ్ళు తెరిచాను. గ్లాసులో బత్తాయి రసం తాగిస్తోంది అమ్మ. "అమ్మా!" గట్టిగా అరుస్తూ మళ్ళీ క్రిందపడబోయాను. పడకుండా ఎవరో పట్టుకున్నారు. నెమ్మదిగా వెనక్కి తిరిగి చూశాను. ‘నాన్న‘... నా వీపుమీద చేత్తో రాస్తూ.

"ఏమయింది? అమ్మా! ఎక్కడున్నాం? టైమెంత?"

"ఏం కాలేదురా! అంతా బాగానే ఉన్నారు. టైము పన్నెండవుతోంది. నువ్వు ఆవేశపడకు. కామ్‌గా ఉండు." అమ్మ ప్రశాంతమైన మొహంతో అంది.

"మేం తొమ్మిదిన్నర కల్లా ఊర్లోకి వచ్చాం. మరి ఇంతసేపు!" ఎవరో కొట్టినట్లయి భోరుమని ఏడవసాగాను.

"అమ్మా! అహల్య..." చెప్పబోతున్న నా నోటిమీద చెయ్యి ఉంచింది అమ్మ.

"అహల్య, గౌతమ్ కులాసాగా ఉన్నారు. రక్తం ఎక్కించారు. కొంచెం మత్తు మందిచ్చారు. ఏం ఫరవాలేదన్నారు. గౌతమ్‌కి తలదగ్గర దెబ్బ తగిలింది. కుట్లు లేశారు. రేప్పొద్దున్న మనం మాట్లాడచ్చు." ఎప్పుడొచ్చిందో శివానీ, నా చెయ్యి నిమురుతూ అంది.

"శివా! మన అహల్య..." మళ్ళీ వెక్కిళ్ళు.

"ఊరుకో మీరా! ఏం కాలేదన్నాగా. మళ్ళీ మనం ముగ్గురం కబుర్లు చెప్పుకోవచ్చు రేపట్నుంచీ" శివానీ గొంతులో ఏదో వెలితి.

## 8

ఉస్మానియా యూనివర్శిటీ లాండ్ స్కేప్ గార్డెన్స్‌లో కూర్చున్నాం నేనూ, అహల్యా. అహల్య మైక్రో బయాలజీలో యమ్.యస్.సి చేస్తోంది. నేను తెలుగు యమ్.లో చేరాను. అప్పటికి ఆ భయంకరమైన సంఘటనలు జరిగి ఏడాది అవస్తోంది. నేను లేడీస్ హాస్టల్లో

ఉండి చదువుకుంటున్నాను. కొంతమంది సహృదయులు, ముఖ్యంగా గౌతమ్ అన్నయ్య ఆర్థిక సహాయంతో ఏ ఆటంకం లేకుండా సాగుతోంది నా చదువు.

అప్పుడప్పుడు టీ.వీ ఛానల్స్‌లో ఇంటర్వ్యూలు కండక్ట్ చెయ్యడం, కామెంటేటర్‌గా ప్రోగ్రామ్స్ నిర్వహించడం... లాంటివి చేస్తూ కొద్దిగా సంపాదిస్తున్నాను కూడా. ఎప్పుడైనా కథలు, కవితలు ప్రచురణ వల్ల ఇంకొంచెం ఆదాయం.... మొత్తానికి ఫరవాలేదనిపించేలా ఉంది. తేజా టీవీ వాళ్ళు ఫుల్ టైం ఎనౌన్సర్‌గా రమ్మన్నారు. కానీ యమ్.ఏ అయాక చేరతానని చెప్పాను.

మధ్య రాత్రిలో ఒకోసారి ఉలిక్కిపడిలేచి ఆపకుండా ఏడుస్తుంటాను. ఈ పీడకలలు ఎప్పటికి ఆగిపోతాయో!

గౌతమ్ హైటెక్ సిటీలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ప్రోగ్రామ్ మేనేజర్‌గా చేస్తున్నాడు. యూనివర్శిటీకి దగ్గరగా ఉంటుందని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో ఎపార్ట్ మెంటు తీసుకుని ఉంటున్నారు అహల్య, గౌతమ్. నేను సాధారణంగా శని, ఆదివారాలు వాళ్ళ ఇంటికి వెళ్ళిగడుపుతుంటాను.

అహల్య ఆ సంఘటన తర్వాత చాలా సన్నగా అయిపోయింది. అసలు తేరుకోవడానికి మూడునెల్ల పైనేపట్టింది. తనకేం పెద్ద దెబ్బ తగల్లేదు మరి! గౌతమ్‌కే తలమీద పెద్ద దెబ్బ... చాలా రక్తం పోవడం... నాలుగు రోజుల తర్వాత కానీ స్పృహ రాలేదు. అయినా వాడే తొందరగా మనుషుల్లో పడ్డాడు.

అహల్య క్కూడా రక్తం ఎక్కించవలసి వచ్చిందట... ఎందుకో మరి. నాకయితే దెబ్బలేం బైటకి కనిపించలేదు.

అసలేం జరిగింది? అడిగితే ఎవరూ చెప్పటంలేదు. ఆఖరుకి అహల్యకూడా. "అబ్బ! అదేం గుర్తు చెయ్యకే బాబూ! అందరం బాగేనే ఉన్నాం కదా!" అని పేలవంగా నవ్వుతుంది.

అంతకుముందే మేం రాసిన, ఉస్మానియా యూనివర్శిటీ పి.జి.ఎంట్రన్స్‌లో, నాన్ లోకల్‌లోనే మా ఇద్దరికీ సీట్లు వచ్చాయి. వెంటనే గౌతమ్‌కి జాబ్‌రావడం ..... నేను హాస్టల్‌కీ, అహల్య, గౌతమ్ తీసుకున్న ఎపార్ట్‌మెంట్‌కి మారిపోయాం.

అహల్య మొహం బాగా కోలగా అయిపోయి, కళ్ళు మరీ పెద్దవిగా... ఏమిటో పోలికే మారిపోయినట్లయిపోయింది. ఇదివరకు ఉండే సహజ మందహాసం మాయమయిపోయిందెందుకో! ఒక్క ఏడాదిలోనే పదేళ్ళ పెద్దరికం వచ్చేసింది. పెళ్ళయితే అలా మారిపోతారేమో!

అమ్మ నాపెళ్ళి గురించి నాన్నగార్ని సాధిస్తూనే ఉంటుంది.

"యమ్.ఏ అయి ఉద్యోగంలో చేరగానే చూస్తాగదా!" అంటారు నాన్నగారు. తను రిటైర్ అయినప్పుడు వచ్చే డబ్బుతో పెళ్ళి చెయ్యొచ్చని. అప్పటికి శేషు బి.టెక్. కూడా అయిపోతుంది కదా!

"శివానీ లేకపోతే మనిద్దరి మధ్యా మాటలే ఉండవు కదా!" అహల్య అంటుంటే ఒక్కసారి ఆలోచనల్లోంచి బైటకి వచ్చాను.

గార్డెన్‌లో ఉన్న చిన్న చెరువు కట్టమీద కూర్చుని కాళ్ళు ఊపుతూ, దొరికిన చిన్న చిన్న రాళ్ళని నీళ్ళలోకి విసురుతూ - మధ్య మధ్య మౌనాన్ని భంగపరుస్తున్నాం.

"రాళ్ళు వెయ్యడం తో ప్రశాంతంగా ఉన్న చెరువులో ఎంత కల్లోలం రేగుతుందో చూశావా అహల్యా?" ఇంకో రాయి విసురుతూ అన్నాను.

"అప్పుడప్పుడు దేముడు కూడా ప్రశాంతంగా ఉన్న జీవితాన్ని ఇలాగే అల్లకల్లోకం చేస్తూ ఉంటాడు." అహల్య గద్గద స్వరంతో అన్న మాటలకి చటుక్కున ప్రక్కకి తిరిగాను.

"హాయ్! సమీరా!" మమ్మల్నిద్దర్నీ తప్పుకుని కట్టమీద నుంచి కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ కేసి వెళుతున్న మా క్లాస్ మేట్స్...." లైబ్రరీకి వస్తావా?" అని అడిగారు.

"హాయ్! నేను అరగంటలో క్లాస్‌కి వస్తాను. మీరు వెళ్ళండి." బై అని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

"శివానీ మెయిల్ ఏమైనా ఇచ్చిందా?" అహల్యకి ఇంటి దగ్గర కంప్యూటర్, బ్రాడ్ బాండ్ కేబుల్ కనెక్షన్ ఉంది. గౌతమ్ శని, ఆదివారాల్లో కూడా దానిముందు కూర్చుని ఆఫీసు పని చేసుకుంటాడు. అప్పటికి అహల్య గద్గద స్వరంతో అన్నమాట మర్చిపోయాను. అహల్య కూడా "హమ్మయ్య" అనుకున్నట్లుంది. వెంటనే టాపిక్ మార్చేసింది. "తను రోజూ ఇస్తుంది. నేనే కంప్యూటర్ ఖాళీ లేక లేట్ చేస్తుంటాను. గౌతమ్ పడుకున్నప్పుడు తప్ప దాని దగ్గరే వేళ్ళాడుతుంటాడు, తెల్లవారు ఝామునే లేచి చూసుకోవాల్సిందే నేను. ఇంతకీ... మా ఇంట్లో అంతా బావున్నార్ట. శివానీ వాళ్ళ నాన్నగారు మాత్రం లిక్విడ్స్ కూడా మింగలేకపోతున్నారట. ఈ సంవత్సరం గడవడం కష్టమే అంటోంది. ఈ ఆగస్టులో పెళ్ళి చేసుకుంటారట రుద్ర, తనూ! వాళ్ళ అన్నా, వదిన అప్పటికి వస్తామని అన్నార్ట. 'పెళ్ళి అయేవరకైనా నాన్నగారుంటే బాగుండును' అనుకుంటోంది".

"అందరికీ పెద్దవాళ్ళు అత్యుత్సాహంతో చేస్తారు పిల్లల పెళ్ళి. శివానీ అన్నీ తనే చూసుకోవాలి. తలిదండ్రులు చేసే పనులు కూడా తనే. వాళ్ళ అన్న సమయానికి వస్తాడేమో! వచ్చే ఆదివారం భవానీ వాళ్ళింటికి వెళదామా?" వెళదామన్నానే కానీ అహల్య వస్తుందన్న నమ్మకం లేదు. శివానీకి, భవానీకీ రూపంలో కానీ స్వభావంలో కానీ పోలికే లేదు. భవానీ లావుగా పొడుగ్గా అంతా వాళ్ళ నాన్నగారిలా ఉంటుంది. చిన్న పిల్లల క్రింద తీసి పడేస్తుందో... లేక మాతో మాట్లాడ్డానికి విశేషాలుండవో కానీ.... రెండు మాటలు మించి మాట్లాడదు.

తనేమో... తన ఎలిట్ సొసైటీ ఏమో! హైదరాబాద్ వచ్చాక, నా బలవంతం మీద ఒక్కసారి వాళ్ళింటికి వచ్చింది అహల్య. భవానీ వాళ్ళిల్లు బంజారా హిల్స్‌లో ఉంది చాలా దూరం... రెండు బస్సులైనా కనీసం మారి వెళ్ళాలి.

మా ఊర్లో ఎక్కడికైనా నడిచి, లేదా సైకిల్ మీద వెళ్ళిపోయే వాళ్ళం. నా అదృష్టం బాగుండి అహల్య వాళ్ళిల్లు మా హాస్టల్‌కి దగ్గరగానే ఉంది. నడవలేకపోతే, ఒక బస్టాప్ తర్వాత దిగిపోతే వాళ్ళిల్లు వచ్చేస్తుంది.

"నాకు ఇంక శని ఆదివారాలు కూడా టైం ఉండదు. ప్రాజెక్ట్ వర్క్ ఒకటి ఉంది. ఎగ్జామ్స్ అవగానే మనూరు వెళదాం. అమ్మా వాళ్ళని కూడా చూడాలి." అహల్య నుంచుంటూ అంది. నేను కూడా లేచి, కుర్తాకి అంటిన మట్టి దులుపుతూ... "సరే! మళ్ళీ సోమవారం కలుద్దాం. నేను కూడా లైబ్రరీలో గడపాలి, ఈ రెండురోజులు" అన్నాను.

ఇద్దరం ఎవరి డిపార్ట్‌మెంట్‌కి వాళ్ళు వెళ్ళిపోయాం.

శివానీకి కూడా అహల్య లాగే బి.యస్.సిలో ఫస్ట్‌క్లాస్ వచ్చినా , ఇల్లు వదిలి ఎక్కడికీ వెళ్ళే అవకాశం లేదు కదా! అన్నింటా తానే అయి చూసుకోవాలి. వాళ్ళ డాడీ పరిస్థితి మరింత క్షీణించింది. మమ్మీ ఇంకొంచెం స్తబ్దుగా అయింది. రుద్ర తన క్వార్టర్స్‌లో ఉంటున్నా రోజూ వచ్చి చూస్తుంటాడు.

శివానీ రోజూ ఆఫీసుకు వెళ్ళి అన్ని వ్యవహారాలూ చూసుకుంటోంది. కరస్పాండెన్స్‌లో యం.బి.ఏ చేస్తోంది.

"సమీరా! నీకు ఫోన్" స్నానానికి వెళ్ళబోతున్న దాన్ని ఆగి ఫోనందుకున్నాను. ఎమర్జెన్సీకి మా రూమ్మేట్ సెల్ నంబరిచ్చాను. ఇదే మొదటి సారి ఆ నంబర్‌కి ఫో రావడం.

"హలో!" చేతులు వణుకుతున్నాయి.

"మీరా! డాడీ ప్రొద్దున్నే వెళ్ళిపోయారు." శివానీ అంత దుఃఖంలోనూ స్థిరమైన కంఠంతో అంది.

"సారీ! శివానీ మేం పన్నెండుకల్లా అక్కడుంటాం."

"అంత ఖంగారు పడకండి. అన్నయ్య రేపు మధ్యాహ్నానికి కానీ రాడు. మీరు రేపు ప్రొద్దున్నకి రావచ్చు." శివానీ ఫోన్ పెట్టేసింది. ఇంకా ఎంత మందికి చెయ్యాలో!

నేను గబగబా స్నానం చేసేసి, పబ్లిక్ బూత్ నుంచి అహల్యకి ఫోన్ చేశాను.

"రాత్రి పదకొండింటికి మా ఇంటి దగ్గర్నుంచే 'బస్' బయలుదేరుతుంది. నేను టికెట్స్ కొంటాను. నువ్వు క్లాసెస్ అవగానే ఇంటికొచ్చేసెయ్" అహల్య కూడా హడావుడేం పడకుండా మాట్లాడింది.

"మరి నీ క్లాసులు?"

"ప్రొద్దున్న థియరీ అవగానే ఫ్రీయే. నా లాబ్ వర్క్ ఈ వారంది కూడా కంప్లీట్ చేసేశాను. ఇంట్లో కూర్చుని థీసిస్ వర్క్ చూసుకుందామనుకున్నా కదా! రాత్రిలోపు చేసేస్తాలే" అహల్య ప్రాజెక్ట్‌కి థీసిస్ సబ్మిట్ చెయ్యాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే ధైర్యం శివానీకి, అహల్యకు కూడా ఉంది.

అహల్యతో మాట్లాడాక నేను కూడా కొంచెం కుదుట పడ్డాను. డిపార్ట్ మెంట్‌కి వెళ్ళి క్లాసెస్ అటెండయి, లైబ్రరీకి వెళ్ళి రిఫరెన్స్ పుస్తకాలు రెండు తెచ్చుకుని, నోట్స్ తయారు చేసుకున్నాను. చాలా మంది ఎం.ఏకి నోట్స్ ఏంటి అనుకుంటారు. ఏ సబ్జక్టయినా సైంటిఫిక్ గా, ఎనలిటికల్‌గా చదివితేనే పట్టుసాధించగలమని నానమ్మకం. పైగా రాస్తూ ఉంటేనే, పరీక్షల్లో రాయడానికి స్పీడు వస్తుంది నాకైతే!

అలా చదువుకుంటూ, రాస్తూ.... సాహిత్య మథనం చేస్తుంటే సమయం ఎలా గడిచిపోయిందో తెలియలేదు. అంత పనిలో ఉండడంతో – శివానీ గురించి ఆలోచించడానికి కూడా టైం లేకపోయింది.

తొమ్మిదింటికల్లా డైనింగ్ హాల్‌కి వెళ్ళి భోంచేసి, అహల్య వాళ్ళింటికేసి నడక మొదలుపెట్టాను.

నడుస్తూ ఉంటే కొంచెం టెన్షన్ తగ్గినట్లు అనిపించింది. హాండ్ బాగ్ తప్ప చేతిలో ఏం లేదు కనక త్వరగానే నడుస్తున్నాను. నాకు, అహల్యకి కూడా మా ఊర్లో కొన్ని బట్టలుంటాయి. బస్సెక్కి వెళ్ళిపోవడమే.

పదిహేను నిముషాల్లో అహల్య వాళ్ళింట్లో ఉన్నాను. మా కాంపస్‌లో నడుస్తూ ఉంటే చెట్ల కొమ్మలు ఊగుతూ పలకరిస్తుంటాయి. పగలైతే అప్పుడప్పుడు ఆకులు మీదపడుతూ... గుత్తులు గుత్తులుగా ఎర్రని ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్ పువ్వులు ప్రకృతి కాంత కట్టుకున్న ఆకుపచ్చ చీరమీద ఎర్రపువ్వుల్లా మెరుస్తూ.... చల్లని గాలి సేద తీరుస్తూ... ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. వీధి దీపాల ఫ్లోరసెంట్ కాంతిలో ఇంజనీరింగ్ కాలేజి బిల్డింగ్ తళతళ మెరుస్తూ కనిపించింది. వచ్చి ఎనిమిది నెలలవుతున్నా మా కాంపస్ ఇంకా కొత్తగానే ఉంటుంది నాకు.

రాత్రి యూనివర్సిటీ కాంపస్‌లో అంత ఎక్కువ ట్రాఫిక్ ఉండదు. అక్కడక్కడ వాకింగ్ చేసే వాళ్ళూ, లైబ్రరీలోనో ... లాబ్‌లోనో లేట్‌గా పని చేసుకుని ఇళ్ళకీ, హాస్టల్స్‌కీ వెళ్ళేవాళ్ళు తప్ప అంతగా సిటీలో ఉన్న రొద ఉండదు.

ఎన్.సి.సి ఆఫీసు దాటి... ఎడం వేపుకి తిరిగి దేశ్‌ముఖ్ కాలనీలో అహల్య వాళ్ళింటి వెళ్ళి, ఎపార్ట్‌మెంట్ లిఫ్ట్ దగ్గర నించున్నాను. అప్పుడే గౌతమ్ కూడా లోపలికి వస్తూ కనిపించాడు.

"ఏంటి ఇంత రాత్రప్పుడు వస్తున్నావు? ఇక్కడే పడుకుంటావా?" గౌతమ్‌కి తెలీదన్నమాట. "శనివారం కదా! ఇవాళ కూడా ఆఫీసేనా? " అదే అడిగాను.

"ప్రాజెక్ట్ కంప్లీషన్‌కి వచ్చింది. రోజూ పదకొండవుతోంది. ఇంకా వీకెండ్ అని ఇవాళ త్వరగా బైటపడ్డాను." ఆఫీస్ పని బాగా ఎక్కువగా ఉందో ఏమో గానీ ఇక్కడికి వచ్చినప్పట్నుంచీ గౌతమ్ కొంచెం సీరియస్‌గా ఉంటున్నాడు. నాతో చదువు సంగతీ, ఏమైనా డబ్బు

కావాలా అని అడగడం తప్ప ఎక్కువగా మాట్లాడట్లేదు. పెళ్ళివరకూ.. పెళ్ళిలో కూడా చాలా సరదాగా ఉన్నాడు. ఎప్పుడో తీరిక చూసుకుని కనుక్కోవాలి. శాంత పిన్ని చెప్పినట్లు ఎప్పుడూ "నాగవల్లి" హడావుడిలోనే ఉంటున్నాం.

పెళ్ళిళ్ళలో ఆఖరి తంతు నాగవల్లి. మా అమ్మా, శాంత పిన్నీ వాళ్ళ పెళ్ళిళ్ళప్పుడు మూడు రోజులు జరిగేవట పెళ్ళిళ్ళు. మూడోరోజు నాగవల్లి వెళ్ళేవాళ్ళు బట్టలు అవీ సర్దుకోవడాలు, ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వెళుతుండడం, పెళ్ళికూతురికి అప్పగింతలూ, జాగ్రత్తలూ చెప్పడం కొంత అలవాటయిన మగపెళ్ళివారు హాస్యాలు చెయ్యడం.... పెళ్ళిలో ఇది సరిగా లేదు, అది బాగాలేదు అని సాధించడం.... అమ్మాయి అత్తారింటికి వెళుతోందని బాధపడ్డం.... అన్ని రకాలుగా సందడి, హడావుడి ఉంటుందని... శాంత పిన్ని అలా అంటుండేది.

అమ్మమ్మగారి ఊర్లో ఆరిళ్ళలోను ఎక్కడో అక్కడ 'నాగవల్లి' హడావిడి ఉంటుండేది. అంత టెన్షన్‌లోనూ అమ్మమ్మగారి ఊర్లో గడిపిన రోజులు తలుచుకుంటే నవ్వొచ్చింది.

"ఏంటీ! చాలా హుషారుగా ఉన్నావు?" గౌతమ్ లిఫ్ట్‌లోకి వెళుతూ అడిగాడు.

"హుషారా... పాడా! ప్రొద్దున్నించీ తలపగిలిపోయేంత టెన్షన్‌గా ఉంది. ఇప్పుడే అమ్మమ్మగారిల్లు గుర్తుకు వచ్చి కొంచెం పెదవులు విచ్చుకున్నాయి." నేను లిఫ్ట్‌లోకి వస్తూ అన్నాను. లోపలికి రాగానే గౌతమ్ తలుపులేశాడు. ఒక్కసారి ఆందోళనగా నాకేసి చూశాడు.

"అహల్య బాగానే ఉంది కదా! నేను పని ఎక్కువగా ఉండి సెల్ ఆఫ్ చేసి కూర్చున్నాను," ఎప్పుడూ అహల్య గురించే ఆలోచించే గౌతమ్‌ని చూస్తే నాకు ముచ్చటేసింది. వాళ్ళిద్దరూ బాగానే ఉన్నారన్నమాటే! సిటీలో బిజీలైఫ్...... ఆఫీస్‌లో కట్‌త్రోట్ కాంపిటేషన్ తోనూ అదోలా ఉంటున్నాడేమో! అంతంత డబ్బు సంపాదిస్తున్నారు కానీ జీవితంలో ఉండాల్సిన అనుభూతుల్ని కోల్పోతున్నారేమో ఈనాటి యువత? నిజంగా పురోభివృద్ధి సాధిస్తున్నామా? ప్రవాహంలో పడికొట్టుకుపోవల్సిందేనా?

"మీరా! ఏమయింది? అలా ఎక్కడికో వెళ్ళిపోతావేంటి! అహల్యకేం కాలేదు కదా!" గౌతమ్ ఒక్కసారి కుదిపాడు. వాళ్ళ అంతస్థురాగానే తలుపు తీసి లిఫ్ట్ లోంచి బైటకి వచ్చాం.

"అహల్య బాగానే ఉంది. శివానీ వాళ్ళ ఫాదర్ పోయారు. ఇప్పుడు బస్‌లో ఊరికి వెళుతున్నాం, ఇద్దరం."

"అయ్యో! అలాగా! నేను కూడా వస్తా." సెల్ తీసి ఏవో నంబర్లు నొక్కాడు. నేను కాలింగ్ బెల్ నొక్కాను. వెంటనే అహల్య తలుపు తీసింది.

గౌతమ్ వాళ్ళ బాస్‌తో మాట్లాడుతున్నాడు. "ఓ ష్యూర్! నేను మండే మార్నింగ్ ఆఫీస్‌కి వచ్చేస్తా. అహల్యా! నాదొక డ్రెస్ కారీ బాగ్‌లో పెట్టు." అంటూ బాత్ రూములోకి వెళ్ళిపోయాడు.

"మరి టికెట్స్ మనకే కొన్నావేమో! దొరుకుతుందా?" నా సందేహం.

"ఎందుకైనా మంచిదని మూడు కొన్నాను. గౌతమ్ బాగ్ కూడా సర్ది పెట్టాను. మనం వెళ్ళేలోపు ఇంటికి వస్తే... మనతో వస్తాడని అనుకున్నా." అహల్య మాటలకి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. భర్తలాగా ఆలోచించే భార్య, భార్య మనసులో మాట గ్రహించే భర్త ఉంటారని చదవడమే కానీ ఎప్పుడూ చూడలేదు. ఇప్పటి జీవన ప్రవాహ వేగంలో ఇలాగే ఉండాలేమో! ఎందుకంటే చర్చించుకోడానికీ, మాట్లాడుకోడానికీ సమయం ఉండదు కదా!

తెల తెలవారుతుండగా మా ఊరు చేరింది బస్సు. నేనూ, అహల్యా ఒక సీట్‌లో, గౌతమ్ వెనకాల సీట్లో కూర్చున్నాం. ఇద్దర్నీ ఒకే సీట్‌లో కూర్చోపెట్టాలని ప్రయత్నం చేశాను. ఒకళ్ళ ప్రక్కన ఒకళ్ళు కూర్చుంటే కష్టం, సుఖం మాట్లాడుకుంటారు కదా అని. గౌతమ్ ససేమిరా ఒప్పుకోలేదు. తగినట్టుగానే వెనక సీట్లో ప్రక్కన ఇంచుమించు నలభయ్యేళ్ళున్న మగాడి కొచ్చింది.

చాలాసేపు ఇద్దరం శివానీ గురించి... మా స్కూలు రోజుల గురించి చెప్పుకున్నాం. ఇప్పుడు ఆలోచిస్తుంటే పజిల్‌లో అన్నీ ఎక్కడి వక్కడ పెట్టినట్లు అతికి పోతున్నాయి. మేం స్కూల్లో చదివినన్ని రోజులూ శివానీ వాళ్ళింటికి వెళుతూనే ఉండేవాళ్ళం. ఇంటర్‌లో చేరాక కొంచెం, డిగ్రీ చదువుతుండగా పూర్తిగా ఆగిపోయింది. వాళ్ళనాన్నగారికి, అమ్మకీ కూడా జబ్బు పెరుగుతూ ఉంటే...... మేం వాళ్ళింటికి వెళ్ళడం తగ్గిపోతూ వచ్చింది. ఏదో సమస్య ఉందని మాకు తెలీకుండా, శివానీ ఎలా నెగ్గుకొచ్చిందో...... రోజులో సగం పైగా కలిసే ఉండేవాళ్ళం..... అంత మబ్బుగా ఎలా ఉన్నామో తలుచుకుంటే వింతగా అనిపిస్తుంది.

బస్సు దిగాక గౌతమ్ హోటల్‌కి వెళతానన్నాడు. అహల్య వాళ్ళ ఇల్లు చిన్నదని ఎప్పుడూ హోటల్లోనే దిగుతాడు. "మా ఇంట్లో దిగచ్చు కదా" అని ఒకటి రెండు సార్లడిగాను.

"ఎందుకే మీకు ఇబ్బంది? అయినా మీ ఇంట్లో దిగితే వాళ్ళు ఫీలవుతారు. హోటల్లో అయితే ఏం ప్రాబ్లం ఉండదు." గౌతమ్ మాటలకి నేను ఏం రెట్టించలేదు. మా ఇంట్లో కూడా తనకేం సదుపాయాలుండవు కదా!

అహల్య, వాళ్ళింటికి, నేను మా ఇంటికి వెళ్ళిపోయాం.

"తొమ్మిదింటికల్లా శివానీ వాళ్ళింటి దగ్గర కలుద్దాం." అంటూ గౌతమ్ హోటల్ కేసి వెళ్ళిపోయాడు.

మరి అహల్య వాళ్ళింటికి వెళ్ళడా? శివానీ వాళ్ళింటికి వెళ్ళాలని వచ్చాడు కదా! అందుకే అయుంటుంది. ఎక్కడో ఏదో ఏమూలో మనసులో పీకుతోంది. అహల్య, గౌతమ్ పూర్తిగా ఫార్మల్‌గా ఉన్నట్లనిపిస్తోంది.

ఏమిటో ఏమీ అర్థం అవట్లేదు.

అమ్మ, గుమ్మంలో అడుగుపెడుతూ ఉండగానే ఆదుర్దాగా ఎదురొచ్చింది.

"ఏవండీ! మీరా వచ్చింది. ఏంటిలా హఠాత్తుగా వచ్చావు. సెలవులేం లేవు కదా? వంట్లో ఎలా ఉంది? అక్కడేం గొడవల్లేవు కదా!" ప్రశ్నలమీద ప్రశ్నలు 'హైదరాబాద్' అంటే ఎప్పుడూ గొడవలు జరుగుతుంటాయని మా ఊర్లో అందరికీ ఒక అభిప్రాయం.

"ఏం లేదమ్మా! కంగారుపడకు." అంటూ శివానీ వాళ్ళ నాన్నగారి సంగతి చెప్పాను. ఎవరికీ ఆయన జబ్బుతో బాధపడుతున్నారని తెలీదు. నేను కూడా ఎప్పుడూ చెప్పలేదు.

"అయ్యో అలాగా? పాపం! ఆయన పోతే ఆయన దగ్గర పనిచేసే వందల మందికి కష్టమేనే. వాళ్ళ అబ్బాయి కూడా దూరంగా ఉన్నాడు." నాన్నగారు పెరట్లోంచి వస్తూ అన్నారు.

అప్పుడు చెప్పాను. "నాయుడుగారు నాలుగేళ్ళనుంచీ సిక్ అయి, రెండేళ్ళుగా కదల్లేని స్థితిలో ఉన్నారు" అని.

"శివానీయే వ్యాపారాలన్నీ చూస్కుంటోంది ఇన్నాళ్ళు. అందుకే మాతో పి.జి చెయ్యడానికి కూడా రాలేదు." నా మాటలకి అమ్మా, నాన్నా నోట మాట రానట్లు నిలబడిపోయారు.

"మేం కూడా రామా?" ఎలాగో గొంతు పెగుల్చుకుని అడిగారు నాన్నగారు.

"మీకు ఎవరూ తెలియదు కదా! శివానీ ఎలా ఉందో తెలీదు. వాళ్ళన్నయ్య విష్ణు ఎప్పుడు వస్తాడో తెలీదు. మీరు వస్తే మాత్రం అక్కడ ఎవర్ని పలకరించాలి? వద్దులెండి." దొడ్లోకి వెళుతూ అన్నాను.

స్నానం చేసి, బట్టలు మార్చుకున్నాక... అమ్మ ఏదైనా తింటేగాని వెళ్ళడానికి వీల్లేదంది. బలవంతంగా నాలుగిడ్లీలు తినిపించింది. ఇడ్లీ తిని, కాఫీ త్రాగుతుంటే లేచాడు శేషు. అప్పుడు టైము తొమ్మిది దాటింది.

"హాయ్! ఎప్పుడొచ్చావ్?"

"వచ్చి మూడు గంటలైంది. కుంభకర్ణుడి తమ్ముడిలా పడుకున్నావు. చదువెలా ఉంది?" వాడికేసి అనుమానంగా చూస్తూ అన్నాను.

"అయితే నువ్వు కుంభకర్ణివి, నేను నీ తమ్ముడ్ని అన్నమాట." అంటూ దొడ్లోకి వెళ్ళిపోయాడు. కళ్ళు అగ్నిపూలల ఉన్నాయి.

"రాత్రి వచ్చేసరికి పన్నెండు దాటుతుంది. 'ఫ్రెండ్స్ దగ్గర చదువుకుంటున్నా' అంటాడు." అంది అమ్మ వాడి పరుపు చుడుతూ.

"వాడి పక్కవాడెత్తుకోలేడా? నువెందుకు చెయ్యాలి? సెమ్ ఎక్జామ్స్‌లో ఎలా వచ్చాయి మార్కులు?" చిరాగ్గా అడిగాను.

"పొద్దుపోయి వచ్చి అలసటగా పడుకుంటాడు. చదువు ధ్యాసలో పడి తిండి కూడా సరిగ్గా తినట్లేదు. పోన్లేవే!" అమ్మ కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళుతూ అంది.

"తిండి తినట్లేదా! ఎక్కడైనా లాగించి వస్తున్నాడేమో! మొహం అదీ అలా ఉబ్బి ఉందేమిటి?" అమ్మా, నాన్నగారు వాడి గురించి పట్టించుకోవట్లేదేమో అనిపించింది. మగపిల్లాడైతే అలా వదిలేయడమేనా? నేను అరగంట ఆలస్యంగా వస్తే, అమ్మ నానా గొడవపెట్టేది.

"పరీక్షల్లో అరవైశాతం పైనే వస్తున్నాయే మార్కులు. రాత్రి చాలాసేపు స్నేహితుల దగ్గర చదువుకుని వస్తున్నాడు." నాన్నగారు కొంచెం సందేహంగా అన్నారు.

"మిగిలిన వాళ్ళకి ఎలా వస్తున్నాయో కనుక్కున్నారా? 'తెలుగు'లాగా కాదు. మిగిలిన సబ్జెక్ట్‌లలో ఎనభైకి మించి వస్తున్నాయి." ఇంజనీరింగులో చేరాడు కదా! ఇంక చెడిపోడానికి ఏముంటుందిలే అనుకుంటున్నారా? నాన్నగారికి సాహిత్య సమావేశాలు తప్ప ఏం పట్టవు కదా! నాకెందుకో శేషుగాడి ధోరణి నచ్చలేదు.

ఇంతలో శేషు మొహం తుడుచుకుంటూ వచ్చాడు. వెనకాలే కాఫీ గ్లాసుతో అమ్మ. ఏం వాడి కాఫీ గ్లాసు వాడు తెచ్చుకోలేడా? బాగానే ఉన్నాయి రాచమర్యాదలు.

"ఏంటి తల్లీ? ఇలా ఊడిపడ్డావు చెప్పాపెట్టకుండా?"

"ఏం? చెపితే కొంచెం జాగ్రత్తగా ఉండేవాడివా?" నా కంఠంలో అనుకోకుండా కరుకుదనం వచ్చేసింది.

"రాకరాక వచ్చావు కదా అని మర్యాద ఇస్తుంటే రెచ్చిపోతున్నావేంటి? వచ్చినపని చూసుకుని వెళ్ళు." విసురుగా అమ్మ చేతిలోగ్లాసు తీసుకుని వరండాలోకి వెళ్ళిపోయాడు.

అమ్మా, నాన్నగారు నిర్ఘాంతపోయి చూస్తుండి పోయారు.

నాకీసారి భయం వేసింది. ఏదో చెయ్యాలి అనుకుంటూ శివానీ ఇంటికి బయలుదేరాను.

శివానీ వాళ్ళ ఇంట్లోకి నేను అడుగు పెడుతూ ఉండగానే, గౌతమ్ కూడా ఆటోలో దిగాడు. అహల్య అప్పటికే వచ్చి శివానీ ప్రక్కన కూర్చుంది. వరండా నిండా జనం. అంతా నిశ్శబ్దం. ప్రమీల ఆంటీ మడత నలగని ఇస్త్రీ చీర కట్టుకుని అటూ, ఇటూ తిరుగుతున్నారు. శివానీ వాళ్ళ నాన్నగారి బాడీని కోల్డ్‌బాల్స్‌లో పెట్టారు. ఏ నిముషంలోనైనా వాళ్ళ అన్న, వదిన రావచ్చట. భవానీ బాక్స్ దగ్గరగా కుర్చీలో కూర్చుంది. రుద్ర ఎరేంజ్ మెంట్స్ అన్నీ చూస్తున్నాడు.

నేను నెమ్మదిగా వెళ్ళి శివానీ దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చున్నాను. నన్ను, అహల్యని పట్టుకుని ఒక్కసారి బోరుమంది శివాని. "నిన్నట్నుంచీ మాటా, మంతీ లేకుండా కూర్చుని ఉంది. మిమ్మల్ని చూడగానే ఆనకట్ట తెగిన ఏరైంది." ఎవరో అంటున్నారు.

"వాళ్ళు ముగురూ అక్కా చెల్లెళ్ళ కంటే ఎక్కువగా ఉంటారు మరి." శివానీ వాళ్ళ పక్కింటావిడ అంది. ఆవిడ రోజూ మమ్మల్ని పలకరిస్తూ ఉండేది.

శివానీ ఏడవడం మేమెప్పుడూ చూడలేదు. వాళ్ళ నాన్నగార్ని పసిపిల్లాడిలా సాకింది మూడేళ్ళగా!

ప్రమీలాంటీ శివానీ దగ్గర నుంచుని అయోమయంగా చూస్తోంది.

"నాకాకలేస్తోంది. బ్రేక్ ఫాస్ట్ పెట్టమను." శివానీ చెయ్యి పట్టుకుని లేపుతూ అంది. కళ్ళు తుడుచుకుని ఆంటీని లోపలికి తీసుకెళ్ళింది శివానీ.

రుద్ర, గౌతమ్ మా దగ్గరకి వచ్చారు. ఇద్దరం లేచి నుంచున్నాం.

"అంకుల్ చాలా ఫాస్ట్‌గా డిటీరియోరేట్ అయిపోయారు. ఒక రకంగా చూస్తే వెళ్ళిపోడమే మంచిదన్నారు డాక్టర్. ఇక మందులు కూడా ఎంత డోస్ పెంచినా పనిచెయ్యడం మానేశాయి. ఆఖరికి లిక్విడ్స్ కూడా మింగలేకపోయారు. చివరికి హార్ట్ మజిల్స్ అండ్ నెర్వ్స్ గే ఇన్" రుద్ర మాట్లాడుతుండగానే సెల్ మ్రోగింది.

"విష్ణు వాళ్ళు ఊర్లోకి వచ్చార్ట." మాతో అని గేటు దగ్గరికి వెళ్ళాడు.

"రుద్ర చెప్పింది నిజమే. పార్కిన్సన్ డిసీజ్ వచ్చినవాళ్ళు పది ఏళ్ళు, ఇరవై ఏళ్ళు బాధపడుతుంటారు. అన్నీ తెలుస్తూ, ఏమీ చెయ్యలేక... నిస్సహాయంగా.. ప్రతి దానికీ ఇతర్ల మీద ఆధారపడుతూ.... నరకం అనుభవిస్తారు. 'ఫాస్ట్ డిటీరియోరేషన్ బ్లెస్సింగ్ ఇన్ డిస్‌గైజ్' అంటారు డాక్టర్లు." అహల్య అంది మెల్లగా.

గేటు దగ్గర హడావుడి. భవానీ పరుగెత్తుకుని గేటు దగ్గరకి వెళ్ళింది. విష్ణు కారు దిగగానే వెళ్ళి అతన్ని గట్టిగా పట్టుకుని వెక్కుతూ ఏడవడం మొదలు పెట్టింది. విష్ణు, భవానీని తీసుకుని నాయుడుగార్ని పడుకోపెట్టిన బాక్స్ దగ్గరికి వచ్చాడు. వెనకాలే అతని భార్య, పిల్లలు రాలేదనుకుంటా. శివానీ కూడా లోపల్నుంచి వచ్చి అన్న ప్రక్కన నుంచుంది.

"థాంక్స్ ఫర్ టేకింగ్ కేర్ ఆఫ్ డాడ్" శివానీని చూస్తూ అన్నాడు.

అన్నేళ్ళుగా శివానీ చేసిన దానికి ఆ ఒక్కమాటతో చెల్లయిపోయిందా!

ఆ తర్వాత అన్ని పనులూ చకచకా జరిగిపోయాయి.

అమ్మ, నాన్నగారు, వాణి ఆంటీ, శివయ్యగారు.... నాన్నమ్మగారు కూడా వచ్చి చూశారు. వాళ్ళింట్లో ఎవరూ తెలియకపోయినా, శివానీతో ఉన్న అనుబంధం అలాంటిది. శేషుగాడు పత్తాలేడు.

శివాని వాళ్ళ అమ్మని చూసుకుంటూ ............రుద్రతో కలిసి అన్ని పనులు సవ్యంగా అయేలా చూస్తూ... అన్నింటా తానే అయి తిరిగింది. భవానీ కూడా అన్ని చోట్లా కనిపిస్తూ ఉండేది.... పనివాళ్ళ మీద పెత్తనం చెలాయిస్తూ....... విష్ణు దగ్గర కబుర్లు చెపుతూ..... చూడ్డానికి వచ్చిన ధనవంతులైన వారిని పలకరిస్తూ. భవానీ వాళ్ళ ఆయన వచ్చిన రోజు సాయంత్రమే వెళ్ళిపోయారు పిల్లల్ని తీసుకుని.

నేనూ, అహల్య రెండు రోజులుండి హైదరాబాద్ వచ్చేశాం.

హైదరాబాద్ వచ్చాక వారం రోజులుకి కానీ మామూలుగా అవలేకపోయాం. నాకు తెలిసీ బాగా పరిచయం ఉన్నవాళ్ళు పోవడం ఇదే మొదలు. చాలా రోజులు ఉయ్యాల బల్లమీద కూర్చుని మమ్మల్ని పలకరించే నాయుడుగారు గుర్తుకొస్తుండేవారు. జబ్బుగా ఉన్న ఆయన్ని ఒక్కసారేగా నేను చూసింది మరి.

నేనూ, అహల్యా అప్పుడప్పుడు కలుస్తూ మొత్తానికి ప్రీవియస్ పరీక్షలు అయాయనిపించాం. ఆఖరి పరీక్ష రాసి హాస్టల్ కొచ్చాను.

"సమీరా! నీకు ఫోన్" రూమ్మేట్ పిలుపు విని వణుకుతూ సెల్‌ఫోన్ అందుకున్నాను.

## 9

**"సమీరా!** నీకు ఫోన్" అనగానే వినకూడనిది వినాల్సివస్తుందేమోనని భయం. కాళ్ళు, చేతులు వణుకు.. గుండె దడ. అహల్యకీ, శివానీకి ఉన్న ధైర్యం, దేన్నయినా ఎదుర్కోగలిగే శక్తి భగవంతుడు నాకెందుకివ్వలేదో!

"మీరా!" శివానీ గొంతు మధురంగా వినిపించింది.

"ఇవాళ బయలుదేరి వచ్చేస్తున్నారా మీరిద్దరూ? మూడురోజుల్లో నా పెళ్ళి"

"అదేంటి? అంత తొందరగా?" ఎప్పట్నుంచో అనుకుంటున్నదే అయినా ఏంటో కంగారుగా అనిపించింది.

"అన్నయ్య వాళ్ళు వస్తున్నారు రేపు. మళ్ళీ వన్ ఇయర్ వరకు రాలేరుట. అందుకే రుద్ర ఇప్పుడే అంటున్నాడు. మామయ్య వాళ్ళుకూడా సరే అన్నారు." చాలా కాలం తర్వాత శివానీ గొంతు యాంత్రికంగా కాకుండా సహజంగా అనిపించింది.

"కంగ్రాజులేషన్స్! రేపొద్దున్నకి మేం అక్కడుంటాం. అహల్యకి ఫోన్ చేశావా?"

"ఆ! నీక్కూడా బస్‌కి టికెట్ కొంటానంది. తయారయి వాళ్ళింటికి వెళ్ళు." శివానీ ఫోన్ క్లిక్ అంది.

ఫోన్ రూమ్మేటుకిస్తూ విషయం విషయం చెప్పాను.

"గుడ్! అయితే సెలవుల్లో మంచి టైమ్ పాస్ అన్నమాట. మరి మీ మారేజ్ ఎప్పుడు?" తనకి మా ముగ్గురి సంగతీ తెలుసు. ఎప్పుడూ బోర్ కొట్టిస్తూ ఉంటాను.

"ఏదీ! ఇంకా మిస్టర్. ఫర్‌ఫెక్ట్ దొరకాలి కదా!" నవ్వుతూ బట్టలు సర్దుకోడానికి బాగ్ తీశాను. ఇంచు మించు రెండు నెలలు ఉండాలి ఇంటి దగ్గర.

✡ ✡ ✡

ఈసారి ఆనందంగా బస్‌లో కూర్చున్నాం. గౌతమ్ దగ్గరనుండి ఎక్కించాడు. తను పెళ్ళిరోజుకి వస్తానన్నాడు. కనిపించినంత వరకు బస్‌లోంచి చూస్తూనే ఉంది అహల్య.

"తల్లీ! కాస్త ఇటు చూస్తావా? రెండ్రోజుల్లో నీ కళ్ళముందుంటాడు నీ విభుడు."

"అబ్బే. అదేం లేదే" తత్తరపడుతూ అంది అహల్య.

"నీ పద్యాలు, వివరణలు విని చాలా రోజులైంది. ఏదీ ఒకటి వదులు."

"ఓ తప్పకుండా. ఇన్నాళ్ళు సరైన శ్రోతలు లేక నా గొంతు మూగవోయింది." గొంతు సవరించుకున్నాను.

సన్నగా అహల్యకి మాత్రమే వినిపించేలా, రాగయుక్తంగా అందుకున్నాను.

"భూషలు గావు మర్త్యులకు భూరి మయాంగద తాపశిరముల్.
భూషిత కేశ పాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్
భూషలు గావు పురుషుని భూషితు జేయుఁ బవిత్ర వాణి, వా
గ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశించు నన్నియున్."

ఎక్కడ ఆపాలో అక్కడ ఆపి, చేతులతో అంటున్న మాటలకి రూపం ఇవ్వడానికి ప్రయత్నిస్తూ, ఏ పదాన్ని వత్తిపలుకుతే అర్థయుక్తంగా ఉంటుందో ఆ పదాన్ని వత్తి స్పష్టంగా పాడాను.

అహల్య చిన్నగా చప్పట్లు కొట్టింది, నాకు మాత్రమే వినిపించేలా.

"చిన్నప్పుడు గౌతమ్ అన్నయ్య బట్టీ కొట్టించిన పద్యాల్లో నాకు చాలా ఇష్టమైంది. ఈ పద్యం నేర్చుకోగానే నాకు నువ్వే గుర్తుకొచ్చావు. అదే అన్నాను అన్నయ్యతో. అప్పటినుంచీ నీ మీద కుతూహలం పెంచుకున్నాడనుకుంటాను." నవ్వుతూ అన్నాను.

కొద్దిగా తలవంచుకుని సిగ్గుగా నవ్వింది అహల్య.

"నిజం అహల్య.. నీకు ఏ భూషణం పెట్టినా, ఆ భూషణం గర్వపడుతుంది. తన 'కేశపాశ భారం' అధికమయిన సరస్వతీ దేవి నీకు సగం ఇచ్చిందేమో! అందుకే 'పుష్ప సుగంధ జలాభిషేకముల్' లేకుండానే కేశాలు సహజ సౌందర్యంతో మెరుస్తూ ఉంటాయి.

ఇంక నీ 'వాగ్భూషణం' గురించి చిన్నప్పటినుంచీ తెలుసున్నదే కదా! ఒక్కమాట అధికంగా, అనవసరంగా, పరుషంగా పలికావా ఎప్పుడైనా? బ్రహ్మకి తన పుత్రిక అహల్యని మళ్ళీ పుట్టించాలని సరదా పుట్టి నిన్ను పుట్టించాడేమో!" ప్రొద్దున్న రాసిన పరీక్ష తాలూకు ఛాయలు ఇంకా వదల్లేదేమో, అనర్గళంగా అనేశాను. మేం ఎప్పుడూ ఇతర్ల గురించి చెడ్డగా ఎలా చెప్పుకోలేదో, అట్లాగే ఎదురుగా ఒకర్నొకరు పొగుడుకోలేదు కూడా! ఇవాళ ఎందుకో ఆవేశంలాగ వచ్చేసింది.

అహల్య కొంచెం నిర్ఘాంతపోయి నట్లుంది, నాకొత్త రకం మాటలకి మొహమాటంగా, కిటికీ కేసి తలతిప్పేసింది.

వెనకాల సీట్లోంచి చప్పట్లు వినిపించాయి. వెనక్కి తిరిగి చూస్తూ అనుకున్నాను. "ఇంకా ఎంతమందికి వినిపించాయో?"

"ఇంక ఎవరికీ వినిపించలేదు లెండి. నేనయినా, సరిగ్గా మీ ఫ్రెండు వెనకే కూర్చున్నాను. పైగా నా బుక్ కింద పడిపోతే ముందుకి వంగి తీస్తూ, మీ సీటుకి దగ్గరగా వచ్చాను కనుక వినగలిగాను. అందరికీ ఆ అదృష్టం పడుతుందా." నా మనసులో మాట వినిపించినట్లుగా వెనకాల సీట్లో ఉన్నతను అన్నాడు.

"మీ పద్యం పాడిన విధానం దాన్ని వివరించి మీ ఫ్రెండుకి అన్వయించిన తీరు... అన్నింటినీ మించి మీ కంఠస్వరం ...ఫాంటాస్టిక్."

"థాంక్స్" అంటూ, ఆ మాటలు అన్న వ్యక్తిని పరిశీలించి చూశాను. ఇరవయ్యేడు ముప్ఫయి మధ్య ఉంటుంది వయసు. జుట్టు ముందు భాగంలో కొద్దిగా ఊడి జరిగినట్లుంది.. నుదురు విశాలంగా ఉంది. మిలమిలా మెరిసే కళ్ళు తప్ప మిగిలిన మొహం సామాన్యంగా ఉంది. నవ్వినప్పుడు తళుక్కుమన్న పలువరస అతనికి 'భూషణమే' అయింది.

"ఏంటి? నాకున్న భూషణాలు చూస్తున్నారా?" అమ్మో! డేంజరస్ ఫెలో లాగున్నాడే నా మనసుని పుస్తకంలా చదివేస్తున్నాడు.

ఇంత సంభాషణ జరుగుతున్నా.. అహల్య కిటికీ కేసి తలతిప్పి బైటకి చూస్తోంది. కంట్లో ఏదో నలక పడినట్లుంది. బాగ్ లోంచి టిష్యూ పేపరు తీసి కళ్ళు తుడుచుకుంటోంది. పొగిడానని బాగా కోపం వచ్చినట్లుంది! కాసేపు తన జోలికి వెళ్ళకుండా ఉంటేనయం

"అన్‌ఫార్చ్యునేట్‌లో మన దేశంలో కాంప్లిమెట్స్‌కి మంచి స్పందన లభించదులెండి." వెనక సీటతను నన్నూ, అహల్యనీ కూడా ఉద్దేశించి అన్నట్లు అనిపించింది. బస్సు పరిచయాలూ, రైల్లో స్నేహాలు.. మామ్మగ్గరికీ అంత నచ్చవు. అందులో అపరిచిత యువకుడితో!

వెనక్కి తిరిగి చిన్నగా నవ్వి 'కథామహల్' పుస్తకం తీశాను చదవడానికి.

✡ ✡ ✡

రాత్రి చాలాసేపు వీడియోలో ఏదో పిచ్చి సినిమా వేసి చావుగొట్టాడు బ్రహ్మాండం బద్దలయేలా డ్రమ్స్ చప్పుడుతో, అర్థంకాని.. అర్థంలేని మాటలున్న పాటలతో.. కళ్ళు నొప్పుట్టేలాంటి కదిలికలున్న డాన్సులతో అస్సలు నిద్రపట్టలేదు. అహల్య కోపం పోలేదనుకుంటా, మాట్లాడకుండా సినిమా చూస్తూ కూర్చుంది. మాట్లాడినా ఏమైనా వినిపిస్తుందా ఏమన్నానా?

ఆ సినిమా అయిపోయాక కూడా చాలాసేపు చెవులు చిల్లులు పడినట్లయిపోయింది. అప్పుడే కాస్త నిద్రలోకి జారుకుంటున్నానేమో. అహల్య తట్టిలేపింది. "మీరా! లే. ఊరొచ్చేసింది."

"అప్పుడేనా! ఇప్పుడేగా నిద్రపట్టింది." ఆవలిస్తూ లేచి బాగ్ దింపి క్రిందకు దిగాను. నా వెనకాలే అహల్య.

"గుడ్ మార్నింగ్". ఎవరా అని వెనక్కి తిరిగాను. రాత్రి నా పద్యాన్ని మెచ్చుకున్నతను. మసక వెలుతురులో పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుని నిల్చున్నాడు. కూర్చున్నప్పటి కంటే నుంచున్నప్పుడు బాగున్నాడు. ఆ నిల్చోడంలో ఒక రకమైన ఠీవి ఉంది. అప్పుడే ఉదయిస్తున్న సూర్యకిరణాలు కళ్ళమీద, పెదవుల మీద పడి తళుక్కుమన్నాయి.

అహల్య బస్ కండక్టరు దగ్గరుండి సామాన్లు దింపిస్తోంది.

కాస్త తత్తర పడుతూ "గుడ్ మార్నింగ్" అన్నాను.

"రాత్రంతా నిద్రపోయినట్లు లేరే! కదులుతూనే ఉన్నారు." ఏమిటి? ఇతనికి నన్ను చూడ్డం తప్ప పనిలేదా!

"నేను కూడా ఆ గందరగోళం సినిమా వల్ల పడుకోలేక పోయాన్లెండి " అదిగో! మళ్ళీ నేననుకుంటున్నది విన్నట్టుగా...

"పద మీరా! " అహల్య ఆటో మాట్లాడేసి, సామాన్లు పెట్టించేసి పిలిచింది.

అహల్య ఎక్కాక, నేనుకూడా ఆటో ఎక్కేసి అతని కేసి తిరిగి ఒక నవ్వు నవ్వాను. అతను మళ్ళీ కనిపిస్తే బాగుండును. ఆటో ముందుకి వెళుతుంటే వంగి వెనక్కి చూశాను. అతను అలాగే నుంచుని చూస్తున్నాడు.

✡ ✡ ✡

ఆటో చప్పుడుకి గుమ్మంలో ముగ్గువేస్తున్న అమ్మ లేచి నుంచుంది.

"మీరా!" అంది సంతోషంగా. "ఇవాళ వస్తావని అనుకున్నాను. మళ్ళీ పరీక్షలయాయో లేదో అని అనుమానం వేసింది. అహల్యా! బాగున్నావా? గౌతమ్ రాలేదా?" ఇద్దర్నీ ఒకేసారి పలకరిస్తూ, నా చేతిలో బాగ్ అందుకుంది. "పెళ్ళి టైముకి వస్తానన్నారత్తయ్యా! నేను మళ్ళీ వస్తా" అది వాళ్ళింటి కేసి వెళ్ళిపోయింది అహల్య.

"ఇవాళే పెళ్ళికూతుర్ని చేస్తున్నారట. నన్ను కూడా పిలిచింది శివానీ." అంటూ, ఇంట్లోకి దారి తీసింది అమ్మ.

వరండాలో పడక్కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతున్న నాన్నగారు లేచి "పరీక్షలు బాగా రాశావామ్మా?" అంటూ పలకరించారు. నాన్నగారు వచ్చే ఏడే రిటైర్ అవుతారు. కొంచెం లావయారు. అందుకేనేమో కుర్చీలోంచి మెల్లిగా లేచారు.

"శేషు ఏడీ?" వరండాలో కానీ, హాల్లో కానీ వాడి పరుపు, వాడు కనిపించలేదు. "సెమిస్టర్ పరీక్షలవుతున్నాయి. ఫ్రండ్స్ దగ్గర చదువుకుంటానని రాత్రి వెళ్ళాడు." నా సామాన్లు సర్దుతూ అమ్మ అంది.

"ఇవాళ్టికి వాడికీ నాకూ యుద్ధం తప్పింది" అనుకున్నాను.

అందరితోనూ ఎంతో ప్రసన్నంగా, స్నేహంగా ఉంటూ, నవ్విస్తూ మాట్లాడే నేను... అదేమిటో 'శేషు'ని చూడగానే చిరచిరలాడి పోతుంటాను. లోపం నాలోనే ఉందేమో!

అమ్మ ఇచ్చిన వేడి వేడి కాఫీ అందుకని వరండాలోకి వచ్చాను. నాన్నగారి కుర్చీ ప్రక్కనే, క్రింద కూర్చుని, గోడనానుకుని... ఒకసారి చుట్టు ప్రక్కల పరిశీలించాను. శివానీ వాళ్ళ డాడీ పోయినపుడు వచ్చాను... కానీ అంతగా గమనించలేదు. రెండురోజులు.. అంతా హడావుడి అయిపోయింది.

వీధి కాంపౌండు గోడ పై రెండు వరస ఇటికలూ కూలిపోయినట్లున్నాయి. గోడ పొట్టిగా అయిపోయింది. వీధివేపుకి ముళ్ళచెట్లు పెరిగి కొంచెం ఇంటికి మరుగు కల్పిస్తున్నాయి. మందారాలు, జాజులూ మాత్రం విరగపూచాయి. నాన్నగారు ఎప్పుడూ వాటికి సంరక్షణ చేస్తుంటారు కదా!

ప్రక్కన బాబాయి వాళ్ళిల్లు పడగొట్టేశారు. నేను లేచి గోడ దగ్గరగా వెళ్ళితొంగి చూశాను.

"డాబా వేసుకుంటున్నారు. అందాక ప్రక్కవీధిలో అద్దెకు తీసుకుని ఉంటున్నారు." నా వెనకే వచ్చిన అమ్మ అంది.

"ఎప్పటికైనా మా ఇల్లు కూడా డాబా అవుతుందా! శేషు పైకి వచ్చి బాగు చేయిస్తాడా? నా 'తెలుగు' యమ్.ఏ కి వచ్చే ఉద్యోగంలో నేనేమైనా చేయించగలనా?" అలా ఆలోచిస్తూ మందార చెట్టు దగ్గర చాలాసేపు నిలబడిపోయాను.

"ఏయ్! మీరా! ఇంకా అలాగే ఉన్నావేంటి? తొమ్మిదింటికి శివానీని పెళ్ళికూతుర్ని చేస్తున్నారు. అమ్మ చెప్పలేదా?" అహల్య ఇంట్లోకి వస్తూ హడావుడి చేసింది.

"అయ్యో! నేను టైం అడగలేదే పదిహేన్నిముషాల్లో తయారవనూ" అంటూ లోపలికి పరుగెత్తాను.

"రా! రా! అహల్యా. ఏంటి విశేషాలు? ఈ సెలవుల్లో పాలెం వెళుతున్నావా?" అమ్మ అహల్యని లోపలికి పిల్చి వంటింట్లో పీట వేసి కూర్చోపెట్టింది.

"గౌతమ్‌కి భోజనం ఇబ్బంది అవుతుంది అత్తయ్యా! వెళ్ళి ఒకవారం ఉంటాను. అత్తయ్య రమ్మని గొడవ పెడుతున్నారు. రాధ, సావిత్రి వస్తున్నార్ట, సెలవలకి"

"వెళ్ళేప్పుడు చెప్పమ్మా! నేను కూడా వస్తాను. అమ్మ పెద్దదైపోయింది. ఒకసారి చూడాలి. "అహల్యకి టీ గ్లాసు ఇస్తూ అంది అమ్మ. అహల్య టీ తాగుతోంది. తనకి హైద్రాబాద్ వెళ్ళాక 'టీ' అలవాటయింది, అది గౌతమ్‌కి కంపెనీ కోసమని.

"తప్పకుండా! కలిసే వెళదాం. మీరు రావట్లేదా శివానీ వాళ్ళ ఇంటికి?"

"వంట చేసేసి మీ వెనకాలే వచ్చేస్తాను."

వంకాయలు తరుగుతూ, మధ్యలో పులుసు కలియబెడుతూ అంది అమ్మ.

"మీ దగ్గర వంట త్వరగా ఎలా చెయ్యాలో నేర్చుకోవాలత్తయ్యా! రెండు అయిటమ్స్ చెయ్యడానికి గంట పడుతుంది నాకు."

"అనుభవం మీద అదే వచ్చేస్తుంది లేమ్మా! మొదట్లో అందరూ అంతే."

వాళ్ళ మాటలు వింటూ తయారైపోయాను. అహల్య గులాబీ రంగు చీరకి ఆకుపచ్చ బోర్డరున్న మైసూర్ సిల్క్ చీరలో మెరిసిపోతోంది. తన ప్రధానానికి గౌతమ్ అన్నయ్య స్వయంగా సెలెక్ట్ చేశాడు.

నాకు ఒకటే పట్టుచీర ఉంది. అది ఇప్పుడు కట్టేసుకుంటే మరి పెళ్ళికి? పైగా ఆ పట్టుచీర అహల్య పెళ్ళికి కట్టుకున్నాను. అంతకు ముందు కూడా ఊళ్ళో ఏ పెళ్ళయినా అదే చీర. సమీర కంటే ముందు, సమీర చీర వెళ్ళిపోతుందే పెళ్ళికైనా. అయినా చీరకేనా విలువ?

సౌత్ కాటన్ చీర కట్టుకున్నాను. గంధం రంగుకి మెరూన్ బార్డరు. సరిపడా గంజి పెట్టి ఇస్త్రీ చేయించి పెట్టింది అమ్మ. మా ఊరి వాతావరణానికి ఇలాంటి చీరలేనయం. నాకు అహల్యకున్నంత పొందిక ఎలాగాలేదు. అక్కడ ఏమైనా పనిలో సాయం చేస్తే... అంతా కుప్పగా ఎటూ చేసేస్తాను.

నాకున్న సన్నటి ఒంటిపేట గొలుసు పైకి వేసుకున్నాను. ఒక పుట్టినరోజుకి శివానీ, అమెరికన్ డయమండ్స్ పొదిగిన చిన్న లాకెట్ ఇచ్చింది. అది ఉండి ఉండీ జిగేల్ మని మెరుస్తోంది.

మా జాజి చెట్టు పూలని మూడు దండలుగా కట్టించింది అమ్మ. అహల్యా, నేనూ చెరొకటీ పెట్టుకున్నాము.

ఇద్దరం బైటకి వెళుతుంటే అమ్మ పిలిచింది. లోపలికి వెళ్ళాను. తన చేతికున్న బంగారు గాజుల జతని నాకు తొడిగింది. కుంకుడుకాయ పులుసుతో బాగా తోమినట్లుంది. ధగధగా మెరిసిపోతున్నాయి.

"ఎందుకమ్మా! నీ చేతికుండనీ." మొహమాటంగా అన్నాను.

"నేను నిన్ననే చేతినిండా ఎర్రగాజులు వేయించుకున్నాను. పైగా కొంచెం సేపే ఉంటాను కదా! ఫరవాలేదు." బలవంతం చేసి ఒప్పించింది.

వరండాలోంచి బైటికి వస్తుంటే అహల్య కళ్ళార్పకుండా నాకేసి చూస్తోంది. "ఏంటా చూపు?"

"నిన్న నువ్వు నన్ను వర్ణించావు కానీ, ఇప్పుడూ నువ్వెలాగున్నావో తెలుసా? నీ అంత బాగా నేను వర్ణించలేను అనుకో." అంది అహల్య. కొంచెం ఆశ్చర్యపోయాను. అందానికీ, నాకూ ఆమడదూరమని నా అభిప్రాయం.

"అప్పుడే విరిసిన సింహాచలం సంపెంగ పువ్వులా ఉన్నావు." సిగ్గుతో కాస్త బుగ్గలెర్రబడ్డాయనుకుంటా నాకు.

"ఇప్పుడు సరిగ్గా షేడ్ సరిపోయింది." అహల్య ఇంకా ఏదో అనబోయింది.

"ఇంక ఆపుతావా లేదా?" చిరుకోపంగా అన్నాను.

"ఏం? మరి నిన్న నువ్వు వర్ణించలేదా?"

"సరే! సరే! పద తల్లీ. మనం వెళ్ళేప్పటికి పెళ్ళికూడా అయిపోతుంది." గేటు తీశాను.

అప్పుడే శేషు లోపలికి వస్తున్నాడు. కళ్ళు ఎర్రగా, కళ్ళక్రింద ఉబ్బుగా... తెగ చదివేస్తున్నాడులావుంది.

మమ్మల్ని పలకరించలేదు సరికదా... అహల్యని చూసి తలవంచుకున్నాడు.

"గుడ్ మార్నింగ్ రా! బాగా చదువుతున్నావా?"

శేషు ఒక్కసారి కంగుతిని నాకేసి తలెత్తి చూశాడు. ఇంత సౌమ్యంగా పలకరిస్తోందేమిటా అని షాక్ తిన్నట్లున్నాడు. నేను, వాడితో మంచిగా ఉండి చూద్దామనుకున్నాను. వాడీ ధోరణి అనుమానంగా ఉన్నా!

"హాలో! శేషూ! సెకండ్ ఇయర్ సెం ఎక్జామ్స్ అవుతునాయా?" అహల్య అడిగింది.

"ఆ! ఆ! బాగా చదువుతున్నాను." తడబడుతూ అని లోపలికి వెళ్ళిపోయాడు.

"రాత్రంతా నైటవుట్ చేసి చదివినట్లునాడు... అందుకే ఏదో లోకంలో ఉన్నట్లున్నాడు." అహల్య కామెంట్‌కి నేను మౌనం వహించాను.

✡ ✡ ✡

శివానీ వాళ్ళ ఇల్లు దగ్గర పడుతుండగానే సన్నాయి పాట లయబద్ధంగా వినిపించింది.

ఏదో వర్ణించలేని ఉద్వేగానికి లోనయ్యాం ఇద్దరం.

"ముగ్గురం ఒకటే ప్రాణంలా ఉన్నాం ఇన్నాళ్ళూ. ఇంక ముందు ఎలా ఉంటుందో జీవితం." నెమ్మదిగా అంది అహల్య.

"మీ ఇద్దరూ ఫరవాలేదే! రుద్ర చిన్నప్పట్నుంచీ తెలిసిన వాడే ఇంక గౌతమ్ సరేసరి. నా సంగతే ఎలా ఉంటుందో? అందరం అప్పుడప్పుడు కలిసేలాగ కుదిరిస్తే బాగుండును భగవంతుడు."

"ఏమిటి? అంత భారంగా వస్తున్నారు? మీరు లేకుండా పెళ్ళి కూతుర్ని చెయ్యడానికి వీల్లేదని చెప్పాను. త్వరగా రండి." శివానీ పరుగెత్తుకుంటూ గేటు దగ్గరికి వచ్చి చెరో చేత్తోటీ మమ్మల్ని కౌగిలించుకుంది.

చేతులకి గోరింటాకు, కాళ్ళకి పారాణి, తల్లోంచి సాంబ్రాణి వాసన... అన్నివాసనలు కలగలిపి ఒక మధురమైన సువాసన.... కాలం ఆగిపోతే బాగుండుననిపించింది.

కౌగిలి వదిలి కొంచెం వెనక్కి వెళ్ళి తన్ని చూశాం.

"మీరా! తొందరగా చూసెయ్ తల్లీ.. " అంది అహల్య.

ఆపాద మస్తకం ఒక్కసారి తనివి తీరా చూశాను. శివానీ మమ్మల్ని చూస్తూనే నాలుగడుగులు వెనక్కి వేసింది.

కాళ్ళగజ్జెలు ఘల్లు ఘల్లుమని శబ్దం చేశాయి. మామిడి పండురంగులో కొంచెం లేతరంగుకి, ఎర్రబార్డరు... బార్డరు మీద నాట్యమాడుతున్న నర్తకీమణులు... నడుముకి వడ్డాణం, మెళ్ళో వజ్రాలు పొదిగిన హారం, క్రింద వరుసగా నాలుగైదు హారాలు.. చెవులకి జుంకాలు, వజ్రాలు, కెంపులు పొదిగిన పాపిటి బిళ్ళ.. అన్ని రంగులూ పరావర్తనం చెంది నీరెండలో వింత కాంతిని సంచరించుకున్న మేనిఛాయ.... అన్నింటినీ మించి అలవోకగా నవ్వుతున్న.. చంద్రబింబం అసూయ చెందేలాంటి మోము.... ఏమని వర్ణించను?

"కవీంద్రాః కల్పంతే కథ మపి విరించి ప్రభృతయః"

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలైన కవివరేణ్యులు వర్ణించలేని సౌందర్యమని ఆదిశంకరులు ఆ శివానీని వర్ణించారే... అలాగే ఈ శివానీని కూడా... పరవశంతో చూస్తున్న నన్ను, అహల్య భుజం మీద తట్టింది.

"అమ్మా! ముహూర్తం దాటిపోతోంది. వస్తున్నారా?" లోపల్నుంచి పంతులుగారు గంభీరమైన కంఠంతో పిలుస్తున్నారు.

"త్వరగా" అంటోంది అహల్య.

"ఆ పరమ శివుడి తోటి కళ్యాణానికి, ఉవిళ్ళూరుతున్న మనస్సుతో... శ్రద్ధగా అలంకరించుకున్న పార్వతీ దేవిలా ఉంది."

"అంత సింపుల్‌గా తేల్చేసేవేమిటే"... అహల్య కొంచెం కోపంగా అంది.

"హలో!" భవానీ వచ్చి మమ్మల్ని పలకరించి, శివానీని లోపలికి తీసుకెళ్ళింది. అందరం హాల్లోకి వెళ్ళాం. హాలంతా పూలతో అలంకరించారు. ఒక ప్రక్క మండపంలా కట్టారు. అందులో పెళ్ళిపీట, పీటమీద పట్టుచీర పరిచారు. ముందు చిన్నరోలు, రోకలి అలంకరించి పెట్టారు.

పెళ్ళిపీటమీద, మినీ శివానీలాగ ఉన్న పాప కూర్చుని ఉంది. శివానీ చీర రంగులాంటిదే పట్టుపావడా కట్టుకుని జరీపూల ఎర్రజాకెట్టు వేసుకుని, శివానీ పెట్టుకున్న అలంకారాలన్నీ పెట్టుకుంది. మేమిద్దరం సంభ్రమంగా చూస్తుంటే,

"మా అన్నయ్య కూతురు 'హిమానీ'" అని పరిచయం చేసింది శివానీ.

"మనం సిక్స్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు నువ్విలాగే ఉన్నావు" అంది అహల్య. హిమకి అర్థమైందనుకుంటా, చక్కని చిరునవ్వుతో మమ్మల్ని పలకరించింది. "టూడేస్ నుంచీ అత్త మీ గురించే చెపుతోంది." అంది అమెరికన్ తెలుగులో. ఇద్దరం వెళ్ళి ఆ పాపకి షేక్‌హాండిచ్చాం.

శివానీ వాళ్ళ వదిన రాధిక. ఆవిడే ప్రమీలాంటీని తీసుకుని వచ్చింది. ఆవిడ కొంచెం పరిసరాల్ని అర్థం చేసుకుంటున్నట్లున్నారు. వచ్చి పెళ్ళిపీట దగ్గర్లో ఉన్న కుర్చీలో కూర్చున్నారు. అదే మడత నలగని కాటన్ చీర, అదే అలంకారం. జీవితంలో జరుగుతున్న మార్పులకీ ఆవిడకీ ఏం సంబంధంలేనట్లుగా - మమ్మల్ని చూసి మాత్రం గుర్తుపట్టనట్లుగా నవ్వి, శివానీ కేసి చూపించారు.

"అవునాంటీ! శివానీకి పెళ్ళవుతోంది." అన్నాను. ఆవిడ ఒక నవ్వు నవ్వి శివానీకేసి చూస్తుండిపోయారు.

అహల్య, నేనూ ఒక ప్రక్కన కూర్చుని చూస్తున్నాం.

పెళ్ళి ఇంట్లో పనిచెయ్యడానికేం లేదు. అంతా కాంట్రాక్టుకిచ్చేసినట్లున్నారు. ప్రతీ ఈవెంట్‌కీ అనుభవం ఉన్నవాళ్ళు, సందర్భోచితంగా దుస్తులు ధరించి, అన్ని పనులూ చేసేస్తున్నారు.

వీధి వరండాలో సఫారీ డ్రెస్ వేసుకున్న వాళ్ళు... అతిధుల్ని ఆహ్వానిస్తూ, హాల్లో పట్టుచీరలు కట్టుకున్నపిల్లలు. అందరికీ పసుపుకుంకం ఇస్తూ, టిఫిన్ తినేవాళ్ళకి లోపల బేరర్ డ్రస్‌లు తీసుకుని సర్వ్ చేస్తూ... అన్నీ ఆటోమేటిక్‌గా జరిగిపోతున్నాయి.

శివానీ వాళ్ళు కోట్లకి అధిపతులని మాకు కాలేజీలోనే తెలిసింది, వాళ్ళ నాన్నగారిని జబ్బులో చూసినపుడు, తరువాత అహల్య పెళ్ళప్పుడు. కానీ ఇంత వైభవంగా ఉంటుందని అనుకోలేదు.

ముత్తయిదువులు పసుపు కొమ్ములు దంచుతుంటే అమ్మా వాణీ ఆంటీ వచ్చారు. వాళ్ళురాగానే, అందరం శివానీకి దగ్గరగా చాపమీద కూర్చున్నాం. అమ్మావాళ్ళు కూడా పసుపు దంచి అక్షింతలు వేశారు.

అక్షింతలు వెయ్యడానికి వచ్చిన విష్ణు మమ్మల్ని పలకరించారు. "ఏమ్మా! బాగున్నారా?" అంటూ

"బాగున్నాం అన్నయ్యా! మీ పాప అచ్చు శివానీ లాగే ఉంది. " అన్నాను.

"అవునవును" అంటూ పెద్దగా నవ్వి వెళ్ళిపోయారు వరండాలోకి.

శివానీ బావగారు మాత్రం సీరియస్‌గా వచ్చి అక్షింతలు వేసి వెళ్ళిపొయ్యారు. కొంతమంది అంతే. ఎప్పుడూ ఏదో ముంచుకొస్తున్నట్లు ఉంటారు.

అమ్మ, వాణి ఆంటి పేరంటం పుచ్చుకుని వెళ్ళిపోయారు. వాళ్ళు భోజనం చెయ్యరని శివానీ కూడా ఉండమనలేదు.

✡ ✡ ✡

పెళ్ళికూతుర్ని చెయ్యడం అవగానే, శివానీ మమ్మల్ని లోపలికి తీసుకు పోయింది. "రండి టిఫిన్ తిందాం." అంటూ.

చాలా పెద్ద పెరడు. అంతా షామియానాలు వేసి బల్లలు, కుర్చీలు వేశారు. అందరు కూర్చుని అప్పటికే తింటున్నారు. మేం ముగ్గురం వెళ్ళి ఒక వరసలో కూర్చున్నాం. మా వెనకే హిమానీ. అన్నీ కుతూహలంగా అడుగుతూ ఇంగ్లీషులో చెప్పబోతుంటే తెలుగులో చెప్పమంటుంది.

"వెయిట్. ఇప్పుడే వస్తా." అంటూ లోపలికి వెళ్ళింది హిమ.

తనకి సీట్ ఉంచి మేం కూర్చున్నాం.

"కమాన్ గ్రామ్మా!" అంటూ ప్రమీలాంటీని తీసుకుని వచ్చింది. అంతా శివానీలాగే.

"చూశావా! మమ్మీని మర్చిపోయాను. ఎప్పుడూ తనే అడుగుతుంది కదాని ఊరుకున్నాను." అంటూ శివానీ లేచి తన ప్రక్కన కూర్చో పెట్టుకుంది. ఆంటీ ఏం మాట్లాడకుండా నవ్వుతూ శివానీ ప్రక్కన కూర్చుని తినడానికి రెడీ అయారు. ఇంకో ప్రక్క హిమానీ. ముగ్గురూ ఒకటే పోలిక. చూడ్డానికి తమాషాగా ఉంది.

బ్రేక్ ఫాస్ట్.. ఏం కావాలంటే అది వడ్డిస్తున్నారు. ఇడ్లీ ఉప్మా, పెసరట్, దోశ, ఊతప్పం. ఇంకా మూడు రకాల స్వీట్స్.

ఎవరిక్కావల్సింది వాళ్ళు తిని లేస్తుంటే... బిలబిల్లాడుతూ అప్పుడొచ్చారు మా కేలేజ్ గాంగ్..

ఇంక ఒకటే గోల. చాలామంది పై చదువులకి వెళ్ళినా వాళ్ళు కూడా పరీక్షలయి పోయి వచ్చారు.

అందర్నీ వరసగా కూర్చోబెట్టి పేరుపేరునా పలకరించి, దగ్గరుండీ టిఫిన్ పెట్టించింది శివానీ.

"పెళ్ళిరోజున మీతో మాట్లాడ్డానికుండదే అందుకే ఇవాళ తప్పకుండా రమ్మన్నా" అంటూ.

✡ ✡ ✡

సాయంత్రం వరకు అందరం ఆటపాటలతో గడిపేశాం. అందరితో మేం కూడా వెళదామని బయలుదేరుతుంటే శివానీ ఆపేసింది. "రాత్రి భోంచేసి వెళుదురుగాని" అంటూ. ఇంటినిండా బంధువులు... అందరూ బిజినెల గురించీ, రియల్ ఎస్టేటు గురించీ మాట్లాడుకుంటున్నారు. భోజనాలయాక, శివానీ చుట్టాలందరూ వాళ్ళ వాళ్ళ వసతుల దగ్గరికి వెళ్ళిపోయారు.

మమ్మల్నిద్దరినీ సోఫాలో కూర్చోపెట్టింది. అదే మొదటిసారి మేం శివానీ గదికి వెళ్ళడం. తన గదే మా ఇల్లంత ఉంది. ఇక కార్పెట్లు, సోపాలు మంచం... అంతా మనం సినిమాల్లో చూసే 'రిచ్' హీరోయిన్ గదిలా ఉంది. అప్పుడర్ధమైంది నాకు, అవన్నీ చూస్తే, మేం తనతో ఫ్రీగా ఉండలేమని, మమ్మల్ని వాళ్ళింటికి ఎప్పుడూ రమ్మనలేదని.

మా ఇంటికి వచ్చి చద్దన్నంలో ఆవకాయ కలుపుకుని, ఉల్లిపాయ కొరుక్కుని తినే శివానీ... అహల్య వాళ్ళింట్లో కందిపచ్చడి కొద్దిగా వెన్నతో తినే శివానీ.... నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అహల్య కూడా అంతే ఉద్వేగంతో ఉందనుకుంటాను, గోడలమీద పెయింటింగ్స్ చూస్తూ ఉండిపోయింది. ఒక ప్రక్క గోడకి మా ముగ్గురి ఫోటో ఎన్‌లార్జ్ చేసి ఉంది. నేను గబగబా అక్కడికి వెళ్ళి చూశాను.

'కృష్ణ'కి అవతలి ఒడ్డున ఉన్న కొండ దగ్గరికి, మేం క్లాస్ మేట్స్ పిక్‌నిక్‌కి వెళ్ళినప్పటి ఫోటో. మేం టెన్త్ క్లాసులో ఉండగా తీసింది. ఆ ఫోటో చూడగానే నాకు నవ్వొచ్చింది.

నేను, అదే మొదటిసారి పిక్‌నిక్ వెళ్ళడం. అమ్మ ససేమిరా పంపనంటుంది. ఇంతా చేసి మా ఊరినుంచి గంట ప్రయాణం. రెండూ రోజులు 'ఇంట్లో' సత్యాగ్రహం చేసి, పిక్‌నిక్‌కి పర్మిషన్ సంపాదించాను.

అహల్య, శివానీల టిఫిన్ డబ్బాలోంచి పగలు, అహల్య వాళ్ళింట్లో గోంగూర పచ్చడి అన్నం రాత్రిళ్ళులాంగించేసేదాన్ని. ఇంట్లో తెలీకుండా.

ఇంక మేం బేరానికి రాక తప్పలేదు. శివానీ వచ్చి గంట బ్రతిమాలితే ఒప్పుకుంది.

ఫోటోలో, ముగ్గురం రెండేసి జళ్ళు, ఒక జడముందుకి వేసుకుని అహల్య సీరియస్‌గా, నేను బిగుసుకుపోయి... శివానీ మాత్రం హాయిగా నవ్వుతూ ఒక్కసారి మా స్కూలు రోజులు జ్ఞాపకం వచ్చాయి. ముగ్గురం ఎంత అమాయకంగా ఉన్నామో!

"మీరా! ఒకసారిలారా!" శివానీ పిలిచి, నన్ను అహల్య ప్రక్కన కూర్చోపెట్టింది. ఒక పెద్ద ట్రేలో రెండు చీరలూ, జాకెట్లు, మేచింగ్ గాజులు, బొట్లతో సహా తీసుకొచ్చింది.

అహల్యకి నాచురంగు, నాకు లేత పసుపు కంచి చీరలు. మూడు వేళ్ళ వెడల్పు జరీ.. పల్లు భుజం దగ్గర్నుంచి మోకాళ్ళ వరకు మొత్తం జరీ వర్క్. ఇద్దరం కళ్ళు పెద్దవి చేసుకుని, మొహమాటంగా చూస్తూ ఉండిపోయాం. ఇద్దరం ఒకేసారి ఏదో అనబోయాం.

అప్పటికే ట్రేని, టీపాయ్ మీద పెట్టిన శివానీ.. నా నోర్లు మూసేసింది.

"మీరేం మాట్లాడద్దు. నా పెళ్ళికి కట్టుకోవాలని మీ కోసం కొన్నాను. మీ ఇళ్ళకి వెళ్ళి ఆది బ్లౌజులు తెచ్చి కుట్టించాను - ఫాల్స్ కూడా ఎల్లుండి పొద్దున్న ఇవి కట్టుకుని మీరు పెళ్ళికి రావాలి. అంతే!"

ఇద్దరం కూడా కొంత కోపంగా కొంత నిష్టూరంగా మొహాలు పెట్టాం. "ఇంత ఖరీదైనవి.." అని అహల్య మొదలు పెట్టింది.

"ప్లీజ్! అహల్య! ఇన్నాళ్ళ మన అనుబంధానికి గుర్తు. నాకు ఈ చీరలు చూడగానే మీరు జ్ఞాపకం వచ్చారు. మీ ఫావరెట్ కలర్స్. నాకు బాగా నచ్చాయి. నా స్నేహం 'నిష్కల్మషమైనది' అని మీరనుకుంటే, ఇవి తీసుకుంటున్నారంతే." అని మా ఇద్దరికీ బొట్టుపెట్టి ఇచ్చింది.

మారు మాట్లాడకుండా తీసుకున్నాం ఇద్దరం.

"అహల్యా! ఏంటలా చిక్కిపోయావు? అంతాబాగానే ఉందా? గౌతమ్ నిన్ను బాగా చూసుకుంటున్నాడా?" శివానీ ఆదుర్దాగా అడిగింది.

"ఏరి కోరి చేసుకున్నాడు ఎందుకు సరిగ్గా ఉండడు? కాకపోతే సిటీ లైఫ్ ... ఇద్దరూ బిజీ" అందుకున్నాను.

అహల్య మొహంలోకి అనుమానంగా చూసింది శివానీ. ఒకసారి కళ్ళు ఆర్పి తెరిచింది అహల్య. శివానీ మొహంలో ఆందోళన చూసి నవ్వుకున్నాను.

తనకి అహల్యంటే ఉన్న అభిమానంతో అనిపిస్తుంది కానీ అహల్యకేం లోటు?

✡ ✡ ✡

శివానీ పెళ్ళి అంగరంగ వైభోగంగా జరిగింది. మా ఊళ్ళోకొత్తగా కట్టిన ఏ.సీ హాల్లో చేశారు. ముత్యాల పందిరి. వెనక గిరిజా, శంకరుల కళ్యాణం పూలతో చేసిన తెర. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో చూడ్డానికి రెండు కళ్ళూ చాలవనిపించేలా ఉంది.

శివానీ ఇచ్చిన చీరలు కట్టుకుని నేను, అహల్యా మా కాలేజ్ ఫ్రెండ్సందరినీ చూసుకున్నాం. చిత్రం ఏమిటంటే... శివానీ కూడా మా చీరల్లాంటిదే హాఫ్ వైట్ చీర కట్టుకుంది పెళ్ళికి... మన 'మధుపర్కంలాగా' అన్నమాట,

రుద్ర ఆజానుబాహువు. కోటేసినట్లున్న ముక్కు, తీరైన పెదవులతో, విశాల నేత్రాలతో, పురాణాల్లో వర్ణించే గంధర్వుడిలా ఉంటాడు. మళ్ళీ మాట్లాడితే ..బ్రాహ్మణుడి వేషం వేస్తే, వరూధిని మనసుపారేసుకున్న ప్రవరుడిలా ఉంటాడు. నిజం చెప్పొద్దూ! శివానీ కంటే రుద్రే బాగుంటాడు. అతని ప్రక్కన నుంచుంటే మా శివానీ కూడా మామూలు కంటే వెయ్యిరెట్లు బాగుంది.

అసలు సంగతి మర్చిపోయాను. బస్సులో మా వెనక కూర్చుని, నన్ను ఆరాధించిన తను, అప్పుడప్పుడు ఫోటోలు తీస్తూ కనిపించాడు. రుద్రకి వాళ్ళ నాన్న వేపు నుంచి కజిన్ అవుతాడుట. పేరు "నంద కుమార్." రుద్ర పెళ్ళికి ముందు పరిచయం చేశాడు. "వాళ్ళందరూ ఆగర్భశ్రీమంతులు కదా! మరి మాతో బస్‌లో" ఆలోచిస్తున్నాను.

"ప్రొద్దున్నే మా వాళ్ళందరూ కారు తీసుకుని వచ్చేశారు కదా! అందుకని నేను బస్సెక్కాను. వీరిని కలిసే భాగ్యం కలిగింది." మళ్ళీ నా మనసులో మాట గ్రహించిన నందకుమార్ అన్నాడు, నా వేపు తిరిగి నవ్వుతూ.

"నందూ! అయితే నా ప్రాణమిత్రురాళ్ళని ముందే పరిచయం చేసుకున్నావన్నమాట." శివానీ అడిగింది.

"అంత సీన్ లేదులే! ఎక్కడ కిడ్‌నేప్ చేసానో అన్నట్లుగా ముడుచుకుపోయి కూర్చున్నారు మీ ఫ్రండ్ అయినా నేను కిడ్‌నాపర్‌లా, రౌడీలా కనిపిస్తున్నానా?" నందు నిష్టూరం వేశాడు.

"నువ్వు కిడ్‌నాపర్‌లా లేవుగానీ, మా మీరా ఎత్తుకుపోవాలనిపించే రత్నమే."

"మీ స్నేహితురాలి పాండిత్యం నీక్కూడా వచ్చినట్లుందే" నందు నవ్వాడు.

"ఓహో! బస్సులో 'వర్ణనలు, వివరణలు' ప్రోగ్రాం అయిందా? మిస్సయిపోయానన్నమాట." శివానీ నా చెయ్యి నొక్కి మండపం మీదకి వెళ్ళింది. నేను అహల్య కోసం వెతుకుతూ వెనక్కి తిరిగాను. కెమెరా నా కేసి పెట్టి క్లిక్‌మనిస్తున్నాడు నందూ!

కళ్ళు మూసుకుని తెరిచేలోపు సెలవులు అయిపోయినట్లనిపించింది. శివానీ పెళ్ళయాక నాలుగురోజులు కేరళ హనీమూన్‌కి వెళ్ళొచ్చారు. తర్వాత పదిరోజులోపలే వాళ్ళ అన్న, వదిన, పిల్లలు అమెరికా వెళ్ళిపోయారు. వెంటనే భవానీ వాళ్ళూ హైదరాబాద్‌కి వెళ్ళారు.

రుద్ర క్వార్టర్స్ ఖాళీ చేసి, శివానీ వాళ్ళింటికి వచ్చేశాడు. ప్రమీలాంటీని వదలడానికి లేదుకదా!

మరి ట్రాన్స్‌ఫర్ అయితే ఏం చేస్తారు?

"ఏముందీ? అత్తకూడా మాతో వచ్చేస్తుంది. నోప్రాబ్లం." అన్నాడు రుద్ర. అతనికి వాళ్ళ అత్త అంటే ప్రాణం. వాళ్ళ అమ్మ చిన్నప్పుడే పోతే ప్రమీలాంటీనే అతణ్ణి పెంచింది.

రుద్ర ఇంటికి వచ్చేసరికి ఎనిమిది దాటుతుంది. శివానీ మామూలుగా రోజూ సాయంత్రం మా ఇంటికో, అహల్య వాళ్ళింటికో వస్తే కాలక్షేపం చేస్తుండేవాళ్ళం.

నేను ఇంటిదగ్గర ఉన్నాననో.. లేక నిజంగానే శ్రద్ధ వచ్చిందో కానీ, శేషు రాత్రిళ్ళు ఇంటిదగ్గరే చదువుకుంటున్నాడు. నా ప్రయాణానికి నాలుగురోజులు ముందే వాళ్ళ సెమిస్టర్ పరీక్షలయాయి. ఈసారి మా ఇద్దరికీ అంత గొడవ అవలేదు. అమ్మ చాలా ఆనందించింది.

మర్నాడు మా ప్రయాణం అనగా ముగ్గురం కలిసి అలా షికారుకి వెళదామనుకున్నాం. అహల్య వాళ్ళ ఇంటి వెనక రైలు కట్టదాటి వంతెన దగ్గరికి వెళ్ళేవాళ్ళం ఎప్పుడైనా. అలాగే అనుకుని నేను దారి తీశాను.

"అటయితే నేను రాలేను. ఇంకెక్కడికైనా వెళదాం" అహల్య మొహం ఎర్రగా అయిపోయింది.

ఒక్కసారి నాకు ఆ వంతెన దగ్గర జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. అహల్య వణుకుతూ నుంచుంది.

శివానీ తనని పట్టుకుంది. "వద్దులే మనం కృష్ణ ఒడ్డుకి వెళదాం అక్కడైతే బాగా లైట్లు, చాలా మంది జనం ఉంటారు."

ముగ్గురం ఆటో చేసుకుని కృష్ణఒడ్డుకి వెళ్ళాం. అక్కడొక బెంచీ చూసుకుని కూర్చున్నాం.

"నా పెళ్ళిక వచ్చి వెళ్ళాక, గౌతమ్ మళ్ళీ రాలేదేం?" శివానీ అడిగింది.

"ఏముంది? ప్రాజెక్టు టార్గెటు... అంటూ వీలుపడట్లేదంటాడు. నేను రేపు వెళుతున్నాను కదా!" అహల్య సన్నగా అంది.

శివానీ తేరిపారి అహల్య కేసి చూస్తూ... "మీ అత్తగారింటికి వెళ్ళలేదేం, ఈ రెన్నెళ్ళలో?" అడిగింది.

"ఏంటీ! బోనులో ముద్దాయిని అడిగినట్లడుతున్నావు? మీరు హనీమూన్‌కి వెళ్ళినప్పుడు వెళ్ళొచ్చింది. శాంత పిన్నికి కోడలంటే ప్రాణం పెళ్ళికి ముందు కాస్త గొడవచేసినా, తర్వాత ఇటుపుల్ల అటు పెట్టనివ్వట్లేదు." నేనేదో అహల్యకి లాయర్నయినట్లు మాట్లాడు.

"అలా అయితే ఫరవాలేదులే! అహల్య సంతోషంగా ఉంటే నాక్కావలసిందేముందీ?" అహల్య తలవంచుకుని చీరకంటుకున్న గడ్డిపరకని తీస్తోంది. ఒకసారి కళ్ళెత్తి శివానీ కేసి చూసి ... ముంత కింద పప్పు వాణ్ణి పిలిచింది.

ముగ్గురం పప్పు తింటూ 'ఇంక వెళదాం' అనుకుని లేచాం.

"ఇంక మీరాక్కూడా పెళ్ళవుతే ముగ్గురం ఒక ఒడ్డుకు చేరుకున్నట్లే. లక్కీగా మనిద్దరికీ తెలుసున్నవాళ్ళే వచ్చారు. తనక్కూడా అలాగే దొరుకితే. మనం జీవితాంతం కలుస్తూండచ్చు" అహల్య నవ్వుతూ కాస్త పప్పు నా నోట్లో వేస్తూ అంది.

✡ ✡ ✡

## 10

"ప్లీజ్ కమిన్." యం.డి గారి ఛాంబర్ తలుపు తీసి లోపలికి ఆహ్వానించింది పి.ఏ. క్రొత్తగా పెట్టిన 'నవీన' టీ.వి. ఛానల్‌లో ఇంటర్వ్యూ కోసం, నాగార్జు హిల్స్ దగ్గరున్న వాళ్ళ ఆఫీసుకి వచ్చాను. యమ్. ఎ ఫైనల్ పరీక్షలయి నాలుగురోజులయింది. పేపర్లో క్వాలిఫికేషన్స్ చెప్పి, వాక్-ఇన్ ఇంటర్వ్యూ అన్నారు. సరే! ప్రయత్నిద్దాం అనుకుని వచ్చాను.

అప్పుడే నేను పంపించిన రెస్యూమె చదివి, తలపైకెత్తి నవ్వాడు యం.డి.

నమ్మలేనట్లు చూశాను.!!

"సిట్ డౌన్" అన్నాడు నందకుమార్, యం.డి. శివానీ పెళ్ళప్పుడు పరిచయం అయింది కానీ, అతను ఏం చేస్తాడో అడగనే లేదు.

"కెన్ యు ప్లీజ్ సెండ్ కాఫీ ఫర్ టూ?" పి.ఏ తోటి అని, నాకేసి తిరిగాడు నందకుమార్.

"మిస్. సమీరా! బాగున్నారా? యం.ఏ అయిపోయిందా?"

నవ్వేసి ఊరుకున్నాను.

"ఓహ్! ఇందులో రాశారు కదా! మిమ్మల్ని చూసిన ఆనందంలో బుర్ర పని చెయ్యట్లేదు. సారీ."

కాఫీ వచ్చింది. ఇద్దరం మాట్లాడకుండా తాగేశాం. కొంచెం సేపు, శివానీ, రుద్ర గురించి మాట్లాడుకున్నాం.

"మా ఫాదర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టారు, ఫోర్ ఇయర్స్ బాక్. అది ఒక గ్రూమ్‌లో పడింది. ఆయన ఊర్లో ఉన్న డైరీ ఫాం చూసుకుంటూ ఉంటారు. నేను ఆ కంపెనీని మానేజ్ చేస్తాను. బిజినెస్ డైవర్సిఫై చేద్దామని ఈ ఛానెల్ స్టార్ట్ చేస్తున్నాం. క్రొత్తదనం ఉన్న ప్రోగ్రాంలు పెట్టాలని 'నవీన' అని పేరు పెట్టాం. యంగ్ థింకింగ్ కావాలని, ఫ్రెష్ పి.జి.ల కోసం ఎడ్వర్టైజ్ చేశాం. సో ఆవిధంగా మిమ్మల్ని చూడగలిగానన్నమాట." నవ్వుతూ అన్నాడు నందకుమార్..

ఈ ఏడాదిలో కొంచెం లావయాడు. నవ్వుతుంటే కళ్ళుమూసుకు పోయినట్లవుతోంది. అతన్ని చూస్తుంటే, నాక్కూడా నవ్వొచ్చింది. జుట్టు ఇంకా వెనక్కి వెళ్ళి, నుదురు ఇంకా విశాలమైంది.

"ఏంటి? నాలైన్ ఆఫ్ ఇంటిలిజెన్స్ వెనక్కి వెళ్ళిందని చూస్తున్నారా?" జుట్టు మీదకి చెయ్యిపోనిచ్చి అన్నాడు.

మర్చిపోయాను. ఇతను మనసుని పుస్తకంలా చదివేస్తాడు కదా! నవ్వుతూ తలూపాను.

"మీరు ప్రోగ్రాం మానేజర్ అయితే ... ఎలా ప్లాన్ చేస్తారో చెప్పండి." సీరియస్‌గా ఇంటర్వ్యూ చెయ్యడమ్మొదలు పెట్టాడు.

ముందరే ప్రిపేరయాను కనుక, ఒక రోజు ప్రోగ్రాం చెప్పాను.

"అంతా 'సాహిత్యం' పెట్టేస్తే, ఒక్క కమర్షియల్ కూడా రాదు. మనం అన్నీ కవర్ చేయ్యాలి. రోజూ ఒక మూవీ ఎలాగూ ఉంటుంది. మిగిలిన ప్రోగ్రామ్స్ ఒక రోజుకి, ఒక వీక్‌కి, అలాగ ఒక మంత్ కి స్ప్రెడ్ చేసుకుంటూ ప్లాన్ చేసుకోవాలి. మీకు నావెల్‌గా ఉండే 'సాహిత్యం' ప్రోగ్రాం... మీ టాలెంట్ నాకు తెలుసులెండీ... 'క్లాసికల్ మ్యూజిక్ అండ్ డాన్స్' ప్రోగ్రాం ఇస్తాను. దానికే మీరు కనీసం టెన్ అవర్స్ వర్క్ చెయ్యాలి. ఎప్పటినుంచీ జాయిన్ అవగలరు?" నందకుమార్, ఇంటర్ కంలో పి.ఏని పిలుస్తూ అడిగాడు.

"ఎపాయింట్ చేస్తున్నారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"మిమ్మల్ని నేను జెమినీ టి.వీ, ఈ టీవీ ఛానెల్స్‌లో చూస్తుంటాను. మీ మానెరిజమ్స్, ది వేయు కారీ యువర్ సెల్ఫ్.. అంతా కెమేరా ఫ్రెండ్లీగా ఉంటుంది. అందుకని అవేం నేను చూడక్కర్లేదు. కాకపోతే, మీ ఐడియాస్ తెలుసుకుందామని, 'ప్రోగ్రాం మానేజర్' అన్నాను. యు ఆర్ అపాయింటెడ్ యాజ్ 'యాంకర్ అండ్ పి.యమ్' అందుకే టెన్ అవర్స్ పని. పే స్టార్టింగ్ టెన్ థౌజండ్'. అన్నాడు, నందకుమార్.

'నవీన' టీ.వీలో చేరి నెలయింది. అప్పుడప్పుడే పని అలవాటవుతోంది. ఇంకా మూడు నెలల్లో ఛానల్ టెలికాస్ట్ అవుతుంది. అప్పటికి అన్ని ప్రోగ్రాంలు సెట్ చెయ్యాలి. రికార్డ్ చేసి పెట్టుకునేవి కొన్ని.. అవి స్టూడియోలో చేసేసి తయారుగా ఉంచుకోవాలి.

కొంతమంది 'ఎ' గ్రేడ్ ఆర్టిస్టుల ప్రోగ్రాంలు... డాన్స్, కర్ణాటక సంగీతం రికార్డ్ చేసి పెట్టేశాము. కొన్ని 'బాలే'లు తయారవుతున్నాయి, నాటికల పోటీలు... అన్ని పేపర్లలోనూ ఎడ్వర్టైజ్ చేశాము. మంచివి వస్తే, మేమే షూట్ చెయ్యాలని చెప్పాను. ఇలా తలమునకలుగా పనిలో మునిగిపోయి కాస్త ఊపిరి తీసుకుందామని చూసేసరికి నెలయింది. మొదటి జీతం అందుకున్నాను.

ఈ నెలలోనూ మా యం.డిగారితో కాస్త చనువు ఏర్పడింది. నా అయిడియాలన్నీ ఆయనకి బాగా నచ్చుతున్నాయి. శని ఆదివారాలు, మా ఊరు వెళ్ళి వస్తానని చెప్పాను. ఆదివారాలు కూడా పని చేశానేమో అడగ్గానే ఒప్పుకున్నారు.

అమ్మకీ, నాన్నగారికీ, తమ్ముడికీ బట్టలు తీసుకున్నాను. ఆఫీస్ నుంచి రాగానే రూమ్ కి వెళ్ళి సర్దేసి, బస్సెక్కేశాను.

గౌతమ్‌కి బెంగుళూర్‌లో జాబ్ వచ్చింది. అహల్య పరీక్షలవగానే సామానుతో సహా చేక్కేసింది. అక్కడే రిసెర్చికి ఎప్లై చేస్తుందట. అహల్యకి ఫోన్ చేసి, వీలైతే తనని కూడా రమ్మన్నాను. బస్‌లో ఖాళీగా కూర్చోగానే, అహల్య జ్ఞాపకం వచ్చింది. ఇన్ని రోజులు తనని చూడకుండా ఉండడం ఇదే మొదటిసారి. మేం ఇద్దరం, ఫైనలియర్లోకి రాగానే, కలవడం తగ్గింది. నాక్కూడా పని ఎక్కువైంది. తనక్కూడా ప్రాక్టికల్స్, ప్రాజెక్ట్ వర్క్.. అంతా బిజీ అయిపోయింది.

రాత్రి పదకొండవుతుండగా మా ఊరు వచ్చింది. ఆటోలో ఇంటికెళ్ళాను.

నేను వస్తున్నట్లు శివానీ చెప్పిందట. అమ్మ, నాన్నగారు మెలకువగానే ఉన్నారు. శేషు కూడా ఉన్నాడు. ముగ్గురికీ తెచ్చినవి ఇచ్చాను. అమ్మా, నాన్నలకి దణ్ణం పెడుతుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ముగ్గురం ఎంత శ్రమపడితే.. నేను ఈ స్థాయికి చేరుకున్నాను!

మర్నాడు.. శనివారం, ప్రొద్దున్నే లేచి, స్నానం చేసి గుడికి వెళ్ళివచ్చాను. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. శేషు కాలేజ్‌కి వెళ్ళిపోయాడు. నాన్నగారు, వరండాలో తన మామూలు కుర్చీలో కూర్చున్నారు. క్రిందటి నెలే, ఆయన రిటైర్ అయారు.

"మీరా! ఇలా వచ్చి కూర్చో." నెమ్మదిగా పిలిచారు. అమ్మ కూడా వచ్చింది కాఫీ గ్లాసులతో. ఏదో ఉంది. పెళ్ళి గురించే అయి ఉంటుంది. నాక్కూడా ఇంక జీవితంలో స్థిరపడాలనే ఉంది అనుకోకుండా, మనసులో నందకుమార్ మెదిలాడు. ఒకసారి తలవిదిల్చాను. అసలు ఆ ఆలోచనే రాకూడదు!

"వింటున్నావా అమ్మా!" నాన్నగారు పిలిచారు. అయోమయంగా చూశాను. అమ్మ మాత్రం మొహం ఎర్రగా చేసుకుంది.

"నిన్న శివానీ వచ్చింది. చాలా సేపు కూర్చుంది." అందులో వింత ఏముంది? ఎప్పుడూ వస్తూనే ఉంటుంది కదా!

"రావడమేనా! తను ఏం చెప్పిందో చెప్పండి. డబ్బులేని వాళ్ళంటే అంత చులకనగా ఉంటుంది. మనకి డబ్బులేకపోయినా పరువుంది కదా!" అమ్మ మాటలు కాసేపటికి బుర్రలోకి ఎక్కాయి. అమ్మ ఎపుడూ అలా మాట్లడదే!

శివానీకి డబ్బులేని వాళ్ళంటే చులకనా! అసంభవం. అదే అన్నాను.

"ఊరుకో పూర్ణా! వాళ్ళ అభిప్రాయం చెప్పారు. ఇష్టమైతే ఊ అనాలి, లేకపోతే ఊరుకోవాలి. అనవసరంగా మాటలెందుకు?" ఏం మాట్లాడుతున్నారో, దేనిగురించో ఏమీ అర్థంకాలేదు.

"దేనిగురించి నాన్నగారూ!" నా మొహం చూసి, నాకు ఏం తెలీదని తెలిసినట్లుంది, నాన్నగారు కాసేపాగి మెల్లిగా అన్నారు.

"మీ మానేజింగ్ డైరెక్టర్ నందకుమార్‌కి నిన్ను పెళ్ళి చేసుకోవాలనుందటమ్మా!"

నిజంగా వింటున్నానా? కలా? తలవంచుకున్నాను. ఏం అనాలి?

"అసలు ఎలా అడుగుతాడండీ? బ్రాహ్మల పిల్లని ఎలా చేసుకుందామనుకున్నాడు. ఎంత డబ్బుంటే మాత్రం, వాళ్ళ కులమేంటి?" ఎప్పుడూ గట్టిగా మాట్లాడని అమ్మ పెద్దగా అంటోంది.

ఓ! వాళ్ళు కమ్మవాళ్ళు కదా! ఇన్నేళ్ళ శివానీ స్నేహంలో ఒక్కసారి కూడా మా మధ్య కులాల ప్రసక్తి రాలేదు.

"పైగా వాళ్ళు 'శాఖాహారులండీ' అంటుంది. అయితే మాత్రం శూద్రులు, బ్రాహ్మలైపోతారా? మన బంధువుల్లో తలెత్తుకుని ఎలా తిరుగుతాం?" అమ్మ మాటలు, నాకు కలోలా వినిపిస్తున్నాయి.

అవును. ఎలా తలెత్తుకుని తిరుగుతారు? నెలలకి నెలలు మాకు జీతాల్లేకపోతే ఎవరైనా మాకేసి తిరిగిచూశారా? "మా తోటలో పండి... మా పొలంలో పండాయండీ.." అంటూ శివానీ ఎన్నిసార్లు కూరలూ, పళ్ళూ పంపించేది? ఇవన్నీ మర్చిపోయిందా అమ్మ!

"పైగా దీనికీ, అతనికీ పదేళ్ళు తేడా. అయినా దీన్నడిగేదేమిటీ? కుదరదని చెప్పేయండి."

నేనేం మాట్లాడలేదు. కాసేపుండి, అమ్మలోపలకు వెళ్ళిపోయింది. పదేళ్ళు తేడా ఉందా? అలా అనిపించలేదే నాకు!

"నందకుమార్‌కి నా మీద అలాంటి అభిప్రాయం ఉందా?" తలుచుకుంటుంటే... ఒక క్రొత్త అనుభూతి కలుగుతోంది.

"ఎర్రగా అయిన నీ మొహం చెప్పేది నిజమేనా అమ్మా!?"

"అతను చాలా మంచివాడు నాన్నగారూ! నాకు ఏం తెలియనీయకుండా మీకు కబురు పంపాడు." కాళ్ళు తేలిపోతుంటే అక్కడ్నుంచీ లేచి వెళ్ళిపోయాను.

✡ ✡ ✡

రోజంతా ఇంట్లో వాతావరణం గంభీరంగా ఉంది. గుడినుంచి వచ్చాక శివానీ వాళ్ళ ఇంటికి వెళదామనుకున్నదాన్ని, వెళ్ళలేకపోయాను. ఆలోచించుకోవడానికి సమయం ఇవ్వాలనుకుందో ఏమో, తను కూడా రాలేదు.

నాన్నగారు, తపస్సు చేస్తున్న మునిలా కూర్చుండిపోయారు, మధ్యాహ్నం భోజనాలయాక, మళ్ళీ పిలిచారు. అమ్మ ముభావంగా ఉంది.

"ఏమ్మా? ఏం చేద్దాం?" ఇలా అడిగారంటే పూర్తిగా వద్దనుకోలేదు కదా! ఈ అవకాశం నేను వదులుకోదలుచుకోలేదు. సిగ్గుపడో, మొహమాటపడో, నా అభిప్రాయం చెప్పకపోతే... జీవితాంతం, ఏదో కోల్పోయినట్లు బాధపడాలి. కళ్ళుమూసుకున్నాను. నవ్వుతూ నందు కనిపించాడు.

"నా కిష్టమే నాన్నగారూ! ఇంత తెలిసిన మీకు కులాల గురించి నేను చెప్పక్కర్లేదు. ఈ చిన్న జీవితంలో మనం ఆనందంగా ఉండగలగడం ముఖ్యం కదా. ప్రొద్దున్న వరకూ నాకు అతనిమీద, బాస్‌గా తప్ప ఎలాంటి ఉద్దేశం లేదు. అప్పట్నుంచీ, ఆలోచిస్తుంటే ... అతను, నాకు నచ్చిన వ్యక్తే అనిపించింది. నాకు, మంచి జీవితం ఇవ్వగలడన్న ధీమా కలిగింది. చాలా మృదుస్వభావి. నా దూకుడుకి అడ్డు వేయగలడు. మీరు వద్దంటే... కొంచెం బాధ కలిగినా ... సర్దుకుంటాను." నెమ్మదిగా అయినా స్థిరంగా అన్నాను.

"అదేదో అంటుంది. మీరు తొందర పడకండి. ఇంటిపేరు కమ్మవాళ్ళది అయిపోతుంది. దీని పిల్లలు కమ్మవాళ్ళవుతారు. ఆడపిల్లనివ్వడం అంటే ఎన్ని చూసుకోవాలి?" అమ్మ కోపంగా అంది.

నాన్నగారు నాకేసి చూశారు. ఆశగా, ఆతృతగా తిరిగి చూశాను.. నాకోసం.. సరే అన్నా, ఎన్నో విమర్శలు ఎదుర్కోవాలి. ముఖ్యంగా అమ్మ ప్రతిఘటనని. ఏం నిర్ణయం తీసుకుంటారో!?

"వెళ్ళి శివానీని తీసుకురామ్మా! మాట్లాడదాం." అమ్మ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

✡ ✡ ✡

శివానీ వాళ్ళింట్లో అడుగు పెడుతుండగానే, ఒక్కసారి దీపాలు వెలిగాయి. మధ్యాహ్నం అంతా, నేనూ, నాన్నగారూ అమ్మని ఒప్పించడం. తనకి సర్దిచెప్పడం సరిపోయింది. మళ్ళీ శివానీ వచ్చాక, అమ్మ నిష్ఠూరంగా మాట్లాడకూడదు కదా! ఎలాగైతేనేం అమ్మని శాంత పరచి, అన్నింటికీ సిద్ధం చేసి వచ్చేసరికి, దీపాల వేళయింది.

రుద్ర కూడా వచ్చేసినట్లున్నాడు. వీధిలో రెండు కార్లు, జీపు, నలుగురు పోలీసులు ఉన్నారు. వరండాలో ఎవరూ లేరు. బెల్ నొక్కి, హాల్లోకి వెళదామని అడుగు వేయబోయిన దాన్నల్లా, ఆగిపోయాను సంకోచిస్తూ! హాల్లో క్రొత్త వాళ్ళు ఎవరో ఉన్నారు. వెళ్ళచ్చా, వద్దా! అని ఆలోచిస్తుండగానే...

"అరే! మీరా. ఇపుడే నీ గురించి అనుకుంటున్నాం రా! రా!" శివానీ లోపల్నుంచీ వస్తూ పిలిచింది. వెనకాలే రుద్ర. ఆ వెనక... నవ్వుతూ నందూ. అతను ఎపుడూ నవ్వుతూనే ఉంటాడా!

ఎప్పుడూ లేనిది నందూని చూడగానే తలకొద్దిగా వంచేశాను. ఏదో బిడియం. కాళ్ళు కదలనంటున్నాయే!

"అక్కడే ఆగిపోతావా? బుగ్గలు చూడు.. ఎలా ఎర్రగా అయిపోయాయో" శివానీ దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకుని లోపలకు తీసుకెళ్ళింది.

"జయ ఆంటి, రామ్ అంకుల్. నందు పేరెంట్స్." శివానీ మాటలకి ఆశ్చర్యంగా తలెత్తాను. నందు మొహంలో అదే చిలిపి నవ్వు. అసంకల్పితంగా వంగాను, కాళ్ళకి దండం పెడదామని. ఇద్దరూ చటుక్కున లేచారు. నందు వాళ్ళ అమ్మగారు, మధ్యలోనే నన్ను లేపి, నుదుటి మీద ముద్దు పెట్టుకున్నారు.

అందరం కూర్చున్నాక, ఒకసారి నన్ను చూసుకున్నాను. మంగళగిరి చుడీదార్ డ్రస్‌లో.... మామూలుగా ఉన్నాను. వీళ్ళందరూ ఉంటారని తెలీదు కదా! తలెత్తి, ఒకసారి మొహమాటంగా నవ్వాను.

"ఇన్ని రోజులు పెళ్ళి వద్దన్నవాడు. ఈ డింపుల్ చూసి పడిపోయాడన్నమాట" జయ ఆంటీ మాటలకి, ఇంకొంచె సొట్టపడేలా నవ్వాను.

✡ ✡ ✡

ఆ తర్వాత ... అంతా కలలా జరిగిపోయింది. నందు ఒక్కడే కొడుకు అతని మాటని ఎప్పుడూ పేరెంట్స్ కాదనలేదట. నన్ను చూస్తూనే అక్కున చేరుకున్నారు కదా! నాకు ఎంతో నిశ్చింతగా అనిపించింది.

మొత్తం పెళ్ళిలో డబ్బు ప్రసక్తే రాలేదు. ఒక్క పెళ్ళి ఖర్చు.. అంటే భోజనాలకి మాత్రం, నాన్నగారు తను పెట్టుకోవల్సిందే అన్నారు. శివానీ దగ్గర దాచి, తను మానేజ్ చేసిందే రెండు లక్షలుంది. అత్తయ్య నాకు పెట్టిన నగలు, లిస్టు చేస్తే రెండు పేజీలుంటుంది. ఇంక చీరలు చెప్పక్ఖర్లేదు. అత్తయ్యకి ఆడపిల్లలు లేరన్న కొరత, నాద్వారా తీర్చుకోవాలని తాపత్రయం. షాపులో ప్రతి చీరా బాగుంటుందంటారు. "మీరాకి ఇది బాగుంటుంది, అది సూటవుతుంది.." అంటూ.

"ముందు పది సూట్‌కేసులు, నాలుగు బీరువాలు కొనమ్మా" అన్నాడు నందూ. అన్నింటి కంటే.. ఆవిడ ప్రేమకి , కళ్ళలో నీళ్ళొచ్చేసాయి నాకు.

ఇంక మా బంధువులు. ముఖ్యంగా బాబాయి, పిన్ని బాగా చిందులు వేశారు. "ఇంక మా పిల్లలకి పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి?" పిన్ని వెక్కుతూ వెళ్ళిపోయింది, ప్రధానం దగ్గర్నుంచి. వాళ్ళు పెళ్ళికి కూడా రాలేదు.

పాలెం నుంచి, అమ్మ బంధువులందరూ వచ్చారు. నందు వాళ్ళ చుట్టాలు, అమ్మమ్మ ఇంటి ప్రక్కనే ఉంటారట. వాళ్ళు ఎప్పటినుంచో స్నేహితులు. చాలా మంచి వాళ్ళని చెప్పారు.

పెళ్ళి అయాక, హాస్టల్ ఖాళీ చేసేసి, నందు ఇంటికి... కాదు... మా ఇంటికి మారిపోయాను.

మా "సన" ఛానల్ లాంచ్ అయింది. అన్నట్లు "నవీన"ని "సన" క్రింద మార్చాడు నందూ. అంటే "సమీర - నంద" అనిట.

ఇప్పుడు "సన" ఛానల్‌కి నేనే జి.యమ్.ని.

## 11

రికార్డింగ్ స్టూడియోకి వెళ్ళడానికి తయారవుతున్నాను. అప్పటికే ఆలశ్యమయిపోయింది. నందు ప్రొద్దున్నే ఏడింటికే వెళ్ళిపోయాడు. మార్కెటింగ్ వాళ్ళతో ఏదో మీటింగ్ ఉందని. స్టూడియోలో చాలా పనుంది. ఇంజినీర్‌కి ఇంతకుముందు రికార్డింగ్ అయినవి మిక్సింగ్‌కి సూచనలివ్వాలి. మధ్యాహ్నం 'సామవేదం షణ్ముఖ శర్మగారి'తో ఇంటర్వ్యూ. దానికి అన్నీ చూసుకోవాలి. అటూ ఇటూ పరుగులు పెడుతుండగా.... "మనసున ఉన్నదీ చెప్పాలనున్నదీ" అంటూ ఎవరో పిలిచారు. నందుకిష్టమైన పాట, రింగ్ టోన్ పెట్టాడు. నవ్వుకుంటూ సెల్‌ఫోన్ ఆన్ చేశాను.

"మీరా!" అమ్మ. ఖంగారుగా, గొంతుకతో ఏడుపుతో మూసుకుపోయినట్లుంది.

"నువ్వు వెంటనే బయలుదేరిరా!" అంటూ వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

"ఏమైందమ్మా! నాన్నగారు.."

"నాన్నగారికేం అవలేదు. శేషుని పోలీసులు అరెస్ట్ చేశారు. నాన్నగారు పోలీస్ స్టేషన్ ఉన్నారు. నాకేం తోచట్లేదు." ఒక్కసారి నా బుర్ర పనిచేయడం మానేసింది.

"మీరా! మీరా!"

"ఆ!ఉన్నా, చెప్పు ఏం జరిగింది? ఏమైనా యాక్సిడెంట్ చేశాడా?" ఫ్రెండ్స్ బైక్ మీద విన్యాసాలు చేస్తుంటాడు కదా!

"అదేం లేదు. ఫోన్‌లో ఏం చెప్పలేను. వెంటనే రా!" అమ్మ గొంతు అంత దీనంగా ఎప్పుడూ వినలేదు.

"శివానీకీ, రుద్రకీ చెప్పకపోయారా? మీకు మొహమాటం అయితే నేను ఫోన్ చేస్తాలే. రుద్ర సెల్ నంబర్ ఇవ్వనా?"

"రుద్రే అరెస్ట్ చేశాడు." నెత్తిమీద పిడుగుపడినట్లయింది.

"సరే! సాయంతంలోపు వస్తా." నీరసంగా అని ఫోన్ పెట్టేశాను.

✡✡✡

కారులో వెనక్కి వాలి కళ్ళు మూసుకుని ప్రొద్దున్నించీ జరిగిందంతా సింహావలోకనం చేసుకున్నాను.

అమ్మ ఫోన్ పెట్టేసిన వెంటనే శివానికి  ఫోన్ చేశాను.

"నువ్వు వస్తున్నావు కదా! మాట్లాడదాం." అని పెట్టేసింది శివానీ. రుద్ర సెల్ ఆఫ్ చేసుంది. నా నంబర్ చూసి ఆఫ్ చేస్తున్నాడేమో అని అనుమానం.

నందుకి ఫోన్ చేసి చెప్పాను. "అరె! కారు పంపుతాను వెళ్ళు. అక్కడ ఏం అవసరం ఉంటుందో, లంచ్ చేసి వెళ్ళు." అని వెంటనే తనకారు పంపాడు.

స్టూడియోకి ఫోన్ చేసి సెక్రటరీకి ఏం చేయాలో అంతా వివరించాను. ఇంటర్వ్యూకి 'ప్రతిభ'ని పంపమని చెప్పాను. ప్రతిభ నాకు యమ్.ఏలో జూనియర్, అప్పటికప్పుడు తనని పట్టుకుని ఎసైన్ చెయ్యాలి. నేను రాసుకున్న పాయింట్లన్నీ తనకి హాండోవర్ చెయ్యమని చెప్పి కాగితాలు తనకిమ్మని ఇంట్లో పనివాడికి చెప్పాను. ప్రతిభ ఏదయినా చురుగ్గా పట్టేస్తుంది. కాకపోతే ఎప్పటినుంచో షణ్ముఖ శర్మగారిని నేనే ఇంటర్వ్యూ చెయ్యాలని ఆశ. కానీ ఆయన ఎపాయింట్ మెంట్ మళ్ళీ ఇప్పట్లో దొరకదు కదా!

నేను మళ్ళీ రావడానికి ఎన్ని రోజులుపడుతుందో! నందు స్టూడియోని తను మానేజ్ చేస్తానన్నాడు. తన ఆఫీస్, నా పనీ చూసుకోవడం కష్టమే. కానీ తప్పదు మరి.

లంచ్ కార్లో చెయ్యచ్చులే అని పెరుగన్నం డబ్బాలో తెచ్చుకున్నాను. అన్నీ సర్ది కారెక్కడానికి రెండూ గంటలు పట్టింది. టైమ్ చూశాను. పదకొండూ పది. ఊరెళ్ళేసరికి నాలుగవుతుంది. డ్రైవర్ చాలా అనుభవం ఉన్నవాడే! కానీ ట్రాఫిక్.. సిటీ వదలడానికే గంటపైన పడుతుంది.

ఏం చేసుంటాడు? ఇంక కొన్ని నెలల్లో బి.టెక్ అయిపోయి ఉద్యోగంలో చేరతాడనుకుంటుండగా... నాన్నగారికి పిడుగుపాటే.

శేషు గురించి నాకు ఎప్పటినుంచో కలుగుతున్న ఇంగ్లీషులో ఏదో మాటుంది... ఆ! 'గట్ ఫీలింగ్'.... నిజమే నన్నమాట. మొదటి నుంచీ వాడి వ్యవహారం నాకు అనుమానంగానే ఉంది. ఎంత చెప్పినా నాన్నగారు వినిపించుకోలేదు. మాది మధ్యతరగతి కుటుంబం కదా! ఇప్పుడూ చిన్న టౌన్స్‌లో కూడా 'పబ్ కల్చర్' వచ్చేసింది. జల్సాలకి డబ్బుకావాలి... దొంగతనం చేసుంటాడు.

రుద్ర స్వయంగా తనే ఎరెస్ట్ చేశాడంటే, పెద్ద దొంగతనమే అయియుంటుంది. ఏదైనా బాంక్ లూటీ చేశారా? ఫ్రెండ్సందరూ కలిసి మా ఊళ్ళో, ఆడవాళ్ళు నగలు బాగానే వేసుకుని తిరుగుతుంటారు. బెదిరించి నగలూడదీశారా?

ఒకసారి తల విదిలించాను. ఆలోచనలతో బుర్ర పగిలిపోతోంది. అహల్య ఉంటే కాస్త పంచుకునేదాన్ని. అసలు ఉంటే, తను కూడా వచ్చేదే కదా! పోనీ చెపుదాం... బెంగుళూర్నించి వస్తుందేమో... అని ప్రయత్నం చేస్తే... అహల్య, గౌతమ్.. ఇద్దరూ ఫోన్ తియ్యట్లేదు. ఎక్కడికైనా వెళ్ళారో ఏమిటో! నందు బిజీగా ఉండి, అసలు కలవలేకపోయాడు.

అమ్మకి, నాన్నగారికి చేద్దామంటే.. ఎక్కడికి చెయ్యను?! ఇంట్లో ఇంకా ఫోన్ పెట్టుకోలేదు. నందు, ఒక సెల్ కొని, కార్డు వేయించి ఇస్తానంటే... నాన్నగారు ససేమిరా వద్దన్నారు. "మీరా చక్కగా ఉత్తరాలు వ్రాస్తుంది దాని కలవాటే. తోచనప్పుడల్లా చదువుకుంటూ ఉండచ్చు." కానీ ఎమర్జన్సీకి ఎలాగ?

✡✡✡

ఒక్క కుదుపుతో ఆగింది కారు. మగత నిద్రలో ఉన్న నేను ఏమైందో అని లేచాను. ఇంటిముందు ఉన్నాను. డ్రైవర్ తలుపు తీసి, నా బాగ్ లోపలికి తీసుకు వెళుతున్నాడు. ఎవరూ కనిపించరే?

తలుపు తీసి హాల్లోకి వెళ్ళాను. ఒక మూల అమ్మ కూర్చుని ఉంది. ప్రక్కనే కుర్చీలో బాబాయ్, క్రింద పిన్ని ఉన్నారు. ఎవరూ మాట్లాడటం లేదు. అమ్మ, నన్ను చూసి లేచింది. ఏడ్చి, ఏడ్చి కళ్ళు ఉబ్బి ఉన్నాయి. నాకు ఏం మాట్లాడాలో, ఏం చెయ్యాలో తోచలేదు.

''మళ్ళీ వస్తాం అక్కా! పిల్లలు వచ్చేటైమయిందికి. మీరా! కొంచెం సేపయాక కలుద్దాం.'' శారద పిన్ని బైటికి దారి తీసింది.

బాబాయ్ కూడా తలపంకించి వెళ్ళిపోయారు.

అమ్మ ఏం మాట్లాడకుండా కూర్చుంది.

''మేం సాబ్'' డ్రైవర్.

''ఛాయ్ తాగి అదా గంటలో వచ్చేయ్.'' పాపం! బయలుదేరినప్పటినుంచీ ఆపకుండా డ్రైవ్ చేశాడు. మధ్యలో ఆగాడేమో... నాకు తెలీలేదు.

''అచ్చా! మేమ్ సాబ్''. అంటూడ్రైవర్ వెళ్ళిపోయాడు.

వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి, అమ్మకో గ్లాసు, నాకో గ్లాసు తెచ్చాను. ఇద్దరం, అలాగే మౌనంగా త్రాగాము. గ్లాసులు లోపల పెట్టి వచ్చి, అమ్మ ప్రక్కన కూర్చున్నాను.

''ఇప్పుడు చెప్పమ్మా! ఏమైంది?''

అమ్మ, తల మోకాళ్ళ మధ్యలో పెట్టుకుని కుళ్ళి, కుళ్ళి ఏడవసాగింది, వెక్కిళ్ళు పెడుతూ.

''శేషుని ఎందుకు అరెస్ట్ చేశారు?''

కళ్ళలోంచి నీళ్ళు కారుతుండగా అతి నెమ్మదిగా అంది, ''రేప్, మర్డర్.''..!!!

***

శివానీ వాళ్ళింట్లో, మేడమీద బాల్కనీలో కూర్చున్నాం. బాల్కనీ అనే కంటె పెద్ద డాబా అంటే బాగుంటుంది. ఒక ప్రక్క గార్డెన్‌లో వేసుకునే ఇనప ఉయ్యాల.. కుండీల నిండా రకరకాల చెట్లు, ఒక తీరుగా అమర్చి ఉన్నాయి. మధ్యలో గుండ్రటి బల్ల, చుట్టూరా కుర్చీలు ఉన్నాయి. ఇద్దరం చెరో కుర్చీలో కూర్చుని, పంజరంలో ఉన్న 'లేబర్డ్స్' ఆటలు చూస్తున్నాం. ఉండుండి శివానీ నాకేసి చూస్తోంది. నేను ఒకసారి కళ్ళు నులుపుకుని, కాళ్ళు పైకి పెట్టి కుర్చీలో ముడిచి పెట్టి కూర్చున్నాను. కుర్చీ పెద్దగా ఉందేమో, సరిగ్గా ఇమిడిపోయాను.

రాత్రి ఏడు దాటింది. సాయంత్రం అమ్మ మాటలకి వచ్చిన షాక్ నుంచి తేరుకోవడానికి పావుగంట పైనే పట్టింది. డ్రైవర్ రాగానే, పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాను. నాన్నగారు అక్కడ బల్లమీద సర్వస్వం కోల్పోయినట్లు కూర్చుని ఉన్నారు. ఒక పదేళ్ళు వయసు మీద పడినట్లుగా ఉన్నారు. స్టేషన్లో, ఇద్దరు కాన్స్టేబుల్స్, ఒక యస్.ఐ ఉన్నారు.

నన్ను చూసి తలవంచుకున్నారు.. ఎపుడూ ఎవరికీ తలవంచని... హైస్కూల్ హెడ్ మాస్టర్ నారాయణరావుగారు. రిటైరవడానికి నాలుగు నెలల ముందు ప్రమోషన్ వచ్చింది నాన్నగారికి. ఆయన్ని చూస్తే కడుపులో ఏదో తెలియని బాధ కలిగింది. మెల్లిగా వెళ్ళి ప్రక్కన కూర్చున్నాను.

యస్.ఐ నన్ను చూసి లేచి దగ్గరగా వచ్చాడు. రుద్రకి బంధువునని తెలుసు. శివానీ పెళ్ళికి, నా పెళ్ళికి కూడా వచ్చాడు.

''మధ్యాహ్నం నుంచీ ఇంటికి వెళ్ళమంటే వెళ్ళట్లేదు మేడమ్.''

నాన్నగారి కేసి చూశాను. అదే.. తప్పు చేసిన వాడిలా ... చూపు. ఆయనకు కుడిచెయ్యి, నా రెండు చేతుల్తో పట్టుకున్నాను, సున్నితంగా. ''వాడ్ని కాదమ్మా! నన్ను పెట్టాలి జైల్లో.'' ఆ ఒక్క మాటతో అర్థమైంది. ఆయన ఎంత పశ్చాత్తాప పడుతున్నారో!

"నాలుగేళ్ళనుంచీ నువ్వెంత "జాగ్రత్త" అంటున్నా వినకుండా తోసిపారాశాను. చిన్నపిల్ల కదా! దానికేం తెలుసుననుకున్నాను. ఇప్పుడు, ఇలా జరగడానికి నా బాధ్యత ఎంత?" ఆయన మనసులో అనుకుంటున్న వన్నీ నాకు వినిపిస్తున్నాయి.

"రండి నాన్నగారూ, ఇంటికెళ్దాం. నేను చూసుకుంటాగదా అన్నీ" బలవంతంగా ఆయన్ని లేపి, కారులో ఇంటిదగ్గర దింపి, అమ్మకి అప్పచెప్పి వచ్చాను. ప్రొద్దున్నించీ.. ఇద్దరూ ఏమీ తినలేదుట. చారూ అన్నం వండి, బలవంతాన నాలుగు ముద్దలు తినిపించి, మజ్జిగ తాగించి... శివానీ వాళ్ళింటికి వచ్చేసరికి ఆరున్నర.

ఎప్పట్లా శివానీ పరుగెత్తుకుని వచ్చి, నన్ను లోపలికి తీసుకెళ్ళలేదు. వరండాలోంచే.. "రా! మీరా!" అని లోపలికి వెళ్ళింది. నేను వెనకాలే వెళ్ళాను. చెరొక గ్లాసూ బత్తాయి రసం తాగి మేడమీదకి వచ్చాం. రాత్రి నుంచీ తను కూడా ఏమీ తినలేదట. అంత ధైర్యంగా ఉండే శివానీ కూడా డీలా పడిపోయింది. సదా పెదవులపై నిలిచి ఉండే చిరునవ్వు మాయం అయిపోయింది. కళ్ళనిండా దిగులు. రాత్రంతా నిద్రపోలేదేమో, కళ్ళు అలసటగా కనిపిస్తున్నాయి.

ప్రతీదానికీ తక్షణం స్పందించే నేను స్తబ్దుగా ఉండిపోయాను. ఇలాంటిదేదో జరుగుతుందని ముందునుంచే ఊహించినట్లు, నా గోడు ఎవరూ వినిపించుకోలేదే అని ఆక్రోశం... రకరకాల భావాలతో నా మెదడు, మనసు మొద్దుబారిపోయాయి.

ఇపుడు కర్తవ్యం ఏమిటి? అమ్మనీ, నాన్నగారినీ ఎలా ఓదార్చాలి. కేసులు, కోర్టులూ... బోలెడు డబ్బు, నాన్నగారెక్కడినుంచీ తెస్తారు? ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్న మేము ఎంతని సర్దగలం నందు ఏమంటాడో తెలీదు కదా! అన్ని లోన్స్ పోగా..... సరిగ్గా సరిపోతుంది మా ఆదాయం. ఆలోచిస్తుంటే నడిసముద్రంలో ఉన్నట్లనిపిస్తోంది.

***

**అసలేమయింది? ఎలా జరిగింది?**

నేనేమీ అడగక ముందే శివానీ చెప్పసాగింది.

"రుద్ర ఏ.యస్.పిగా జాయినయిన కొత్తలో మొదలయింది. అంటే మనం డిగ్రీ ఫైనలియర్లో ఉండగా నన్నమాట. ముందు ఆడవాళ్ళు, "నగలు ఎవరో బెదిరించి దోచుకున్నారు" అని రిపోర్ట్ ఇచ్చారు. అలా రెండూ, మూడు కేసులు ఊర్లో పోలీస్ స్టేషన్లో నమోదయ్యాయి.

మీరు హైదరాబాద్ వెళ్ళాక, కొత్తలో బాగానే ఉంది. ఆర్నెల్లయాక మళ్ళీ మొదలు. జనం తక్కువగా ఉండే చోట, ఊరు చివర్లలో.... జరిగినట్లు రిపోర్టులు వచ్చేవి. చాలాసార్లు రుద్ర వచ్చి చెపుతుండేవాడు. "దొంగతనం ఒక్కటే కాదేమోనని నా అనుమానం" అని.

"ఎలా చెప్పగలవు?" అని అడిగాను.

"రెండు కేసుల్లో రిపోర్టిస్తున్న ఆడవాళ్ళని కలిశాను. వాళ్ళెందుకో పూర్తిగా నిజం చెప్పటంలేదేమోనని అనిపించింది. ఒక అమ్మాయి అయితే నేను ఎక్కువ ఇన్సిస్ట్ చేస్తుంటే కేసు విత్‌డ్రా చేసుకుని వెళ్ళిపోయింది." రుద్ర ముఖకవళికల్ని బట్టి చెప్పగలడు. అసలు ట్రైయిన్డ్ పోలీస్ ఆఫీసర్స్ చాలామంది చెప్పగలరనుకుంటాను.

తరువాత్తరువాత రెండు చోట్ల యువకులు దెబ్బలు తిని కనిపించారు. వాళ్ళని హాస్పిటల్‌లో చేర్పించినప్పుడు తెలిసింది. హాస్పిటల్ వాళ్ళు ఇన్‌ఫామ్ చేస్తారు కదా! కానీ వాళ్ళేమీ, ఎవరిమీదా రిపోర్టివ్వలేదు. "ఎలా తగిలాయి దెబ్బలు" అంటే ఏవో కథలు చెప్పారు.

అయిదు నెలలక్రితం అనుకుంటా, కృష్ణ ఒడ్డున కొంచెం దూరంగా ఇరవై యేదేళ్ళ అతను మర్డర్ అయి కనిపించాడు. అసలు ఎవరూ కూడా వంటరిగా వెళ్ళడం మానేశారు. రాత్రి తొమ్మిది దాటాక జన సంచారమే తగ్గిపోయిందని పోలీస్ పెట్రోలింగ్ తేల్చింది.

ఇంక సెకండ్ షోల కయితే, హాల్స్ సగం కూడా నిండటంలేదట. ఆ మర్డర్ అయినతను కూడా మన ఊరివాడు కాదు. అందుకే రాత్రి దూరంగా వెళ్ళుంటాడు.

మొత్తానికి ఊరంతా ఒక రకమైన భీకర వాతావరణంలో ఉంటోంది, ఎవరూ పైకి అనకపోయినా.

రుద్రకి ఈ సంవత్సరం ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్ రావాలి. డి.జి.పి, ఈ మిస్టీరియస్ కేసుల్ని ఇన్‌వెస్టిగేట్ చెయ్యమని ఆర్డర్ వేశారు. ఫోర్‌మంత్స్ నుంచీ రుద్ర అదే పనిమీద ఉన్నాడు. ఎవరో బైటపడకుండా పకడ్బందీగా ప్లాన్ చేసి చేస్తున్నారు. పోలీస్ ఫోర్సుతోనూ, అతను ఒంటరిగా కానీ... రాత్రి అంతా ఎంత తిరిగినా ఎవర్నీ కనిపెట్టలేదు.

అప్పుడు, నేనే అన్నాను. "మనిద్దరం మామూలుగా, ఒక యంగ్ కపుల్ షికారుకెళ్ళినట్టు వెళ్ళి చూద్దాం" అని. అలా ఒక నెల, మన ఊర్లోంచి బైటికి వెళ్ళే అన్ని రోడ్లకీ, రాత్రి ఎనిమిది నుంచీ తొమ్మిది వరకూ వెళ్ళాము.

మామూలుగా ఎప్పుడూ చుడీదార్‌లో ఉండే నేను చీర కట్టుకునేదాన్ని. ఎప్పుడూ యూనిఫామ్‌లోనో, ఫుల్‌హాండ్స్ టక్‌లోనో ఉండే రుద్ర, టీ షర్ట్, జీన్స్‌తో వచ్చేవాడు. కానీ తన దగ్గర కావల్సిన ఎక్విప్‌మెంట్ అంతా ఉండేది. రివాల్వర్, రోప్, నైఫ్‌లాంటివి అన్నీ. పదినిముషాల కొకసారి, మేం వెళ్ళేదారిలో మఫ్టీలో పోలీసులు, మామూలు కార్లలో తిరుగుతుండేవారు, ఎవరికీ అనుమానం రాకుండా. అలా శని, ఆదివారాలు కూడా వదల్లేదు మేము.

నిన్నరాత్రి అలాగే బైలుదేరాం రుద్ర, నేనూ. తూర్పు వేపు... అంటే వైజాగ్ వెళ్ళే మెయిన్ రోడ్‌కి జాయిన్ అయే సన్నరోడ్‌మీద నడుస్తున్నాం. నీకు తెలుసుకదా! ఆ రోడ్ మీద కాలవదాటడానికి వంతెన, ఆ తర్వాత రైలు గేటు ఉంటాయి. వంతెన దాటి, గేటు కేసి నడిచాం. ఇటు ప్రక్క పొలాలు, అటుప్రక్క తుప్పలు. సింగిల్ లైను రోడ్డు. పైగా రోడ్ అంతా కంకర బైటికొచ్చేసి, గతుకులతో వెహికల్ వెళ్ళడానికి నానా అవస్థపడాలి. అందుకని ఎప్పుడో కానీ కార్లు వెళ్ళవు. తుప్పలు దట్టంగా ఉండడం వల్ల ఊర్లో వాళ్ళకి అక్కడ ఏం జరుగుతోందో కనిపించదు. అప్పుడే మెయిన్ రోడ్ మీంచి ఒక కారు ఆ రోడ్ లోంచి ఊర్లోకి వెళ్ళింది. అందులో పోలీసులున్నారు. కానీ మమ్మల్ని పట్టించుకోనట్లు వెళ్ళిపోయారు.

ఆ సమయంలో ఒక గంట సేపు ఏ రైలూ వెళ్ళదు. అదే అనువైన ప్రదేశం, సమయం. "ఏదైనా జరిగితే బాగుండును. రుద్రకి ఇంక ట్రాన్స్‌ఫర్ అయే సూచనలు కనిపిస్తున్నాయి." అనుకున్నాను. అప్పుడు వచ్చారు." శివానీ ఒక్క నిముషం ఆపింది. గ్లాసులోకి నీళ్ళు వంపుకుని త్రాగింది. అలాగే నిస్సత్తువగా కూర్చుని వింటున్నాను. ఒకసారి కాళ్ళు జాపి వత్తుకుని మళ్ళీ ముడుచుకుని కూర్చున్నాను.

"మీరా! ఒకరకంగా ఇది ఇన్నాళ్ళుగా కొనసాగడానికి నేను కూడా బాధ్యురాల్నే" శివానీ మాటలు నాకేం అర్థం కాలేదు. అయోమయంగా చూస్తుండిపోయాను.

"పూర్తిగా వింటే నీకు అర్థమవుతుంది" అని మళ్ళీ మొదలు పెట్టింది.

"అందరూ ఇంచుమించు ఇరవై అయిదేళ్ళ వయసున్న వాళ్ళే, నలుగురు యువకులు. ముక్కు, కళ్ళ దగ్గర మాత్రం చిల్లులున్న కాప్‌లు పెట్టుకున్నారు. మొహం, తల పూర్తిగా కప్పేసి ఉంది.

ఇద్దరు నా వెనక వచ్చి రెండు చేతులు పట్టుకున్నారు. ఇద్దరు, బలంగా ఉన్నారు... వాళ్ళు రుద్ర దగ్గరికి వెళ్ళి, పక్కకి పొలలోకి లాగేశారు. అక్కడ వీధిదీపాలు కూడా లేవు. నా వెనక ఉన్న ఇద్దరు నన్ను తుప్పల్లోకి లాక్కెళ్ళారు. అరవకుండా నా నోరుమూసేశారు.

రుద్ర బలం ముందు, ట్రైనింగ్ ముందు వాళ్ళేపాటి? ఇద్దరున్నారు కనుక తను కొంచెం కష్టపడాల్సి వచ్చింది. పదిమందిని చొక్కా నలగకుండా తన్నడానికి సినిమా కాదుకదా! వాళ్ళు కూడా బాగానే పెంచారు బాడీని. సందు చూసుకుని రివాల్వర్ తీసి కంట్రోల్ చెయ్యడానికి పదినిముషాలు పట్టింది. ఇద్దర్నీ కట్టేసి నా దగ్గరకి వచ్చాడు.

నన్ను తీసుకెళ్ళిన వాళ్ళు అంత బలవంతులు కాకపోయినా, మామూలు ఆడపిల్లని... అందులోనూ పానిక్ అయిన పిల్లని సులువుగా లొంగదీసుకోగలిగిన వాళ్ళే. నన్ను క్రిందపడేసి, కాళ్ళ చేతులు కట్టేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. రుద్ర నాకిచ్చిన ట్రెయినింగ్‌తో, నేను ఎదిరించాను. అందులో ఇలాంటిదేదో జరుగుతుందని ప్రిపేర్డ్‌గా ఉన్నాను కదా!

కానీ ఇద్దరు మగవాళ్ళ ముందు, నాబలం సరిపోలేదు. ఒకడు నా దవడ మీద కొట్టాడు. పళ్ళు ఊడిపోయాయేమో అనిపించింది"

శివానీ కాసేపు ఆగింది. అందుకేనా అప్పుడప్పుడు చేత్తో, చెంప తడుముకుంటోంది! పైగా కష్టం మీద మాట్లాడుతున్నట్లుంది. ఇందాక పైకెక్కుతుంటే చూశాను. మోచేతులు, అరిచేతులు గీరుకుపోయినట్లు. నా ధోరణిలో నేనుండి, అడగడం మర్చిపోయాను.

చటుక్కున లేచి తన దగ్గరికి వెళ్ళబోయాను. చేత్తో ఆగమన్నట్టు సైగ చేసింది. మళ్ళీ కూర్చుని వినసాగాను. అందుకేనా! ఎవరో నొక్కినట్టు పట్టి పట్టి మాట్లాడుతోంది.

"రుద్ర నా దగ్గరకి వస్తుంటే, వెనక్కి తిరిగి ఉన్నవాళ్ళు... వాళ్ళ ఫ్రెండ్సే వస్తున్నారనుకున్నారు. "ఎప్పుడూ ఇలాంటి కేసు చూళ్ళేదురా! మామూలుగా వణికిపోయి మూర్ఛపోయేవాళ్ళు కదా! ఈ అమ్మాయి ధైర్యవంతురాలే." అంటూ నాకాళ్ళు కట్టేయయబోయాడు ఒకడు. చాచి, కాల్తోతన్నాను. అదాటుగా ఉన్నాడు. అందులో అలా తంతానని ఊహించలేదేమో! ఎగిరి రుద్ర కాళ్ళదగ్గర పడ్డాడు. రుద్ర లేపి, తాపీగా దగ్గరకొస్తుంటే, నాలుగోవాడు, నన్ను వదిలేసి పారిపోబోయాడు. పారిపోవాలంటే, రుద్రవేపునుంచే వెళ్ళాలి. అటు ప్రక్క అంతా ముళ్ళపొదలు. పరుగెడుతుంటే, రుద్ర ఒక చేత్తో పట్టేసుకున్నాడు. వాడే అందరిలోకీ వీక్‌గా ఉన్నాడు కాస్త.

వీళ్ళిద్దర్నీ కూడా కట్టేస్తుంటే, మఫ్టీ పోలీసులున్న కారు వచ్చింది. అవసరమైతే మర్డర్ చెయ్యడానిక్కూడా వెనుకాడరు కదా, ఆ గాంగ్! అందుకే పోలీసుల్ని పెట్రోలింగ్ చెయ్యమని చెప్పాడు రుద్ర. అందర్నీ, బేడీలు వేసి స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

రుద్ర, నేను కూడా స్టేషన్‌కి వెళ్ళి, జరిగింది రాసిచ్చాము. చదివి, సంతకాలు పెట్టమన్నాడు రుద్ర. అందర్నీ విడి, విడిగా సెల్స్‌లో పెట్టించాడు. ముగ్గురు మాత్రం సైన్ చెయ్యమని మొండికేశారు. లాయర్ వచ్చేవరకు మాట్లాడమన్నారు. ఒకడు మాత్రం మారుమాట్లాడకుండా సైన్ చేశాడు." శివానీ బాధగా దవడ తడుముకుంది.

అడగడం అనవసరం. అయినా అడిగాను. "ఎవరు?"

"'శేషు', అతనే పారిపోబోయినవాడు."

మిగిలిన ముగ్గుర్నీ కూడా ఊహించగలను. అయినా నిజమో కాదో తెలుసుకోవాలి కదా! "మిగిలిన ముగ్గురూ.."

"నీ ఊహ కరెక్టే. ఫణీంద్ర, అవినాశ్, అక్షయ్."

"అయామ్ సారీ మీరా!" రుద్ర రాత్రి భోజనానికి వస్తూనే అన్నాడు.

"ఎందుకు? నీ డ్యూటీ నువ్వు చేశావు. డోంట్ ఫీల్ బాడ్. ఎవరైనా తప్పు చేసినందుకు శిక్ష అనుభవించాలి కదా!"

"అవుననుకో! కానీ తప్పు చేసింది మనవాళ్ళే అయితే చాలా బాధగా ఉంటుంది కదా!" రుద్ర మొహంలో, మాటలో మాటలో బాగా అలసట కనిపిస్తోంది. రాత్రి నుంచీ తిరుగుతూనే ఉన్నాడట.

"ఏమవుతుంది?" నా గొంతు నాకే వినిపించలేనట్లుగా ఉంది.

"యమ్.ఎల్.ఏ గారు, ఐ.టి.ఓ గారు బెయిల్ తెచ్చారు. బెయిల్ ఇవ్వడానికి లేకుండా ప్రయత్నం చేశాను. మా మీద ఎటాక్ తప్ప ఏమీ ఆధారల్లేవనుకున్నారు. ఇదొక్కటే కేసయితే, మేం కావాలని చేస్తున్నాం అని అంటారు." రుద్ర భోజనానికి కూర్చోబోతూ అన్నాడు.

"మీరా! దా! నువ్వు కూడా. మధ్యాహ్నం ఏ తిన్నావో ఏమో!" శివానీ నాక్కూడా కంచం పెట్టింది.

ముగ్గురం డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాం. నేను చేత్తో కెలుకుతూ కూర్చున్నాను.

"ప్లీజ్ మీరా! కొంచెం తిను. ఏదైనా తట్టుకోడానికైనా తినాలి కదా!" శివానీ బ్రతిమాలింది.

"మరి ఇప్పుడేం చెయ్యాలి" రుద్రని అడిగాను.

"ఇదివరకు మర్డర్ కేసులో ఫింగర్ ప్రింట్స్, ముగ్గురితో సరిపోయాయి. అందుకే బెయిల్ రాలేదు. శేషు ప్రింట్స్ లేవు. అతను అప్రూవర్‌గా మారితే తక్కువ శిక్షపడచ్చు. ఇదంతా తేలడానికి చాలా రోజులు పడుతుంది. అన్ని రోజులూ.. నెలలు కూడా కావచ్చు జైల్లో ఉండాల్సొస్తుందేమో! శివానీని 'ఎటెమ్ప్టెడ్ రేప్' అని కూడ్ పెడదామనుకుంటున్నాను."

ఆశ్చర్యంగా చూశాను. "కోర్టు చుట్టూ తిరగొద్దూ!"

"తప్పదు మీరా! అయామ్ రెడీ. ఎవరికి వాళ్ళే భయాపడుతూ కూర్చుంటే దుర్మార్గాలు ఎలా ఆగుతాయి?" అతి కష్టం మీద నములుతూ అంది శివానీ.

"నందుకి చెప్పి, మీ పేరెంట్సుని తీసుకెళ్ళు. మీరు ఇక్కడుండి చేసేదేమీ లేదు. ఎంత వీలయితే అంత తక్కువ శిక్ష పడేలా నేను చూస్తాను." రుద్ర భరోసా ఇస్తూ అన్నాడు.

"చిన్నదైనా, పెద్దదైనా జైలు శిక్షపడ్డాక, కెరీర్.... జీవితం సర్వనాశనం అయినట్లే కదా! అమ్మా, నాన్న ఎన్ని ఆశలు పెట్టుకున్నారు? అంత ప్రేమగా చూస్తుంటే, ఏం లోటని ఇలా చెయ్యాలి?" దుఃఖం ఆపుకోలేక బల్లమీద తలపెట్టుకున్నాను.

రుద్రజాలిగా చూశాడు. అంతకన్నా ఏం చేస్తాడు?

"నిద్దరొస్తోంది. ఎక్స్‌క్యూజ్‌మి" అంటూ రుద్ర మేడ మీదకి వెళ్ళిపోయాడు. శివానీ, వాళ్ళ అమ్మకి భోజనం తీసుకుని గదిలోకి వెళ్ళింది. ఆవిడ పెడితే తింటారట. లేకపోతే అంతే.. అలాగే పడుకుంటారు.

హాల్లో ...ఒక్కదాన్నీ కూర్చుంటే, ఆలోచనలు ఆపకుండా ముసరసాగాయి. ఎలా? అమ్మా, నాన్నని ఓదార్చడం? నాతో వస్తారా? రాకపోతే వాళ్ళ నెవరు చూస్తారు? భౌతికంగా ఆరోగ్యంగా ఉన్నా.. 'శేషు' భవిష్యత్తు శూన్యమైపోయిందని తెలిసి తట్టుకోగలరా? నేను మాత్రం ఇక్కడ ఎన్నాళ్ళుండగలను? ఇదంతా తేలేవరకు 'నందుని' వదిలి ఉండగల్నా? కిం కర్తవ్యం?

మా ఊరు వచ్చి పదిహేను రోజులైంది. నందు, ఇంక స్టూడియో మేనేజ్ చెయ్యడం కష్టం అంటున్నాడు. "మీ పేరెంట్స్‌ని తీసుకుని వచ్చేయ్! ఇక్కడ చూసుకుందాం!" ప్రొద్దున్నే ఫోన్ చేశాడు.

వచ్చిన మర్నాడే కారు పంపేశాను. కావాలంటే మళ్ళీ పంపుతాడు.

"నువ్వు వెళ్ళమ్మా! మేం బాగానే ఉంటాం. ఇదేం ఇప్పట్లో తేలే వ్యవహారమా?" నాన్నగారు నీరసంగా అన్నారు. రోజూ, వంట చేసి బలవంతం చేస్తే కానీ... ఏమీ తినట్లేదు ఇద్దరూ.

నన్ను చూస్తే... ఇంకా ఏదో అపరాధం చేసినట్లు బాధపడుతున్నారు. నేను, వాడి గురించి హెచ్చరిస్తే కూడా పట్టించుకోలేదని.

ఏదో అనుకోవడంగానీ... అమ్మ, నాన్నగారు ఏమైనా చెప్పినా వింటాడా? "వినాశకాలే విపరీత బుద్ధి" అని. ఇంట్లో అంతా సౌమ్య, సాత్విక వాతావరణం.. పిల్లల్లో ఇలాంటి ఆలోచనలుంటాయని ఎవరూహించగలరు?

ఇంకా నాన్నగారు అంతా తెలుసున్నవాళ్ళు. వేదాంతి.. కనుక కాస్త ఫరవాలేదు. అమ్మనైతే అసలు పట్టుకోలేకపోయాను. ఇంటికొచ్చే బంధువులు... పాపం! ఏదో ఓదార్చాలని చూస్తారుగానీ ఏం మాట్లాడతారు? చూసి వెళ్ళిపోయినా... వాళ్ళు వెళ్ళాక అమ్మ కుళ్ళి, కుళ్ళి ఏడుస్తుంది. రావద్దని చెప్పలేం కదా!

బాబాయ్ వాళ్ళు మళ్ళీ రాలేదు. పిల్లలు కూడా రాకుండా కట్టడి చేశారు. నాన్నగారు కేసు గురించి ఏమీ మాట్లాడలేదు. "లాయర్ని కూడా పెట్టను" అనేశారు. లాయరు ఫీజులు ఎక్కడ్నించీ తేవాలి?

మిగిలిన ముగ్గురికీ మంచి లాయర్లని పెట్టుకున్నారు. ఫణీంద్రకి హైదరాబాదు నుంచి డిఫెన్స్ లాయర్ని పిలిపించారు. ఎంత ప్రయత్నించినా బెయిల్ మాత్రం ఇవ్వలేదు.

నేను రోజు విడిచి రోజు శేషుని చూసి వస్తున్నాను. నన్ను చూసి తలదించుకుంటాడు. ఆ పొగరంతా దిగిపోయింది. నేను 'ఎందుకిలా చేశావని' ఎప్పుడూ అడగలేదు. తినడానికేదైనా ఇచ్చి, చదువుకోవడానికి పుస్తకం ఇచ్చి వచ్చేయడమే. బాగా చిక్కిపోయాడు.

"మీరా?" అమ్మ పిలిచింది. ఆవిడ అంతవరకు నన్ను పిలిచి మాట్లాడలేదు. వెళ్ళి దగ్గర కూర్చుని, రెండు చేతులూ పట్టుకున్నాను.

"ఇంక నువ్వెళ్ళమ్మా! నేను మామూలుగా వంట చేసి, నాన్నగారిని చూసుకుంటాను. శేషుని కూడా చూసి వస్తాను." అమ్మ మాటలకి కొంచెం ఆశ కలిగింది.

"నిజంగానా అమ్మా? ఎంతకాలం అలా ఉంటారు? కాస్త మనసు మరలించుకోవాలి." నిజం చెప్పద్దూ! నాకేం చెయ్యాలో ఏమీ తోచట్లేదు. ఉండలేను, వెళ్ళలేను.

"నిజం తల్లీ! నిన్ను చూస్తే ముందు కడుపు తరుక్కుపోతోంది. వాడూ చేసిన పాపానికి, నువ్వు నలిగిపోతున్నావ్. వాడి ముఖాన ఏం రాసిపెట్టుంటే అదే అవుతుంది. నువ్వెళ్ళు." ఇలాగే, ఇంకొన్నాళ్ళుంటే నాకు పిచ్చెక్కిపోయేలా ఉంది.

నందుకు వస్తున్నానని ఫోన్ చేశాను. "కారు పంపొద్దు. బస్సెక్కేస్తాను. రేపు ఆరింటికల్లా ఇంట్లో ఉంటాను." అని చెప్పాను.

వెళ్ళేముందు, జైలుకి వెళ్ళి శేషుని కలిశాను. వెళుతున్నానని చెప్పాను. అప్పుడు కదిలాడు వాడు. ఊచలు పట్టుకుని... కడుపులో పేగులు కదిలేల .... హృదయ విదారకంగా ఏడిచాడు.

"నన్ను క్షమించమని అడగనక్కా!" 'అక్కా' ఆ పిలుపు విని ఎన్నాళ్ళైంది? ఇంజినీరింగ్ లో చేరాక, ప్రపంచానికి అధిపతినైపోయాననుకున్నాడు. నేననే మనిషిని ఉన్నాననే పట్టలేదు. దారి తప్పుతున్నాడేమో అని భయంతో ఏదైనా చెప్పబోయాను. అది కొంచెం నెమ్మదిగా చెప్పవలసిందేమో! తప్పుచేస్తున్నాడు కనుకనే, నన్ను చూసి అలా రెచ్చిపోయేవాడనుకుంటా!

"వాళ్ళు బాగా చదువుతారని, మొదటవాళ్ళ దగ్గరికి వెళ్ళాను. నిజంగానే సబ్జెక్ట్‌లు బాగా వచ్చు. ఇంక అలా ఆకర్షణ లాగేసింది. ముందు చిన్న, చిన్న ఎంజాయ్ మెంట్లు... అలా పూర్తిగా కూరుకుపోయాను. నువ్వేమైనా చెపుతుంటే.. నాన్నగారి దగ్గర నీ అనుమానాలు చెపుతుంటే.. నాకు వెర్రి కోపం వచ్చేది. అదొక మత్తులో ఉండిపోయాను. చిన్నప్పుడు చదువుకున్నాం చూడు... "పోగాలం దాపురించినవాడు మిత్రవాక్యము వినడు" అని అలాగ కళ్ళుమూసుకుపోయాయి." శేషు అంత దీనంగా మాట్లాడటం ఎప్పుడూ వినలేదు.

"ఇప్పుడు విచారించేం లాభం? ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? మూడేళ్ళ నుంచి పట్టుబడలేదు కదా! మమ్మల్నెవరు పట్టుకుంటారనుకున్నారా?" నిష్ఠూరంగా అన్నాను.

"ఫణీంద్ర డిస్టింక్షన్ స్టూడెంట్. మమ్మల్ని చదువులో గైడ్ చేస్తూనే, థ్రిల్.. ఎక్సైట్‌మెంట్ అనుకుంటూ దించేవాడు. 'వాళ్ళ నాన్న పొలిటికల్ ఇన్‌ఫ్లూయన్స్ ఉన్నవాడని. ఏం డేంజర్ లేదని మాకు ప్రతీ 'ప్రాజెక్ట్' ముందర చెపుతుండేవాడు." శేషు నాలిక్కరుచుకున్నాడు.

"ప్రాజెక్టా!" ఆశ్చర్యంగా అడిగాను.

శేషు తలవంచుకున్నాడు. ఏం చెపుతాడు. అనుకోకుండా మళ్ళీ ఒక సుభాషితం గుర్తుకు వచ్చింది నాకు. అప్రయత్నంగా పైకి అనేశాను.

"విద్యచే భూషితుడయి వెలయుచున్నఁ

దొడరి వర్జింపనగుఁజుమీ దుర్జనుండు

చారు మాణిక్య భూషిత శస్తమస్త

కంబుగల పన్నగము భయంకరము గదె"

శేషు తల ఇంకా భూమిలోకి కూరుకుపోయింది. ఎంత "ప్రాజెక్ట్" పనుల్లో బిజీగా ఉన్నా తెలుగు మాష్టారి కొడుకే కదా మరి. అదే అన్నాను.

"అర్ధమయే ఉంటుందికదా!"

"అంతా అయిపోయాక అర్ధమయిందక్కా!" మళ్ళీ భోరుమన్నాడు.

"టైమైపోయిందమ్మా! " సెంట్రీ వార్నింగ్ ఇచ్చాడు.

"సరే! మళ్ళీ నెల వస్తాను." అంటూ లేచాను

"అక్కా?" వెనక్కి తిరిగి చూశాను.

"ఆ మర్డర్ అయినప్పుడు, నేను ఊర్లోనే లేను. స్టడీ టూర్‌కి వెళ్ళాను. నాకేం తెలీదు."

"మరి ఆడపిల్లల్ని..." ఇంకా పూర్తిచెయ్యలేదు....

"నేనెప్పుడూ రేప్ చెయ్యలేదక్కా!"

"నగలు మాత్రం తీసుకున్నావా?" కఠినంగా అడిగాను. ఏం మాట్లాడకుండా తలదించుకున్నాడు. పశ్చాత్తాపమో, పట్టుబడ్డానని బాధోకానీ... జల జలా నీళ్ళు కారాయి. బరువుగా తిరిగి బైటికి వచ్చాను.

"నాకు బ్రతకాలనుందక్కా!"

వెనక్కి తిరిగి చూడకుండా బైటకి నడిచాను.

## 12

బస్సు దిగుతుంటే చేతిలో బాగ్ అందుకున్నాడు నందు సంభ్రమంగా చూశాను. "ఏ బస్‌లో వస్తున్నానో చెప్పలేదు కదా!"

"అన్నీ ఎరౌండ్ సిక్స్ వస్తాయి కదా! అరగంట నుంచీ చూస్తున్నాను."

నందు చెయ్యి పట్టుకుని దింపాడు. మనసులో మాట కనుక్కోగలిగిన ʽజీవన సహచరుడుʼ ఎప్పుడు వస్తానో తెలుసుకోలేడా!

ఇంట్లో అడుగు పెడుతూనే.. అప్పటివరకూ ఎలాగో ఆగిన దుఃఖం... కట్టలు తెగిన ప్రవాహంలా బైట పడింది. నందుని చుట్టుకుని, మనసులోని బాధంతా పోయేలా ఏడ్చాను.

ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ తిరిగే మీరాని తప్ప.. ఇలా దిక్కు తోచనట్లున్న మీరాని చూడలేదు నందు. తనవరకూ ఎందుకు? నాకే ఎప్పుడూ ఏడ్చిన గుర్తులేదు. మౌనంగా నా వీపు నిమురుతూ ఉండిపోయాడు.

అప్పటివరకు అమ్మకీ, నాన్నకీ కొండంత బలం ఇచ్చిన నేను, నందుని చూడగానే వైరస్ సోకిన వృక్షంలా కూలబడిపోయాను.

"నందూ! అమ్మా, నాన్నగారు.." నా కళ్ళలోంచి ధారగా కారుతున్న నీళ్ళు తుడుస్తూ,

"మనం వెళ్ళి తీసుకు వద్దాం. వాళ్ళని మనం చూసుకుందాం. సరేనా! ఇంక ఊరుకో!" అన్నాడు.

కాస్త నెమ్మదించి, "స్నానం అదీ కానీ" అంటూ బాగ్ లోపల పెట్టి కాఫీ కలిపి ఇచ్చాడు.

అదృష్టవశాత్తు ఆదివారం అవడంతో పరుగులు పెట్టాల్సిన పనిలేదు. నేను తయారయి వచ్చేసరికి హోటల్ మినర్వానుంచి ఇడ్లీ ఉప్మా తెచ్చి ప్లేట్లలో సర్దాడు.

"దా! ఇన్ని రోజులు నువ్వసలు సరిగ్గా ఏదీ తినలేదట నాక్కూడా సరిగ్గా ఏదీ ఎక్కలేదు. కలిసి తిందాం."

కుర్చీ జరిపి, కూర్చోబెట్టాడు. మాట్లాడకుండా తిన్నాము. పదిహేను రోజుల తర్వాత, నందు ఎదురుగుండా కూర్చుని కడుపు నిండా తినగలిగాను. కొంచెం శక్తి వచ్చినట్లుంది. అన్ని రోజులూ మనోబలంతో, తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో ఉన్నాను.

శివానీ, రుద్ర అప్పుడప్పుడు పలకరించడం, సానుభూతి చూపడం తప్ప, నాకు అంత మనస్థైర్యం ఇవ్వలేకపోయారు. వాళ్ళ సమస్యలు వాళ్ళకున్నాయి. రాజకీయంగా, ప్రభుత్వపరంగా బలమైన వ్యక్తులతో తలపడుతున్నారు కదా!

"శివానీ కొంత చెప్పింది. కానీ పూర్తిగా తెలీలేదు. ఏం జరిగింది?" సోఫాలో విశ్రాంతిగా కూర్చున్నాక నందూ అడిగాడు.

మాటలు కూడ బలుక్కుని జరిగిందంతా చెప్పాను.

అంతా విని చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"తనకి స్వయంగా పుట్టిన బుద్ధికాదు. శేషు, ప్రలోభపడ్డాడు. కొన్ని సినిమాల్లో గుండాలని హీరోలుగా మలుస్తున్నారు. అది చూసి కొంత, 'ఎలాఉంటుందో' చూద్దాం' అని కుతూహలం కొంత... యూత్ ప్రక్కదారి పట్టేస్తున్నారు.

రుద్రతో మాట్లాడి మంచి లాయర్ని పెడదాం" అన్నాడు.

"చాలా ఖర్చవుతుంది కదా! మరి అత్తయ్యగారు, మామయ్యగారు.." సగంలోనే ఆపేశాను.

"మనకి క్రొత్త ప్రాజెక్ట్ వచ్చింది. ఇన్‌కమ్ ఫరవాలేదు. మమ్మీ డాడీకి నేను చెపుతాను. ఏమీ అనరు. ఈసారి వెళ్ళినపుడు అత్తయ్యగారినీ, మామయ్యగారిని తీసుకు వచ్చేయి. వాళ్ళని అడక్కుండా బాగ్‌లు సర్ది రమ్మనడమే! అంతే." నందుకి కాన్ఫిడెన్స్ చాలా ఎక్కువ.

నందుకేసి కృతజ్ఞత నిండిన చూపుతో చూస్తూ, ఫోనందుకున్నాను. సెక్రెటరీకి ఫోన్ చేసి, పదిహేను రోజుల్లో జరిగింది తెలుసుకోడానికి.

* * *

కడుపు నిండిందేమో, అలాగే సోఫాలో పడుకుని కంటి నిండా నిద్రపోయాను.

"మీరా! ఫోను." నందు లేపాడు. ఎవరో ఇంపార్టెంట్ అయివుంటుంది. లేకపోతే నందు నిద్రలేపి చెప్పడు.

"మీరా! నేను ఇప్పుడే వచ్చాం. గౌతమ్ పనిమీద యు.యస్ వెళుతుంటే నేను కూడా వెళ్ళాను. సారీ! శివానీ ఫోన్ చేసింది."

"అహల్యా! నీకోసం ఎంత ప్రయత్నించానో తెలుసా!" ఫోన్ గట్టిగా పట్టుకుని, ఫోన్ వదిలితే.... అహల్య ఎక్కడికైనా వెళుతుందేమో అన్నట్లుగా అరిచాను.

"మీరా! నెమ్మది. ఎక్సైట్ అవకు. అంతా సర్దుకుంటుంది. అత్త ఎలా ఉంది?"

"బాగా డీలా పడిపోయారు అమ్మా నాన్నగారు. వాళ్ళు ఇంక మామూలుగా అవుతారంటావా?"

"తప్పకుండా. మనం అంతా ఉన్నాం కదా. వచ్చేవారం నేను కూడా మన ఊరువస్తాను. నువ్వే వాళ్ళని చూసుకోవాలి. జాగ్రత్త." అంటూ అహల్య ఫోన్ పెట్టేసింది.

గౌతమ్ మాట్లాడలేదే! మా కుటుంబం అంటే అసహ్యం వేసిందేమో! మా చుట్టాల్లో జైలుకి వెళ్ళిన వాళ్ళెవరూ లేరు. అందులోనూ మర్డర్.. ఎవరూహిస్తారు. ఎందుకిలా అయింది

మాకు? ఇంక ఎవరూ మాతో మాట్లాడరా! ఎలా ఉంటుంది భవిష్యత్తు? అసలు భవిష్యత్తంటూ ఉంటే!

చల్లటి ఆరెంజ్ జ్యూస్, రెండు గ్లాసులో తెచ్చి, నాకొకటి ఇచ్చి తనొకటి తీసుకున్నాడు నందూ!

"లంచ్‌కి బైటకి వెళదాం పద."

సిగ్గుపడి లేచాను. రోజూ బైటే తింటున్నాడు కదా.

"వద్దు నందూ! వంట చేస్తాను" జ్యూస్ త్రాగేసి వంటింట్లోకి నడిచాను.

**స్టూడియోలో** ఊపిరి సలపనంత పని. రోజూ సాయంత్రం నందు వెళ్ళి చూసుకునేవాడట. కానీ నేను పెట్టినంత ధ్యాస పెట్టలేడు కదా! అప్పుడప్పుడే మా ప్రోగ్రాములు జనాదరణ పొందుతున్నాయి. ఆ వేవ్‌లో కొన్ని రోజులు కొట్టుకుపోగలం కానీ, వదిలేస్తే మళ్ళీ మొదటి కొస్తుంది. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్స్‌ని పిలిచి ప్లాన్స్ అన్నీ కనుక్కుని, కొత్తవాటికి రిపోర్ట్సు తయారు చెయ్యమని... ఇంటర్వ్యూలు తీసుకోవలసిన ప్రముఖుల దగ్గర ఎపాయింట్ మెంట్ తీసుకోడం... పగలు, రాత్రి అదే ఆలోచన.

ఈ హడావుడిలో శేషు సంగతి ప్రక్కన పెట్టేయగలిగాను. వారం అయాక వస్తానంటే, ఎక్కువ ఏం ముందుకి నడవలేదని వద్దన్నాడు రుద్ర. అమ్మా, నాన్నగారూ బాగానే ఉన్నారని శివానీ చెప్పింది.

పదిరోజుల పైన అయింది. ఇంక ఆగలేకపోయాను. కారు తీసుకుని శనివారం వెళ్ళి ఆదివారం వచ్చేస్తానని నందుకి చెప్పి బయలుదేరాను.

ఇంటికి వెళ్ళేసరికి.. దృశ్యం బాగానే ఉంది. నాన్నగారు మామూలుగా ఆయన కుర్చీలో కూర్చుని చదువుకుంటున్నారు. శనివారం సాయంత్రం సాహితీ స్నేహితులుండాలే!? ఈయన ఒంటరిగా ఉండాలని కోరుకుంటున్నారో!? వాళ్ళు వదిలేశారో!?

వస్తున్నట్లు తెలీదు కదా! నాన్నగారు లేచి బయటికి వచ్చారు. ఇంటిముందు మొక్కలు ... మందారాలు, జాజులు కూడా నాన్నగారిలాగే వడలిపోయి ఉన్నాయి. పలకరించి లోపలికి వెళ్ళాను.

వంటింట్లో, పీట మీద కూర్చుని, కాఫీ కలుపుతున్న అమ్మతో కబుర్లు చెబుతోంది అహల్య. నన్ను చూసి, గబగబా వచ్చి చెయ్యి పట్టుకుంది.

"నిన్న ప్రొద్దున్న వచ్చాను. మాకేదో లోకల్ పండగ ఉందని నిన్న సెలవు. ఇవాళా రేపు ఎలాగూ సెలవులే అని బయలుదేరాను." గౌతమ్ ఆఫీస్ పని ఉందని రాలేదు." అహల్యకి అదే నెమ్మది తనం.

నాకు మాత్రం నెమ్మదిగా అనిపించలేదు. మాకింత కష్టం వచ్చింది కదా! గౌతమ్ ఒక్కసారి వస్తే ఏం పోయింది?

అమ్మ, ఇంకా చిక్కిపోయింది. ప్రాణం లేని బొమ్మలా తిరుగుతోంది.

"రోజూ శేషుని చూసి వస్తున్నాను. నీకు థాంక్స్ చెప్పమన్నాడు, లాయర్ని పెట్టినందుకు." ఆశ్చర్యంగా చూశాను. లాయరా! అప్పుడు గుర్తొచ్చింది. అన్నమాట ప్రకారం 'నందు' లాయర్ని మట్లాడాడన్నమాట.

"రేపు మధ్యాహ్నం బెంగుళూరు వెళుతున్నా. ఎల్లుడి ప్రొద్దున్నే ప్రొఫెసర్ని కలవాలి."

అహల్య, శేషు పేరెత్తితే ముభావంగా ఉంటోంది. అవును మరి జైల్లో కూర్చున్న వాడి మీద సానుభూతి ఎవరికుంటుంది? అదే ఏ జబ్బో చేసి హాస్పిటల్లో ఉంటే? అందరూ చూడ్డానికి వెళతారు.

ఇద్దరం కాఫీలు త్రాగేసి శివానీ వాళ్ళింటికి వెళ్ళాం.

శివానీలో పదిహేనురోజుల్లోనే చాలా మార్పు కనిపించింది. కళ్ళక్రింద నల్లచారలు. కళ్ళలో మెరుపు తగ్గిపోయింది. కానీ, మొహంలో అదే పట్టుదల. అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం. దారుణాల్ని అడ్డుకునే మనోబలం. స్నేహంకోసం ఏమైనా చేసే శివానీ... నా నిస్సహాయ స్థితి చూసి కదలిపోయింది.

"మీరా! నేనేం చెయ్యలేను. కేసు చాలా స్ట్రాంగ్‌గా ఉంది. శేషు, 'మారిపోయాను... ఎలాగైనా నన్ను బయటికి లాగండి' అని ఏడుస్తుంటే ఏమీ మాట్లాడలేకపోతున్నాను." శివానీ ఉయ్యాల బల్ల మీద కూర్చుని అంది. నేనూ, అహల్య దగ్గరలో ఉన్న కుర్చీల్లో కూర్చున్నాము.

అహల్య తల తిప్పుకుని, కుండీల్లో ఉన్న చెట్లని దీక్షగా చూస్తోంది.

"బాణం ఎత్తి కొట్టబోతున్న సత్యభామని, నరకాసురుడు రక్షించమంటే ఏం చేస్తుంది? లోకకంటకుడిని చంపకుండా వదిలేస్తుందా? దుర్మార్గ, దుష్టకార్యాలు చేసేటప్పుడు ఉండాలి ఆ జ్ఞానం." నా మాటలకి అహల్య మెచ్చుకోలుగా చూసింది.

"కేసు ఏమైనా నడుస్తోందా?" శివానీని అడిగాను. మా ముగ్గురి మధ్యా, ఇలాంటి కృత్రిమ వాతావరణం ఉండడం, ఇదే మొదటిసారి.

"ఎమ్.ఎల్.ఏ గారు తన పలుకుబడి అంతా ఉపయోగించి త్వరగా మూయించేయాలని చూస్తున్నారు. డిఫెన్స్ లాయర్లందరూ నిష్ణాతులే. శేషుకి కూడా మంచి లాయర్నే పెట్టాడు రుద్ర. ఎవరూ సాక్ష్యం ఇవ్వడానికి ముందుకి రావట్లేదు. అంతా హియర్ సీ ఎవిడెన్సే. ఒక్క మేం తప్ప. ఎలాగైనా శిక్షపడాలని, నేనే పోరాడుతున్నాను" అంటూ లోపలికి వెళ్ళింది.

శివానీ వెళ్ళయాక, ఇద్దరం ఆ ఇంట్లో తిరుగుతున్నాం.

"విక్టిమ్స్ ఎవరైనా సాక్ష్యం ఇస్తే కేసు చాలా స్ట్రాంగ్ అవుతుంది."

నేను కేసు స్ట్రాంగ్ అవాలనుకుంటున్నానా? లేదా? నాకే అర్థం అవటంలేదు. "పరువుపోతుందని కొంత, రాజకీయ పలుకుబడికి భయపడి కొంత ఎవరూ ముందుకి రావట్లేదనుకుంటాను." నీళ్ళు తీసుకుని వస్తున్న అహల్యకి పొరపోయింది. శివానీ మాటలాపి, వెళ్ళి నీళ్ళ ట్రే అందుకుంది.

"ఏదో ఒకటి. త్వరగా తేలిపోతే బాగుండునని ఉంది నాకు, అప్పుడు ఏం చెయ్యాలో ఆలోచించవచ్చు." నీళ్ళు తాగుతూ అన్నాను.

"అహల్యా! బెంగుళూరు ఎలా ఉంది? రిసెర్చి బాగా సాగుతోందా?"

"బాగా అలవాటయింది. ఇప్పుడు తెలుగు వాళ్ళు బాగా ఉన్నారు. మేం కన్నడ దేశంలో ఉన్నాం అనే అనిపించదెప్పుడూ."

"నీ రీసెర్చి టాపిక్ ఏమిటి?" శివానీ అడుగుతుంటే టాపిక్ మారినందుకు నాక్కాస్త తేలిగ్గా అనిపించింది.

"పార్కిన్‌సన్స్ డిసీజ్ మీద."

శివానీకి ఎక్కడో సున్నితమైన నరం కదిలినట్లయింది. ఉయ్యాల బల్ల గొలుసుని చేత్తో పట్టుకుని అలా ఉండిపోయింది.

"నిజం శివానీ! నువ్వు... మీ డాడీ పడిన చిత్రహింసని చూస్తూ.. అప్పుడే అనుకున్నాను. కొంత అయినా ఏదయినా చేద్దామని." అహల్య కేసి అలా చూస్తూ ఉండిపోయింది.

"లీవోడోపాకి' కొన్నాళ్ళకి రెసిస్టెన్స్ వస్తోంది కదా! అలా రాకుండా వేరియస్ డెరివేటివ్స్ తయారు చేసి స్టడీ చేస్తున్నాం."

ముగ్గురం చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాం.

మధ్యలో ప్రమీలాంటీ ఓ సారి బయటకి వచ్చి చూసి వెళ్ళారు. "చీకట్లో కూర్చున్నారేంటి?" అంటూ లైట్ వేసి వెళ్ళారు.

అహల్యా, నేనూ ఆశ్చర్యంగా చూశాం.

"మమ్మీకి ఏదో కొత్త మెడిసిన్ ఇచ్చారు. అప్పటినుంచీ కాస్త పరిసరాలు గమనించడం, రియాక్టవడం చేస్తోంది." ఇలాంటప్పుడు ఎంత చిన్న మంచి విషయమైనా కొండంత ఆనందాన్నిస్తుంది.

గేటు దగ్గర కారాగిన చప్పుడైంది. రుద్ర.. టకటకా షూష్ చప్పుడు చేసుకుంటూ లోపలికి వచ్చాడు.

శివానీ, రుద్ర బాగ్ అందుకుని లోపలికి వెళ్ళింది. రుద్ర అక్కడే కుర్చీలో కూర్చుని షూస్ విప్పుకున్నాడు. కానిస్టేబుల్స్‌నీ, ఆర్డర్లీనీ ఇళ్ళకి వెళ్ళిపొమ్మని సెలవిచ్చేశాడు.

శివానీ నలుగురుకీ టీ, బిస్కట్లు, తెచ్చింది ట్రేలో, అందరం కప్పులు తీసుకున్నాం.

"ఇవాళంతా చాలా హెక్టిక్ అయిపోయింది. యం.ఎల్.ఏ గారి పార్టీ వర్కర్లట.. గుంపులుగా వచ్చి, ఆఫీసు దగ్గర గొడవ. వాళ్ళని కంట్రోల్ చెయ్యడానికి చాలా అవస్థపడాల్సి వచ్చింది." రుద్ర అలసటగా అన్నాడు.

"వాళ్ళ వాళ్ళెవరైనా విక్టిమ్స్ అయితే తెలిసేది." కసిగా అన్నాను. తమ్ముడు దోషి అయిన నేనేనా ఇలా మాట్లాడేది? ప్రూవ్ అయితే ఏ శిక్ష పడుతుందో!

అందరూ నాకేసి అభినందనగా చూశారు.

✡ ✡ ✡

నేను మా ఊర్లో ఉండగానే శేషు రిజల్ట్స్ వచ్చాయి. డిస్టింక్షన్‌లో పాసయాడు. జైలుకి వెళ్ళి అభినందించాను.

"ఎందుకక్కా? నన్ను నోటికొచ్చినట్టు తిట్టాలి, కానీ అభినందించడం ఏమిటి? చేతులారా బ్రిలియంట్ కెరీర్‌ని నాశనం చేసుకున్న ఫూల్‌ని." ఊచలకి తలకొట్టుకుని ఏడ్చాడు.

నిస్సహాయంగా చూస్తుండిపోయాను.

అమ్మకి, నాన్నగారికి గాయం రేగినట్లయింది. అమ్మ దేముడి ముందు కూర్చుని కుళ్ళి, కుళ్ళి ఏడిచింది. నాన్నగారు శూన్యంలోకి చూస్తూ కూర్చున్నారు.

కుటుంబంలో ఏ ఒక్కరు బాగా లేకపోయినా అందరికీ దుఃఖం తప్పదు.

ఎవర్ని కలిసినా, మేమే ఏదో తప్పు చేసినట్లు చూస్తున్నారు. అంతెందుకు, మాకే అలా అనిపిస్తోంది. ఎంత మంది ఆడపిల్లల జీవితాల్లో చిచ్చుకి కారణమయ్యారో! శేషు గాంగ్ మాత్రం ఏం పావుకున్నారు?

ఫణీంద్ర ఇంజినీరింగ్ అయాక కాంట్రాక్ట్‌లు చేయడం మొదలు పెట్టాడు. వాళ్ళు అన్నింట్లో రాటు దేలారు కనక ఫరవాలేదు. బలమైన సాక్ష్యం ఉండి కేసు ప్రూవ్ అయితే తప్ప, తప్పించుకుని బైటపడతాడు.

అవినాశ్, అక్షయ్... ఇంజినీరింగ్ అయాక, మా ఊర్లోనే యం.బి.ఏ చదువుతున్నారు. డబ్బున్నవాళ్ళు కనుక బైట పడ్డాక ఎలాగైనా బ్రతికేస్తారు.

శేషుకే .. ఏదారీ లేదు. వాడితో.. అమ్మకీ, నాన్నగారికీ.

అహల్య వాళ్ళ అమ్మ, బామ్మగారు.. మా ఇంటికి వచ్చికాసేపు కూర్చుని వెళ్ళారు. బామ్మగారు, అమ్మని ఊరుకోపెట్టడానికి చాల ప్రయత్నం చేసింది. అహల్య బెంగుళూరు వెళ్ళిపోయింది.

అనుకున్నట్లుగానే అమ్మ, నాన్నగారు హైదరాబాద్ రామన్నారు. ఇక్కడే ఉంటే కేసు ఏమవుతుందో చూడచ్చుకదా!

ఇంట్లోకి కావల్సిన వన్నీ అమర్చి హైదరాబాద్ వెళ్ళిపోయాను.

✡ ✡ ✡

శేషుని జైల్లో పెట్టి ఆర్నెల్లయ్యింది. ప్రతి నెలా వెళ్ళి, అమ్మనీ, నాన్ననీ వాడినీ చూసి అన్నీ చూస్తున్నాను.

మా ఛానెల్ చాలా పాపులర్ అవుతోంది. రిటైర్ అయినవాళ్ళు ఎక్కువగా మా ప్రోగ్రాముల్ని మెచ్చుకుంటున్నారు. విమర్శనాత్మకంగా, సున్నితమైన హాస్యంతో, క్లాసికల్ మ్యూజిక్.. డాన్స్ ప్రోగ్రాంలతో అందర్నీ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా.. ఆడవిలన్ల సీరియల్స్‌తో విసుగెత్తి పోయిన జనం, మా ప్రోగ్రాంలని మెచ్చుకుంటున్నారు.

పాపులారిటీతో డబ్బు.... పని కూడా బాగా పెరిగాయి. నందు కూడా తన సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులతో బాగా బిజీ అయిపోయాడు. నాకు, ఒక కారు... డ్రైవరుతో సహా. ఇప్పుడు ఎటువంటి ఆర్థిక సమస్యలు లేవు. అప్పులన్నీ ఆటోమాటిక్‌గా తీరిపోతున్నాయి.

శేషు కేసు, ఒక కొలిక్కి వచ్చేలాగ ఉంది. రుద్రని, ప్రమోషన్ మీద హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ చేశారు. శివానీ, ప్రమీలాంటీతో సహా వచ్చేసి క్వార్టర్స్‌లో ఉంటోంది. మా ఊర్లో, వాళ్ళ బిజినెస్‌లన్నీ సమర్థులయిన మానేజర్లు చూసుకుంటున్నారు.

శేషు కేసు వాయిదాకి వచ్చినపుడూ, తన బిజినెస్ పనులు చూసుకోవడానికీ, రుద్ర, శివానీ మా ఊరు ఎప్పుడూ వెళ్ళివస్తుంటారు. వీలయినప్పుడు నేను కూడా వెళ్ళి, అమ్మనీ.. నాన్నగారినీ చూసొస్తున్నాను.

ఇంక కేసు ఫైనల్ స్టేజిలో ఉందనగా.. నేను కూడా ప్రతీసారీ, మా ఊరు వెళ్ళి... హియరింగ్స్ అన్నీ ఫాలో అవుతున్నాను.

అమ్మ, నాన్నగారు.. గుండెరాయి చేసుకుని అలాగే తిరిగేస్తున్నారు.. ఇలాంటి సమయంలో మా అత్తయ్యగారు, మామయ్యగారు.. ఇచ్చిన ధైర్యం ఎప్పటికీ మరచిపోలేను. ఊర్లో పొలాలన్నీ కౌలుకిచ్చి మా దగ్గరకి వచ్చేసి, కొండంత అండగా ఉన్నారు. ఇలాంటి కుటుంబంలోకా... నేను వస్తానంటే బంధువులందరూ, అంతగొడవ చేశారు? మంచి నిర్ణయం తీసుకున్నందుకు, నాకు చాలా గర్వంగా ఉంది.

✡ ✡ ✡

కార్లో కూర్చుని, డ్రైవర్‌ని స్టూడియోకి పోనీమన్నాను. టైము, ప్రొద్దున్న ఎనిమిదిన్నర. తొమ్మిదింటికల్లా స్టాఫ్‌తో మీటింగ్ ఉంది. ఏమేం డిస్కస్ చెయ్యాలో చూసుకుంటున్నాను.

ఆంధ్రదేశంలో ఉన్న పుణ్యక్షేత్రాల గురించి, డాక్యుమెంట్రీగా.. అన్ని క్షేత్రాల గురించీ ఛానెల్స్‌లో వస్తున్నాయి. కానీ పంచారామాలు అన్నీ కలిపి, క్షేత్రపురాణం.. మహిమలు.. చరిత్రలతో ఒక నృత్యరూపకం చెయ్యాలని ప్లాన్.

పంచారామక్షేత్రాలు, అయిదూ విడివిడిగా క్షేత్రమహిమలు కలిగి ఉన్నా... ఆలింగాలు అన్నీ కలిపి 'ఒకే లింగం' అనీ, అది తారకాసుడి మెళ్ళో వేసికుని, అక్రమాలు చేస్తుంటే దేవతలు పరమేశ్వరుడిని వేడి, పార్వతీదేవిని పరిణయమాడేలా చేసి, కుమారసంభవానికి నాంది పలకడం.. కుమారస్వామి తారకుడ్ని వధించినప్పుడు ఆ లింగం ముక్కలై ఐదుచోట్ల పడిందనీ అవి పడిన చోటే పంచారామాలు వెలిశాయనీ పురాణగాథ. నృత్యరూపకానికి మంచి కథావస్తువు.

కానీ, ఎక్కడ మొదలు పెట్టాలో.. ఏ క్షేత్రాన్ని ముందరతీసుకోవాలో, ఎవరిచేత రాయించాలో... ఇవన్నీ డిస్కస్ చేయాలి. రూపకం తయారయాక ఆర్టిస్టులని ఎంపిక, రిహార్సల్స్. అందర్నీ అలరించేలా తయారు చెయ్యాలంటే, రెండునెలలైనా పడుతుంది.

స్టాఫ్ మీటింగ్‌లో డిస్కస్ చెయ్యాల్సిన పాయింట్లు ఆలోచించుకుంటున్నాను. "నువ్వంటే నాకిష్టమనీ..." రింగ్ టోన్ మార్చినట్లున్నాడు నందూ.. సెల్ బటన్ ఆన్ చేశాను.

"మీరా! రేపు క్రిటికల్ హియరింగ్ ఉంది. సాయంత్రం మనూరు వెళుతున్నాను. నువ్వు వస్తానంటావేమోనని ఫోన్ చేశాను." శివానీ.

ఒక్క నిముషం ఆలోచించాను. ఇవాళ మొదటి సిట్టింగ్ కదా! కొంతమందికి కొన్ని పనులు ఇచ్చి, ప్రతిభకి మిగిలిన పనులు అప్పచెప్పి వెళ్ళచ్చు. శివానీకి నేను కూడా రావాలనుంది. లేకపోతే ఫోన్ చెయ్యదు.

"అలాగే! బయల్దేరే ముందు ఫోన్ చెయ్యి. అయిదింటి వరకు నాకు పనుంది. ఫరవాలేదా?"

"అయిదు తర్వాతే బయలేరదాం. నువ్వు ఏర్పాట్లు చూసుకో. " శివానీ ఫోన్ పెట్టేసింది.

సెల్ ఆఫ్ చేసేసి, కార్లో వెనక్కి వాలి కూర్చున్నాను. నందు కానీ అత్తమామలు కానీ దేనికీ అభ్యంతరం పెట్టరు. అర్థం చేసుకుని ప్రతిదానికీ సహకరిస్తారు. ప్రతి చిన్నదానికీ పర్మిషన్ తీసుకోనఖ్ఖర్లేదు.

నందుకి ఫోన్ చేసి చెప్పాను. అత్తయ్యకి కూడా చేస్తే, ఆవిడ రెండు జతల బట్టలు సర్దిపెట్టానని చెప్పారు.

క్రిటికల్ హియరింగ్ అంటే ఎలా ఉంటుందో! రేపు ఏదో ఒకటి తేలిపోతే బాగుండును. శివానీ, రుద్ర.. తమకు వీలైనన్ని సాక్ష్యాలు సేకరించారు. ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న యువకులు ఇలా అయిపోవడం బాధగానే ఉంది, అందరికీ.

✡ ✡ ✡

## 13

మా ఊరు చేరేసరికి రాత్రి పన్నెండు దాటింది. అసలు సిటీ శివార్లు దాటడానికే రెండుగంటలు పైన పట్టింది. మా చిన్నప్పుడు, పాలెం నుంచి మోపర్రుకి ఎడ్లబండి మీద వెళ్ళేవాళ్ళం. ఆ ఎడ్ల బళ్ళు ఇంకా తొందరగా వెళ్ళేవేమో. సిటీలో ఎక్కడి కక్కడ, నాలుగు వేపులకీ బైపాస్ రోడ్లు వేస్తేగాని లాభం లేదు.

అమ్మకీ, నాన్నగారికీ, నా హఠాత్తు రాకలు అలవాటయి పోయాయి. ఇంటికి వెళ్ళగానే మజ్జిగ అన్నం తినేసి పడుకున్నాను. మాకు చెప్పుకోవడానికి కూడా ఏమీ కబుర్లు ఉండటం లేదు. నా పని గురించీ, సిటీలో జీవితం గురించి చెపుదామంటే.. అమ్మా, నాన్నగారు కూడా ఏమీ ఉత్సాహం చూపట్లేదు. ఈ శేషు విషయం తేలిపోయాక, వీళ్ళని ఈ ఊరినుంచి మార్చేస్తే కానీ లాభం లేదు.

ప్రొద్దున్నే లేచి, తయారయి, శివానీ వాళ్ళింటికి వెళ్ళాను. శివానీ వాళ్ళు లేకపోయినా, ఇల్లూ.. ఇంట్లో పనివాళ్ళూ.. అంతా మామూలే. అప్పటికే రుద్ర వెళ్ళిపోయాడట. నేనూ, శివానీ టిఫిన్ తిని కూర్చున్నాం కాలం చాల నెమ్మదిగా గడుస్తున్నట్లనిపిస్తోంది. శివానీ ప్రతి ఐదు నిముషాల కొకసారి గడియారం చూసుకుంటోంది.

పదిన్నరకల్లా కోర్టు దగ్గరకి వెళ్ళాం. అదొక ప్రపంచం. గుంపులుగా మనుషులు కూడి, ఏదో చేసెయ్యాలన్న తాపత్రయం. నేరాలు చేసిన వాళ్ళని తప్పించాలనీ.. అందుకు ఏ నేరం చెయ్యని వాళ్ళని ఇరికించాలనీ... పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి. తమ వాక్పటిమతో చరిత్రల్ని మార్చేయగలమంటూ.. నల్లకోట్లు వేసుకుని లాయర్లు హడావుడిగా తిరిగేస్తున్నారు.

దూరంగా శేషు కనిపించాడు. పోలీసులు శేషునీ, వాడి ఫ్రెండ్స్‌నీ విడివిడిగా కోర్టులోపలికి తీసుకెళుతున్నారు. ఒక్కసారి ఆగి, నాకేసి చూశాడు వాడు. ఆ కళ్ళల్లో దిగులు తప్ప ఏం లేదు. మనిషి చిక్కిపోయి... నిరాశగా.. నిస్పృహగా.. ఇలాంటి శేషు కోసమేనా అమ్మా, నాన్నా అహర్నిశలూ శ్రమించారు!

ఆ రోజు శేషుదే అంతా కీలక పాత్ర. శేషుకి పెట్టిన లాయర్ లేచి వీడి తరపు వాదనని వినిపించారు. ఇంజినీరింగ్ ఫస్టియర్‌లో చేరినప్పటినుంచీ, శేషు పొందిన అనుభవాలు. ఏ విధంగా ఫణీంద్ర, వీడిని కన్విన్స్ చేసి, రొంపిలోకి దింపిందీ.. షుమారుగా ఎప్పుడెప్పుడు వాళ్ళు, ఏయే నేరాలు చేసింది.. చెపుతూ, శేషు నేరాలు ఒప్పుకుంటున్నట్లుగానూ.. వాడి ఫ్రెండ్స్ చేసిన పనులకి సాక్ష్యం కూడా ఇవ్వడానికి తయారుగా ఉన్నట్లు చెప్పారు.

జడ్జీగారు అంతా శ్రద్ధగా విని పాయింట్లు రాసుకున్నారు, మధ్యలో తన సందేహాలు తీర్చుకుంటూ. ఆయన మొహం మాత్రం భావరహితంగా ఉంది. ఫణీంద్ర, అవినాశ్, అక్షయ్.. వాళ్ళ మనుషులూ.. దొరికితే శేషుని చంపేద్దాం, అన్నంత కోపంగా చూశారు.

మధ్యాహ్నం అంతా శేషుని క్రాస్ ఎక్సామినేషన్. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడిగిన వాటన్నింటికీ, వివరణలతో సహా, తడుముకోకుండా జవాబులు చెప్పాడు. అంతా సవ్యంగా ఉండుంటే మంచి లెక్చరర్ అయ్యుండేవాడు.

వాడి మాటల్లో నిండా పశ్చాత్తాపం కనిపిస్తోంది. ప్రతీ నేరంలోనూ తను వెనకగానే ఉండేవాడినని చెప్పాడు.

"అత్యాచారం చెయ్యడానికి కానీ, హత్య చెయ్యడానికి కానీ నాకు ధైర్యంలేదు. 'థ్రిల్లింగ్‌గా ఉంటుంది... పద..' అంటే వెళ్ళేవాడిని. కానీ అదీ తప్పే. ఒకవేళ ఇష్టం లేకపోతే అప్పుడే చెప్పాలి కదా! నేను చేసిందానికి ఏ శిక్ష అయినా అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాను."

సాయంత్రం ఇంటికి వచ్చాక నాన్నగారికి జరిగిందంతా చెప్పాను.

"పోన్లే వాడితోపాటు దోషులందరికీ శిక్షపడడానికి దోహదం చేస్తున్నాడు. కొంతనయం." అంటూ నాన్నగారు పుస్తకం చేతిలోకి తీసుకున్నారు.

హాల్లో నుంచుని వింటున్న అమ్మ లోపలికి వెళ్ళిపోయింది. ఇద్దరూ జీవిస్తున్నారు కానీ, జీవితం మీద ఇచ్ఛ నశించిపోయింది. నీరసంగా లేచి లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని, అమ్మనడిగి కాఫీ తెచ్చుకుని వరండాలో కూర్చున్నాను.

నందుకి ఫోన్ చేసి ఇంకా రెండుమూడు రోజులుంటానని చెప్పాను.

"ఈ వారం రోజుల్లో కేసు తేలిపోతుందని రుద్ర చెప్పాడు." ఇరికే నేను ఏదో చెపుతుండగానే, నందు అన్నాడు.

"అయేవరకూ అక్కడే ఉండు. అక్కడినుంచే నువ్వు, నీ అసిస్టెంట్స్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇయ్యి. ఇంట్లో ఏం ప్రాబ్లం ఉండదు."

"థాంక్యూ నందూ."

"మీరా! మీ పేరెంట్స్‌ని కన్విన్స్ చేసి ఇక్కడకు తీసుకొచ్చేయ్. మనింటి దగ్గరగా ఒక సింగిల్ బెడ్ రూం ఎపార్ట్‌మెంట్ రెంట్‌కి ఉంది. మనం చూసుకుంటూ ఉందాం."

"సరే" అని ఫోన్ పెట్టేశాను.

ఎలాగైనా హైదరాబాద్ రావడానికి నాన్నగారిని ఒప్పించాలి. ఈ ఊర్లో ఏం ఉందని ఇక్కడే ఉండాలి? ఎక్కడికి వెళ్ళినా వీళ్ళే ఏదో తప్పు చేసినట్లు, తలవంచుకుని, తప్పుకుని తిరుగుతున్నారు.

కొత్తవాతావరణంలో, తెలియని మనుషుల మధ్య అయితే కాస్త బయతికయినా నవ్వుతూ బ్రతకవచ్చు. మా ఇంటి దగ్గరగా ఉన్న గుళ్ళో, రోజూ ఏవో ఉపన్యాసాలు, కార్యక్రమాలు అవుతుంటాయి. నాన్నగారికి ఏదైనా స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో పనిచూపించాలి. అసలు ఇక్కడినుంచి కదలడానికి ఎలా ఒప్పించాలి? ఆలోచనలో పడ్డాను.

✡ ✡ ✡

నేరం ఒప్పుకున్నంత మాత్రాన, అనుకున్నంత సులభంగా కోర్టుకేసు తేలిపోదు. రెడ్ హాండెడ్‌గా, యాక్షన్‌లో ఉండగా పట్టుకున్నాం కదా.. తప్పకుండా శిక్షపడుతుంది అనుకోడం పొరపాటే..

అదే జరిగింది మా శేషు విషయంలో. వాడు నేరం ఒప్పుకోవడానికి రకరకాల కారణాలు చూపించారు, వాడి 'ఫ్రెండ్స్' లాయర్లు. కొన్ని ఊహించలేనివి కూడా!

చివరికి 'శేషు'నే అన్నింటికీ కారణం, అనేలా వాదించారు. ముఖ్యంగా ఫణీంద్ర లాయరు.. చాలా అనుభవం ఉన్న క్రిమినల్ లాయర్ జఠమలానీ స్టైల్లో, అతను నుంచుంటే.. ముందు అతన్ని చూడగానే శేషుగాడు వణికి పోవడం మొదలు పెట్టాడు.

అంతకు ముందు కేసులకీ, వీళ్ళకీ ఏమీ సంబంధంలేదనీ.. ఉంటే, నెల్లాళ్ళనుంచీ కాపుకాస్తే, ఆ ఒక్కరోజే ఎందుకలా జరిగిందనీ వాదించారు. ''ఏదో చిన్నతనం కొద్దీ, ఆ రోజు పొరపాటు చేయడం జరిగింది. అదీ 'ఈవ్ టీజింగ్' కి మించి జరగలేదు. మిగిలిందంతా పోలీసుల కుట్ర.'' ఆజానుబాజువయిన, ఆ డిఫెన్స్ లాయర్.. మాడ్యులేషన్‌తో వాదిస్తుంటే.... అందరూ, అతను ఎటు వెళుతుంటే అటు తిరుగుతూ.. చెవులప్పగించి విన్నారు.

ముఖ్యంగా శేషు సాక్ష్యాన్ని, శేషు లాయర్ని ఛెండాడేశాడు.

''ఎన్నో కేసులు.. ఐ మీన్ 'ప్రాజెక్టు'లలో (ప్రాజెక్టుని వత్తి పలుకుతూ) ఈ అబ్బాయి సహకరించానంటున్నాడు. మరి అన్ని రోజులూ, చేతులు కట్టుకుని 'చూస్తూ' ఆనందించాడా? ఈ రోజు 'పట్టుబడ్డాడు' కనుక పశ్చాత్తాపంతో రగిలిపోతూ నేరాలు ఒప్పుకున్నాడా? ఇవన్నీ కాక్ అండ్ బుల్ స్టోరీస్ క్రియేటెడ్ బై పోలీస్.'' ప్రాసిక్యూషన్ లాయరు అబ్జక్షన్ చెప్పబోయాడు. జడ్జీగారు ఆగమన్నారు.

విజయోత్సాహంతో ఫణీంద్ర లాయర్ మొదలు పెట్టాడు.

ఎంతో భవిష్యతు ఉన్న యువ ఇంజినీర్లు. నగరంలో పేరు ప్రతిష్టలున పెద్ద మనుష్యుల పిల్లలు. ఆ రోజు చేసిన తప్పుకి, ఆడపిల్లని ఆకతాయి తనంతో టీజ్ చేసినందుకు శిక్ష విధించండి. కానీ, అంతక్రితం జరిగిన మర్డర్‌కి వీళ్ళని బాధ్యుల్ని చెయ్యద్దు, యువర్ ఆనర్'' అంటూ కూర్చున్నాడు.

పైగా ''అక్షయ్', శివానీ వాళ్ళ పోటీవ్యాపారదారు కొడుకుకదా... అందుకని వాళ్ళ వ్యాపారం దెబ్బతీయాలని కుట్రపన్నారు.'' అని, అక్షయ్ వాళ్ళలాయరు అభియోగం మోపాడు.

కోర్టుల్లో ఎంత నిర్దాక్షిణ్యంగా, నిర్హేతుకంగా వాదిస్తుంటారో అప్పుడే తెలిసింది నాకు. లేకపోతే ముప్పయ్యేళ్ళనుంచీ, పెద్ద బజార్లో ఇద్దరి షాపులూ ఎదురెదురుగా ఉన్నాయి. ఇప్పుడే కుట్రపన్నారా?

ఇదీ, అదీ అని లేకుండా.. చిన్న తాడుతో కొండని లాగేస్తారు.

ఈ వాదన్లన్నీ రెండు రోజులు నడిచాయి. నాలుగో రోజున శివానీ, రుద్రబోనులో నుంచున్నారు. రుద్రది కొంత తేలిగ్గానే అయిపోయింది. అతను కూడా అనుభవం ఉన్న ఆఫీసర్ కనుక, అంత తేలిగ్గా లొంగలేదు. వాళ్ళిద్దరి మీదా ఎటాక్‌ని ఎలాగా 'చిన్నతన'ం కొద్దీ చేసిన నేరం అని ఒప్పుకుంటూనే ఉన్నారు కదా!

కానీ అంతకు ముందు హత్య చెయ్యబడిన యువకుడి కేసు... శేషు తను ఊర్లోలేనని చెపుతున్నాడు. అందుకని అతనిది సాక్ష్యం తీసుకున్నా, ఆ కేసులో లాభంలేదు.

''వేలి ముద్రలు ముగ్గురు నిందితులతో మాచ్ అవుతున్నాయి. ఇదుగో నిపుణుల రిపోర్టు.'' అని చూపించాడు రుద్ర.

అనుభం లేకనో, ఎవరు పట్టుకుంటార్లే అనే ధీమాతోనో వేలిముద్రలు పడకుండా జాగ్రత్త పడలేదు, ఫణీంద్ర బృందం.

ఈ వేలిముద్రల సాక్ష్యం కూడా సృష్టించినవి కావని నమ్మడం ఎలా? ఆ యువకుడికీ, వీళ్ళకీ ఏమిటి సంబంధం? మోటివ్ ఏమిటి? అలా సాగింది, ఆ రోజంతా.

ప్రాసిక్యూషన్ వాళ్ళు చెపుతున్నట్టుగా, శేషు వివరించినట్టుగా, ఆ యువకుడి స్నేహితురాల్ని కానీ, భార్యని కానీ, అత్యాచారం చేసి.. చూశాడని అతడ్ని హత్య చేశారనుకుందాం! అందుకు తగిన ఆధారాలేవి? ఆ యువతి ఎవరు?

ఆ యువతి ఎక్కడుందో! అసలుందో... అవమానం భరించలేక, సహచరుడ్ని చంపేశారనీ ఆత్మహత్య చేసుకుందో.. ఏమీ తెలీదు కదా! అసలు ఆ యువకుడు, ఈ ఊరి వాడిలాగానే లేడు. బట్టలమీద లేబుల్స్ అవీ, ఇక్కడివి కావని తెలుస్తోంది.

ఆ రకంగా, హత్యానేరం కూడా అంత బలంగా మోపడానికి వీలులేకపోయింది.

పైకి కనిపించలేదు కానీ రుద్ర బాగా నిరాశ చెందాడనిపించింది. అంత రిస్కుతీసుకుని, శ్రమపడి పట్టుకుంటే... ఒక్కొక్కళ్ళకి ఏ మూడు నెలలో శిక్షపడ్డమా! ఇంకా నేరాలు జరగకుండా ఎలా ఆపడం. వాళ్ళే చేశారని తెలుస్తూనే ఉంది. ఎంతమంది వీళ్ళ బారిన పడ్డారో? డబ్బు, శీలం పోగొట్టుకున్నారో! శీలం పోయిందని అందరికీ తెలిస్తే, పరువుపోతుందని.. తలెత్తుకుని తిరగలేమనీ ఎవరూ ముందుకు రారు. శేషు చెప్పిన దాన్ని బట్టి, అరడజను మందికి పైనే ఉన్నారు. కానీ, అందరూ కళ్ళుమూసుకుని కూర్చున్నారు.

రుద్ర కుర్చీలో కూర్చుని, కళ్ళు మూసుకుని, అలసటగా కూర్చున్నాడు. తర్వాత, శివానీని రమ్మన్నారు.

✡ ✡ ✡

ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కలిగిన శివానీ, ఆదిశక్తిలాగా అడుగులు వేస్తూ, ఆత్మస్థైర్యంతో వచ్చింది. ఎప్పటినుంచీ, తనూ రుద్ర కలిసి, నేరస్థుల్ని పట్టుకోవాలని ఎలా ప్లాన్ చేశారో, ఆ రోజు ఏం జరిగిందో... స్పష్టంగా నిర్భయంగా చెప్పింది.

ఇంక మనం కేసు గెలిచినట్లే.. శేషుకి కూడా ఎంత పెద్ద శిక్ష పడినా ఫరవాలేదు.. ఈ అపర కీచకులకి తగిన శాస్తి జరిగితే చాలనుకున్నాను. అప్పుడు లేచారు డిఫెన్స్ లాయరుగారు.

ఆయన అడిగిన ప్రశ్నలు, విధానం.. అభిమానం, పరువు ఉన్న ఏ ఆడపిల్లా తట్టుకోలేదు. మాటల్లో, కళ్ళల్లో, చేతల్లో వ్యంగ్యంతో బాణాల్లా మాటలు వదులుతూంటే.. నాకే లేచి నాలుగు ఉతకాలనిపించింది. ఇంక శివానీ ఎలా తట్టుకుందో!

రుద్ర, ఇంట్లో బాగా ట్రైనింగ్ ఇచ్చినట్లున్నాడు. తడుంకోకుండానే సమాధానం చెప్పింది.

"చీర కొంగు ఏ రకంగా లాగారు?" చెప్పింది.

"చేతులు ఎలా కట్టేశారు?" చూపించింది.

"కాలితో ఎలా తన్నావు?"

"అదికూడా చూపించమంటారా?" అని శివానీ అడిగేసరికి, సీరియస్‌గా ఉన్న వాతావరణం అంతా కాస్త తేలికపడింది.

"అక్కర్లేదు. కానీ తన్నాలన్నంత ధైర్యం ఎలా వచ్చింది?" అడిగాడు లాయరు.

"ఆ సమయంలో ఎవరికైనా ధైర్యం వస్తుంది. మీ అమ్మాయైనా అంతే." అంది శివానీ

"మా అమ్మాయి అర్ధరాత్రి నీలాగా బైటకి వెళ్ళదు."

"రాత్రి తొమ్మిదింటికి అర్ధరాత్రవుతుందా? చీకటిపడగానే ఇంట్లో కూర్చుంటేనే ఆడదానికి 'రక్షణ' అనేది ఏం వ్యవస్థ? మనం నాగరిక యుగంలోనే ఉన్నామా?" శివానీ ధాటికి తట్టుకోలేని లాయరు మాటమార్చాడు.

"అసలు శ్రీమతి శివానీ ఈ కేసులో భర్తకి ఎందుకు సహకరించవలసి వచ్చింది? ఊర్లో బోలెడు నేరాలవుతుంటాయి కదా! ప్రతీసారీ ఇలాగే 'ప్లాన్లు' వేస్తుంటారా?"

"ఆడపిల్ల కూడా ఉంటేనే ఈ నిందితులు బైటకి వస్తారనీ, ట్రాప్ చెయ్యాలనీ, అలా చేశాం. నేరం చేసిన వాళ్ళని పట్టుకోడానికి 'యాజ్ సిటిజన్' సహాయం చెయ్యకూడదా!" ఈ గొడవలన్నీ అయాక, శివానీని 'లా' చదవమనాలి.

"బాగానే ఉంది. మరి ఇదివరకు కూడా చాలామంది చాలా నేరాలు చేశారు కదా! అప్పుడు ఈ హానరబుల్ సిటిజన్ గారు ఎక్కడున్నారు? ప్రతీసారీ భర్తకి సహకరించట్లేదే? బహుశా "రేప్" ఎలా ఉంటుందో చూద్దామనుకున్నారేమో!" రుద్ర పిడికిలి బిగించి లేవబోయాడు. ప్రక్కనున్న ఆఫీసర్ భుజం మీద చెయ్యివేసి ఆపేశాడు. నాకు ఆ లాయర్ని చంపేద్దామన్నంత కోపం వచ్చింది. కోర్టులో అంతా గుసగుసలు.

"టైమయింది. రేపు కలుద్దాం" జడ్జిగారు లేచి వెళ్ళిపోయారు.

శివానీ మొహం ఎర్రగా అయిపోయింది. కళ్ళు ఎర్రగా తీక్షణంగా అయాయి. కాళ్ళు, చేతులు వణుకుతుండగా బైటికి వచ్చింది. డిఫెన్స్ లాయర్ తలెగరేసి వెళ్ళిపోయాడు.

ముగ్గురం కార్లో కూర్చుని ఇంటికెళుతున్నాం. రుద్ర డ్రైవ్ చేస్తున్నాడు. "శివానీ! ఎందుకింతలా ఈ కేసులో ఇన్వాల్వ్ అయ్యావు?" చెయ్యిపట్టుకుని అడిగాను.

"అహల్య మీద అత్యాచారం చేసింది వీళ్ళే!" నెమ్మదిగా అంది శివానీ.

✡ ✡ ✡

ఊహించిందే వింటున్నట్లుగా ఉదాసీనగా ఉండిపోయాను. ఇంతకాలం విడని చిక్కుముడులన్నీ ఒక్కసారి విడిపోయాయి. శివానీ ఎందుకు అంతగా తరచి, తరచి అహల్యని ప్రశ్నించేదో.. అహల్య నిర్లిప్తత... అవునూ! ఎందుకు నానించి అంతా దాచారు?

శివానీ వాళ్ళ ఇంటికి వెళ్ళి, కాఫీ త్రాగి వరండాలో కూర్చున్నాం. శివానీ, కోర్టులో జరిగిన అవమానం నుంచి కొద్దిగా తేరుకుంది. రుద్ర అంతా వివరించసాగాడు.

"మనం వైజాగ్ నుండి వస్తుంటే జరిగినదంతా నీకు గుర్తుందికదా!" ఒళ్ళంతా ఒణికింది. నీరసంగా తలూపాను.

"అహల్య పెళ్ళి అయిన మూడోరోజు. వాళ్ళు మర్నాడు హనీమూన్‌కి వెళదామని ప్లాన్ చేసుకున్నారు. ఆ రోజు గౌతమ్, అహల్య భోజనాలయాక, అహల్య వాళ్ళింటి వెనకాల రైలు కట్టవరకు వాకింగ్‌కి వెళదామని వెళ్ళారు. అహల్య వాళ్ళ ఇల్లు చిన్నది కదా! కాస్త మనస్సు విప్పి మాట్లాడుకున్నట్లు ఉంటుందని. అహల్య మెళ్ళో.. కొత్త పెళ్ళికూతురు కదా. రెండు గొలుసులు ఉన్నాయి." రుద్ర ఆపాడు.

శివానీ, కాళ్ళు ముడిచి పెట్టుకుని కూర్చుంది.

అవును! శాంత పిన్ని మంగళసూత్రాలకి ఒక గొలుసు, కాకుండా నాలుగు పేటల చంద్రహారాలు పెట్టింది.

"ఆ గొలుసులు, వీధి దీపాల కాంతిలో, ఉండుండి తళతళా మెరిశాయి. వీళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, మెల్లగా నడుస్తుంటే సరిగ్గా మమ్మల్ని ఎటాక్ చేసినట్లే చేశారు. ఎదిరించిన గౌతమ్‌ని తలమీద కొట్టి, ముగ్గురు అహల్యమీద అత్యాచారం చేశారు. ఒక్కడు, మెయిన్ రోడ్ దగ్గర నుంచున్నాడు. ఎవరైనా వస్తుంటే వార్నింగ్ ఇవ్వడానికి."

రుద్ర కేసి ఒకసారి చూశాను.

అవునన్నట్లుగా రుద్ర తల ఊపాడు.

శేషు మెయిన్ రోడ్ దగ్గర నుంచున్నాడన్నమాట. అప్పటికి, వాడికి ఆ జంట అహల్య, గౌతమ్‌లని తెలీదు. అప్పుడే తెలిస్తే ఏం చేసేవాడో మరి.

"మనం ఆ రోడ్ మీదికి వస్తుండడం గమనించి వాళ్ళుపారిపోయారు. తరువాత నువ్వే చూశావు కదా!" రుద్ర లేచి లోపలికి వెళ్ళాడు.

"మీరా! ఆ తర్వాత నీ పరిస్థితి చూసి నేనేం చెప్పలేకపోయాను. అదీకాక, అందరు ఆడపిల్లలూ ఎందుకు నోరు తెరవరో. అందుకే నేనూ నోరు తెరవలేదు. గౌతమ్, మీ కుటుంబంలోవాడు కదా! ఎవరికీ తెలియనియ్యవద్దని, అహల్య, గౌతమ్ రిక్వస్ట్ చేశారు." శివానీ, ఆగి ఆగి చెప్పింది.

రుద్ర, ఇంట్లోంచి వస్తూ ఏదో ఫైలు తెచ్చాడు

"అహల్య, ఆ షాక్ నుంచి తేరుకోవడానికి చాలా రోజులేపట్టింది. గౌతమ్‌కి దెబ్బ తగిలిన వెంటనే స్పృహ పోయింది. ఇద్దరూ హాస్పిటల్ నుంచి డిస్‌ఛార్జ్ అయి ఇంటికి వెళ్ళేవరకూ.. వాళ్ళిద్దర్నీ మేమే దగ్గరుండి చూసుకున్నాం. అహల్య కేసు పెడదామని అంది. ఎలాగూ నా జీవితం నాశనం అయిందికదా! ఇంక పోయేదేముందని అంది.

మెడికల టెస్టులకీ, అన్నింటికీ సహకరించింది. వాళ్ళని ఎటాక్ చేసిన దగ్గర దొరికిన హాండ్ కర్చీఫ్, బ్రాస్‌లెట్ ఫణీంద్రది, కర్చీఫ్ అవినాష్‌ది" రుద్ర చెపుతూ ఫైల్ తీసి, ఫోటోలు చూపించాడు.

ఫోటోలు చూస్తే, కడుపులో తిప్పినట్లనిపించింది.

"గౌతమ్ ఒప్పుకోలేదు. ఎంతో కోరి చేసుకున్నాడు కదా! అహల్యని సముదాయించి, కేసు క్లోజ్ చెయ్యమన్నాడు. జరిగినదంతా పీడకల అనుకుని మామూలుగా ఉందాం అన్నాడు. ఎంతో బ్రాడ్ మైండెడ్‌గా బిహేవ్ చేశాడు" రుద్ర మాటలకి నేను, శివానీ కేసి చూసాను.

అంత బ్రాడ్ మైండడ్‌గా తర్వాత ఉండగలుగుతున్నాడా! అహల్య ఎందుకంత డల్‌గా అయిపోయింది. తెచ్చిపెట్టుకుని నవ్వుతున్నట్లుగానే అనిపించేది ఎప్పుడూ. శివానీకి అనుమానం వేసినా ఏమీ చెయ్యలేకపోయిందా! ఎలా ఉండవలసింది వాళ్ళ కాపురం? ఎంత చిత్రవధ అనుభవిస్తున్నారో ఇద్దరూ! తలుచుకుంటుంటే కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఒక్క నగల దొంగతనం మాత్రమే రికార్డ్ చేసి, అందరిలాగే.. కేసు ఎవరికీ తెలియకుండా క్లోజ్ చేశాను." రుద్ర నిట్టూరుస్తూ అన్నాడు.

"ఈ సంగతి ఎవరికీ తెలీదా?" రుద్రని అడిగాను.

తెలీదన్నట్లుగా తలూపుతూ, అన్నాడు రుద్ర. "ఇద్దర్నీ కొట్టి, నగలు ఎత్తుకుపోయారని, అందరితో చెప్పాం. అహల్య, గౌతమ్‌ల తర్వాత, మా ఇద్దరికీ, టెస్ట్‌లు చేసిన డాక్టర్‌లకీ మాత్రం తెలుసు. అఫ్‌కోర్స్ దోషులకి కూడా తెలుసుననుకో." పేలవంగా నవ్వాడు.

నాకూ, అహల్యకీ ఒకసారి మా ఇంట్లో ఎదురుపడిన శేషు గుర్తుకు వచ్చాడు. అహల్యనీ, గౌతమ్‌నీ హాస్పిటల్‌లో చూడ్డానికి ఒక్కసారి కూడా రాలేదు. 'పరీక్షలేమోలే' అనుకున్నాం. అహల్యని చూసి శేషు తల ఎందుకు దించుకున్నాడో ఇప్పుడర్థమైంది.

శేషుని అరెస్ట్ చేశాక, గౌతమ్ ఎందుకు ముభావంగా ఉన్నాడో అహల్య కూడా మామూలుగా ఎందుకు లేదో... మబ్బులు విడినట్లు, నా సందేహాలన్నీ పటాపంచలయిపోయాయి. అందరి చుట్టాల్లాగే గౌతమ్ కొని కూడా అనుకున్నందుకు, సిగ్గుపడ్డాను.

✡ ✡ ✡

"అహల్య, గౌతమ్ .. మనకి తెలుసున్నవాళ్ళు, ఫ్రెండ్స్ కనుక మనం ఇంత బాధపడుతున్నాం. ఇలాంటి వాళ్ళవల్ల ఎంతమంది క్షోభపడున్నారో.. ఎన్నికాపురాలు కూలిపోయాయో.. పైకి చెప్పలేక ఎంతమంది లోలోపల కుళ్ళిపోతున్నారో..."

శివానీ మాటలు వినలేక చెవులు మూసుకుని, క్రింద కూలబడి, మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని ఏడవసాగాను. శివానీ లేచి, నా ప్రక్కన కూర్చుంది.

"నా తమ్ముడు కూడా.. అందులో" వాక్యం పూర్తిచెయ్యకుండా, మళ్ళీ వరదలా ఏడుపు.

"కంట్రోల్ చేసుకో మీరా! దానికి నువ్వేం కారణం కాదు కదా!" అనునయంగా అంది శివానీ.

"ఎందుక్కాదు. నాకు అనుమానం వచ్చినప్పుడు, వాడిని మరింత పట్టించుకోవలసింది. రుద్రకి చెపితే నిఘాపెట్టేవాడేమో. కొన్ని కాపురాలైనా నిలిచేవికదా!" తలెత్తి, కళ్ళలో నీళ్ళు కారుతుండగా అన్నాను.

"నిఘా పెట్టేవాడో! సినిమాహాల్లో నేను మాట్లాడినట్లే, తీసి అవతల పడేసేవాడో. ***భయంకరమైన వాస్తవాన్ని ఒకపట్టాన ఒప్పుకోలేయదు, మానవనైజం.*** అందుకని, నీవల్లనేదో అయిందని బాధపడకు."

శివానీ చెప్పింది నిజమే. మాలాంటి సామాన్య సంసారాల్లోంచి ఇలాంటి శేషు పుట్టుకొస్తాడని ఎవరూహించగలరు?

రాత్రి భోజనానికి వస్తూ "బంగాళా దుంపవేపడం లేకపోతే అన్నం తినను" అని ఇంటర్లో మొండికేసిన శేషు.. సంవత్సరం తిరగకుండానే, ఇలాంటి పనులలో పాలుపంచుకుంటాడని నాన్నగారికి అనిపిస్తుందా!?

అంతెందుకు? ఏదో ఉందని అందరితో వాదించిన నేను మాత్రం ఈ రేప్‌లూ, మర్డర్లూ.. కల్లోనైనా అనుకున్నానా?

"మీరా?" ఎవరా అని తలెత్తాను.

చేతులు చాపుతూ నందూ నిలబడి ఉన్నాడు.

✡ ✡ ✡

పరుగెత్తుకుంటూ వెళ్ళి నందూ చేతుల్లో వాలిపొయ్యాను. "ఊరుకో! మీరా! కామ్ డౌన్". నందు వీపు నిమురుతూ ఓదారుస్తున్నాడు. వెక్కుతూ, కాసేపు అలాగే ఉండిపోయాను. నన్ను కుర్చీలో కూర్చోపెట్టి తను ప్రక్కన కుర్చీ జరుపుకుని, నా చెయ్యి పట్టుకున్నాడు.

శివానీ లోపలికి వెళ్ళి, నాకు చల్లని నీళ్ళు, నందుకి కాఫీ తీసుకొచ్చింది.

"డిన్నర్ ఇక్కడే తీసుకుని వెళుదువుగాని. నేను మీ ఇంటికి కబురుపంపిస్తాను" అంది.

అసలు ఏదీ ఆలోచించే స్థితిలో లేను నేను. శివానీ నేరస్థులని పట్టుకోవడానికి తెగించి, రుద్రకి సహకరించింది. పట్టుకోవడానికి ముందు, వాళ్ళెలాంటివాళ్ళో తెలీదుకదా! కరుడు గట్టిన వాళ్ళు, తుపాకులు కత్తులు పట్టుకుని ఉంటే! పైగా ఎంతమంది ఉంటారో తెలీదు. అంతా అయాక, కోర్టులో నిలబడి.. అందరూ చూస్తుండగా.. ఆ లాయర్ చేత అవమానం భరించడం, ఇదంతా ఎందుకు?

శివానీని ఆరాధనగా చూస్తూ ఉండిపోయాను. నందుతో జీవితం ముడివడడానికి, ఇంత క్లిష్ట సమయంలో నన్నెంతో ఆదుకుంటున్న 'నందు' నాకు దొరకడానికి శివానీయే కారణం కదా! నాకోసం, అహల్య కోసం ఇంత తాపత్రయ పడుతోంది. ఎన్ని జన్మల పుణ్యఫలం, ఇలాంటి స్నేహితురాలు దొరకడానికి?

"ఏయ్? ఏంటలా చూస్తున్నావు?" శివానీ నవ్వుతూ పిలిచింది. ఎంత కష్టమైనా కడుపులో దాచుకోగలిగిన ధీర.

"మీరా! ఎపార్ట్‌మెంట్ ఫిక్స్ చేసేశాను. మనం వెళ్ళేటప్పుడే అత్తయ్యని మామయ్యనీ తీసుకెళ్ళిపోదాం" నందు అన్నాడు.

"ఇంటికి వెళ్ళి మాట్లాడదాం. ఏమంటారో?"

"కన్విన్స్ చేద్దాంలే." అంది శివానీ.

✡ ✡ ✡

మర్నాడు, కోర్టుకి నందు కూడా వచ్చాడు. ఫణీంద్ర లాయరు, తన ఆర్గ్యుమెంట్ మొదలు పెట్టాడు. లంచ్ వరకు సాగింది.

అతను చెప్పేది ఒకటే. ఆ రోజు చేసింది తప్పు, అంతవరకు ఏ పాపం చెయ్యలేదు.. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు అదే ముందుకీ వెనక్కీ తిప్పి, పాయింట్లన్నీ నొక్కి ... శివానీని రిఫర్ చేసినప్పుడు వీలైనంత వ్యంగ్యంగా మాట్లాడుతూ.. అందర్నీ ఆకట్టుకున్నాడు.

లంచ్ టైంలో, ఎవరం ఏం మాట్లాడలేదు. నాన్నగారు కూడా వచ్చికూర్చున్నారు. ఈ రెండురోజుల్లో తీర్పు వచ్చేస్తుందని అందరూ అనుకుంటున్నారు.

శేషుని పోలీసులు భయపెట్టి మార్చేశారని లాయరువాదన. ఆ డిఫెన్స్ లాయర్ గెలిస్తే మంచిదేకదా! శేషుకి కూడా స్వల్పశిక్షతో తేలిపోతుంది. అందరం.. ముఖ్యంగా, నేను, నాన్నగారు సంతోషించవలసిన విషయమే. కానీ ఎందుకో చాలా బాధగా ఉంది.

నేరస్తులకి పడాల్సిన శిక్ష పడాలి. వాళ్ళు మనవాళ్ళయినా కూడా. ఎంత నేరం చేసిన వాడయినా తప్పించుకుపోతుంటే, నేరాలు జరగకుండా ఎలా ఆపడం?

లంచ్ అయాక మళ్ళీ సమావేశమయ్యారు.

"యువర్ ఆనర్! ఈ కేసులో శ్రీమతి శివానీ తప్ప, నిజంగా విక్టిమైజ్ అయిన వాళ్ళెవరూ లేరు. శివానీగారిని కూడా ఏ అత్యాచారం చెయ్యలేదని వాళ్ళే చెపుతున్నారు. నా కంప్లయింట్ మీద మోపబడిన దొంగతనాలు, హత్య, అత్యాచారం కేసులు తొలిగించి, ఒక్క ఈవ్ టీజింగ్ మీదే తీర్పు ఇవ్వవలసిందిగా కోరుతున్నాను." లాయర్ కూర్చున్నాడు.

"ఉన్నారు యువరానర్" గుమ్మంలోంచి వినిపించింది. తలతిప్పి చూశాను.

అహల్య! వెనకాలే గౌతమ్.

✡ ✡ ✡

# 14

ఎవరూ ఊహించని అహల్య, గౌతమ్‌ల రాకతో కోర్టులో పరిస్థితులు తలక్రిందులయాయి. ప్రాసిక్యూషన్‌కి ముఖ్య సాక్షులుగా ఇద్దరూ ముందుకి రావడంతో డిఫెన్స్ లాయరు ఖంగుతిన్నాడు. అప్పటికి టైమయిపోవడంతో, మర్నాటికి వాయిదా వేశారు.

అందరం కోర్టునుంచి శివానీ వాళ్ళ ఇంటికి వెళ్ళాం. నేను ఏమీ మాట్లాడకుండా చాలా సేపు తలదించుకుని ఉండిపోయాను.

"మీరా! నువ్వెందుకే అలా అయిపోతావు? మా సంగతి ఎలా ఉన్నా శేషు కూడా ఇందులో ఉన్నాడనే, మేం ఇన్నాళ్ళూ మాట్లాడలేదు. కానీ కోర్టులో జరుగుతున్న అన్యాయం చూసి ఇంక ఉండబట్టలేకపోయాం." అహల్య నా ప్రక్కన కూర్చుని సముదాయించసాగింది.

"నీకు జరిగిన అన్యాయానికి నిన్నెలా అనునయించాలా అని నేను చూస్తుంటే, నువ్వు నాకు.." కంఠం రుద్ధమైపోయింది.

గౌతమ్! ఎన్నో ఆశలతో, కోరుకున్న భార్యతో ఆనందంగా జీవించాలని కలలు కన్న గౌతమ్... తన ఆశలు చిగురించకుండానే చిదిమివేయబడితే.. ఎంత నరకం అనుభవించాడో! గౌతమ్ కేసి చూడాలమేనే నాకు ఎంతో సిగ్గుగా ఉంది. గౌతమ్ కూడా వచ్చి, ఇంకోపక్క కుర్చీలో కూర్చున్నాడు. ఏం మాట్లాడకపోయినా, నా చెయ్యిపట్టుకుని, మౌనంలోనే ఎంతో స్వాంతన కలిగిస్తున్నాడు.

రుద్ర, ప్రాసిక్యూషన్ లాయర్‌కీ, శేషు లాయర్‌కీ ఫోన్ చేశాడు. ఇద్దరూ వచ్చి, కావలసిన ఎవిడెన్సులు అన్నీ చూసి, తీసుకున్నారు అహల్య కేసు అప్పుడు దాచిన రిపోర్టులన్నీ బైటకి తీసి, ఫైల్ చేశారు. మర్నాడు కోర్టులో, ఖచ్చితంగా అనుకున్నట్లుతీర్పు వస్తుందని చెప్పి, లాయర్లు వెళ్ళిపోయారు.

✡ ✡ ✡

రాత్రి భోజనాలు అయాక, వరండాలో కూర్చున్నపుడు అంది శివానీ.

"మీరు బాగా ఆలోచించుకునే, సాక్ష్యం ఇవ్వడానికి వచ్చారా?"

"సొసైటీలో ఎలా ముఖం చూపించగలమనా? ఇన్నాళ్ళు అలా అనుకునే తప్పు చేశాం. అందరూ అలా అనుకోబట్టే నేరలు పెచ్చుపెరిగి పోతున్నాయి. మేం ఎలాగూ కలిసి బ్రతకాలని నిర్ణయించుకున్నాం కదా! ఇప్పుడు బైటికి వచ్చినందువల్ల మాకేం నష్టం లేదు. ఇంక బంధువుల్లో, స్నేహితుల్లో.. మమ్మల్ని కోరుకునే వాళ్ళు ఎలాగైనా మాతోటే ఉంటారు. లేనివాళ్ళు, కొంతమంది కొన్నాళ్ళకి సర్దుకోవచ్చు.. కొంతమంది సర్దుకోకపోయినా మాకేం నష్టం లేదు." గౌతమ్ అన్నమాటలకి, అందరం ప్రశంసగా చూశాము.

శాంత పిన్నీ వాళ్ళు ఎలా తీసుకుంటారో!

"ఒకోసారి పల్లెల్లోనే విశాల హృదయంతో ఆలోచిస్తారు." నందు అన్నాడు.

పర్యవసానం ఎలా ఉన్నా, అహల్య - గౌతమ్‌ల చర్యవల్ల అందరికీ పెద్ద భారం తీసేసినట్లయింది. అందరం, ఏ సంకోచం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నాం.

వరండాలో లైట్లన్నీ ఆర్పేసి, గార్డెన్‌లోవి మాత్రమే వేసింది శివానీ. వరండాలో వెలుగు నీడల్లో క్రోటన్ ఆకులు పొడవుగా కనిపిస్తున్నాయి, అప్పుడప్పుడు దూరంగా వినిపించే కారు హారన్‌లు తప్ప ఏ శబ్దాలూ వినపడటంలేదు. మంద్రస్వరంతో మేం మాట్లాడుకునే మాటలు తప్ప.

"మీరు తీసుకున్న ఈ స్టెప్ వల్ల, నా కెరీర్ కూడా మంచి మలుపు తిరుగుతుంది. కానీ సమాజం మిమ్మల్ని చిన్న చూపు చూస్తుందేమోనని గిల్టీగా ఉంది." రుద్ర అన్నాడు.

"రుద్రా! మీరు అప్పటి మా క్రిటికల్ సిట్యుయేషన్‌లో ఎంత ఆడుకున్నారు? అప్పుడే మీరు, మీ డ్యూటీ చేసి రిపోర్టిచ్చి ఉంటే కాదనగలిగే వాళ్ళమా? ఆ వేడిలో అలా జరిగితే ఎటువంటి నిర్ణయం తీసుకునే వాళ్ళమో. అంత చేసిన మీరు, ఇప్పుడు నవ్వుల పాలైపోతుంటే ఎలా ఊరుకోగలము? పైగా, మా జీవితాలతో ఆడుకున్న దుర్మార్గులకి శిక్ష పడేలా చెయ్యవలసిన విధి మాకుంది కదా! అదే. అహల్య ఎంతో మధనపడి బైటపడింది. మేం విడిపోవడానికి కూడా తెగించి.. సాక్ష్యం ఇద్దామంది. దీని మూలాన, నాలుగేళ్ళ తర్వాత, మేం మనసువిప్పి మాట్లాడుకున్నాం. ఒకోసారి ఎంతకీ మానని పుండు, మాడుస్తే తగ్గుతుంది" గౌతమ్ ఇంతసేపు, స్పష్టంగా మాట్లాడి ఎన్నాళ్ళైందో!

"అహల్యా! ఇన్నాళ్ళూ నీలో నువ్వే ఎంత కుమిలిపోయావో తలుచుకుటే గుండెపిండేసే భాధ కలుగుతోంది." శివానీ గొంతులో ఏదో అడ్డుపడ్డట్లుగా ఆగి, ఆగి అంది.

"నువ్వు తీసుకున్న రిస్కు ముందు నేను చేసిందేపాటి? ప్రాణాలకు తెగించావు కదా! నేను ఒంటరిగానైనా బ్రతికి ఉండేదాన్ని కదా!
"

వాళ్ళిద్దరినీ చూస్తుంటే.. అనుకోకుండా ఒక పద్యం వచ్చింది నానోటంట.

"క్షీరము మున్ను నీటకొసగెన్ స్వగుణంబులు దన్ను జేరుటన్,
క్షీరము దప్తమౌటగని చిచ్చురికెన్ వెతచేజలంబు, దు
ర్వార సుహృద్విపత్తిఁ గని వహ్నిజొరం జనె దుగ్ధ, మంత
నీరము గూడి శాంతమగు నిల్చు మహాత్ముల మైత్రియాగతిన్."

నాకు ఎంతో ఇష్టమైన భర్తృహరి సుభాషితం. తెలుగులో రాసి లక్ష్మణ కవి సాహితీ ప్రియులకు ఎంత మేలు చేశాడో

ఎంత సన్నగా చెప్పినా, ఆ నిశ్శబ్ద నిశీధిలో, అక్కడున్న వాళ్ళందరికీ స్పష్టంగా వినిపించింది.

✡ ✡ ✡

**అందరూ కాసేపు** అలా ఉండిపోయారు. ముందుగా, నందు తేరుకుని చప్పట్లు కొట్టాడు చిన్నగా.

"అక్కడడక్కడ తెలిసింది. పాలు, నీళ్ళు.. వగైరా. కానీ పూర్తిగా అర్థంకాలేదు నాకు" అన్నాడు రుద్ర.

గౌతమ్‌కి మాత్రం, బాగా తెలుసున్న పద్యమే. మేం కలిసేకదా అవన్నీ నేర్చుకునది. ఇద్దరం ఒకర్ని చూసి ఒకరం చిన్నగా నవ్వుకున్నాం. ఇద్దరికీ, పాలెం రోజులు గుర్తుకువచ్చాయి. మళ్ళీ పాలెం వెళ్ళగలమా! కాలమే చెప్పాలి.

"మీరిద్దరూ డింపుల్స్ పడేలా బాగా నవ్వుతున్నారు, కానీ మాక్కొంచెం వివరించు తల్లీ." అంది, శివానీ నాకేసి, గౌతమ్ కేసి చూసి.

"పాలు, నీళ్ళు తనలో కలవడం చూసి, తన స్వభావం నీటికిచ్చింది. పాలు సలసలా కాగడం చూసి బాధతో నీరు అగ్నిలో దూకింది. నివారింపరాని స్నేహితుని ఆపద చూసి, పాలు కూడా అగ్నిలోకి పొంగాయి. ఇంతలో నీటితో కొంత కలిపి (పైన నీళ్ళు చల్లితే) చల్లారింది. ఉన్నతుల స్నేహము, ఈవిధంగా అన్యోన్యంగా ఉంటుంది" నేను ఇచ్చిన వివరణకి, రుద్ర, నందు చప్పట్లు కొట్టారీసారి. అహల్య, శివానీల బుగ్గలు ఎర్రగా అయిపోయాయి.

"సరే! ఇంక బయల్దేరతాం. మేం హోటల్‌కి వెళతాం. ప్రొద్దున్న అహల్యా వాళ్ళింటికి వెళ్ళి, అక్కడ్నుంచి కోర్టుకి వస్తాం." గౌతమ్ లేచాడు.

"మా ఇంట్లో ఎవరికీ మేం వచ్చినట్లు తెలీదు." అంది అహల్య తను కూడా లేస్తూ.

నేనూ, నందూ, శివానీ వాళ్ళింట్లోనే పడుకుంటాం. నందు వచ్చినప్పుడు, ఇప్పుడూ అంతే. అందరం లేచి, గేటు వరకు వచ్చాం.

గౌతమ్ ముందు, నాలుగడుగులు వెనక అహల్య వెళుతున్నారు. రాత్రి పదకొండు అవుతోంది. ఇంకా సెకండ్ షో వాళ్ళెవరూ రాలేదేమో, రోడ్డు ఖాళీగా ఉంది. ఒక్క మా అడుగుల చప్పుళ్ళు తప్ప ఏం వినబడటల్లేదు. గౌతమ్ తలుపు తీస్తున్నాడు. అహల్య కూడా గౌతమ్‌ని చేరింది. "అన్నయ్యా!" పిలిచాను. గౌతమ్ వెనక్కి తిరిగాడు.

"అనాడు, అహల్య తెలిసి తప్పు చేసిందంటారు. అయినా గౌతముడు శాపం మాత్రం ఇచ్చి, తర్వాత ఏలుకున్నాడు. ఈనాడు ఈ అహల్య ఏ తప్పూ చెయ్యలేదని నీకు తెలుసు. ఇకనైనా శాపవిమోచనం చెయ్యవా?" చేతులు రెండూ జోడించి అన్నాను.

తలవంచుకుని, ప్రక్కకి తిరిగిన అహల్య కోలముఖంలో కోటేసినట్లున్న ముక్కు, ఎర్రబడి అదరసాగింది. కళ్ళలోంచి రెండే రెండు చుక్కల నీళ్ళు పడ్డాయి.

నా మాటలు జీర్ణించుకోవడానికి అందరికీ కొంత సమయం పట్టింది. ఏం చెప్పాలో తెలీనట్లుగా, గౌతమ్ కుడి చెయ్యి గేటు మీద వేసి ఉండిపోయాడు. ఎక్కడి వాళ్ళక్కడ నిలబడిపోయారు.

ఇలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి ఎవరికీ రాకూడదని, రాకుండా ఉండేలా.. అందరికీ మంచి బుద్ధి ఇమ్మని.. నిశ్శబ్దంగా భగవంతుడిని ప్రార్థించాను.

"గౌతమ్" శివానీ గొంతు మృదువుగా.. ఎప్పట్లాగే స్థిరంగా...

"అహల్య కడుపు పండితేనే మా వంశాలు కూడా నిలుస్తాయి."

అవును మరి రుద్ర, నందు ఒక్కొక్కరే సంతానం, మా స్నేహం సంగతి అప్పటికే తెలిసింది కదా!

గౌతమ్ బుగ్గ సొట్టపడేలా నవ్వి, ఎడం చేత్తో అహల్యని పొదవి పట్టుకుని, కుడిచేత్తో గేటు తీశాడు.

✡ ✡ ✡

## 15

పదేళ్ళ తర్వాత. జూబ్లీ హిల్స్‌లో ఒక ప్రశాంతమైన కాలనీ. ఒకే రకమైన మూడిళ్ళు. మూడిళ్ళకీ కలిపి కామన్‌గా లాన్, పెద్ద గార్డెన్ ఒక ప్రక్క పిల్లలాడుకునే ఉయ్యాల, జారుడుబండ, చిన్న ఆటఇల్లు లాంటివన్నీ ఉన్నాయి. అవన్నీ మెత్తటి ఇసుక మీద ఉన్నాయి. తోటలో వాకింగ్‌కి వీలుగా బాట.

అప్పుడే వచ్చాను. మా "సన" టీ.వీ ఛానల్ బాగా ప్రాచుర్యం పొందింది. క్రొత్త ప్రొడక్షన్ మానేజర్లని.. అంతా రకరకాల వయసు వాళ్ళని.. అన్ని రకాల ఐడియాలు వస్తాయని... చేర్చుకున్నాం. అన్నీ కలిపి, అందరితో చర్చించి నిర్ణయాలు తీసుకోడం నా పని. నేనిప్పుడు, ఆ ఛానల్‌కి యమ్.డిని.

అమ్మ, నాన్నగారు, వాణీ ఆంటీ, శివయ్య మామయ్య, ప్రమీలాంటీ... వాకింగ్ పూర్తిచేసుకుని గార్డెన్‌లో కుర్చీల్లో కూర్చుంటున్నారు. గార్డెన్‌లో మధ్య ఫౌంటెన్, చుట్టూరా గట్టు ఉన్నాయి. అక్కడే పన్నెండు కుర్చీలు, పెద్ద బల్ల ఉన్నాయి. నేను లోపలికి వెళ్ళి, బట్టలు మార్చుకుని వచ్చి కూర్చున్నాను.

మూడిళ్ళలో, మధ్య ఇల్లు శివానీది. కుడిప్రక్క మాది, ఎడం ప్రక్క అహల్యది. ఒక అరగంటలోపుగా అందరూ వచ్చేశారు. ప్రతి శనివారం, సాయంత్రం అందరూ కలవాలని, శివానీ రూల్ పెట్టింది.

రుద్ర మధ్యలో ఊళ్ళు తిరిగి, రెండేళ్ళ క్రితం డి.ఐ.జిగా ఇక్కడికి వచ్చాడు. క్వార్టర్స్ వద్దని, స్వంత ఇంటికి వచ్చేశారు. మా ఇళ్ళు కూడా రెండేళ్ళ క్రితమే పూర్తయాయి. అంతా శివానీ ప్లానే. ఆర్కిటిక్ దగ్గర ఆర్నెల్లు కూర్చుంది.

గౌతమ్, అహల్య.. అమెరికాలో అయిదేళ్ళు ఉండి వచ్చారు. అహల్య పి.హెచ్.డి అయి, తార్నాకాలో ఉన్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీలో సైంటిఫిక్ ఆఫీసర్‌గా ఉంది. ఇంకా పార్కిన్‌సన్ డిసీజ్ మీదే రిసెర్చి చేస్తోంది. రెండు మూడేళ్ళలో 'బ్రేక్ త్రూ' రావచ్చని అంటుంది. గౌతమ్, హైటెక్ సిటీలో ఒక మల్టీనేషనల్ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్.

శాంత పిన్నినీ, బాబాయ్‌నీ రమ్మంటే పాలెం వదిలి రామంటారు. అప్పుడప్పుడు అందరం వెళ్ళి వస్తుంటాం. వాళ్ళు కూడా ప్రతీ సంవత్సరం రెండుసార్లు వస్తుంటారు.

నందు తన కంపెనీ ఒకటి కాలిఫోర్నియాలో స్టార్ట్ చేశాడు. మా అత్తయ్యగారు, మామయ్యగారు అక్కడే ఉన్నారు. నందు నెలకోసారి వెళ్ళివస్తుంటాడు. మేం ప్రతీ సమ్మర్‌కీ వెళ్ళిపోతాం.

శేషుకి మూడేళ్ళు, ఫణీంద్ర, అవినాశ్, అక్షయలకి ఏడేళ్ళు శిక్షలు పడ్డాయి. శేషు జైల్లోనే కరస్పాండెన్స్ కోర్సులో యం.బి.ఏ చేశాడు. నందు కంపెనీలో మార్కెటింగ్ మానేజర్‌గా జాబ్ ఇచ్చాడు. పాలెంలో, అమ్మకి దూరబంధువుల అమ్మాయిని, వాళ్ళు పెళ్ళిచెయ్యలేని పరిస్థితుల్లో ఉంటే శేషు మారాడని.. అందరూ ఎంతో సర్దిచెపితే ఇచ్చి పెళ్ళిచేశారు. మా ఊర్లో ఇల్లు అమ్మేశాక, నందు ఇక్కడ ఒక ఎపార్ట్‌మెంట్ కొన్నాడు. శేషు, సుజాత అక్కడే ఉంటున్నారు. సుజాత, నా మరదలు. చాలా మంచిపిల్ల. శేషుని మాటమాటకీ పాత సంగతులులెత్తి హింసించకుండా.. బాగా కలిసిపోయి ఉంటుంది. ఫణీంద్రకి ఈ సంవత్సరం యమ్. పి సీటిచ్చారట. శేషు జైలుకి వెళ్ళాక, అమ్మ, నాన్న బలవంతమ్మీద నా దగ్గరకి వచ్చేశారు.

"అమ్మా!" రొప్పుతూ వచ్చి ఒళ్ళోపడ్డాడు మూడేళ్ళ శ్రీరామ్. నందులాగే కళ్ళు చిన్నవి చేసి నవ్వుతూ.. "అక్క నన్ను ఆడనీయట్లేదు... కొత్తవా.." అంటూ.

"అలాగే" ముద్దుపెట్టుకుని అన్నాను. "ఈ బెటాలియన్ అంతా ఏది?"

"అదిగో! వస్తున్నారు. మామిడి పిందెలన్నీ తెంపుకుని, కాళ్ళు గీరుకుపోయి.." అమ్మలోపలికి వెళ్ళింది, కాటన్.. డెటాల్ లాంటివి తేవడానికి.

"వాణీ! ఇవాళ రామదాసు కీర్తన పాడవా?" ప్రమీలాంటీ అడిగింది. ఆంటీ గొంతు సవరించుకుంది.

చేతులు తిప్పుతూ ఏదో గడగడ చెపుతూ వస్తోంది. 'మృదుల', నా కూతురు. ప్రక్కనే తలకొంచెం వంచి, పెద్ద కళ్ళని అటూ, ఇటూ తిప్పుతూ వింటోంది 'మంజుల' ... అహల్య కూతురు. మంజు, మృదులకంటే ఆర్నెల్లు పెద్దది. ఇద్దరూ ఒకటే క్లాసు. ఇద్దరికీ కుడి ప్రక్క బుగ్గల మీద సొట్టలు పడతాయి నవ్వినప్పుడు.

మంజుల మామిడిపిందెలు, ఉప్పు, కారం, చాకు తెచ్చింది. మృదుల ప్లేట్లూ.. నీళ్ళూ.

"హీరో ఏడీ" అంటూ వచ్చాడు రుద్ర వెనకాలే శివానీ. అహల్య, గౌతమ్.. టీ సరంజామా అంతా తెస్తున్నారు.

ఒక చేత్తో అయిదేళ్ళ 'ధర్మ'నీ, ఒక చేత్తో ఫస్ట్ ఎయిడ్ కిట్‌నీ పుచ్చుకుని 'ఇడుగో' అంటూ వచ్చింది అమ్మ. ధర్మ అంతా రుద్రపోలికే. కానీ, ఇద్దరి స్థిరత్వం మాత్రం రాలేదు. వీడు కడుపులో ఉండగా, నిన్ను తలుచుకునుంటాను మీరా అందుకే కుదురు లేదు" అంటుంది శివానీ.

అహల్య, కుర్చీలో కూర్చుని.. ముందుకి వంగి కప్పులు తీయబోయింది.. "ఆగు. నేను తీస్తాను." అంటూ లేచింది శివానీ. అహల్యకి ఎనిమిదో నెల. "తొమ్మిదేళ్ళ తర్వాత కానుపుకదా! జాగ్రత్తగా ఉండాలి." అంటుంది అమ్మ. గౌతమ్ ఫ్లాస్కులోంచి టీ కప్పుల్లో పోస్తున్నాడు.

"నాన్నా!" అంటూ పరుగెత్తాడు శ్రీరామ్. ఇంట్లోనుంచి అప్పుడే వస్తున్న నందు కాళ్ళకి అడ్డం పడ్డాడు.

"ఉండు! ఇప్పుడే వస్తానూ!" అంటూ మామిడిపిందెలు రెండు పట్టుకుని గేటుకేసి నడిచాడు 'ధర్మ'! శివానీ కొడుకు.

అక్కడ ఇద్దరు చిన్నపిల్లలు చేతులు చాపి నిలబడి ఉన్నారు.

✡✡✡

*ఐపోయింది*

## ఈ నవల వెనుక కథ

ఒకరోజు తొమ్మిదో తరగతి చదువుతున్న మనవరాలు వరుసైన అమ్మాయి, కిరణ్, నా దగ్గరికి "పద్యాల పోటీలున్నాయి నాన్నమ్మా! మంచి పద్యం నేర్పించవా?" అంటూ వచ్చింది.

భర్తృహరి సుభాషితాలు గుర్తుకొచ్చి చదువుతుంటే స్నేహం గురించి, నిజమైన స్నేహితులు ఏ విధంగా ఉంటారు అని వర్ణించిన పద్యాలు కనిపించాయి. అప్పుడే స్నేహంలోని మాధుర్యాన్ని గురించి వర్ణిస్తూ ఒక నవల వ్రాద్దామనిపించింది.

ఫస్ట్‌ఫామ్‌లో (6వ తరగతి) నేను, సరోజిని, రాజ్యం, అన్నపూర్ణ జట్టుగా ఉండేవాళ్ళం. అయితే ఏ రోజూ నలుగురం కలిసే వాళ్ళం కాదు. ఒకళ్ళో ఇద్దరో ఎప్పుడూ అలిగి.. రకరకాల కాంబినేషన్‌లో పోట్లాడుకుంటూ, మళ్ళీ చిత్రవిచిత్రంగా కలిసిపోతూ.. రాత్రిళ్ళు పెద్దవాళ్ళు పిలుస్తే కానీ ఇళ్ళకి చేరేవాళ్ళం కాదు. అందరిళ్ళూ దగ్గర దగ్గరే ఉండేవి.

ఒక్క సంవత్సరమే కలిసున్నా, తర్వాత అప్పుడపుడు కలుస్తూ, విడిపోతూ.. అరవయ్యేళ్ళు దాటినా కూడా ఇంకా పలకరించుకుంటూ ఉంటాం. అన్నపూర్ణ మాత్రం ఇరవై ఏళ్ళ క్రితమే పైకి వెళ్ళిపోయింది. ఇంకా అప్పటి ఆటలు అవీ గుర్తుచేసుకుని నవ్వుకుంటూ ఉంటాం.

అలాగే నిర్మల, కవిత, నాగు, రేణుకక్క.. వీళ్ళందరూ కాలేజ్‌లో... కళ, రాధ, ప్రభ, లక్ష్మి, బంధువులలో, మణి, అంబిక, జానకి ఇంకా చాలామంది ఉద్యోగంలో... ఎంతమందో స్నేహ కుసుమాలు. తల్చుకుంటే ఒళ్ళు పులకరిస్తుంది. స్థలాభావం వల్ల కొంతమందిని చేర్చలేదు.. క్షమించాలి.

ఏ అవసరం ఉన్నా, ఏ సమయంలోనైనా "మేమున్నాం" అంటూ వచ్చేసే మిత్ర రత్నాలు... స్నేహానికి నిర్వచనం చెప్పే నిజమైన ఆప్తులు నా ఈ నవలకి ప్రేరణలు.

ఆ పద్యం.. కిరణ్‌కి రాగయుక్తంగా నేర్పిస్తున్న సమయంలోనే వార్తాపత్రికలో ఒక వార్త చదివాను.." ఫలానా ఊర్లో (ఏ ఊరో గుర్తులేదు..) నలుగురు ఇంజినీరింగ్ విద్యార్ధులు మానభంగాలకి, దోపిడీలకి పాల్పడుతున్నారు.." అని. ఆ విద్యార్ధులో, బాధితులో మనవాళ్ళైతే.. అటువంటి ఊహ వస్తేనే వణికిపోతాము. ఆ ఊహలోంచే శేషు పాత్ర పుట్టింది. అందనికి మంచితనానికి ప్రతిరూపమైన అహల్య బాధితురాలైంది.

సమస్య ఉన్నప్పుడు పరిష్కారం ఉండాలికదా! అది శివానీ రూపంలో జరిగింది. అందుకే ఆమె ధీరోదాత్త అయింది. సమీర సమస్యని వివరించే మాధ్యమం అయింది. నవలకి వస్తువు ఎన్నుకుని, పాత్రల్ని పరిచయం చెయ్యగానే, సంఘటనలు సహజంగా రూపుదిద్దుకుంటాయి. అది ప్రతి నవలా రచయితకీ అనుబవమే.

ఈ నవల నా మూడవ ప్రయత్నం

మొదటి నవల, "గ్లేషియర్". రచన మాసపత్రికలో నర్సిపురం ఆదిలక్ష్మి స్మారక పోటీలో వసుంధర, శ్రీ ఉదయినిలతో సమ బహుమతి గెలుచుకుంది.

రెండవ నవల, "అంతా ప్రేమమయం", స్వాతి వారపత్రికలో పదహారు వారాల సీరియల్‌గా బహుమతి పొందింది.

ఆ స్ఫూర్తితో, మనసంతా పెట్టి రాసిన "శివానీ" ఆంధ్రభూమి దినపత్రికలో పోటీలకి పంపితే తిరిగొచ్చింది. భయపడుతూనే కౌముది సంపాదకులకి పంపించాను. వారికి నచ్చి నా నవలని ప్రచురించినందుకు, ప్రపంచంలోని వివిధ దేశాల్లోని తెలుగువారికి నా భావాలు పంచినందుకు వేవేల కృతజ్ఞతలు. **- మంథా భానుమతి**